

చెన్నపట్టణము, ఏప్రిల్ ౧౯౩౧

సంపుటము ౮ ప్రజోత్పత్తి సంవత్సరము చైత్రమాసము సంఖ్య ౪

శ్రీసూక్తిసుధానిధి

వేంకట పార్వతీశ్వరకవులు

(శ్రుతి-వీథి)

ఆవేగతరంగము

౧

వీనులవిందుగా విన్పింపలేదఁటే సరసమోహన పాంచజన్యరవళి?
కన్నులు చల్లగాఁ గాన్పింపలేదఁటే జయవైభవానంతచక్రదీప్తి?
కాయ ముప్పొంగఁగాఁ గదియంగలేదఁటే కమనీయ ఖగరాజ గమనలీల?
ఎదఁ బుల్కరింపఁగా నెలమింపలేదఁటే సుందరవదనారవిందశోభ?
నిగమనిత్యోత్సవానంద నినద మదిగో!-నా మనసుగొన్న నా ప్రాణనాథుఁడున్న
దివ్యతిరుపేర కిఁకఁ బోక తీరదమ్మ!-ఆఁగవలదమ్మ! యింక న న్నమ్మలార!

౨

అలికచలార! సారె కిటు లాడెద రూఱట లేక నా వెతల్
దెలియరు గాక; కమ్మవిరి దేనియసోనలఁ బూవుఁగోనలన్
జెలఁగు తిరుప్పరిం గొలువు సేసిన శ్రీశుని కావి మోవితే
నెల చవిఁ జొక్కి క్రమ్మఱదు నెమ్మది యెమ్మెయి; నేమి సేయుదున్?

౩

శ్రీవత్సకాంతులఁ జిక్కి రాకున్నదో? సురభిళవనమాలఁ జూచి రాదో?
దర సుదర్శనలీలఁ దవిలి రాకున్నదో? కర్ణకుండలశోభఁ గాంచి రాదో?
అధరబింబామృతం బాని రాకున్నదో? వనజాయతాక్షుల వదలి రాదో?
వదనేందుచంద్రికల్ వలచి రాకున్నదో? మాణిక్యమకుటంబు మరగి రాదో?
శ్రీపతికిఁ జిక్కి నామది సిగ్గు దక్కి-మరలి రాకున్న దివి యేటిమాటలమ్మ!
దివ్యతిరుపేర కిఁకఁ బోక తీరదమ్మ!-ఆఁగవలదమ్మ! యింక నన్నమ్మలార!

౪

నా చెల్వంబు హరించి చన్న హరి నెన్నాడించి సామోక్తులన్
యాచింపం జని నా మనం బతనిపాదాబ్జంబులం జిక్కి యుం
డే చైతన్యము దక్కి సొక్కె; నిఁక మీ రేమన్న నేమైన నే
నా చిత్తాబ్జవిహారి వీడఁ; జెలులారా! నన్నుఁ బోనీయరే!

౫

శకటముఁ దన్ని, పూతనను జంపి, వృషంబును గూల్చి, మద్దులం
బెకలిచి వచ్చి నేఁడు తిరుపేర వసించినయట్టి స్వామి నే
వకు మరు లొంది కుంది గరువమ్మును శీలముఁ జంపుకొన్న నా
కిఁకఁ బరచింత లేల? భయ మేల? ప్రబోధము లేల? నెచ్చెలీ!

౬

ముందట నిల్చియున్ జలదమోహనగాత్రుఁడు పల్కకుండె; నా
కందక యుండె; నాసలు మహాంబుధులై నను ముంచుచుండె నో
యిందునిభాస్యలార! బ్రదు కేర్పడఁ దేర్పఁదలంతు రేని గో
విందుఁడు గొల్వు సేయు తిరుపేరకుఁ బోవఁగఁ ద్రోవఁ జూపరే!

౭

నెచ్చెలులార! ప్రాణవిభునిం గన నామన సేఁగి క్రమ్మఱన్
వచ్చినజాడ లేదు; నలువంకలఁ జూచుటె యయ్యె; నిచ్చమై
వచ్చునొ? రాదొ? తెల్పఁగలవారిని, బిల్చెడివారి నైన నే
నెచ్చటఁ గాన; నచ్చటికి నేఁగెడిదానఁ; బనేమి నా కిటన్?

౮

అన్నవలార! నేను బరమాత్మునిపేర రచించియున్న నా
చిన్నికృతుల్ పఠించి నను శ్రీహరి ప్రేయసిఁగాఁ దలంచి మీ
రన్నది యాదిగా మనసునం దొక యాస జనించి వృద్ధి నై
మిన్నును, మన్ను, సంద్రముల మేరలు మీఱె నిఁకేమి సేయుదున్ ?

౯

వంతమె కక నా పడెడుపాటులు బోటులు మీ రెఱుంగరే!
స్వాంతమె నన్నుఁ బాసి చనినప్పుడు తాలిమి దూలి యున్న నా
చెంతల మూఁగి యే దిటవు చెప్పఁగఁ జూచెద రమ్మ? యింక నా
చింతలు దీఱ, శ్రీహరిని జేరఁ దిరుప్పరి కేఁగనీయరే!

౧౦

తిరుపురదివ్యమందిరు యుధిష్ఠిరవైభవసుప్రతిష్ఠు సు
స్థిరు జగదేకరక్షకు విచిత్రచరిత్రుఁ బయోదగాత్రు సుం
దరదరచక్రహస్తు సుమనఃప్రభు మద్విభుఁ బట్టి తేఱఁగాఁ
బురవనసీమలం గలసి పోయెదఁ; బోయిన సిగ్గిఁకేటికిన్ ?

'సంస్కారార్థో నియమః'

అను సూత్రముతో గొప్ప భాషా సంప్రదాయ రహస్యమును నన్నయ సూచించినాఁడు. ప్రజకు వాడుక బాసలో గ్రామ్యములును, గ్రాంథికములు నగు పదములు వచ్చియుండును. వారు తిరమైన గ్రాంథికభాషా సృష్టి సేయునప్పుడు గ్రామ్యములను జేరనీయక గ్రాన్థికపదములనే వాడినచోఁ బ్రాయిక నిత్య ప్రయోగరూపమైనట్టియు, సంకేతిత సుప్రసిద్ధ పదభూయిష్ఠమైనట్టియు, రసాత్మక వాగ్రూపమైనట్టియు, విశ్వశ్రేయస్సాధనమైన గ్రాంథిక భాష నిర్దోషమై పరిశుద్ధి వహించియుండు నని శబ్దానుశాసనాదుల యానాఁటి యాశయము. ఇట్టి నియమమును జేయునది వ్యాకరణమే. వ్యాకరణము రానివాఁడు తనకు సాజముగఁ బుట్టినప్పటినుండియు వచ్చిన బాసలో నిది హేయమనియు, నిది యుపాదేయమనియు వేఱుపఱచుకోలేఁడు కదా.

కాని వస్తాడు, తెస్తాడు మున్నగునవి చేరినఁ బొత్తముల కపరిశుద్ధి యెట్లు వచ్చునో మనము ప్రత్యక్షముగఁ జూడఁజాలకున్నాము.

ఇయ్యెడ దండి మొదలగు ప్రాచీనాలంకారికులచేతను, నన్నయగారిచేతను వాడఁబడిన గ్రామ్యశబ్దము మనకుఁ గొంతవఱకుఁ బనికి వచ్చుచున్నది.

'నిష్ఠ్యూతోద్గీర్ణవాంతాది
గౌణవృత్తి వ్యపాశ్రయమ్,
అతిసుందర మన్యత్ర
గ్రామ్యకక్ష్యాం విగాహతే.'

అని దండి వ్రాసె.

ఇచ్చట గ్రామ్యపద మనహ్యంచుకొనఁబడుదానియందు జుగుప్సితాది శబ్దములవలెఁ బ్రవర్తించెడిని.

'కామం సర్వో ప్యలంకారో
రస మర్థే నిషించతి,
తథా ప్యగ్రామ్యతై వైనం
భారం వహతి భూయసా.'

ఇచ్చటను జుగుప్సితార్థముగనే గ్రామ్యపదము వాడఁబడినది. పైపెచ్చు దీనిని రసస్ఫూర్తి ప్రతిబంధమనియు దండి వక్కాణించెను.

ఇది యెల్ల రూఢ్యర్థమే కాని యోగబలమున నింతయర్థము రానేరదు. యౌగికార్థవిూపదమునకు గ్రామములోని దని. నిరూఢ లక్షణచే వచ్చెడియర్థము ప్రసిద్ధమై శక్యార్థమును జంపివేసినది. కుశలదంతురాది శబ్దము లిట్టివే. దీనివలనఁ జరిత్రము మాత్రము కొంత తెలుచున్నది. గ్రామములోనివారు పౌరుల కన్నఁ దీసిపోయియుందురు. కాన జానపదులు మాటాడు మోటబాసను నాగరికు లేవగించుకొనుచువచ్చి యుందురు. గ్రామీణులు కూడ

తెలుఁగు బలిసినకొలఁది, తెలివి మించినకొలఁది తాముకూడ నాగరిక వేషభాషలను గైకొను చున్నారు. కాని స్వీయగ్రామ్యతానైచ్య నిరాకరణముకై పాటుపడరు. 'గతానుగతికో లోకః' యనునట్లు పోవుచుండు లోకయాత్రా ప్రవాహమున కెదురీఁదఁ గలవాఁడు లక్షకొక్కఁడు గదా. అట్లు నాగరిక వేషభాషానుకరణ పరాయణు లగువారికి రాజునుగన్న కన్నుల మగనిఁ జూచిన మొట్టబుద్ధి యైన దన్నట్లు, బీదసాదల మోటబాస రుచించునా? అట్లు క్రమముగఁ దక్కువవారు మాటాడు బాస గ్రామ్యమై జుగుప్సితమగుటచే గౌణమర్యాదచే జుగుప్సితము లైనవెల్ల గ్రామ్యములని వ్యవహరింపఁబడుచు వచ్చినవి. దండి గ్రామ్యములని చెప్పినవి కొన్ని ఉమ్మి, కక్కు మొదలైనవి స్వరూపముచేతనే యసహ్యించుకోఁదగినవి. కొన్ని పల్లెటూళ్లలో నాగరిక మెఱుఁగని వారిమాటలు కనుక హీనులు మాటాడిన వస్తాను, పోతాను ప్రభృతి పదంబులు గ్రామ్యము లగుచు హేయము లైనవి. ఇంగిలీషు ప్రభుభాష కానఁగదా రాని వారుకూడ దానిని గొప్పకై మాటాడఁబోదురు. దొరలపంట్లములను హిందువు లేల వేసికొందురు? వారు పింజగోచుల నేల పెట్టరు? కాన వేషభాషల గొప్ప ధర్తలను, వ్యవహర్తలను బట్టియే వచ్చును. తద్భవములెల్ల నట్టివారి నోటఁ బుట్టి పాత్రములఁ గైసేయుచున్నవే.

'సోర్థ స్తద్వ్యక్తి సామర్థ్య యోగీ శబ్దశ్చకశ్చన' యని యానందవర్ధనాచార్యులు సెలవిచ్చినవిధమున రసభావోద్రేకవ్యంజకమ్ములైన కతమున పీడరానివిగ మహాకవికటాక్ష భాజనములై కొన్ని పదాలు వానిభాగ్యవశమున గ్రంథమున కలంకారము లైనవి. అట్టి యదృష్టము లేని కొన్నిపదాలు పుట్టినవి పుట్టినట్లే నిలిచిపోయినవి. ఇప్పుడా మాటలు వస్తాడు మున్నగునవి శిష్టాగ్రేసరుల నోళుల మడిపేళల సైతము నాట్యమాడుచున్నను, మొదట వచ్చిన గ్రామ్య మను నెంగిలి పేరు* బ్రాహ్మణశ్రమణ కన్యాయమున వానిని వదలక వేధించుకొని తినుచున్నది.

ఇట్లు గ్రామ్యభాష యొక్క హేయత చాలవఱకు వ్యవహర్తలతక్కువదనముచేతనే వచ్చినదని యూహింపవచ్చును.

అట్టి గ్రామ్యభాష నుపయోగించిన సారస్యము చెడుననుటయు యుక్తివిరుద్ధము కాదు.

'శబ్దేపి గ్రామ్యతాఽస్త్యేవ
సా సభ్యేతర కీర్తనాత్,
యథాయకారాదిపదం
రత్యుత్సవ నిరూపణే.'

అని దండి.

గ్రామ్యపుమాటలు వినుటతోడనే అనుకార్యులు, నీచ వేషభాషలు కలవారు మనమనసునకుఁ బొడకట్టుదురు. గుణాలంకారాదిచమత్కార విశిష్టపద ప్రతిపాద్యములయి రమణీ

* బ్రాహ్మణుఁడు బౌద్ధులలోఁ గలసినను బ్రాహ్మణ శ్రమణకుఁ డనఁబడువారఁట. ఇప్పుడు బ్రాహ్మణులు మొదలైనవారు క్రైస్తవు లయినను వెనుకటి కులములతో వాడఁబడుచుందు రందురు.

యములగు ద్రవ్యగుణక్రియల భావనచే సిద్ధింపవలసినదని యభినవగుప్తపాదాచార్య ప్రభృతులచేఁ జాటఁబడుచుండు రస మసహ్యించుకొనఁబడుచుండెడి యనుకార్యుల భావనచే నెట్లు సహృదయుల సిద్ధించును? నీచజాతులవారికి మాత్రము భావములు, రాగాదులు లేవా? అవి పావనములు కావా? అందురు. భావము లెచ్చటఁ గల్గినను బవిత్రములే కాని బూతులు తిట్టుకొనునప్పుడు కూడ నాయికా నాయకులును, శృంగారచేష్టలును దోఁచుచుండును. అంతమాత్రమున నచ్చట రసము సిద్ధించు ననుట గలదా?

కేవల విభావాదులే కాక విభావాదులను దెల్పెడు పదములును జుగుప్సావహములు కాక గుణాలంకారరీతులచే రమణీయములును, సముచితములును గావలెను. ప్రసంగములు మోటుగ నుండఁగూడదు. ద్రవ్యగుణక్రియలును మనోజ్ఞములు కావలెను. అట్టి కావ్యముల వలననే రసములు నిష్పన్నము లగునని రసవేత్తల సిద్ధాంతము. చూడుఁడు:

'కన్యే కామయమానం మాం
న త్వం కామయసే కథం.'

ఈశ్లోకమున నర్థము గ్రామ్యము కాన రసము గల్గదని చెప్పి,

'కామం కందర్పచండాలో
మయి వామాక్షి! నిర్దయః,
త్వయి నిర్మత్సరో దిష్ట్యా...'

అను శ్లోకమును రసవదలంకారమున కుదాహరణము చేయఁబడెను. మొదటిశ్లోకమున విభావాదులు లేవనియు, రెండవశ్లోకమునఁ గలవనియుఁ జెప్పవలనుపడదుకదా. ఇఁక భేదమేమి? అందర్థము చేటలో వెలఁగకాయలవలెఁ గన్పట్టి మోటయై రసస్ఫూర్తిని జెడఁగొట్టినది. రెండవ పద్యము నాతిగూఢమై ధ్వనిమూలమునఁ గన్పట్టుచు హృద్యమై రసమును బోషించినది. కావున, గ్రామ్యములై యసహ్యించుకొనఁ దగినమాటలు, నర్థములును రసప్రతిబంధకములని యొప్పుకోవలెను. కాని యొకమాట మిగిలియున్నది. ఎప్పుడో అసహ్యించుకోఁదగినవై వ్యవహర్తలనుబట్టియో, వాని యభాగ్యమునుబట్టియో ఉండును గాక. ఇప్పుడు పెద్దల వాడుకలోనికి రానోచుకొనియు వస్తాదు ప్రభృతుల కేల హేయత? అని.

దానికి వేరుసమాధానము తోఁపదు గాని యొకప్పుడు హేయములని వదలఁబడి చిరకాలమునుండి కవులయాదరమునకుఁ బాత్రములు గాని కతమున నవి నీచపాత్ర సాహచర్య నియమము గలిగి జుగుప్సాచిహ్నములుగఁ దోఁచి నీచాతినీచవ్యక్తులనే మన కన్నులఁ గట్టినట్లు చూపును. దాన రసభంగ మందురు. వాచ్యవాచకములయందమావశ్యకము కానిచో అభినవకవితలలోఁగూడ పండువెన్నెలలను, ఇసుకతిన్నెలను, తీగలను, కోయిలలను, చిల్కలను, చివుళ్లను ఏల వర్ణింతురు? పెద్దనాదులు "తావుల్ క్రేవల"; "తనశృంగార"; ఇత్యాది పద్యముల నిట్లేల రమణీయ వస్తుసృష్టి నొనర్చిరి! నాగజెముళ్లు, పెండ్రుకలతుట్టలు, పేడకుప్పలు, గుడ్డపేలికలు, చీపురుకట్టలు, శ్మశానములు, పాకి

దొడ్లు మున్నగువానిని బద్యములలో వర్ణించి తమ గ్రంథములకు వన్నె తెచ్చుకోరాదా? అందఱకును రమణీయవస్తుసామగ్రియే సారస్యనిదానము. చూడుఁడు: 'రమణీయార్థప్రతిపాదకశ్శబ్దః కావ్యః' అని పండితరాయ లనెను.

రమణీయవస్తు జాతము స్వతస్సిద్ధముగఁ గథలో లేనపుడు కొందఱు కవులు ప్రౌఢోక్తులతో నతిశయోక్తిమూలమున నౌపచారికమర్యాద ననుసరించి శబ్దమాత్రవేద్య వస్తువుల నందముగ సృష్టించుకొని వర్ణించి తాము తనిసి పాఠకులం దనుపుదురు. ఈ మార్గమున భవభూతి, మురారి ప్రభృతులు మార్గదర్శకులు. వారినుడికారములఁ ద్రావి యానందాకాశమున విహరించు వాగ్విదులుం బెక్కురు గలరు.

రససిద్ధి రసికునిబట్టి యుండును. గ్రామ్యభాష నెవ రసహ్యించుకొనరో నెవ రట్టి మాటల వాడుకతో నుందురో వారి కాగ్రామ్యభాష శబ్దములచే రసము గల్గుటకుఁ బ్రతిబంధకము లేదు ఫ్యాక్టరీ కూలీలు, పడవల వాండ్రును, బండ్లు నెట్టువారును బూతుమాటల కీర్తనలను ఒడుపుగాఁ బాడుకొనుచు నానందాంబుధిమగ్నులై మేనులు మఱచి తమశ్రమ నెఱుఁగని స్థితిలో నుండి యెంతెంత లేసి భారపు పనులనేని జేయుదురు. వారికి రసానుభూతి లేనిచో శ్రమ తత్కాలమున వారి కేల కన్పట్టదు?

ఆమాటలు పౌరులకును, గ్రామములలోని పెద్దమనుష్యులకును అసహ్యించుకోఁబడునవిగ నుండు. అట్టు లేవగించుకొనుచున్న వారి డెందములకు నిర్మల రసానుభవ మెట్లు కలుగు? వీ రేమాటల నసహ్యించుకొనరో అట్టి బాసతో వీరికి రసము సిద్ధించు.

ఇంతకన్న గొప్పనాగరికులు ప్రభువులు మున్నగువారికి సామాన్యపౌరుల వేషములును జుగుప్సావహములే. కావుననే మన కవులు ప్రౌఢోక్తులనైన నెల్లవారికి నచ్చు గొప్పపాత్రలనే విభావాదులుగా సృజించి రాజాధిరాజులకును రసానుభవము కల్గునట్లు కబ్బముల నల్లిరి. అట్టిశైలి నిప్పటివారు నాయికానాయకులు గొప్పయిండ్లవారే కావలెనా? పల్లెల పిల్లలు పనికిరారా? అని యీసడించుచున్నారు. అనుకార్యులు పెద్దతరగతివారైన చిన్నతరగతివారి రసోదయమునకు భంగ ముండదు. అనుకార్యులు చిన్నతరగతివారైనఁ బెద్దతరగతివారికి రసానుభవము దుర్లభము కావచ్చు. ఏలయన అనుకార్యుల వేషభాషలు తమకు నచ్చక యేవగించుకొనుచుండు కావ్యపాఠకులకుఁ గాని, నాటకద్రష్టలకుఁ గాని లౌకిక తాత్కాలిక జుగుప్స యలౌకికరసానందానుభవమునకుఁ బ్రతిబంధకము కాదా?

'చతుర్వర్గ ఫలప్రాప్తిః సుఖాదల్పధియామపి'

అనుచో సాహిత్యదర్పణము కావ్యనాటకాదులు సుకుమారమతులగు రాజకుమారాదులకే యని చెప్పెడిని. అట్టియెడ నధికారులగువారికే సరసప్రబంధము లుపయోగింప నగును. కాని, ప్రభుసమ్మిత వాఙ్మయముచేతను, మిత్రసమ్మిత గ్రంథమండలిచేతను వినేయులగు

లాతియధికారుల కీకావ్యనాటకాదుల వినయా ధాన మేల?

చిన్నతరగతి జనుల రసానుభవమునకుఁ జిన్నతరగతి యనుకార్యులకథ లుపయోగించుటయుఁ, గొన్నిచుట్టుప్రావలు మొదలైనవి లేనిచోఁ బెద్దతరగతి సహృదయులకుఁగూడ నవి రంజకము లగుటయుఁ గలదు. కాన లోకసహజప్రకృతిలోల మగు రసికహృదయమును దన్నుట కట్టి కథలతో సైతము పుస్తకములు సృజింపఁబడుట యుక్తమే యైనను బ్రాచీనకవులు సర్వసామాన్యముగా రసోదయమునకు గొప్ప పాత్రలనే యనుకార్యులఁ జేసి పొత్తముల మొత్తముల వెలార్చుటయు నవిచారకార్యము కాదు.

మహాత్మ దివ్యమహిమ

త్రిపురాన వేంకట సూర్యప్రసాదరావు దొరగారు

అభవం ధర్మరక్షార్థై యజ్ఞాతం భాస్కరాన్వయే,
రామాహ్వయం పరం బ్రహ్మ ధ్యాయేఽహం శ్రేయసే సదా.

సత్యము శౌచమున్ దయయు సర్వసమత్వము శాంతి స్వార్థరా
హిత్యము ధర్మబుద్ధి భువనైకహితాచరణంబు సాధుసాం
గత్యము నిత్యతుష్టియు వికారవిదూరవిచారదృష్టి ని
ర్వ్యత్యయచిత్తవృత్తి గలవారు మహాత్ములు గారె యెయ్యెడన్.

పటుబంధముల బాపి ప్రజకు స్వేచ్ఛ యొసంగఁ దా బంధనములలోఁ దగులుకొనియెఁ
గడు బీదజనులయాఁకటిచిచ్చు చల్లార్చ వలసి తా నిరశనవ్రతముఁ బూనె
ననద లౌలోకులయసహాయతలఁ దలంగ నసహాయయుక్తిఁ దా నధిగమించె
నూలువోఁగులను గొంతులు గోయుపని మాన్ప నూలువోఁగులకుఁ దా నూలుకొనియె
వాఁడిములుతోడ ములు పుచ్చవలనో లేక-విసము వోసి మృత్యువుఁ బాపువెరవో యెంత
వింత గొల్పెడు సహహా రవ్వంత యైనఁ-దెలియఁగా వచ్చునె మహాత్ముదివ్యమహిమ.

తన స్వార్థమును బరార్థము వీడు టది యెట్టిస్వారాజ్యవిభవమో చాటి చెప్పెఁ
దన తెచ్చికోలుపేదఱికం బరసి చూడ నెంతయైశ్వర్యమో యెఱుకపఱిచెఁ
దనగోఁచిపాఁత రాయునితనం బన నెట్టిపీతాంబరత్వమో పేర్మిఁ దెలిపెఁ
దన మౌనముద్ర యెంతటిసమస్యాపూర్తివివరణంబో చక్కఁ వెల్లడించెఁ
దనదుజీవితమే నిదర్శనము చేసి-లేమిలోఁ గల్మిఁ గల్మిలో లేమిఁ జూపె
వింత గొల్పెడు నహహా గోరంతయైనఁ దెలియఁగా వచ్చునె మహాత్ముదివ్యమహిమ.

ప్రబలహింసాకార్యపరులదౌర్జన్యంబుఁ బ్రతిఘటింప నహింసఁ బాదుకొలిపి
యనృతైకవాదులయక్రమంబు లడంప ననఘ మహా సత్యాగ్రహము వహించి
యదయచిత్తులశుష్కహృదయమ్ములఁ గరంప నతిదయామయవృత్తి ననువుపఱిచి
విప్లవకారులవిక్షోభ ముడిగింపఁ బరమప్రశాంతిసంపత్తిఁ దాల్చి
తమ్మిపూ ఱేకు నతితీక్ష్ణశరశతార-ధార కెదు రొడ్డునేర్పరితనముఁ జూపె
వింత గొల్పెడు నహహా కా సంతయైనఁ-దెలియఁగా వచ్చునె మహాత్ముదివ్యమహిమ.

కోరి ముప్పదిమూఁడుకోట్ల హైందవు లెల్లఁ దననోటిమాట వేదముగఁ దలఁప
సదుప దేశార్థమై జగ మెల్లఁ దనవంక నేకాగ్రదృష్టి నార్తి చూడఁ
బటుబలోదగ్రులౌ పగవారును దమంతఁ దనచెల్మికై తహతహలు వడఁగ
ధరఁ జేవ్రాసిన మహాపురుషు లందఱుఁ గూడఁ దనయుద్యమము మెచ్చి యనుసరింపఁ
గలిని గృతయుగధర్మముల్ నిలుపుకనదు-మతము సర్వలోకైకసమ్మతముఁ జేసె
వింత గొల్పెడు నహహా యొక్కింతయైనఁ-దెలియఁగావచ్చునె మహాత్ముదివ్యమహిమ.

కాదంబరీరసగ్రహణలోలతచేత మత్తా వహించి మై మఱచుఁ జగముఁ
బరదేశజనవేషభాషానుకృతిచేత స్వత్వసంపత్తిఁ గోల్పడినజగము
నస్పృశ్యభావజోపానురోధమ్ముచే నాత్మగౌరవదూర మైన జగము
వైదేశవస్త్రాదివస్తుమోహమ్ముచేఁ గడు లేమిఁ బొరసి కీడ్పడినజగము
మేలుకొలిపి కర్తవ్యపుంగీలు దెలిపి-దాస్యముక్తికిఁ దగినరాదారిఁ జూపె
వింత గొల్పెడు నహహా గవ్వంతయైనఁ-దెలియఁగావచ్చునె మహాత్ముదివ్యమహిమ.

తనబోసినవ్వులోఁ గనవచ్చునటె భారతాంబికాననమందహాసరుచులు
తనవింతపూన్కిలోఁ గనవచ్చునటె జగత్కావ్యార్థనూతనాధ్యాయరచన

తననోటిమాటలోఁ గనవచ్చునట సర్వభారతీయులభావిభాగ్యగరిమ
తనవాఁడిచూపులోఁ గనవచ్చునట మహాలోకావనైకవివేకపటిమ
జగతియం దింతటియపూర్వసంఘటనము-లెందుఁ గంటిమె వింటిమే యింతదనుక
వింత గొల్పు నహహా చిన్నమంతయైనఁ-దెలియఁగావచ్చునె మహాత్ముదివ్యమహిమ.

జనజీవనద మైనతనచేతిరాట్నంపుఁజక్రమే వైష్ణవచక్ర మేమొ
విన నింపు నింపెడు తన త్రిప్పుచరకాస్వనమె పాంచజన్యనినాద మేమొ
యనయమ్మును గడంకఁ దనయేకునచ్చంపుటేకులే వజ్రంపుమేకు లేమొ
తకిలీని జేపట్టి తనతీయునూలుదారమ్ములే కంఠపాశమ్ము లేమొ
ధర్మవిజయార్థమై నియంత యయి శాంతి-సంగరమ్ము నడపుతాన శౌరి యేమొ
వింత గొల్పు నహహా పీసమంత యైనఁ-దెలియఁగావచ్చునె మహాత్ముదివ్యమహిమ.

సత్యాగ్రహమహాస్త్రశక్తి మార్కొన లేక కాల్బలమ్ములు చాఁపకట్టువడియె
సత్యాగ్రహమహాస్త్రశక్తి డీకొన లేక గుఱ్ఱంపుదళములు గుంటువడియె
సత్యాగ్రహమహాస్త్రశక్తికి సరి గాక మరఫిరంగులు బైసి మాలిపోయె
సత్యాగ్రహమహాస్త్రశక్తికిం బ్రతి గాక వైమానికదళమ్ము వాసి చెడియె
ఆత్మశక్తికిఁ బశుబలం బఖిలగతులఁ-గ్రిం దగుట సూప నవతార మొందె నేమొ
వింత గొల్పు నహహా యిసుమంత యైనఁ-దెలియఁగావచ్చునె మహాత్ముదివ్యమహిమ.

మాక్రీస్తు ప్రభవించె మగుడ భారతభూమి నని క్రైస్తవులు గొల్వ నభిలషింప
మాబుద్ధుఁ డుదయించె మగుడ నీభరతోర్వి ననుచు బౌద్ధజనంబు లర్థిఁ బొగడ
మామహమ్మదు పుట్టె మగుడ నిక్కడ నంచు నెలమి మహమ్మదీయులు భజింప
మాకృష్ణుఁడు జనించె మగుడ నియ్యెడ నంచు భారతీయులు భక్తిఁ బ్రస్తుతింప
నీతఁ డవతారపురుషుఁ డన్ ఖ్యాతిఁ బొంది-యఖిలలోకకల్యాణార్థి యయ్యె నెంత
వింత గొల్పెడు నహహా యీవంత యైనఁ-దెలియఁగావచ్చునె మహాత్ముదివ్యమహిమ.

ధర్మవిప్లవంబు ధరఁ గల్గునపు డెల్ల-యుగయుగమునఁ బుట్టుచుందు ననుచు
గీతలందుఁ దొల్లి కృష్ణుండు పలుకఁడే-యదియ యేమొ నేఁటియిదియుఁ గూడ.

కాళిదాసుఁడు

విద్వాన్ జి. జె. సోమయాజిగారు M. A., L. T.

౩ మాళవికాగ్నిమిత్రము.

౧

కాళిదాసునిచే వ్రాయఁబడినవని విమర్శకులు విశ్వసించుచున్న గ్రంథములలో మాళవికాగ్నిమిత్రమొక్కటి. దీనినామధేయమునుబట్టియే యియ్యది మాళవికాగ్నిమిత్రులను గురించి వ్రాయఁబడెనని తెలియుచున్నది. 'మాళవికాగ్నిమిత్రము' అను పదమునకు వివరణమెట్లనఁగా మాళవికా చ అగ్నిమిత్రశ్చ మాళవికాగ్నిమిత్రౌ, తావధికృత్య కృతో గ్రంథః మాళవికాగ్నిమిత్రమ్' అనిగాని మాళవికయా సహితః అగ్నిమిత్రః మాళవికాగ్నిమిత్రః తమధికృత్యకృతో గ్రంథః మాళవికాగ్నిమిత్రమ్' అనిగాని చెప్పవచ్చును.

కాళిదాసరచితములని చెప్పఁబడుచున్న తక్కిన రెండురూపకములలోవలెఁ గాక దీనిలోఁ గథ చరిత్రాత్మకమైనది. విక్రమోర్వశీయమునందును, శకుంతలమునందును గల కథలను బురాణములనుండి గ్రహించి కవి రూపకానుగుణములుగ మార్పులనొనరించి యా గ్రంథములను రచియించెను. చారిత్రకపురుషుల కథలను గ్రహియించి రూపకములను రచియించు నభ్యాసము సంస్కృత సాహిత్యమునందు విశేషముగా లేదు. ఆంగ్లమునందు నాటకములనురచించి విఖ్యాతిఁగాంచిన షేక్స్పియరుమహాకవి వ్రాసినవానిలో ననేకములు చరిత్రాత్మకకథాయుక్తములగుట సుప్రసిద్ధము. చరిత్రాత్మకములగు నవలలు నాటకములు, దేశమునందలి పూర్వస్థితిని సజీవముగాఁ బాఠకులకుఁ బ్రదర్శించుటకు సమర్థములు గావున నిట్టి చరిత్రాత్మకమగు కథను గ్రహియించి రూపకమును రచియించుటచేఁ గాళిదాసుఁ డెంతయుఁ బ్రశంసార్హుఁడు. దేశచరిత్రమును నిర్ణయించుపట్ల నీమాళవికాగ్నిమిత్రమును బ్రమాణగ్రంథముగాఁ జారిత్రకపరిశోధకులు గ్రహించుచున్నారు.

౨

ఈరూపకమునం దైదంకములు గలవు. ప్రథమాంకమునఁ గవి యుక్త దేవతాప్రార్థన మొనరించి ప్రస్తావనాంగమునఁ దన నామాదులఁ దెలిపెను. తరువాతఁ గల మిశ్రవిష్కంభకమునందు వచ్చు నిరువురు పరిచారికల మూలమున మాళవికయను నామముగల యొక యువతి గణదాసుఁడను నాట్యాచార్యునికడఁ దత్కళాభ్యాసము చేయుట కంపఁబడినదనియును, మహిషియగు ధారిణి కొఱకు సర్పముద్రాంగుళీయక మొండు చేయింపఁబడినదనియును, రాజుగారి కంటఁబడకుండ నీమాళవికను ధారిణి రక్షించుచున్నను నామె నిసర్గమనోహరమగు నాకృతి రాజుగారిచే నొక్క చిత్రఫలకమునఁ గనుఁగొనఁబడి యాతని కౌతూహలమునకుఁ గారణమయ్యెననియు నాపయిని ధారిణి మాళవికను మఱింత జాగరూకతతోఁ గాపాడుచుండెననియును, దెలియవచ్చుచున్నది. తరువాతి నాపరిచారికలలో నొకతెయగు వకుళావళిక నాట్యాచార్యుఁడగు గణదాసునితో నొనరించిన సంభాషణమునుబట్టి మాళవిక మిక్కిలి బుద్ధిశాలినియనియును, రాజునగ్నిమిత్రునికిఁ బ్రియురాలగు నిరావతి నత్యల్పకాలములోనే మించఁగలదనియును, నర్మదాతీరమున నున్న దుర్గమునకుఁ బాలకుఁడును రాణియగు ధారిణికిఁ దనకంటెఁ దక్కువకులమునఁ బుట్టిన సవతితమ్ముఁడును నగు వీరసేనునిచే మాళవిక సేవకురాలుగాఁ బంపఁబడినదనియును, నామె రూపాదులామె నున్నతవంశసంజాతఁగాఁ దెలుపుచున్నవనియును, ఛలితమను నాట్యవిశేషమునం దప్పుడే సమర్థురాలయి పంచాంగాభినయాత్మకమగు మఱియొక నాట్యవిశేషము నభ్యసించుచున్నదనియును దెలియవచ్చుచున్నది. అనంతరమగ్నిమిత్రునకును నమాత్యుఁడగు వాహతకునకును జరిగిన సంభాషణమునుబట్టి రాజ్యవిషయములగు కొన్ని పూర్వసమాచార

మాలుఁ దెలియవచ్చుచున్నవి. విదర్భదేశమునకుఁ బ్రభువగు యజ్ఞసేనుని శ్యాలకుఁడు మౌర్యమంత్రి, యగ్నిమిత్రునిచేఁ జెరయందుంపఁబడెను. దీనికిఁ బ్రతీకారముగా యజ్ఞసేనుఁడు నిజజ్ఞాతియును, నగ్నిమిత్రునకుఁ బ్రియుఁడును, దనచెల్లెలి నగ్నిమిత్రునకిచ్చి యాతనితో సంబంధమును గల్పించుకొన నూహించుచున్నవాఁడును నగు మాధవసేను నోడించి యాతనిని గారాగారమునందుంచఁగా నగ్నిమిత్రుఁడు కోపోద్దీపితుఁడయి మాధవసేనుని విడువవలసినదని యజ్ఞసేనునకుఁ గమ్మఁబంపఁగా నాతఁడు దనశ్యాలకుండగు మౌర్యసచివు నగ్నిమిత్రుఁడు విడిచిపుచ్చినచో నట్టి నిబంధన సంగతమగునని మారు వ్రాసిపంపఁగా నతఁడు దండతాడితభుజంగము భాతి మండిపడి యజ్ఞసేనుని నోడించి యాతనిరాజ్యమును వశమొనరించుకొనుటకుఁ దనసేనానినిఁ బంపుటకుత్తరువొసంగెను. మనకథాభాగమునకుఁ బూర్వస్థితములగు పయియంశములన్నియుఁ గాళిదాసుఁడు పయిసంభాషణములవలనఁ దెలిపి ప్రకృతకథావిధానమును జరిపించుటకుపక్రమించెను. మాళవికను జిత్రమునందు దర్శించినదాఁగనగ్నిమిత్రుఁడామెను జూడవలయునని కౌతూహలముగలవాఁడయి యట్టి సన్నివేశమును జరుపుటకయి విదూషకునిఁ గోరఁగా నాతఁడు నాట్యాచార్యులగు గణదాసునకును హరదత్తునకును విద్యావిషయమున నొక గొప్పవివాదమును బుట్టించి యొకరితో నొకరు మచ్చరించునట్లు చేయఁగా నారిరువురును దమకుఁగల వివాదమునుదీర్ప నగ్నిమిత్రునిఁ బ్రార్థించిరి. రాజునకును రాణికిని మాననీయురాలగు నొక పరివ్రాజిక రాజగృహమునందుండఁగా నామె నీ పండితుల వివాదమును దీర్ప వారిరువురును నియమించిరి. నాట్యాచార్యుల పరీక్షాకాలమున రాణియును బరివ్రాజికయును సభాస్థానమునందుఁ గూరుచుండిరి. పరివ్రాజిక కూడ నెట్టెటులో విదూషకుని మంత్రమునకుఁ దోడయి యీ యిరువుర నాట్యమును నింతకుమున్నే చూచితిని గావున వీరిశిష్యుల నాట్యమును జూడవలయునని చెప్పెను. ఈ పద్ధతి రాణికేమాత్రము నిష్టము లేకుండుటచే నట్లు జరుగకుండఁ జేయుటకుఁ బ్రయత్నముఁజేసెనుగాని యామె కాశ్రితుఁడగు గణదాసునికిఁ గల స్వపాండిత్యప్రకటనా కౌతూహలముచేఁ దన ప్రయత్నమును సాగించుకొనలేకపోయెను. హరదత్త గణదాసుల శిష్యులు స్వల్పభూషణములతో నస్వల్పవస్త్రములతో వచ్చి నాట్యము సేయవలయునని నియమించి రాజును బరివ్రాజికయును ధారిణియును నాట్యశాలకుఁ బోయిరి.

రెండవ యంకమున గణదాసుని శిష్యురాలగు మాళవిక పయిప్రకారము తన నైపుణ్యమును జూపుట కడఁగించి ఛలికమను నాట్యవిశేషమును బ్రదర్శింప మొదలిడెను. అగ్నిమిత్రుఁడా సుందరీరూపమును గనులఁ గ్రోలుచుఁ దన్మయుఁడై యుండెను. మాళవికయు శృంగారరసోద్బోధకమగు నొక శ్లోకమును జదివి తాను నగ్నిమిత్రునిపయి మరులుకొని యున్నదనునట్లభినయించుటచే నాతఁడెంతయు సంతసించెను. విదూషకుఁడు వివిధోపాయములచే మాళవిక యక్కడ నుండవలసిన కాలమును బొడిగించుటకుఁ బ్రయత్నించి రాజునకానందమునుగూర్చెను. నాట్యప్రదర్శనానంతరమున విదూషకుఁడు రాజహస్తమునుండి కటకమును గ్రహించి మాళవిక కొసంగుటకుఁ బ్రయత్నించుచుండఁగా దేవియగు ధారిణి కోపించి యాతని నాపనినుండి నివారించి శిష్యాసహితముగా సభనుండి వెడలిపోవలసినదని గణదాసున కాజ్ఞాపించెను. హరదత్తుఁడు తన శిష్యప్రదర్శనమును దిలకింపవలసినదని ప్రార్థించుచుండఁగాఁ బంద్రెండు గంటలు కొట్టుటచే భోజనకాలమతిక్రమించినదనియును హరదత్త శిష్య పరీక్ష మఱునాఁడు జరుగుననియును జెప్పి యానాటి కాతని వెడలిపొమ్మనిచెప్పిరి. చిత్రగత మాళవికాదర్శనముచే నగ్నిమిత్రునిహృదయసీమను నాటంబడిన ప్రేమబీజమామె నైశారద్యమును పరీక్షించుటచే వృద్ధింగాంచి మొలకలెత్తెను. మదనసాయకహతుఁడగు తానింక మాళవికా సంయోగమును బొందక యూరటఁ బొందఁజాలనని విదూషకునికిఁ జెప్పి తల్లాభముకొఱకయి యాతని సాహాయ్యమొనరింప వేడుకొనఁగా నాతఁడు ప్రయత్నింతునని చెప్పి రాజును దనమనస్సునందలి యభిలాషమును వెలిపుచ్చక జాగరూకతతో నుండవలసినదని హెచ్చరించెను.

మూఁడవయంకమునకాదియన్న ప్రవేశకమునందు, విద్యావిషయములో హరదత్త గణదాసు లిరువురును సమానులయ్యు శిష్యపై శారద్యముచే గణదాసుఁడధికుండని నిర్ణయింపఁబడినదనియును, మాళవికాగ్నిమిత్రులిరువురును బరస్పరానురాగముతో మన్నారనియును క్రీడావనమందలి తపనీయాశోకము వసంతకాల మారంభమయ్యును బుష్పింపకుండుటచే దానికి దోహదంబగు స్త్రీపాదఘాతమావశ్యకమనియును దెలియఁజేయఁబడినది. అగ్నిమిత్రుఁడు మదనశరములచే నొంపఁబడినవాఁడయి కాలమునెట్లు గడపుటయో యెఱుఁగకుండు సమయమున నిరావతితోఁగూడి సాయంకాలమున డోలోత్సవము ననుభవింతునని చెప్పినమాటను విదూషకుఁడాతనిస్మృతికిఁ దెచ్చెను. ఆసమయమునఁ దాననుభవించుచున్న తనోవేదనతో నిరావతినిగలసికొనుట యసంభవమని రాజు బదులుచెప్పఁగా విదూషకుఁ డిపుడాలము నంతఃపుర పరిచయము నొక్కసారిగా భంగపఱుపరాదని యుపదేశించి రాజును గేళీవనమునకుఁ గొంపోయెను. ఇట్లుండఁ దపనీయాశోకంబునకుఁ బాదఘాతంబు నొసంగుటకు, డోలాధిభ్రష్టయగుట పరజచరణయగు ధారిణి యుపరుద్ధురాలయి యాకార్యంబునకు మాళవికను బంపుచు నామె చరణనిపాతంజేసి యశోక మయిదుదినములలోఁ బుష్పించెనేని నభీష్టవరంబొసంగెదనని చెప్పెను. మాళవికయును వకుళావళికాసహితయయి ధారిణి ధరించు పాదకటకంబుల గ్రహియించి వేలిచే నలంకరింపఁబడినదయి కార్యమునకై కేళీవనమున కరుగుదెంచెను. ఈసందర్భమున రాజు విదూషకునిఁగూడి యొక్క పొదమాటునఁ గూరుచుండి తనప్రియురాలింజూచుచు నామెయును వకుళావళికకును జరుగు సంభాషణమును వినుచు దానినిబట్టి తనపై మాళవికకుఁ బ్రేమగలదని యెఱింగి యానందించుచుండెను. ఇరావతి నిపుణికయను తనసఖితోఁగూడి డోలాధిరోహణంబునకై వచ్చుట కేఁగుదెంచి రాజునంగానక యేపొదమాటుననో దాగియుండునని యూహించి యక్కడనే వేచియుండెను. మాళవిక యశోకపాదపంబును దనపదహతిం బొసంగించి రాజప్రేమాంబుధిమునిఁగి పోయియున్న సమయంబున నాతఁడు బయటికివచ్చి మాళవికకుఁ బాదపము తాఁకుటచేఁ గాలికినొప్పితగులలేదు గదా యని ప్రశ్నించి యట్టిపాదహతిచేఁ దన్ను గౌరవింప వలసినదిగాఁ గోరెను. ఈవృత్తాంతమును గనిపెట్టుచున్న యిరావతి (రాజు రెండవభార్య) కోపోద్దీపితయై వెడలి వచ్చి పురుషులు కుటిలస్వభావులని నిందింపఁదొడంగెను. ఇరావతి యాగ్రహంబునకు భయపడి యెట్టెటో మాళవికయును వకుళావళికయుఁ జారిపోయిరి. తనకు సంభవించిన యవస్థను దెలిపికొని యగ్నిమిత్రుఁడు 'నీకొఱకై వచ్చి నిన్నుఁ గానక వినోదంబునొకింత సల్పుచున్నాను' అని చెప్పి యిరావతినను నయింపఁ జూచెనుగాని పాదగ్రహణ మొనరించిన రాజును నిరాకరించి యామె వెడలి పోయెను. విదూషకుఁడు ధైర్యముఁ జెప్పఁగా నగ్నిమిత్రు డాతనిఁగూడి భవనమునకు మరలిపోయెను.

నాల్గవయంకమునందు మాళవికనుగలసికొనఁజాలక పరితపించుచున్న యగ్నిమిత్రుఁడు ప్రవేశించును. ఇరావతిచేఁ బురికొల్పఁబడినదియై ధారిణి మాళవికను వకుళావళికను భూగృహంబున బందీకృతలంజేసి యాకారను రక్షించు మాధవికకుఁ దన యంగుళీయక దర్శనంబునఁ గాని వారిని విడువరాదని యానతిచ్చెనని విదూషకుఁడు రాజునకు నివేదించును. ఇఁకమాళవికను గలసికొనుట యెట్లని రాజు చింతించుచుండ విదూషకుఁ డొక్క యుపాయమునాతనికిని బ్రతీహారిణియగు జయసేనకును దెల్పఁగా రాజాతనుపాయానుసారముగా ధారిణీగృహంబున కామె స్వాస్థ్యమును గనుఁగొనుటకునని వెడలెను. విదూషకుఁడు రాజ్ఞీ దర్శనార్థము పోవుచు పూజాకవస్తువును బహుమానార్థముఁ గొంపోవనెంచి దానిని వెదకుటకుఁ బోయెను. పాదరుజచేఁ బర్యంకాసీనయైయున్న ధారిణికడకగ్నిమిత్రుఁ డరిగిన కొంతసేపటికి విదూషకుండేడ్చుచు వచ్చెటికరుగుదెంచి రాజ్ఞీబహుమానార్థము పూవులవెదుకంబోయి సర్పదష్టుఁ డనయితినని చెప్పెను. రాజాజ్ఞపై విషవైద్యుని కీసమాచారముఁ దెలియనంపఁగా నాతఁడు విదూషకుండనకడకే దీసికొనిరావలసినదని చెప్పెను. విదూషకుఁ డచ్చటికేగిన కొంతసేపటికి జయసేన యరుగుదెంచి విదూషకుని పాముకాటునకుఁ బ్రతిక్రియ చేయుటకుదకకుంభవిధానముచే

సర్పముద్రనొకదానిని గల్పింపవలయుననియును దానికి సర్పముద్రాంగుళీయకమొండు గావలసినదనియును జెప్పఁగా ధారిణి నిజాంగుళీయకము నొసంగెను. తరువాత విదూషకుఁడు పాము బాధనుండి నివారింపఁబడెనని జయసేన వార్తఁ దెల్పినయనంతరము రాజకార్యమున్నదను మిషపై రాజంతఃపురమును వీడి యుపవనమునకుఁ బోయెను. ఇంతలో విదూషకుఁడు నిజముగాఁ బాము కాటులేనివాఁడు గావున నాయుంగరమును గ్రహించి దాని మూలమున మాళవికను జెలికత్తెను విడిపించి యుపవనంబునకుఁ దోడ్కొనిపోయి సముద్రగృహమునందుంచెను. రాజును మాళవికనందుఁ బ్రవేశింపఁజేసి విదూషకుఁడును వకుళావళికయును వెలికివచ్చిరి. ద్వారముకడఁ బరుండి విదూషకుండు నిదురింపఁజొచ్చెను. విదూషకుం డొక్కఁడునుండుటను గాంచిన యిరావతి సేవకురాలగు చంద్రిక యావిషయమును నక్కడికివచ్చిన యిరావతి చెలికత్తెయగు నిపుణికకుఁ దెలుపఁగా నేదియో కుతంత్రమొండు విదూషకుఁడు పన్నుచున్నాఁడని యూహించి యిరావతియు నిపుణికయు విదూషకుఁడున్న స్థలమునకుఁబోయిరి. అతఁడు నిద్రలో 'మాళవికా, తప్పక యిరావతికంటె మిన్నవైయుండుము' అని కలవరింపఁగా విని దానిని సహింపఁజాలక యాబ్రాహ్మణుని భయపెట్టుటకొక సర్పాకారము గల కొయ్యను నాతనిపై వైచెను. ఆతఁడును భయపడుచు లేచి యఱవఁగా రాజును వకుళావళికయు, మాళవికయు నచ్చోటికేఁ బరువెత్తుకొనివచ్చిరి. దీనినంతయును బరికించి యిరావతి శోకపూరితకాఁగా రాజామెతో 'వీరివిరువురను జెఱనుండి విడిపించుటవలన నాకుఁ దమ కృతజ్ఞతను దెల్పుకొనుటకై వచ్చిరి' అని చెప్పి యామెనోదార్పఁజూచెను. ఈసందర్భమున, కుమారిక వసులక్ష్మి (రాజుమఱఁదలు) కోఁతిని జూచి భయపడినదనియు నామెనోదార్చుటకు రాజంతఃపురమునకుఁ బోవలసినదనియును జయసేనచెప్పి రాజు నాచిక్కునుండివిడిపించెను. పైపనికంతటికిని విదూషకుఁడే మూలమని యిరావతి యెంచెను. ఈమూలసాపరాధమునకే శిక్ష యగునోయని మాళవికభయపడుచుండఁగా వనపాలకుండశోకవృక్షము పుష్పించినదని తెల్పెను. ఆమాటవిని ధారిణియొసంగిన వరంబును జ్ఞప్తికిఁదెచ్చుకొని మాళవికయు వకుళావళికయును సంతసించిరి.

అయినను యంకమునను ద్వారపాలికయగు మధుకరికకును సారసకునకును జరిగిన సంభాషణమును బట్టి యశోకవృక్షముపూయుటచే మాళవికకు మంచిదినములు వచ్చునని తెలియవగును. అగ్నిమిత్రునితండ్రియగు పుష్పమిత్రుఁడశ్వమేధయాగమును జేయుచు నశ్వరక్షణార్థ మగ్నిమిత్రుని కుమారుఁడగు వసుమిత్రునంపెననియును, ప్రథమాంకమునందు విదర్భరాజుపై దాడివెడలిన సేనాపతి యాతని జయించి మాధవసేనుని విడిపించెననియు నచ్చటినుండి యనేకోపాయనములు రాజుగారి కొఱకు వచ్చుచున్నవనియును బయిసంభాషణము వలన నేకముఁ గొనవలెను. మాళవికను గురించి చింతించుచున్న రాజున కీజయవార్త విశేషము మోదావహము గాకుండెను. ఇంతలోఁ బూచిన యశోకవృక్షమును జూచి యానందింపవలయునని రాజును ధారిణి పిలువనంపఁగా నారేఁడును వెడలెను. ధారిణియు మాళవిక కలంకారంబు సేయించుటకుఁ బరివ్రాజికతోఁజెప్పి కృతాలంకారయగు నామెంగూడి యుపవనమునందు రాజు రాకకయి ప్రతీక్షించుచుండెను. ఇంతలో రాజును విదూషకునింగూడి యచ్చటికి విచ్చేసెను. ఆసమయమున విదర్భనుండి రాజునకుపాయనముగా వచ్చినయిరువురు స్త్రీలు రాజసన్నిధానమునకుఁ దీసికొని రాఁబడిరి. వారిరువురును మాళవికను బరివ్రాజికను గుర్తించి మాళవిక తమరాజగు మాధవసేనుని చెలియలనియును నామెను సురక్షితఁగాఁ గన్గొనినందులకు సంతసించుచున్నామనియును దెల్పిరి. తరువాతఁ బరివ్రాజికనుండియుఁ గ్రొత్తగావచ్చిన స్త్రీలనుండియు నీక్రింది సమాచారము నంతయును రాజు తెలిసికొనెను. మాధవసేనుఁడు చెఱయందుంపఁబడిన యనంతర మాతని మంత్రియగు సుమతియను నాతఁడు విధవయగు తన చెలియలు కౌశికితోడను మాధవసేనసోదరియగు మాళవికతోడను నగ్నిమిత్రుని పురంబునకుఁ బయనమై యొకబిడారుతోఁ గలిసిపోవుచుండఁగా మార్గమునఁ దస్కరులచేఁ దోచుకొనఁబడినవారై మాళ

వికారక్షణార్థము దన ప్రాణములను గోలుపోయెను. మాళవిక యాటవికులచే గ్రహింపఁబడి వీరసేనునకర్పింపఁబడఁగా నాతఁడామెను దన సోదరియగు ధారిణికడ కంపెను. కౌశికియు గతించిన తనయన్నకగ్నిసంస్కారము గావించి పరివ్రాజికావేషధారిణియయి క్రమంబున నగ్నిమిత్రుని యంతఃపురముఁ జొచ్చెను. అంతఃపురమున నే కౌశికికిని మాళవికకును సమావేశము కలిగెను. మాళవికయొక్క వృత్తాంతమును నెఱిఁగినదయ్యును నొక యతి 'మాళవిక సంవత్సర పర్యంతము సేవకురాలిగా నుండి యనంతరమున్నతావస్థకు వచ్చు' నని చెప్పిన జోస్యము ననుసరించి మాళవికాజన్మవృత్తాంతమును గౌశికి మఱుఁగుపఱచెను. అనంతరము విదర్భదేశము రెండు భాగములుగా భాగింపఁబడి మాధవసేన యజ్ఞసేనులకుఁ బంచి పెట్టఁబడవలయునని రాజును నమాత్యులును నిశ్చయించి యుండు సమయమునఁ బుష్యమిత్రుని కడనుండి యొక కమ్మ వచ్చినది. అందు వసుమిత్రుఁడు హయమునడ్డగించిన యవనులను జయించి యజ్ఞాశ్వమును మరలించికొని వచ్చెననియు నిఁక యజ్ఞమును జూచుట కగ్నిమిత్రుఁడు కుటుంబముతోఁగూడ రావలయుననియు వ్రాయఁబడియున్నది. కుమారవసుమిత్రుని విజయవార్త తల్లియగు ధారిణికెంతయు నానందమును గల్పింపఁగా నాయమ మాళవికకు రాణి యను పేరినొసంగి యామెను రాజునకు సమర్పించెను. ఈసమయమున నిరావతియుఁ దాను రాజునెడఁ జేసిన యపరాధమునకుఁ బశ్చాత్తాపమును దెల్పుచు నీనూత్న వివాహమునకుఁ దనసంతోషమును గూడ విన్నవించుచు రాజునకు వార్తనంపెను. ధారిణియొక్క యున్నత స్వభావమును బరివ్రాజిక మెచ్చుకొనెను. తన యందెప్పుడును ప్రసన్నయయి యుండవలసినదని రాజు ధారిణిని బ్రార్థించెను.

3

ప్రస్తుతరూపకమునందలి కథావిధానమును పైప్రకారముగా వివరించిన యనంతరము దీనికర్తృత్వమును గుఱించి విచారింపఁ బూనుకొనుచున్నాను. నాటకాదిఁ గల ప్రస్తావనాంగమునందు "శ్రీకాళిదాస గ్రథితవస్తు మాళవికాగ్నిమిత్రం నామ నాటకమస్మిన్ వసంతోత్సవే ప్రయోక్తవ్యమ్" అని చెప్పఁబడుటచే నిది కాళిదాసకృతమనుట నిర్వివాదమని చెప్పవలసి వచ్చినను గొందఱు దీని కర్తృత్వము విషయమున సంశయింపక పోలేదు. పందొమ్మిదవ శతాబ్దముయొక్క మొదటి భాగమున సంస్కృతకావ్యముల గుఱించి పనిఁజేసిన పాశ్చాత్యులలోఁ గొందఱు పైకావ్యముయొక్క కర్తృత్వమును శంకించిరి. వారిలో ముఖ్యుఁడగు వాఁడు ప్రొఫెసరు హెచ్. హెచ్. విల్సనుదొర తాను వ్రాసిన ('Theatre of the Hindus') అను పేరితో నున్న పుస్తకముయొక్క రెండవ సంపుటమునందలి యనుబంధములో మాళవికాగ్నిమిత్రమును గుఱించి యీక్రిందిరీతిని వ్రాయుచు నీరూపకకర్త రఘువంశాది కర్తయగు సుప్రసిద్ధ కాళిదాసుఁడు గాక మఱియొక్కఁడై యుండవచ్చునని యూహించెను.

"There is no reason to question the nomenclature of the author here, and the play isprobably the work of a Kalidasa. Tradition alone identifies him with the poet of Vikramaditya's reign, who preceded the Christian era, and the internal evidence is adverse to the drama's being the work of the author of Sakuntala and Vikrama and Urvaci. There is neither the same melody in the verse nor fancy in the thoughts".

'There might seem reason therefore to infer that the play was the work of the Kalidasa of antiquity; but the manners described appear to be those of a degenerate state of Hindu society and it can be scarcely be thought earlier than the tenth or eleventh century."

ప్రొఫెసరు వీబరుగారుగూడ మొట్టమొదట నిట్టి యభిప్రాయముతోడనే యుండెరిగాని విశేషపరిశీలనమువలనఁ దమ యభిప్రాయమును మార్చుకొనిరి. ఈపుస్తకము మొట్టమొదట ౧౮౪౦ వ సంవత్సరమున 'బోన్' నగరమున నచ్చొత్తింపఁబడినది. ఆ వెనుక

౧౮౫౯ వ సం. జెర్మనుభాషలో నొక పరివర్తనమును ప్రొఫెసరు వీబరుగారు ప్రచురించిరి. భారతదేశములో నున్న ప్రాతప్రతులసాహాయ్యమున 'పండిత్'గారీగ్రంథము ౧౮౭౯ వ సం.లో నచ్చొత్తించిదాని యుపోద్ఘాతమున మాళవికాగ్నిమిత్రకర్తృత్వమునుగూర్చి చర్చించి యిది కాళిదాసకృతమనియే సిద్ధాంతమొనరించిరి. అంతటితో నీవివాదము ముగిసినది.

విల్సనుగారు తమ యభిప్రాయమును సమర్థించుకొనుటకుఁ జెప్పిన ముఖ్యకారణములు మూఁడు.

I మాళవికాగ్నిమిత్రమునందలి పద్యములందుఁ గాళిదాసుని యితరనాటకములలోఁ గల మాధుర్యము లేదు.

II మాళవికాగ్నిమిత్రమునందలి కల్పనలును భావములును దక్కిన రెండు నాటకములయందున్న వాని యంతటి యుత్తమముగా లేవు.

III ఈ నాటకమున వర్ణింపఁబడిన సంఘస్థితి నైతికదూరమై ధర్మభ్రష్టమై యున్నది గావున నిది కాళిదాసుని కాలమునందలిస్థితియని చెప్పుటకేమాత్రమును వీలులేదు.

పైవిషయములను ఖండించి మాళవికాగ్నిమిత్రమునకును దక్కిన రెండు నాటకములకును సమానకర్తృత్వమును నిరూపించుటకుఁ దగిన యుక్తులను 'పండిత్'గారు తమ యుపోద్ఘాతమునందిచ్చిరి. పైయంశములను నిర్ధారణమొనరించుటకుఁ వారియుక్తులు సరిపోవునను నభిప్రాయముతో వానిసారమును నా యభిప్రాయములతోఁ గలిపి చేసి క్రింద నిచ్చుచున్నాను.

మాళవికాగ్నిమిత్రమునందలి పద్యములలో మిగిలిన రెండు నాటకముల యందలి పద్యములలో నున్న యంతటి మాధుర్యము లేదని చెప్పువిల్సనుగారి వాక్యముల యభిప్రాయము సుస్పష్టముకాదు. సంస్కృతవృత్తముల లక్షణ మింగ్లీషువృత్తముల లక్షణమువలె వాడినప్పుడు మాత్రాధిక్యమునుగాని మాత్రాన్యూనతనుగాని యొప్పుకొనునదిగాదు. కాళిదాసుఁడు దక్కిన రెండు రూపకములలోను వాడిన వృత్తములవంటివానినే యీరూపకమునందును వాడియున్నాఁడు. ఇఁకఁ బద్యములయందలి పదబంధమును గూర్చియుఁ, బ్రసాదాదిగుణములనుగూర్చియును నీగ్రంథత్రయమునందును భేదమేమియును గన్పించుటలేదని చదివినవారికిఁ దెలియకపోదు. ఇఁక నా గ్రంథములలోని పద్యములలో నున్న మాధుర్యము (Melody) మాళవికాగ్నిమిత్రమునందు లేదని చెప్పుయుక్తి గ్రంథమున కన్యకర్తృత్వమును సాధించుటలో మిక్కిలియు బలహీనమనియు నట్టిభేదమొక్క కవి వ్రాసిన గ్రంథములయందే యాతని బాల్యప్రౌఢావస్థలంబట్టి కన్పించుచుండుననియును ఋతుసంహార వ్యాసమున సంపూర్ణముగాఁ జర్చించితిమిగావున నిఁక నాపని నిచ్చట నారంభింప నావశ్యకత లేదు.

ఇఁక మాళవికాగ్నిమిత్రమునందలి కల్పనలు మొ. దక్కిన రెండునాటకములలోని వాని యంతటి యుత్తమముగా లేవను రెండవయుక్తిలోఁ గొంత సత్యమున్నదని విమర్శకులందఱును నొప్పుకొనిరిగాని దానికి వీబరుగారీక్రిందిరీతిని సమాధానముఁ జెప్పుచున్నారు. "—both rest upon a mythical back ground, and consequently bear a more magnificient and ideal character: the Malavikagnimitra portrays the life in the court of a historic prince and consequently the bare actuality, with its self made, and therefore scanty concerns." అనఁగాఁ దక్కిన రెండు రూపకములయందలి కథావిధానమునందును పౌరాణికవిషయములు మూలమగుట నాశ్చర్యకరములగు సన్నివేశములను గల్పించుటకవకాశమెక్కువ యున్నదనియును మాళవికాగ్నిమిత్రమునందలి చరిత్రాత్మకమగు కథయంతట్టి సన్నివేశముల గల్పించుట కంతగా వీలులేదనియు నభిప్రాయము.

దుష్యంత పురూరవసుల కథలయందువలెనే యగ్నిమిత్రుని కథయందును గవి తన ప్రతిభాబలమున నద్భుత సన్నివేశములను గల్పింపవచ్చుననియును బూర్వకాలిక రాజవంశమునకు సంబంధించిన చరిత్రము నందును నట్టి యవకాశములకు లోటులేదనియును పౌరాణికగాథ కానట్టి

మాలతీమాధవమునందుఁ జక్కని సన్నివేశములను నాశ్చర్యజనకములుగాఁ గవి కల్పించియున్నాఁడనియును నాకారణమున వెబరుగారితోఁ బాటిగా విషయమున నేకీభవింపఁ జాలమనియును 'పండిత్' గారు వ్రాసిరి. కాని వెబరుగారు వ్రాసిన యుక్తిలోఁగూడఁ గొంతమట్టునకు నిజమున్నదని మా యభిప్రాయము. మిగిలిన రెండు రూపకములయందును గవి స్వర్గమర్త్యలోకములకు సంబంధమును గూర్చి మిక్కిలి యద్భుతములగు సన్నివేశములను గల్పింపఁగలిగెను. అట్లు విమానముల నెక్కుచుటకు గాని యతిమానుషములగు దృశ్యములను వర్ణించుటకుఁ గాని యీకథయందవకాశము గానరాదు. తక్కిన నాటకములయందుఁ గల తపోవనవర్ణనము లాంటి వర్ణనములకును గూడ నింకవకాశము లేదు. మాలతీమాధవమునందు భవభూతి యఘోరఘంటునియొక్కయుఁ గపాలకుండలయొక్కయు చరిత్రమును గూర్చి నాటకమునకు వన్నెపెట్టఁగలిగెనా లేదా యని పండిత్ గారు ప్రశ్నింపవచ్చును, గాని మాలతీమాధవకథకును మాళవికాగ్నిమిత్రకథకును భేదము లేకపోలేదు. ఒకటి కల్పితము. రెండవది చరిత్రాత్మకము, కవికాలమునకుఁ జాలసమీపమునందుండిన రాజచరిత్రము విషయముగాఁ గలది. ఇట్టికథలోఁ గవి యాధికములగు నతిమానుషదృశ్యాను గల్పించినయెడలఁ బ్రేక్షకులకుఁ జక్కనినమ్మకగలుగుట కవకాశము లేదుగదా! ఇంతకును చరిత్రకము కొనకే చక్కఁగాఁ దెలిపినవిషయములగుట నందంతటికల్పనను జేయుటకుఁగూడఁ గవి సాహసింపలేకపోయి యుండవచ్చును. కావున దానెందుకో నీకథ కవియొక్క ప్రతిభకు విశ్శృంఖలముగాఁ బరుగెత్తుట కవకాశమనొసంగినది గాదనుటలోఁ గొంతసత్యమున్నదనక తప్పదు. 'పండిత్'గా రూహించునట్లు కాళిదాసుఁ డీపుస్తకమునుగూడ ఋతుసంహారమువలెనే ప్రౌఢావస్థ రాక మునుపే రచియించెనని యూహించుటలో మేమును నేకీభవించుచున్నాము గావునఁ దనరూపకమునకుఁ దగిన కథ నెంచుకొనుటలోఁ గవి చక్కఁగాఁ దన సామర్థ్యమును వినియోగింపఁజాలకపోయెనని మా యభిప్రాయము. ఈనాటకము బాల్యావస్థయందు వ్రాయఁబడెననుట కాధారములేమున్నవో మున్ముందుఁ జర్చింతుము.

ఇఁక విల్సనుగారు చెప్పిన మూఁడవకారణముగూడ సమంజసముగాఁ గన్పట్టుటలేదు. ఒకరాజునకు ననేక భార్యలుండుటయు నప్పుడుగూడ నాతఁడు క్రొత్తఁగా వివాహములాడుటకుఁ బ్రయత్నించుటయు హిందూదేశమున సర్వరాజసాధారణమగు విషయముగావున దానిని గాంచి విల్సనుగారు చెప్పిన యభిప్రాయమున మనమాదరబుద్ధి నుంచనక్కఱలేదు. విల్సనుగారి మతమునఁ గాళిదాసుని రూపకములగు తక్కిన రెండిటియందును గూడ రాజులు భార్యాయుక్తులయ్యుఁదిరిగి వివాహములను జేసికొని యున్నారనుట సత్యమే గదా!

ఇఁకఁ గాళిదాసునిదే యీ కావ్యమనుటకును నియ్యది నాటకముల మూఁడిటిలో మొదట వ్రాయఁబడినదనియును సూచించుటకుఁ దగినయుక్తుల నిచ్చుచున్నాము. ప్రస్తావనయందు మాళవికాగ్నిమిత్రము కాళిదాసవిరచితమని వ్రాయఁబడినది. దానినెవ్వరును హిందూదేశములో నప్పుడు నమ్మకుండినట్లు గాని దానికి విరుద్ధములగు కథలు వాడుకలో నున్నట్లు గాని వినరాలేదు. కావున నెంతటికారణమో యుండినంగాని మనము కావ్యకర్తృత్వమును శంకించుట కవకాశము లేదుగదా! ఇంతియగాక గ్రంథమునందలి కల్పనలు మొదలగువానిని బరీక్షించినను నీయభిప్రాయమే తేటతెల్లమగుచున్నది. గ్రంథాదిని పారిపార్శ్వకునకును సూత్రధారునకును జరిగిన సంభాషణమునఁబట్టి ప్రథితయశస్కులగు భాససౌమిల్లకవిపుత్రాదులుండఁగా వారికావ్యములనుమాని వర్తమానకవియగు కాళిదాసునిరూపకమును బ్రయోగించుట యందేమి యభిప్రాయమను ప్రశ్న లేవదీయఁబడి సమాధానమప్పటనే యొసంగఁబడెను.

పారి. మాతావత్, ప్రథితయశసాం భాససౌమిల్లకవిపుత్రాదీనాం ప్రబంధానతిక్రమ్య వర్తమానకవేః కాళిదాసస్య క్రియాయాం కథం పరిషదో బహుమానః.

సూత్ర. అయి వివేకవిశ్రాంతమభిహితమ్. పశ్య పురాణమిత్యేవ నసాధు సర్వం, నచాపికావ్యం నవమిత్యవద్యమ్, సంతః పరీక్ష్యాన్యతరద్భజంతే, మూఢః పరప్రత్యయనేయబుద్ధిః.

పై ప్రకారమునఁ గాక విక్రమోర్వశీయమునందు సూత్రి। మారిష. బహుశస్తు పరిషదా పూర్వేషాం కవీనాం దృష్టః ప్రయోగబంధః। సోహమద్య విక్రమోర్వశీయం నామ త్రోటకమపూర్వం ప్రయోక్ష్యే। తదుచ్యతాం పాత్రవర్గః స్వేషు స్వేషు పాఠేష్వసంమూఢైర్భవితవ్యమితి। అని చెప్పఁబడినది.

ఈ వాక్యములనుబట్టి చూడఁగాఁ గాళిదాసుఁడు రూపకకర్తగా నుండుట పారిషదులకు నూతనము గాదనియు మాళవికాగ్నిమిత్రమునందుఁ గవికున్నంత సంశయమిందు లేదనియును సువ్యక్తము. ఇఁక శాకుంతలమునందుఁ గవి యీమాత్రము సంశయమునుగూడఁ జూపింపలేదనియును నీక్రిందివాక్యములను బరీక్షించి కనుఁగొన నగును.

"అద్యఖలు కాళిదాసగ్రథితవస్తునా అభిజ్ఞానశాకున్తలనామధేయేన నవేన నాటకేనోపస్థాతవ్యమస్మాభిః."

ఈమూఁడు రూపకములును నేకకవికృతములని యొప్పుకొనవలసినప్పుడు మాత్రము వానిలో మొదటిది మాళవికాగ్నిమిత్రమనియు రెండవది విక్రమోర్వశీయమనియు మూఁడవది యభిజ్ఞానశాకుంతలమనియు నీ పైమాటలనుబట్టి యొప్పుకొనక తప్పదు.

ఈమూఁడు రూపకములను బరీక్షించినయెడల వానిలో ననేకములగు సమానరచన లున్నవనియును బూర్వకృతులయందలి కల్పన లుత్తరకృతులయందు వన్నె పెట్టఁబడినవనియును దెలియకమానదు. దీనినిగుఱించి పండిత్ గారు తమ పుస్తకములో వ్రాసిన సాదృశ్యములనే యెత్తి యీక్రింద నొసఁగుచున్నాను.

I శబ్దసాదృశ్యములు:— ఇందుఁ గవి సాధారణముగా నాయాశబ్దములను బ్రయోగములను బొందుపఱుపఁ బడినవి.

(1) మా. I. మా అత్రభవతీ ధారిణీ విసంవాదయిష్యతి.
శా VI. రమణీయః ఖల్వవధిః విధినా విసంవాదితః.

(2) మా. III. వసన్తప్రథమావతారసుభగాని.
విక్ర. III. వసంతోదారరమణీయకం అభిరామత్వం ప్రమదవనస్య.

(3) మా. V. ఆర్యకౌశిక్యా ఇవ స్వరసంయోగః.
శా. VI. కలవిశుద్ధాయాః గీతేః స్వరసంయోగః శ్రూయతే.

(4) మా. III.
విదూ. అలంభవతో పరిదేవితేన.
విక్ర. II. విదూ— అలంపరిదేవితేన.

(5) మా. II.
విదూ. ఏతావాన్ ఏవ మే మతివిభవో భవంతం సేవితుమ్.
విక్ర. II.
విదూ. ఏతావాన్ మే మతివిభవః.

II పయిమూఁడు రూపకములయందునుగల భావసామ్యములు.

(1) మూఁడవయంకమున నశోకవృక్షము మాళవికయొక్క పాదఘాతము ననుభవించుచుండఁగా రాజట్టి గౌరవము దనకుఁ గలుగలేదుగదా యని చింతించును. అభిజ్ఞానశాకుంతలమునందుఁగూడఁ దుమ్మెద శకుంతలాముఖముపైఁ బ్రసరింపఁగాఁ గాంచి రాజు తనకట్టి యానందము గలుగలేదు గదా యని చింతించును


మా. III. రాజా। నయుక్తం పశ్య।
ఆదాయ కర్ణకిసలయమస్మాదియమత్ర చరణమర్పయతి।
ఉభయోస్సదృశవినిమయాదాత్మానం వంచితం మన్యే॥

శా. I. శ్లో. చలాపాంగాం దృష్టిం స్పృశసి బహుశో వేపథుమతీం, రహస్యాఖ్యాయీవ స్వనసి మృదు కర్ణాంతికచరః, కరౌ వ్యాధున్వత్యాః పిబసి రతిసర్వస్వమధరం, వయం తత్త్వాన్వేషాన్మధుకర హతాస్త్వం ఖలు కృతీ.

ఈరెండుస్థలములయందును రాజు పాదపాంకిహతుఁడై ప్రియురాలిం గాంచుచుండుట సమానము. 'ఆత్మానం వంచితం మన్యే' అనుదానికిని 'వయంతత్త్వాన్వేషా


౪౫-వ అఖిలభారత జాతీయమహాసభా చిత్రములు

కరాచి, ౧౯౩౧



శ్రీ డా. చోఇత్ రాం పి. గిద్వానీగారు

స్వాగతసమితి అధ్యక్షులు



శ్రీ సర్దార్ వల్లభభాయి పటేలుగారు
సభాధ్యక్షులు

న్మథుకరహతాః' అను దానికినిఁగల సాదృశ్యము స్పష్టముగదా!

(2) మూఁడవ యంకమునందు మదనబాధను బొందుచు నగ్నిమిత్రుఁడు మన్మథునిగుఱించి పలుకు మాటలకును దుష్యంతుఁడును నట్టి సందర్భమున మన్మథుని గుఱించి పలుకుమాటలకును మిక్కిలి సాదృశ్యము గలదు.

మా. II. 17. భగవన్ సంకల్పయోనే, ప్రతిబంధన త్స్వప్నేవిమద్యేవ్యభినివేశ్య తథా ప్రహరసి యథా జనోఽయం కాలాంతరక్షమో న భవతి| సవిస్మయమ్|| క్వరుజాహృదయప్రమాథినీ| క్వచ తే విశ్వసనీయ మాయుధమ్ మృదుతీక్ష్ణతరం యదుచ్యతే| తదిదం మన్మథదృశ్యతే త్వయి.

శా. III. 55. భగవన్కుసుమాయుధ, త్వయా చంద్రమసా చ విశ్వసనీయాభ్యామతి సంధీయతే కామిజనసార్థః| కుతః. శ్లో. తవకుసుమశరత్వం శీతరశ్మిత్వమిందోః ద్వయమిదమయథార్థం దృశ్యతే మద్విధేషు| విసృజతి హిమగర్భైరగ్నిమిందుర్మయూఖైస్త్వమపి కుసుమబాణాన్వజ్రసారీకరోషి. భగవన్ కామదేవ, న తే మయ్యనుక్రోశః. మదనబాధాం నిరూప్య. కుతస్తే కుసుమాయుధస్యసత స్తైక్ష్ణ్యమేతత్.

స్వభావముచే మృదువైనను సారవంతమైనదని చెప్పు క్రిందివాక్యమునుగూడ నీసందర్భమునఁ బరికింపవగును. కు. సం. 5 సర్గ. 19 శ్లో. ధ్రువం వపుఃకాంచనపద్మనిర్మితం మృదుప్రకృత్యాకు ససారమేవచ| సాధారణముగా రెండుసార్లు క్వశబ్దమునుజేర్చి భిన్నస్వభావము గల వస్తువులనుఁ జేర్చునట కాళిదాసుని కావ్యముల యందుఁ గన్పట్టుచున్నది.

శా. II. 52. క్వవయం క్వపరోక్షమన్మథో మృగశాబైస్సమమేధితో జనః, పరిహాసవిజల్పితం సఖే పరమార్థేన న గృహ్యతాం వచః.

శా. I. 10. క్వబతహరిణకానాం జీవితంచాతి లోలమ్, క్వచనిశితనిపాతా వజ్రసారాశ్శరాస్తే.

రఘు. I. 2. క్వ సూర్యప్రభవో వంశః క్వచాల్ప విషయామతిః.

మే. I. ధూమజ్యోతిస్సలిలమరుతాం సన్నిపాతః క్వమేఘః, సందేశార్థాఃక్వపటుకరణైః ప్రాణిభిః ప్రాపణీయాః.

(3) అగ్నిమిత్రుఁడు రెండవ యంకమున నృత్యముచేయుచున్న మాళవికరూపమును గాంచి యిట్లనుకొనుచున్నాఁడు. రాజా-(ఆత్మగతమ్) అహో సర్వాస్వవస్థాసు చారుతా శోభాంపుష్యతి. మా. II. 20.

అభిజ్ఞానశాకుంతలమునందును రాజు వల్కలధారిణి యగు శకుంతలనుగాంచి

సరసిజమనువిద్ధం శైవలేనాపిరమ్యం, మలినమపిహిమాంశోర్లక్ష్మ లక్ష్మీం తనోతి, ఇయమధికమనోజ్ఞా వల్కలేనాపితన్వీ కిమివహిమధురాణాం మండనంనాకృతీనాం.

కు. V. 9. నషట్పదశ్రేణి భిరేవ పంకజం సశైవలాసంగమపి ప్రకాశతే.

శా. IV. అహో సర్వాస్వవస్థాసు రామణీయకమాకృతివిశేషాణామ్.

(4) ఒక్కచో సమాకేళముగు మాళవికాగ్నిమిత్రుల విడిచి పోవునప్పుడు విదూషకుఁడు వకుళావళికను బిలుచుటయందును శకుంతలాదుష్యంతులు గూడియున్నపుడు చెలికత్తెలువారినివిడిచి వెడలుటకును దెలుపునట్టి కారణములు సమములయియున్నవి.

మా. IV. 126. విదూషకః-(పరిక్రమ్యసంభ్రమమ్) వకుళావళికే ఏషా బాలాశోకవృక్షస్యపల్లవాని లంఘయతి హరిణః.

శా. III. ప్రియంవదా, సదృష్టిక్షేపమ్, అనసూయే యథైష ఇతో దత్తదృష్టిరుత్సుకో మృగపోతకో మాతరమన్విష్యతి. ఇత్యుభే ప్రస్థితే.

(5) మాళవికాగ్నిమిత్రమునందలి నాల్గవయంకములో విదూషకుఁడు సర్పములనిన భయపడువాఁడని తెలుపఁబడినది.

మా. IV. 158. ఇమం భుజంగభీరుకం బ్రాహ్మబంధుం అనేన భుజంగకుటిలేన దండకాష్ఠేన స్తంభాంతరితా భూత్వా భీషయిష్యామి.

విక్ర. II. అవిదభో! కిన్నేవ్వతత్ భుజంగనిర్మోకః? భూర్జపత్రగతో౽య మక్షరవిన్యాసః.

విక్రమోర్వశీయవాక్యములందును ఛాయగ్రహియింపఁబడినదనుట స్పష్టము.

ఇట్టి భావసాదృశ్యములను శబ్దసాదృశ్యములను ననేకములను 'పండిత్' గారు తమ యుపోద్ఘాతమునందుఁ జూపియున్నారు. అయ్యవిమాత్రమేగాక యట్టి సాదృశ్యముల సంతతము గాఁబఠియించువారికిఁ గన్పట్టక తప్పదు. వాని నన్నిటిని నుదాహరించుట గ్రంథవిస్తరభీతిచే మానివాఁడను. మాళవికాగ్నిమిత్రము శాకుంతలాది కృతికర్తచేతనే వ్రాయంబడినదనుటకుఁ బయిసాదృశ్యములతో పాటుగాఁ గృత్యాదియం దొనరింపఁబడిన యిష్టదేవతాస్తుతియును సాహాయ్యమునుచున్నది. ఈవిషయమును మొదటి వ్యాసమునందు విపులముగాఁ జర్చించియున్నాను.

మాళవికాగ్నిమిత్రము త్రపురూపకమయ్యును గాళిదాసుని యితరరూపకములతో మాత్రమీడు గాదని చెప్పనగునని ముందే తెలిపియున్నాము. ఈకథను వ్రాయునప్పుడు కాళిదాసునకింకను కథారచనా విధానమునందు సామర్థ్యము పెంపొందలేదనుట శాకుంతలాది కృతులకును దీనికిని గల భేదమును బరీక్షించినఁ దేలఁగలదు.

(1) కథనెంచుకొనుటలోఁ గాళిదాసుఁడు తక్కిన రెంటియందును మాళవికాగ్నిమిత్రకథ నెంచుకొనునప్పటికంటె నెక్కువ సామర్థ్యమును జూపియున్నాఁడని ముందే చెప్పియుంటిమి.

(2) మాళవికాగ్నిమిత్రకథయందు రంగమెప్పుడును నగ్నిమిత్రునిపట్టణమును దాటలేదు. కథాంశములన్నియును నాతని సభయందును నంతఃపురమునందును ప్రమదవనమునందును జరిగినవిగాని కవి యన్యస్థలమునకు రంగమును మార్పలేదు. ఇతరస్థలములజరిగిన కథావిషయముల నన్నిటిని పాత్రలచేతనే కవి చెప్పించెను. విక్రమోర్వశీయమునందుఁ బురూరవసుఁడును నూర్వశియు స్వస్థానములనుండి చలించుట సంభవించెను. మొట్టమొదట నూర్వశీపరిత్రాణార్థము పురూరవసుఁడు వెడలుట జరిగెను. ఆకాశవీథి నూర్వశీరక్షణము జరిగినది. రెండవ యంకమునందు రాజనగరము రంగస్థానము. మూఁడవయంకమున దేవలోకమునందలి భరతశిష్యులను కవి ప్రవేశింపఁజేసి వారివలన నన్నటిసమాచారమును దెలియఁజేయును. నాల్గవయంకమునందు రంగస్థానముగా గంధమాదనపర్వత సమీపమునన్న మందాకినీపులినతలంబులను వనప్రదేశములను గవి చూపించియున్నాఁడు. విరహాతురుండగు పురూరవసుఁడు మత్తుఁడై యక్కడనే తిరుగుచుండును. అయిదవయంకమున దిరిగి రంగస్థలము పురూరవసుని పట్టణము ప్రతిష్ఠాననగరము. ఇట్లు విక్రమోర్వశీయమునందును నింతకంటె నెక్కుడు శాకుంతలమునందును జలనమును గవి చూపించియున్నాఁడు. ఇట్లు కథయందును బాత్రములయందును జలనమును గల్పించుట కవియొక్క శక్తికిఁగల పరిణతావస్థను సూచించుచున్నది. ఇట్టిచలనము మాళవికాగ్నిమిత్రమునందుఁ జాలఁదక్కువగానున్నది.

(3) పురూరవసుఁడు భాగీరథీతీరమునఁ దన ప్రియురాలికొఱకుఁ బలవించినప్పుడు గలుగు విప్రలంభమువంటి గాఢమైన విప్రలంభమును మాళవికాగ్నిమిత్రమునందుఁ గవి చూపింపలేక పోయెను. విక్రమోర్వశీయముకంటెను నభిజ్ఞానశాకుంతలమునందు మఱియు గాఢముగా విప్రలంభమును బోషింపఁగలిగెను. ఇంటికి వచ్చి తన భార్యనని చెప్పుకొనిన గర్భిణియగు తరుణిని నిరాకరించితినిగదా యను పశ్చాత్తాపముచే దుష్యంతుని విరహానలము మఱింత ప్రజ్వరిల్లినది. నిర్దోషయును నిరాధారయునగు నారీరత్నము సభయందుఁ జెనిమిటిచేతను సోదరకల్పుఁడగు శార్ఙ్గరవునిచేతను దిరస్కరింపఁ బడునప్పుడు సభ్యులమనంబులకుఁ గలుగు నావేగమును వర్ణింపఁదరముగాదు. కావున మాళవికాగ్నిమిత్రము, విక్రమోర్వశీయము, అభిజ్ఞానశాకుంతలము, అను మూఁడు రూపకములను బరీక్షించుచెడల వానిలోని, రసపోషణరీతులును, సన్నివేశకల్పనాచాతుర్యమును మొదటిదానికంటె రెండవదానియందును, రెండవదానికంటె మూఁడవదానియం

దుకు నధికముగా నున్నదనుట నిర్వివాదాంశము. ఇదియు కవియొక్క ప్రతిభాపరిణతికిని కళాపరిణతికిని నిజమైన ఫలముగాని వేఱొండుకాదు. ఈవిషయమును రెండవ వ్యాసములోఁ గొంతవఱకుదాహరించి షేక్స్పియరు యొక్క కళాపరిణతితోఁగలిపి పరీక్షించితిని.

[కాళిదాసుని కళను జర్చించు వ్యాసములలో నియ్యది విపులముగా వివరింపఁ బడును.]

పై వాదమునుబట్టి మాళవికాగ్నిమిత్రము కాళిదాసకృతమే యనియును నయ్యది తత్కృతరూపకములలోఁ బ్రథమ గ్రంథమనియును నిశ్చయింపనగునుగదా !

౪

ఈరూపకమునందు వస్తువు చారిత్రకమనుట తప్ప దానిలో నెంతవఱకుఁ జారిత్రాంశమున్నది, యెంతవఱకుఁ గల్పనయున్నది యనువిషయముఁ జక్కఁగా నిర్ణయించుటకు మనకాకాలమునాటి చరిత్రమును దెల్పుబలమగు నితరాధారములు లేవు. ఆకాలమును సంబంధించిన చరిత్రమును గనుఁగొనుటకుఁ జారిత్రకులు శాసనములను, బురాణములను మాళవికాగ్నిమిత్రమును నాధారములుగా గ్రహియించుటచే నందును నిందలి యంశములే చెప్పఁబడుచున్నవి. కావున నీపుస్తకమునే యొక యాధారముగా గ్రహించిన చారిత్రకుల వ్రాఁతలనుబట్టి దీనిని విమర్శింపరాదు. పుష్యమిత్రుఁడు శుంగవంశమునకు మూలపురుషుఁడనియు మౌర్యవంశమునకుఁ దుదిపురుషుఁడగు బృహద్రథునికడ సేనానాయకుఁడుగానుండి యాతనిఁ జెఱఁబెట్టి రాజ్యము నపహరించుననియును వానిని యనంతర మాతని వంశజులు రాజ్యముఁ జేయుచుండిరనియు మనపురాణములోని భవిష్యద్రాజేతిహాసములలో నీయఁబడినది. మత్స్యవాయు పురాణములును, భాగవతమును, బ్రహ్మాండపురాణమును నీవిషయముఁ గొంచె మించుమించుగ నొక్కరీతిగనే చెప్పుచున్నవి.

మత్స్యపురాణము. ఆనందాశ్రమ సంస్కృతగ్రంథావళి 54 వ ప్రచురణము. పుట ౯౯౩ అ. 272.

శ్లో. ఇత్యేతే దశమౌర్యాస్తు యేభోక్ష్యంతివసుంధరామ్,
సప్తత్రింశచ్ఛతంపూర్ణం తేభ్యః శుంగాన్ గమిష్యతి.
పుష్యమిత్రస్తు సేనానీరుద్ధృత్య స బృహద్రథాన్,
కారయిష్యతి వై రాజ్యం షట్త్రింశత్తు సమా నృపః,
భవితాఽపి వసుజ్యేష్ఠః సప్తవర్షాణి వై నృపః,
వసుమిత్రస్తథాభావ్యో దశవర్షాణి వై తతః.

వాయుపురాణము. ఆనందాశ్రమగ్రంథావళి. 49 వ ప్రచురణము. పుట 383 ఆశ్వాసము. 99.

శ్లో. బృహదశ్వ స్సవర్షాణి సప్తవై భవితా నృపః,
ఇత్యేతే యేనవభూపా యే భోక్ష్యంతి వసుంధరామ్.
సప్తత్రింశచ్ఛతం పూర్ణం తేభ్యః శుంగాన్ గమిష్యతి,
పుష్యమిత్రస్తుసేనా నీరుద్ధృత్యవై బృహద్రథమ్.
కారయిష్యతి వై రాజ్యంసమాః షష్టిం షడైవతు,
పుష్యమిత్రసుతా శ్చాష్టౌ భవిష్యంతి సమానృపాః.
భవితాచాపి తజ్జ్యేష్ఠః సప్తవర్షాణి వై తతః,
వసుమిత్రః సుతో భావ్యో దశవర్షాణి పార్థివః.

పయి వాక్యములనుబట్టి చంద్రగుప్తునిచే స్థాపింపఁబడిన మౌర్యవంశము బృహద్రథునితో (బృహదశ్వుఁడు?) నంతమందుననియు నాయన సేనానాయకుఁడగు పుష్యమిత్రుఁడాతనిని సంహరించి ముప్పదియారు సంవత్సరములు పాలించుననియును దెలియుచున్నది గదా! పయి లెక్కప్రకారము పుష్యమిత్రుని రాజ్యకాలము క్రీ. పూ 184 వ సంవత్సరములో నారంభించునని నిశ్చయింపనగును. పురాణములుచెప్పిన పయియంశమునే బాణుఁడు తనహర్ష చరిత్రమునందును జెప్పెను. "ప్రతిజ్ఞాదుర్బలంచ బలదర్శన వ్యపదేశ దర్శితాశేష సైన్యః సేనానీరనార్యో మౌర్యం బృహద్రథంపిపేష పుష్యమిత్రః స్వామినమ్."

ఈ పుష్యమిత్రుఁడు పాటలీపుత్రమునే రాజధానిగాఁ జేసికొని రాజ్యమును బాలించెను. ఈతని కుమారుఁడగు నగ్నిమిత్రుఁడు తండ్రి జీవించియుండఁగా 'విదిశా' పట్టణమునఁ దండ్రిక్రింద సామంతరాజుగాఁ బరిపాలించుచుండెను. ఈపట్టణము ప్రస్తుతము 'సింధియా' వారిచేఁ బరిపాలింపఁబడుచున్న రాష్ట్రమునందుఁ బ్రవహించు 'బేత్వా' నదీతీరమున 'భిల్సా' అను నామముతో వెలయుచున్న పట్టణముతోనభిన్నమయినది. పుష్యమిత్రుని

రాజ్యము దక్షిణమున నర్మదానదీతీరమువఱకును వ్యాపించియున్నదని తెలియవగును. "అస్తి దేవ్యావర్ణావరో భ్రాతా వీరసేనో నామ, భర్త్రా నర్మదాకూలే (మందాకినీతీరే) అంతపాలదుర్గే స్థాపితః, తేన శిల్పాధికారే కళావిద్యాధిగమే ఇయం యోగ్యేతి భగిన్యై దేవ్యై ఉపాయనం ప్రేషితా" విదర్భ దేశపురాజగు యజ్ఞసేనునకును నాతని జ్ఞాతియగు మాధవసేనునకును జరిగిన వివాదములో నీతఁడు ప్రవేశించి యజ్ఞసేనుని నోడించి రాజ్యమును రెండుభాగములుచేసి వరదానదియొడ్డున మున్న యొకభాగము నొకరికిని రెండవభాగము రెండవవారికిని నొసంగెను.

"తౌ పృథగ్వరదాకూలే శిష్టాముత్తరదక్షిణే,
నక్తం దివం విభజ్యోభౌ శీతోష్ణకిరణా విన."

ఇఁక నగ్నిమిత్రుని రాజ్యకాలమును నిర్ణయించుటలోఁ గొంచెము కష్టముకలదు. పుష్యమిత్రుఁడు 36 సంవత్సరములు రాజ్యముచేసిన తరువాత నగ్నిమిత్రుఁడు రాజ్యముచేసెనని భాగవతాది పురాణములు చెప్పుచున్నవి. విమర్శకులచేఁ బ్రాచీనములని యెన్నఁబడిన మత్స్యవాయు పురాణములందుమాత్ర మగ్నిమిత్రుని పేరు లేనట్లు నేనిచ్చిన పైశ్లోకములనుండి తెలియనగును.

కె. పి. జయస్వాలుగారు బీహారు అండు ఒరిస్సా రీసెర్చి సొసైటివారి జర్నలులో (1929 వ సం.) యీ క్రిందివాక్యముల ననుసరించి యొకనూతన సిద్ధాంతమును జేయుచున్నారు.

మత్స్యవాయు బ్రహ్మాండపురాణములు:—పుష్యమిత్రస్తు సేనానీ రుద్ధృత్య స బృహద్రథమ్, కారయిష్యతి వైరాజ్యం షట్ త్రింశతి సమానృపః,

మత్స్యవాయు పురాణములు:—పుష్యమిత్ర సుతాశ్చాష్టౌ భవిష్యంతి సమానృపాః.

పై వాక్యములయందలి 'కారయిష్యతి వైరాజ్యమ్' 'సమానృపాః' అను పదములఁబట్టి పుష్యమిత్రుఁడు తనకుమారులను నెనమండ్రను సమముగా రాజులను జేసి దేశమును బరిపాలింపఁజేయుచుఁ దాను సేనాపతిగా నుండెనని యూహించుట కవకాశమగు చున్నదని చెప్పుచున్నారు. అట్లయినయెడల నీతని కాలమున సార్వభౌముఁడు లేనియొక నూతన పరిపాలకసంఘము నేర్పఱచెననియును దానినే 'వైరాజ్యమ్' అను పేరితోఁ బిలుచుచుండిరేమో యనియు నూహించుచున్నారు. అప్పుడు పుష్యమిత్రుఁడు సేనాపతిగా నుండియే తన యశ్వమేధయాగమును జేసెనని యూహింపనగుననియును వ్రాయుచున్నారు. ఇట్లు పుష్యమిత్రుఁడు సార్వభౌముఁడైన తరువాతఁగూడ సేనాని యనియే పిలువఁబడుచున్నట్లు 'అయోధ్యాశాసనమును బట్టియు మాళవికాగ్నిమిత్రము నందలి యీ క్రిందివాక్యమును బట్టియు నూహింపఁదగును. "యజ్ఞశరణాత్ సేనాపతిః పుష్యమిత్రో వైదిశస్థం పుత్రమాయుష్మంతం అగ్నిమిత్రం స్నేహాత్పరిష్వజ్య అను దర్శయతి."

ఈ సేనానీశబ్దమువలనఁ బుష్యమిత్రుఁడు సేనాని యని యర్థముచేయఁగూడదనియును మొదట సేనానిగా నుండి తరువాత రాజగుటవలన పుష్యమిత్రునకు సేనాని పుష్యమిత్రుఁడను నామము వాడుకయందు రూఢమయి యున్నదనియును నూహించుట యుక్తమని 'పండిత్' గారు వ్రాయుచున్నారు. జయస్వాలుగా రూహించిన దానికంటె 'పండిత్' గారి సమన్వయము యుక్తముగా నున్నట్లున్నది. వైరాజ్యమును దానినొక్కపదముగా గ్రహియించి యప్పుడొక విజాతీయమగు ప్రభుత్వముండెనని యూహించుటకంటెఁ బయికల్పనయే సమంజసమనక తప్పదు. 'వైరాజ్యమ్' అనుదానిని 'వై', 'రాజ్యమ్' అని రెండుపదములుగా విభజించి యర్థముచెప్పుటయే యుక్తమని మనము పురాణశైలిని బరీక్షించుచో నెఱుఁగఁ దెలియఁగును. 'వై' అనునది పాదపూరణార్థమెన్నియో సారులు ప్రయోగింపఁబడుచున్నట్లు స్పష్టము. ఇఁక 'కారయిష్యతి' యను పదమునకు రాజ్యము చేయించునని కదా యర్థము దానినెట్లు సమన్వయింపఁగునని యడుగనచ్చును. సేనాని పుష్యమిత్రుఁడు తాను సార్వభౌముఁడయి యున్న కాలముననే తన పుత్త్రులందఱిని దేశముయొక్క వివిధ భాగములకు రాజులుగా నియమించి పరిపాలింపఁ జేసెననుటయే యర్థమని యూహింపనగును. దీని కగ్నిమిత్రుఁడు విదిశాపట్టణమునుండి యాభాగమును బరిపాలించుచుండెననుటయే దృష్టాంతమని చెప్ప

వగును. పుష్యమిత్రుని యనంతరము దత్పుత్రుఁడగు నగ్నిమిత్రుఁడు రాజ్యమునకు వచ్చెనని భాగవతాదిపురాణములు చెప్పుచున్నను మత్స్యవాయుపురాణము లాతని పేరిని స్మరింపలేదని నే నుదాహరించిన శ్లోకములఁబట్టి తెల్లమగుచున్నది. పుష్యమిత్రుని యనంతర మేను వర్షములాయన కుమారుఁడు రాజ్యముచేసినట్లును నాయన యనంతరము వసుమిత్రుఁడు రాజ్యమునకు వచ్చినట్లును గ్రిందివాయుపురాణవాక్యములఁబట్టి నిర్ణయింపనగును. "భవితా చాఽపి తజ్జ్యేష్ఠః సప్తవర్షాణి వై తతః, వసుమిత్రః సుతో భావ్యో దశవర్షాణి పార్థివః." మత్స్యపురాణవాక్యమునుబట్టి యీజ్యేష్ఠకుమారుఁడు వసుజ్యేష్ఠుఁడని తెలియనగును. 'భవితాఽపి వసుజ్యేష్ఠః సప్తవర్షాణి వై నృపః' అయి రెండు పురాణములనుబట్టి యగ్నిమిత్రుఁడే కాలమునను సార్వభౌముఁడయి పరిపాలించినట్లుగాని యాతఁడే తండ్రికి పెద్దకొమరుఁడనిగాని యూహించుట కవకాశము లేదు. కాని తక్కిన పురాణవాక్యములనుబట్టి యగ్నిమిత్రుఁడు కొంతకాలము సార్వభౌముఁడయ్యెనని నిర్ణయించుచున్నారు.

ప్రస్తుతపు గథజరిగిన కాల మగ్నిమిత్రుఁడు తండ్రి యధికారముక్రిందఁ దక్షిణభాగమును బరిపాలించుచుండిన కాలమేయనినిశ్చయము గావున నీకథ పుష్యమిత్రుని పరిపాలనముయొక్క తుదిసంవత్సరములలో నని చెప్పనగును. పుష్యమిత్రునిపాలన కాలము (184-148 క్రీ. పూ) అందు 155-3 (క్రీ. పూ) సంవత్సరములలో మీనాండరు పుష్యమిత్రుని రాజ్యముపై దండెత్తెనని తెలియవచ్చుచున్నది. ఈమీనాండరు సాకేతపట్టణమును జయించి పాటలీపుత్రము వఱకుఁగూడ వచ్చినట్లు విన్సెంటుస్మిత్తుగారు తమగ్రంథమున వ్రాయుచున్నారు. ఆయుద్ధమునఁ బుష్యమిత్రునికే జయము లభియింపఁగా మీనాండరు వెనుకకుఁ ద్రోసివేయఁబడెను. మాళవికాగ్నిమిత్రమునందు వసుమిత్రుఁడు యజ్ఞాశ్వమును రక్షించుచు యవనులతో యుద్ధముచేసి వారినోడించెనని వ్రాయఁబడెను. "స సింధోర్దక్షిణే రోధసి చరన్నశ్వానీకేన యవనానాం నిషిద్ధః, తతఉభయోః సేనయోర్మహానాసీత్ సమ్మర్దః." ఈసింధునది పంజాబులోని సింధునదిగాదు. రాజపుత్రస్థానములో నున్నది. ఈ యవనులతోడియుద్ధమే మీనాండరుతోడి యుద్ధమనుట యయుక్తము. దీనికశ్వగ్రహణము నిమిత్తము. ఇంతకును పాటలీపుత్రముపై వీరుఁడగు మీనాండరు దండెత్తి వచ్చినప్పుడు పుష్యమిత్రునివంటి సేనాని తన మనుమని మాత్రమంపి యూరకుండుననుట యుక్తముగా లేదు. కాబట్టి వసుమిత్రుఁడు యవనులను జయించి యజ్ఞాశ్వమును దీసికొని వచ్చుటకును మీనాండరు పాటలీపుత్రముపై దండెత్తుటకును సంబంధము లేదు. ఇంక నశ్వమేధయాగమును బుష్యమిత్రుఁడు చరమకాలమున శత్రువులనందఱను జయించి శాంతుఁడై స్థిరయూఁడై యున్నప్పుడు చేసెననుట యుక్తముగదా! కావున నశ్వమేధయాగప్రయత్నము క్రీ. పూ. 158 వ సంవత్సరమునకు దరువాతనే జరిగియుండుననుట నిశ్చయము. పుష్యమిత్రునిచేఁ దోలఁబడి పారదోలఁబడిన యవనులు సింధునదీప్రాంతములయందింకను నుండఁగా వారితో వసుమిత్రునకు యుద్ధము జరిగెననియును నూహించుట యుక్తము. 'అశ్వానీకేన యవనానాం నిషిద్ధః' అని చెప్పుటవలన యవనసైన్యము తోడనే యతనికి యుద్ధము జరిగెను గాని మీనాండరు సేనాపతిగా నుండినప్పుడు గాదని తేలుచున్నది. సింధునదికి దక్షిణప్రాంతమునందున్న యవనసైనికులు గొందఱు దగ్గఱఁ దిరుగుచున్న పుష్యమిత్రుని సవనాశ్వముఁ గాంచి యింతకుమున్నె తనిచే నోడింపఁబడినవారు గావున నాకారణమున దానింబట్టఁగా వారికిని వసుమిత్రునకును యుద్ధము జరిగెననుట యుక్తము. కావున క్రీ. పూ. 158 సం॥ నకును క్రీ. పూ. 148 వ సంవత్సరమునకును నడుమ నీయశ్వమేధము జరిగెనని యూహింపనగును. కాబట్టి మనకథాకాలమీ యైదుసంవత్సరములలో నెప్పుడో యైయుండవచ్చును.

ఇఁకఁ గ్రీస్తు పూర్వము 57 వ సంవత్సరమును సంబంధించిన విక్రమార్కుని కాలముననే కాళిదాసుఁ డుండెనయెడల (మాసుకు మొదటివ్యాసము) నీతనికిని గథా కాలమునకును సుమారు 100 వత్సరములు భేదమున్నదని చెప్పవచ్చును. కావునఁ గాళిదాసున కగ్నిమిత్రునివర్యలన్నియును పెద్దలవలన వినఁబడినవిగానే

యుండునను టయు క్తము. తనకాలములోని వారందఱు కును నీచరిత్రము పరిచితమునిరయే గాఁబోలు దీనిని గాళి దాసుఁడు దన తొలినాటకమునకుఁ గథగా నెత్తుకొనెను. ఈతఁడీకథ వ్రాయునప్పటికి పాటలీపుత్ర సింహాసనము పయి శుంగవంశపుకుదిరాజు పరిపాలించుచుండెనో లేక కొలదికాలమునకు ముందే శుంగవంశ మంతరించి కాణ్వులు పరిపాలనమునకుఁ దొడఁగిరో తెలియునవకాశము లేదు.

రూపకమునందు వచ్చిన పాత్రములలో, నగ్ని మిత్రుఁడు, వసుమిత్రుఁడు, పుష్పమిత్రుఁడు నను మూవు రును చారిత్రక పురుషులనుట నిర్వివాదము. యజ్ఞ సేనుఁడు వీరసేనుఁడు మాధవసేనుఁడు, గూడ చారిత్రక పురుషులై యుండవచ్చుననియే తోఁచుచున్నది. మాళవి కాదులు కల్పితపాత్రములో లేక చారిత్రకములో చెప్పఁ జాలముగాని పరిచారికాదులు మొదలగువారు కల్పితపా త్రములనియే చెప్పక తప్పదు.

మాళవికాగ్నిమిత్రపుగథఁ బోలిన కథయే గుణా ఢ్యుని బృహత్కథయందున్నదని కథాసరిత్సాగరమునం దలి బంధుమతీచరిత్రమునుబట్టి యూహింపనగును. కాని కాళిదాసుఁ డీకథను గ్రహించి వ్రాసెననుట యసందర్భ మేమోయని తోఁచుచున్నది. గుణాఢ్యుఁడు క్రీ. శ మొదటి శతాబ్దమునందుండి యుండనచ్చునని బుహ్లరుగారు చెప్పుచున్నారు.

౫

మాళవికాగ్నిమిత్రమునందలి కథాపటము వల్ల నప్పుడు కవి యేయేతంతువులనెట్లెట్లు చేర్చి కలిపెనను విషయమును బరీక్షింపవలయును. ఇందలి కథకు ఫలము మాళవికాగ్నిమిత్రుల వివాహము. అగ్నిమిత్రుఁడు మాళ వికాకృతిని జిత్రపటమునఁ జూడకముందామె విదిశా పట్టణమును జేరుటకొక పెద్దకథగలదు. ఆకథయంత యును రంగముపైఁ బ్రదర్శింపఁబడుటకు వీలులేక కవి దానిని మొదటి విష్కంభకమునఁ జెప్పించి వేసెను. మాధవసేనుఁడు విదిశాపట్టణమునకు బయలుదేరుట మొద లుగా మాళవికయుఁ బరివ్రాజికయు వచ్చిచేరువఱకును గల కథ మాత్రమే రంగప్రదర్శితమగు కథకంటెఁ బెద్దది గాను నెక్కువ రుచికరములగు పన్నివేశములు గలదిగాను రసపోషణమునకు మిక్కిలియు ననువైన పట్టులుగలదిగా నున్నది. తుదియంకమున నున్న వసుమిత్రునిజయము, పుష్పమిత్రుని యాగము మొదలగువిషయములు గూడ మధ్యమున్న కథకంటె నెక్కువరుచికరముగా నేయున్నవి. రంగప్రదర్శిత కథాభాగము మౌర్యసామ్రాజ్యమునకును విదర్భరాజ్యమునకును సంబంధించియున్నది. విశాలమగు పటములో నత్యల్పభాగమును మాత్రము కవి చూపింప సాగెను. ఈమధ్యభాగముతోడి సంబంధమున్నను లేక న్నను మిగిలిన కొన్ని సంగతులను గవి సూచింపక తప్పి నదిగాదు. మాళవికాగ్నిమిత్రుల ప్రణయకథయను భాగ మునకు సామ్రాజ్యకథతోఁ గల సంబంధమును వీలైన చోట్లనెల్లను గవి చూపించుటకుఁ బ్రయత్నించెనుగాని యా యతుకులన్నియు నతుకులట్లే యున్నవి. ప్రథమాంక మునందు విదర్భరాజుపయి దండెత్తుటకు సైన్యమును బంపవలసినదిగా నుత్తరువయ్యెనని మన మెఱుఁగుదుము గాని యా తరువాత నదియేమయ్యెనో దానివలన నవ కథానాయకునకుఁగాని, నాయికకుఁగాని యెట్టిసంబంధ మున్నదో మన మెఱుఁగఁజాలము. ఆవిషయమప్పుడే విస్మృతి యగుచున్నది. 2, 3, 4 అంకములలో వరల నీరాజ కార్యపుగోడవయే మన మెఱుగము. అయిదవ యంకమున మాత్రము ప్రవేశకమూలమున వసుమిత్రుఁడు యజ్ఞరక్ష ణార్థము పోయియుండెనని సూచింపఁబడుటవలన రాజ కార్యవిషయకమగు మఱియొక సూత్రము గ్రహియింపఁ బడినదేగాని ప్రథమాంకగృహీత సూత్రము విస్మృత మయినట్లేయుండి పునః పరామర్శ లేకుండెను. మఱి నయిదవయంకము తుదనే యీ రెండుసూత్రములును దెచ్చి కథకుఁ గలుపఁబడినవి. వసుమిత్రుఁడు యజ్ఞరక్షణార్థము వెడలెననియును నాతఁడు ధారిణీకుమారుఁడనియును మన మెఱుంగుదుముగాని యాతనికిని, యాతనికార్యమగు యజ్ఞరక్షణమునకును ప్రధానప్రయోజనమగు నాయికా నాయకులసమాగమముతో నియతమగు సంబంధము లేక పోవుటచే నాకథాభాగమునందు మనకేవిధమగు బట్టుద లయు రుచియుఁ గలుగదు. కుమారవిజయముచే ధారిణి యానందపరవశయయి మాళవికను రాజునకర్పించినదేమో

యని యూహింపఁదగును గాని యంతకుముందే యామెకిట్టి సంకల్పముగలదని విదూషకునిమాటలవలనఁ దెలియవలెను. మొట్టమొదట మాళవికాపరిచయము కలుగువంతటనే యామె యొక్క యున్నతకుటుంబజాత యని మనకు స్ఫురియింపఁజేయుటకే వాక్యములను కవి గణదాసునిచేఁ జెప్పించెను. "భద్రే! తద్విధానమసులభత్వాత్ పృచ్ఛామి." "ఆకృతి వినయప్రత్యయాత్ ఏనామనూనవస్తుకామ్ సంభావయామి" నిశ్చయరహితములగు నీవాక్యములు మన కామె జన్మాదికమును గూర్చి మాటలలోఁ గొంత కౌతూహలమును గల్పించును గాని తుదియంకమునకుఁ బోవువఱకా కౌతూహలము గొంచెమును సెంకిపోవును. ఇంతకును మాళవికయొక్క యున్నతజన్మమును దెలుపుటవలనఁ బాఠకుల మనస్సులలో నామెను గురించిన పక్షపాతమును, నిట్లైనను రాజుతో నామెకు వివాహము గలుగునాయను నాశయమును గల్గించుటకంటె వేఱుప్రయోజనము లేదు. ఈమె యుత్తమకుల సంజాతయని మనకుఁ గవిచెప్పునప్పటికి మాళవికాగ్నిమిత్రుల వివాహము చాలసమీపించి సిద్ధమైయుండును గావున నీనూతనవిషయము నెఱుంగుటవలన మనకు గలుగవలసినంతటి యానందము గలుగదు. పెండ్లియైనది నీచకులజ గాదు గదా యను శాంతిమాత్రమే కలుగుచున్నది. ముఖ్యముగ ప్రణయకథయంతయు బాఠకుల నాకర్షింపఁగల బలమంతఁగా లేకుండుటచే నీకథ యూర్వశీపురూరవసులచరిత్రమువలెఁ గాని, శకుంతలాచరిత్రమువలెఁ గాని పాఠకవర్గమునకు ఘనైకచిత్తత గల్గింపఁజాలదు. ఇంతియగాక మాళవికను బెండ్లియాడుటకు రాజునకుఁ గల ప్రతిబంధములుకూడ తాను దాటలేనంతటివికావు గావునను, నాతఁడీమెపై మోహముగొని యున్నాఁడు గావునను, స్త్రీలహృదయమును సులభముగా వశముఁజేసికొని వారియనుమతిని రాజు పొందఁగలఁడు గావునను బాఠకులకు సిద్ధప్రాయమైన మాళవికాగ్నిమిత్ర వివాహకార్యమునందును విశేషము పట్టునల కలుగదు. "సంవత్సరోపావర్తనీయో నిరర్గళస్తురగో విసృష్టః" అని చెప్పుటచే వసుమిత్రుఁడొక్క సంవత్సరమునకుముందే తురగరక్షణార్థము వెడలియున్నను నాతనిగురించి కొంచెమైనను గవి తెలుపకుండుటయు విశేషము రసోత్కర్షను గలిగింపఁజాలదు. ధారిణి వసుమిత్రుని యాగమనమును గురించి బ్రాహ్మణులకు దానములు చేయుచున్నదని వైదవ యాంశము తెలుపుటమాత్రమే కవి చెప్పెను. దీనినిబట్టిచూడఁగాఁ గవి యీయజ్ఞమునకును ప్రణయకథకును సంబంధమును గల్పించుట కుద్దిష్టము గలవాఁడై యున్నను నట్టి సంబంధమునుగూర్చుట కాతని కవకాశము లేకపోయెనని తేలుచున్నది. ముందుపయోగపడునట్టి సర్పముద్రాంగుళీయక సంపాదనమును గవి ప్రథమాంకముననే సూచించుట యెంతయుఁ బ్రశంసనీయము. రూపకమునందుఁ బ్రదర్శింపఁబడిన వస్తువులలో 'యాదృచ్ఛికసంఘటన' లేక 'దైవికకార్యసంఘటన'(The introduction of the Accident) చాల స్వల్పముగా నున్నది. ఇంతియగాక యీకథయందతిమానుష విధానములకు (The introduction of the Supernatural) విశేష మవకాశము లేదనియు ముందే తెలిపియున్నాము. ఇన్ని విషయములలోఁగూడ లోటులున్నటుల విమర్శనపై తేలినను మొత్తముమీఁదఁ గథఁ జదివినప్పుడానందము పుట్టకయుండదు. కావుననే యీకావ్యము రసవంతమని చెప్పవలెను.

ఇఁక మాళవికాగ్నిమిత్రము రూపకములలో నే తెగకుఁజేరినదో విమర్శింప వలయును. దశరూపకములలో నాటకలక్షణము.

" నాటకం ఖ్యాతవృత్తం స్యాత్పంచ సంధిసమన్వితమ్
విలాసర్ధ్యాదిగుణవద్యుక్తం నానావిభూతిభిః
సుఖదుఃఖసముద్భూతి నానారసనిరంతరమ్
పంచాదికా దశపరాస్తత్రాంకాః పరికీర్తితాః
ప్రఖ్యాతవంశో రాజర్షిః ధీరోదాత్తః ప్రతాపవాన్
దివ్యోఽథదివ్యాదివ్యోవా గుణవాన్నాయకో మతః
ఏక ఏవభవేదంగీ శృంగారో వీర ఏవవా
అంగమన్యేరసాస్సర్వే కార్యోనిర్వహణేఽద్భుతః
చత్వారః పంచవా ముఖ్యాః కార్యవ్యాపృతపూరుషాః
గోపుచ్ఛాగ్రసమాగ్రంతు బంధనం తస్యకీర్తితమ్."

మాళవికాగ్నిమిత్రమునందలి కథ చారిత్రకము గావున నియ్యది ప్రఖ్యాతమనియే చెప్పనగును. సంధి

విభాగము వెనుకఁ జేయఁబడును. విలాసమనఁగా నాయకునియొక్క చిత్రమైనదృష్టియుఁ గతియు, సస్మితముగా నున్న వాక్కులుగావున నవి యిందున్నవని చెప్పనగును. బుద్ధియనఁగా నాయకుని యభ్యసనము. అదియును నిందున్నది. సుఖదుఃఖసముద్భూతికిఁ దావలము. అంకములయియున్నవి. ప్రఖ్యాతవంశ్యుఁడును రాజర్షియునగు నగ్నిమిత్రుఁడు నాయకుఁడు. ఈతఁడు శృంగారప్రధానుఁడగు నాయకుఁడయ్యును కేవలము స్త్రీలోలుఁడు మాత్రమేగాక ప్రతాపవంతుఁడని చెప్పుటకుఁ గవి యజ్ఞసేనాదులతో యుద్ధమును గల్పించెను. ఈతఁడు ధీరోదాత్తుఁడు, సుశాంతుఁడు. ఓర్పు (క్షమ) గలవాఁడు గావుననే మదనసాయకలక్షుఁడయ్యును నంతఃపుర స్త్రీలయెడఁ జూపవలసిన యాదరమునకు లోటురాకుండ వారి యనుమతిపైనే వివాహమునకుఁ గడంగెను. మాళవికాగ్నిమిత్రుల శృంగారరసమే కావ్యవ్యాపియైయున్నది గనుక నిందుఁ బ్రధానరసము శృంగారమనియే చెప్పవలయును. అన్యరసములును నంగములుగా బ్రవేశించియున్నవి. నిర్వహణసంధియందు మాళవికను విదర్భదేశాగతపరిచారికలు గుర్తించునప్పు డద్భుతరసము. విదూషకుని చర్యలచే నక్కడక్కడ హాస్యరసము. కౌశికి మార్గమునఁ దనకుఁ గిరాతకసైన్యములచేఁ గలిగిన విపత్తును వర్ణించునప్పుడు భయానకరసము. వసుమిత్రుని యొక్క విజయములను వర్ణించునపుడు వీరరసము సుమతి మరణవర్ణనము కరుణము. ఇట్లు దక్కిన రసములును నంగములుగా నక్కడక్కడఁ గొంచెము గొంచెముగా స్ఫురించియున్నవి. నాటక కథావిధానమునందు సంధి సమన్వయముచేయుట కొంచెము కష్టమువని. దీనిని నిర్ణయించునప్పు డభిప్రాయభేదములు సాధారణముగాఁ గలుగుచు జేయుండును. కొన్ని నాటకములలో నియ్యవి స్ఫుటముగానుండవు. ఇందలి రైదంకములును వరుసగా నైదుసంధులని చెప్పవచ్చును. 'ఇతివృత్తస్య భాగాస్స్యుః పంచసంధయః'. నాటకఫలము మాళవికాగ్నిమిత్రులవివాహము. ప్రథమాంకమున రాజుమాళవికా చిత్రమునుజూచినప్పటినుండియును మాళవికారూపమును బ్రత్యక్షముగాఁ జూచుట కిచ్ఛగలిగియే యుండుటచే మొట్టమొదటనే యారంభావస్థవచ్చినది. రెండవ యంకమునందు మాళవికా నాట్యాదులవలన నామెఁగాంచి యామెయందును ప్రేమబీజమును నెలకొల్పుటవలన యత్నావస్థయని చెప్పవలయును. మూఁడవయంకములో మాళవికాసమాగమముకొఱకు రాజు నిరీక్షించుచు నిరాశతోఁ దామజేసిన వాగ్దానమును స్మృతికిఁదెచ్చుకొని కార్యమునెట్లు సాధించుటయని యుపాయాపాయములఁ జింతించుచుండుటచే ప్రాప్త్యాశ. నాల్గవ యంకమున విదూషకుని యుపాయముచే మాళవికాసంయోగము నిశ్చయముగావున నియతాప్తి. అయిదవయంకమునందు మాళవికావివాహముచే ఫలాగమము. అర్థప్రకృతులగు బీజాదులను నిరూపించుటకు మాళవికాగ్నిమిత్రవ్యాఖ్యాతయగు కాటయవేముఁడు ప్రయత్నించెనుగాని బీజ బిందువులను గొన్ని సంధ్యంగములను నిరూపించి విడిచెను. 'అపూర్వేయం దారికేత్యారభ్య దర్శనపథాత్ రక్ష్యతే ఇత్యంతేన వాక్యకదంబేన గమ్యమానః మాళవికాగోచరో రాజ్ఞోఽభిలాషః అత్రనాటకే బీజమిత్యనుసంధేయమ్.' రాజునకు మాళవికా దర్శనమునందు గల యభిలాషయే బీజమని పైవాక్యముల యభిప్రాయము. ప్రథమాంకముయొక్క తుదిని కౌశికీకోపముచేతఁ గథావిచ్ఛేదము జరుగుచుండఁగా నట్లు కాకుండుటకు విదూషకుఁడు గణదాసునిఁ బ్రోత్సాహముచేసి యాతనికిఁ గోపము పుట్టించి కథసాగుట కవకాశము గల్పించును. ఇయ్యదియే బిందువు.

"అత్రదేవీకోపేన విచ్ఛేదే ప్రాప్తే విదూషకకృత ప్రోత్సాహనమ్ ఉత్తరాంకోపయోగిత్వేన అవిచ్ఛేద కారణత్వాత్ బిందురిత్యనుసంధేయమ్."

మొదటియంకమున నారంభావస్థయును బీజమును గలియుటచే ముఖసంధి కలిగినది. రెండవయంకమున బిందువును యత్నావస్థయును గలియుటచేఁ బ్రతిముఖసంధిగలిగినది. ఇఁక మూఁడవసంధియగు గర్భసంధిని నిరూపించు సమయమునఁ గాటయవేముఁ డిట్లు వ్రాయుచున్నాఁడు. "సాతపస్వినీతి......అత్రప్రాప్తి సంభావనయా ప్రాప్త్యాశానామ తృతీయావస్థా సూచితా, అనయా ప్రాప్త్యాశయా బిందోః సమన్వయాద్గర్భసంధిరితి

మంతవ్యమ్." ఈబిందు వెక్కడిదని మనము పరీక్షించిన యెడల రెండవ యంకప్రకటుదిని రాజు మాళవికమీఁదతప్ప నంతఃపురస్త్రీ లెవ్వరిపైనిఁ గూడఁ బ్రేమగలవాఁడను గానని చెప్పు శ్లోకమును వ్యాఖ్యానము సేయుచు సందర్భమున వ్యాఖ్యాత యిట్లువ్రాసెనని తెలియనగును. "అత్రాఽంకే మాళవికానిమగ్నచేతసి కథావిచ్ఛేదేఽపి సర్వాంతఃపురేభ్యోఽపి నా గచ్ఛమానో రాజ్ఞోఽఖిలాపాతిశేషు ఉత్తరాంక కథాహేతుత్వాత్ బిందురిత్యనుసంధేయమ్." ఇట్లు చెప్పుటకంటె నిరావతికథనే పతాకగా నెంచుకొని దానికిఁ బ్రాప్త్యాశతోఁ గలుగుసంబంధము మూలమున గర్భసంధిగల్గినదనుట యుక్తమని నాకుఁ దోఁచుచున్నది. "వ్యాప్తిప్రాసంగికంవృత్తం పతాకేత్యభిధీయతే—యథాశాకుంతలే విదూషకస్య చరితమ్" కాటయవేమునిప్రకారము రాజునఖిలాపాతిశయమునే బిందువుగా (నర్థప్రకృతి) దీసికొనుటయుక్తముగా గనుపట్టదు. రాజునఖిలప యవస్థావిశేషముగాని యర్థప్రకృతి గాదు. ఇంతకును బతాకకును బ్రాప్త్యాశకును గలుగు సంబంధమువనే గర్భసంధి గలుగుననుట సుప్రసిద్ధము. నాల్గవయంకమున విమర్శసంధిని నిరూపించుచు 'విదూషకః—అస్త్యత్రోపాయః' అనువాక్యముపై వ్యాఖ్యానము నిట్లు వ్రాసెను. "అత్రరత్నః కర్ణే విదూషకోక్త ఉపాయః నియమేన మాళవికాప్రాప్తిహేతుత్వాత్ నియతాప్తిర్నామ చతుర్థావస్థానూచితా, అత్ర పూర్వం ప్రకరీస్థానోక్తబీజస్యాఽనయానియతాప్త్యా సమన్వయాదవమర్శోనామ చతుర్థసంధిః ప్రతిపాదిత ఇతి మంతవ్యమ్." పైసమన్వయము ప్రకారమునిందుఁ బ్రకరి లేదనియుఁ దత్స్థానమున బిందువు వచ్చినదనియును గాటయవేముని యభిప్రాయము. దీనిననుసరించియే మూఁడవ యంకపు వ్యాఖ్యానము నిదిని "అత్రబీజానుసంధానాదాక్షేపో నామసంధ్యంగముక్తం భవతి. ఇదమనుసంధానమేవోత్తరాంకకథోపయోగిత్వాద్బిందు రిత్యనుసంధేయమ్." అనివ్రాసియున్నాఁడు. "ప్రాసంగికం ప్రదేశస్థం చరితం ప్రకరీమతా—యథా కులపత్యం కే రావణజటాయు సంవాదః." అనులక్షణమునుబట్టి విదూషకుని ప్రయత్నమే ప్రకరియని నిర్ణయింపనగునని నాకుఁ దోఁచుచున్నది.

ఈప్రయత్నము కథకు మిక్కిలియు నావశ్యకమైనది. విదూషకుఁడు చెప్పినమాటల వలననేగదా నియతాప్తి వచ్చినది. అతని ప్రయత్నమునే ప్రకరియని చెప్పవచ్చునాయని యెవ్వరైనను సందేహింపవచ్చును. కాని నియతాప్తియనునది యవస్థాభేదము గావున నొక్కరిమాటల వలన నాయవస్థ నాయకునియందుఁ గలుగుట కనుపపత్తి లేదు. అట్లు నియతాప్తి కలిగినయనంతరము విదూషక ప్రయత్నముచే సంధికలిగినదని చెప్పవచ్చును. కావునఁ బైసంశయము పుట్టుటకే యవకాశము లేదు. పైప్రకారమున నేగాక నియతాప్తికిని బూర్వోక్తమగు పతాకకును (ఇరావతీచరిత్రము) నీయంకమునందు సంబంధముగలుగుటచే విమర్శసంధియనియుఁగూడ ననవచ్చును. కాని రెండవ పద్ధతికంటె మొదటిపద్ధతియే నాకు మంచిదిగాఁ దోఁచుచున్నది. అయిదవయంకమునందలి యుపసంహృతిసంధిని గురించి నిర్ణయముచేయుచు సనయమున 'కాంతాం విచింత్యసులభేతరసంప్రయోగాం —' అను శ్లోకమునకు వ్యాఖ్యానము సేయుచుఁ గాటయవేముఁ డిట్లు వ్రాయుచున్నాఁడు. "అత్రమాళవికారూపబీజానుసంధానాత్సంధిర్నామ నిర్వహణ సంధ్యంగముక్తం భవతి" ఇంతకు ముందు నాల్గవయంకమునందిది "ఇదం మాళవికాకృతముద్యానపాలికానుసరణముత్తరాంకోపయుక్తత్వాద్బిందు | రిత్యనుసంధేయమ్." అని చెప్పియున్నాఁడు. దీనిని బట్టి మూఁడు నాలుగంకములవలనే యిక్కడను బిందుయోగముచేతనే యుపసంహృతిసంధి యను నభిప్రాయమువలె గనుపట్టుచున్నది. ఇకను పసంహృతిసంధి ఫలాగమమనెడి యవస్థతోడను, కార్యమనెడు నర్థప్రకృతితోడను గలుగుచున్నదనుట శాస్త్రసమ్మతము. ఫలాగమమునకు లక్షణము. "సావస్థా ఫలయోగః స్యాత్ యః సమగ్రఫలోదయః" పంచమాంకమున రాజు విదూషకునితో "సఖే మదనేనానువృత్త్యా నివృత్తైర్యా ధారిణ్యాః పూర్వచరితైః సంభావ్యతే ఏతత్." అని చెప్పు వాక్యములనుబట్టి ఫలసిద్ధియైనదను నూహ స్థిరపడుచున్నది. ఇదియే ఫలాగమమనెడు నవస్థ. "బాధకబాధనేన ఫలపర్యంతత్వాదార్థ్యం ఫలాగమ ఇత్యర్థః" అని ప్రతాపరుద్రీయ వ్యాఖ్యానమున 'ఫలాగ

మావస్థ వివరింపఁబడినది. కార్యమునకు లక్షణము "అపేక్షితంతుయత్సాధ్యమారంభోయన్నిబంధనః సమాపనంతు యత్సిద్ధ్యై తత్కార్యమితిసమ్మతమ్". ప్రతాపరుద్రీయమునందు "కార్యంనిర్వాహకృత్ ఫలే" యని లక్షణము వ్రాయఁబడెఁగా "కార్యమితి ప్రధానఫలనిర్వాహకోఽంతిమః కథావయవః కార్యమిత్యర్థః" అని వ్యాఖ్యానము చేయఁబడినది. పైలక్షణములఁబట్టి యైదవయంకము నందలి కార్యము ధారిణి మాళవికను రాజునకిచ్చుట. 'దేవీ—(మాలవికా మాగుంఠనవతీంకృత్వా) ఆర్యపుత్ర! ఇదానీమిమాం ప్రతీచ్ఛతు' అని యైదవ యంకమునందుఁ జెప్పఁబడుచున్నది. కార్యమునకును ఫలాగమమునకును సామ్యమగుటచే నీయంకమున నుపసంహృతిసంధియని చెప్పఁబడును. అర్థప్రకృతుల యొక్కయు నవస్థల యొక్కయు సామాన్యప్రయోజనమును గుఱించియు వస్తువునందవి యెట్లునియమితములను విషయమును గుఱించియు ముందువ్యాసములలో వివరింపఁబడును.

ఇఁక నీనాటకముయొక్క కాలపరిమితిని నిర్ణయింపవలయును. పంచమాంకమునఁ బరివ్రాజిక, మాళవిక యొక్క సంవత్సరము సేవకురాలుగానుండి యనంతరము త్తముఁడగుభర్తనుబొందఁగలదని చెప్పుచున్నది "సంవత్సరమాత్రమియం ప్రేష్యభావమనుభూయ—." ఈమాటలను బట్టి మాళవిక యంతఃపురమున నొక్క సంవత్సరము పరిచారికగా నుండెనని నిశ్చయము. తుదిని వసుమిత్రుఁడు యజ్ఞాశ్వము నొక సంవత్సరము రక్షించి జయముతోఁ దిరిగివచ్చెనని చెప్పఁబడుటచే నాతఁడు యజ్ఞరక్షణార్థము బయలు వెడలుటయు మాళవిక సేవకురాలుగాఁ బ్రవేశించుటయు నొక్కకాలముననే జరిగియుండవలయును. మొదటి విష్కంభకమునకు ముందే యొక కాలమున రాజు మాళవిక చిత్రమును జూచియుండవలయును. చూచిన యల్పకాలముననే విదూషకునితో మాళవికను జూడవలయును గావున నెద్దియేని యవకాశమును గల్పింపుమని యడిగియుండును. మఱికొన్ని దినములకే ప్రథమాంకము ప్రారంభమగుచున్నది. రాజకార్యములయందు మంత్రియగు వాహతకుఁడు విదర్భరాజు నోడించుటకై సేనలఁబంప నాజ్ఞాపింపఁబడెను. ప్రేమకార్యముల మంత్రియగు విదూషకుఁడును నాసమయముననే వచ్చి మాళవికాదర్శనమున కుపాయమును బన్నితినని చెప్పెను. మొదట మాళవిక చిత్రమును జూచుటకును ప్రథమాంకమున మంత్రితోఁ గలియుటకును నడుమ జాలి కాలముండుట కవకాశములేదు. ఉత్సుకుఁడైనరాజు చాలఁ గాలము నిరీక్షింపఁజాలఁడు. ప్రథమాంకమును ద్వితీయాంకమును మొదటి మధ్యాహ్నముననే పూర్తియయ్యెను. ప్రథమాంకమునందలి మాటలవలననే వారందఱును సంగీతశాలకుఁబోయి ప్రదర్శనమును గాంచినట్లు తేలుచున్నది. ఆనాటికిఁ బరీక్షనునిలిపి హరదత్తుని మఱునాఁడు పరీక్షింతమని రాజు వెడలిపోయెను. "త్వదీయముపదేశం శ్వోద్రక్ష్యామః." అప్పుడే వసంతకాలము గూడ నారంభమై యుండవలయును.

మూఁడవయంకమునందలి ప్రవేశకమున వచ్చుపరిచారికల మాటలవలన హరదత్తుని పరీక్ష జరిగెననియు గణదాసుఁడే శిష్యాధిక్యముచే నధికుఁడని నిర్ణయింపఁబడెననియు మాళవికక్రుశించి యున్నదనియుఁ దేలుచున్నది. "మాళవికాప్యుష్ణదివసేషు అనుభూతముక్తేవ మాలతీమాలా మ్లాయమానాలక్ష్యతే" ఆయంకముననే రాజుగూడ 'ఆత్మానమవలోక్య'-"శరీరంక్షామం స్యాదసతి దయితాలింగనసుఖే" అని చెప్పుటచేఁ దాను కృశించినట్లు తేల్చుటచే రెండవయంకమునకును మూఁడవ యంకమునకును నడుమఁ గొన్నిమాసములైనను జరిగియుండవలయును. మూఁడవయంకపుఁ బ్రవేశకమును నంకచరితమును నొక్కదినముననే జరిగియుండవలయును. "మధుకరికా అహమప్యస్య చిరాయమాణకుసుమోద్గమస్య తపనీయాశోకస్యదోహద నిమిత్తం దేవ్యై నివేదయామి." అని చెప్పియున్నాఁడే దేవికావిషయమును నివేదించెను గావున నానాఁడే యశోకదోహదము గూడ జరిగెనని యూహింపనగును. "రక్తకురవకాణ్యుపాయనం ప్రేష్య నవవసంతావతారవ్యపదేశేన—" అని చెప్పఁబడిన వాక్యములవలనను ముందువచ్చువర్ణనము వలనను నదివసంతావతారసమయమని తెలిసికొనక తప్పదు. ఆదినమునుండి యైదుదినములలో నశోకము పుష్పింపవలయునని ధారిణి చెప్పుటఁజేసియు నాల్గవయంకము తుదిని "అపూర్ణే

ఏవ పంచరాత్రే దోహదస్యముకులైః సన్నద్ధస్తపనీయా శోకః" అని చెప్పుటచే మూఁడవ యంకమునకును నాల్గవయంకమునకును మూఁడు నాలుగు దినములకంటె నెక్కువ యవధి లేదని నిర్ణయింపనగును. మూఁడవ యంకమున రాజును మాళవికయుఁ గలిసియుండుటఁ జూచి యిరావతి వెంటనే కోపముతోఁ వెడలిపోయి ధారిణితోఁ జెప్పి యాదినముననే యామెను బందీకృతఁ జేయించియుండును. ఆమరునాఁడే విదూషకుఁడామెను విడిపించెననుట స్పష్టము. "హ్యఃకిలతత్ర భవతీం వతీ..." నాల్గవ యంకాంతమున విదూషకునిపై సర్పకాష్టము వేసిన తరువాత బకుళావలిక 'మాతావద్భర్తా ప్రవిశతు ఇహకుటిలగతిః సర్ప ఇవ దృశ్యతే' అని చెప్పుటఁబట్టి సాయంకాలము సమీపించినదనియును నప్పుడు సర్పమునకును సర్పాకారకాష్టమునకును గల భేదము తెలియలేదనియును నూహింపనగును. ఇది దోహదమైన తరువాతి మూఁడవ దినము సాయంకాలము. నాల్గవనాఁటియుదయముననే తరువాతి ప్రవేశకము జరిగెనని చెప్పవలయును. ధారిణి బ్రాహ్మణులకు ధనమును దానముచేయుట యుదయముననే జరిగెననుట యుక్తముగదా! అయిదవయంకమా సాయంకాలముననే ముగిసినదని చెప్పనగును. అశోకవృక్షసత్కారమత్యాది పుష్పించిన వెంటనే జరుగుట యుక్తముగావున నాదినముననే మిగిలిన కథయంతయును జరిగియుండును. రాజునకును మంత్రికిని ప్రథమాంకమున జరిగిన సంవాదము నారంభించి నాటకము పూర్తియగువఱకు మూఁడు వారములకంటె నెక్కుడు పట్టియుండదని చెప్పవగును. రెండవయంకమునఁ బ్రత్యవతీర్ణమని చెప్పఁబడిన వసంతకాల మైదవయంకమునఁ గించిత్పరివృత్తయౌవనమని చెప్పఁబడుటచేఁ బైసంభావన మఱియు సరిపోవుచున్నది. ఈ పైరీతినే కాలవిభజనమును 'కాళే'గారు తమ మాళవికాగ్నిమిత్రోపోద్ఘాతమున వ్రాసియున్నారు. పై వాదమంతయును సోపపత్తికముగా నున్నది గాని యొక్క విషయము మాత్రము కాళేగారు పరిశీలింపలేదు. ప్రథమాంకమున రాజు విదర్భరాజ్యముపై దండెత్తఁబంపిన సైన్యము విదిశాపట్టణమునుండి బయలుదేరి విదర్భదేశమునకేగి వారితోఁ యుద్ధముఁజేసి జయించి యక్కడినుండి మూఁడువారములలో వచ్చెననుట యెంతమట్టునకు యుక్తము అను విషయమును జర్చింపవలయును. ఈసైన్యమూరకపోయి యేసంధినో జేసికొని వచ్చెననుటయు నీక్రింది వాక్యములచేఁ బొసఁగదు. "వశీకృతః కిలవీరసేనప్రముఖైః భర్తుర్విజయదండైః విదర్భనాథః—

విరచితపదం వీరప్రీత్యా సురోపమసూరిభి
శ్చరితముభయోర్మధ్యేకృత్వా స్థితం క్రథకైశికాః
తవహృతవతో దండానీకైః విదర్భపతేః శ్రియం
పరిఘగురుభిర్దోర్భిః శౌరేః ప్రసహ్య చ రుక్మిణీమ్"

ఇంక వీరసేనుఁడు రాజునకు బావయును సంతపాలదుర్గపాలకుఁడును నర్మదాతీరస్థుఁడునగు వీరసేనుఁడా వేఱొకఁడాయని చర్చింపవలయును. ఈవీరసేనుఁడు సర్వసైన్యాధిపతియగునో లేక యీకార్యమునకుఁగాను సైన్యాధిపతిగా నియమింపఁబడెనో యెక్కడను జెప్పఁబడలేదుగాని యీతఁడంతపాలదుర్గమున స్థాపింపఁబడినవాఁడనుటచే నీతఁడే సర్వసేనాధిపతియని భావించుట యుక్తముగానుండదేమోయని తోఁచుచున్నది. విదర్భదేశముపై దండెత్తుటకు సైన్యము నిప్పుడును సిద్ధముచేసికొని యేదియో యొక పాకుకొఱ కగ్నిమిత్రుఁడు వేచియుండెననిమాత్రము దీనినిబట్టి తెల్లము. విదిశాపట్టణమునుండి(భిల్సా)బీరారు మధ్యభాగమునకు(విదర్భ)కు మారు 250 మైళ్లదూరముండునని మనము లెక్కవేసిన యెడల సైన్యములు 21దినములలో పైదూరమునంతయును బ్రయాణముచేసి యుద్ధముచేసి తిరిగి రాఁగలిగెనని యూహింపవలనవదిగానున్నది. అటుఁగా నేడుదినములు పోవుటకును నేడుదినములువచ్చుటకును యుద్ధమునకేడు దినములును బట్టెనని యూహింపవచ్చును. ఇంతకంటె నర్మదానదీతీరమునయుండిన వీరసేనుఁడు తనదుర్గములోనున్న సైన్యముచే దీసికొని సుమారొక నూరుమైళ్లుపోయి యుద్ధముచేసి విదర్భరాజవాహిని నోడించివచ్చి యుండుననుట పైదానికంటె మఱియును యుక్తముగానుండును. కాఁబట్టి మాళవికాగ్నిమిత్రనాటకము కథ సుమారు మూఁడు వారములలో జరిగెననుట నిర్వాహమని తోఁచుచున్నది.

ఈనాటకమందలిపాత్రములనుగురించి మున్ముందుఁ గాళిదాసుని పాత్రములన్నిటిని గురించి విమర్శించు నప్పుడు విమర్శింపఁబడును.

మొత్తముమీఁద మాళవికాగ్నిమిత్రము బాల్యావస్థయందు వ్రాయఁబడిన దయ్యును సహృదయులకానందము నొసంగుచుండుటచేఁ గాళిదాసుఁ డెంతయును బ్రశంసార్హుఁడు.

అంధ బాలిక

కోడాలి ఆంజనేయులుగారు

౧

అంధురాలను దివ్యనిశాంతసమయ
  కరిమిళానిలమార్గముల్ పట్టిపోదు
త్వత్పదాబ్జసేవాపరత్వమునఁ జేసి
జీర్ణతృణకుటీరాంగణసీమ విడిచి.

౨

చిగురువెన్నెల లేత పచ్చికబయళ్లు
మధురనీహారముల మాటు మణగువేళ
వలపు పిల్లనగ్రోవి పాటలకు నేను
వెదురుపొదరిండ్ల రొదలలో వెదకుకొందు.

౩

గొల్లపడుచుల చెదరిన కుంతలముల
జారిపోయిన అడవి గన్నేరుపూల
తావులంబట్టి సడలెడ తావకీన
ప్రణయపదరేఖ వలచు భూభాగములకు.

౪

త్వద్గళమ్మున నాగరప్రమద లిడిన
స్వర్ణకహ్లారమాలానిసర్గసౌర
భముఁ త్రోవలం బడి పోవ వలతు నేను
ప్రేమపూజాసుమాన్వేషహృదయ నగుచు.

౫

నీ మనోహర రూపమ్ము నీమనోజ్ఞ
వేణుగానమ్ము గీర్తించి వెల్లివిరియు
విమలయమునాతరంగనాదముల చాయ
చనెద నిబిడలతామాలావృతముల నీడ!

విగుర్వణము కర్ణాటపదమా? సంస్కృతపదమా?

కవిభూషణ, కవిరాజ, శ్రీరాజా వత్సవాయ వేంకటనీలాద్రిరాజుగారు

ఆను చర్చ కొన్నాళ్లనుండి సాగుచున్నది.

ఈ పదమున కాంధ్రసారస్వతమునం ప్రయోగంబు లిప్పటికి నుపలబ్ధము లైనవి నాలుగు మాత్రమే:

(1) వి,గుర్వింపుము చూత మనిన గోత్రభిదుండున్

—మహాభారతము, ఆదిపర్వము.

(2) గణముఖ్యులు, వెడలి విగుర్వించి.

(3) పటుదోర్బలగర్వ విగుర్వణంబులన్.

—నన్నెచోడకవిరాజశిఖామణి కుమారసంభవము.

(4) * కోరి శశాంకమౌళికి విగుర్వణతో గుడి
[నిల్పె భక్తునన్.

—నాదెండ్లశాసనము,

శబ్దరత్నాకరము పుట్టునాటికి మొదటిప్రయోగ మొకటిమాత్రి ముపలబ్ధమైనందున దానికి "విఱుచువిఱుచు వికుర్వించు" అని రత్నాకరమున నిర్వచన మియ్యబడినది. "ఇది విగుర్విసిద" అను కన్నడధాతువనియు, దీనికి భయంకరత్వము చూపు టర్థమనియు, రత్నాకరకారుని నిర్వచనము ప్రామాదికమనియు కీ॥ శే॥ తేవప్పెరుమాళ్లయ్య మహాశయు డాంధ్రసాహిత్యపరిషన్మహాసభలో జదివిన యుపన్యాసమున తెలిపెను. అప్పటికి కవిరాజశిఖామణిప్రయోగములు గూడ నుపలబ్ధములైనవి. అందు "దోర్బలగర్వవిగుర్వణంబులన్" అను సంస్కృతసమాససంఘటనముం జూచి యది విచారణీయ మని యా మహాశయు డాశంకించెను. విచారణీయ మనుటలో రెండు సందేహము లున్నవి:

(1) "విగుర్విసిద" అను కన్నడధాతువున కీకర్ణాటకకృత్ప్రత్యయవిధానమువలన "విగుర్వణ"మను పదము పుట్టినది?

(2) "విగుర్వణము" కర్ణాట వ్యాకరణము ప్రకారము నిష్పన్నమైనను సంస్కృత శబ్దముతో నెట్లు సమసించెను?

ఈ రెండాక్షేపణలకును కర్ణాటవాదులు సమాధాన మియ్యవలసి యున్నారు.

కర్ణాటపక్షము వారు

(1) కీ. శే. తేవప్పెరుమాళ్లయ్యమహాశయుడు
(2) గా. శ్రీ. నడకుదిటి వీరరాజుపంతులుగారు
(3) బ్ర. శ్రీ. శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రులుగారు

సంస్కృతపక్షము వారు

(1) ......వ్యాసకర్త
(2) విద్వాన్ కట్టి సాంబమూర్తిశాస్త్రులుగారు
(3) వేటూరి ప్రభాకరశాస్త్రులుగారు

---

* శాసనమున 'గౌరి శశాంకమౌళికి విగుర్వణతో' అని యున్నది. 'గౌం' యన్న నర్థము లేదు, యతి చెడ్డది. 'విగుర్వణతో' నన్నప్పుడు, 'విగుర్వ' అనియా, 'విగుర్వణ' అనియా? 'విగుర్వణా' అనుట నసంజసము.

సంస్కృతపదవాదమును 1922, 1924 లో నేనును, 1924 లో సాంబమూర్తి శాస్త్రులుగారు నుపపాదింపగా ప్రభాకరశాస్త్రులుగా రామోదించినారు.

సంస్కృతపక్షమందలి సాధకబాధకముల నన్నింటిని నే నిదివరకే చర్చించి యున్నాను.

విపూర్వకగుర్వీధాతువుకంటె ల్యుట్టు చేయగా "విగుర్వణ"పద ముత్పన్న మగును. "ఉపధాయాంచ" అను సూత్రమువలన ప్రాప్తించవలసిన ఉపధాదీర్ఘవిధాన మనిత్య మగుటవలన దీర్ఘము రాలేదని తెలిపితిని. కాని యీ యనిత్యత్వము నంగీకరింపక శ్రీలక్ష్మీపతి శాస్త్రులుగారు వాదించిరి. నా వాదమును (1) మాధవీయధాతువృత్తి (2) తత్త్వబోధిని (3) అమరకోశము యొక్క భానోజీదీక్షితీయ వ్యాఖ్యానము సమర్థించుచున్నవి.

"సంజ్ఞాపూర్వకో విధి రనిత్యః" అను పరిభాషనుబట్టి భానోజీదీక్షితీయవ్యాఖ్యానములో "ఉర్వరా" శబ్దనిష్పత్తి చేయబడ్డది. ఉర్వీ ధాతువుకంటె ఘప్రత్యయము చేయగా "ఉర్వం; ఉర్వం రాతీతి ఉర్వరా" అయినదని భానోజీదీక్షితీయవ్యాఖ్యానమున నున్నది. మాధవీయధాతువృత్తియందును, తత్త్వబోధిని యందును "టుజ్ స్ఫూర్జా వజ్రనిర్ఘోషే" అను ధాతువునందలిదీర్ఘోపదేశము "ఉపధాయాంచ" అను దీర్ఘవిధానముయొక్క అనిత్యత్వజ్ఞాపనమనిచెప్పి, "ముర్ఛతి, హుర్ఛతి" అను రూపములు సాధింపబడినవి. కావున విగుర్వణపదము సంస్కృతమని సంస్కృతవ్యాకరణశాస్త్ర సమ్మతముగ మేము చెప్పుచున్నాము. విగూర్వణము సంస్కృతమని లక్ష్మీపతిశాస్త్రులుగారు నొప్పుకొన్నదే. మాధవీయవృత్తి తత్త్వబోధినీ కారుల మతము ప్రకారము దీర్ఘవిధాన మనిత్యము గనుక హ్రస్వరూపమును శాస్త్రులుగా రంగీకరింపక తప్పదు. అంగీకరింపని పక్షమున శ్రీ శాస్త్రులుగారు "విగుర్విసిద" అను కన్నడ ధాతువునుండి విగుర్వణ మనుపద మేకర్ణాటక వ్యాకరణవిధానముబట్టి నిష్పన్నమైనదియు జెప్పవలసి యున్నారు.

ఈ శబ్ద మిదివరకే శబ్దరత్నాకరమున ప్రామాదికముగ నిర్వచింపబడినది. ఇప్పుడు సూర్యారాయాంధ్ర నిఘంటువునం దయినను శాస్త్రీయముగ నిర్వచింపబడవలెను. ఈవ్యాసమును, నిటుమీదట కర్ణాటపక్షమున శ్రీశాస్త్రులుగారు ప్రచురింపబోవు వాదమును గూడ ఆంధ్రసాహిత్యపరిషన్మహాసభలో జర్చించి నిర్ణయించిన పిమ్మటనే యీశబ్దము సూర్యారాయాంధ్ర నిఘంటువున కెక్కవలయును.

(1) రత్నాకరము ప్రకారము అత్యంతము విలుచు టర్థము.

(2) కన్నడపక్షవాదము ప్రకారము భయంకరత్వము చూపు టర్థము.

(3) సంస్కృతవాదప్రకారము విశేషమగు నుద్యమన మర్థము. సూర్యారాయాంధ్ర నిఘంటువునం దేమి యర్థము వ్రాయబడ నున్నదో యీభారమంతయు సాహిత్యపరిషత్సభ్యమహాశయులపై నున్నది.

ప్రణయసమాధి

౧

కలల పొలాలు చెమ్మగిలగా దరహాస కళాతుషారముల్
చిలుకు శరద్విలాసరుచిశీలవొ! పుష్పాశిపైట మేల్ముసుం
గులు బెళుకన్ వసంతధరకున్ డిగు నందనలక్ష్మివో! అరా
ళలలిత కుంతలాల దరళమ్ముగ నాచెదవా కటాక్షముల్ ?

నాకసతీరహఃప్రణయనాటకరంగము లల్కు వెన్నెలల్
రేకులు రేకులన్ జిలకరించు వియోగకథాసుధారస
వ్యాకులధాళధళ్యముల వన్నెలు దిద్దు ముఖాబ్జపాండుర
శ్రీకరుణమ్ముగా పలుకరింప గలంతు వదేల డెందమున్ ?

మన మొక భావగీతమయి మాధురులన్ స్రవియింప తొల్లి నిన్
గనుగొనినప్పుడే వలపుకక్కురుతుల్ చన క్షీరసాగరా
నవదరహాసశోభవలె నాతి! గభీరప్రశాంతి పూత మీ
'ప్రణయసమాధి' మున్గితి భవచ్ఛుభమూర్తి స్మరింపు చాత్మ ':

'కోరికతీవ లెల్ల తెగ కోసి, నిరాశయు మన్మనో శయా
ధారముగాగ జేసి వనితా! నెఱచేదుల స్వాదు లేరు నా
చారమె జీవితావధిగ శాంతి గడించు విషాదభాగ్యరే
ఖారమణీయతల్ తెలుప గ్రమ్మర దర్శన మిచ్చి తేలనో !

ఏనరసంపువేళ హృదయేప్సితముల్ వెలవోసి యీ యువ
స్థాసుకుమారవేదన లతాంగి! వరించితినో ప్రవాస దీ
క్షాసఖమా ప్రవృత్తిగ, నగాధహృదంతరతీక్ష్ణబాధ లే
మో సరళమ్ములై తెరలిపోవు సుఖాశయక్రమసీమలన్.

*　　*　　*　　*　　*

ఏయనురాగపున్ తొలకరింపుల, నీలనభోవిశాలశా
లాయుతలాస్యఖేలనములన్ విహరింపుచు, బాళికయ్యపున్

రాయిడిఁ బెట్ట నే జలదరాట్సుతుఁ బాసి చలించుదంచలా
ప్రేయసివో! దరిం జె నిరుపేదయెదన్ బ్రణయాతిథేయమున్ ?

ఏసంధ్యారుణధర్మహర్మ్యములలో, నే యింద్రచాపాచ్ఛరే
ఖాసౌధాంతరకాంతిశయ్యలనొ, రాకాచంద్రికారామసీ
మాసౌరభ్యనికుంజరాసముల, ప్రేమశ్రీల శాసించు నీ
కీసామాన్య మనోజ్ఞమాధురి నివాళింపన్ రుచుల్ దోచునో!

రేయిచెఱంగులో పసిడిరేకుల గేదగికన్నవోలెనున్
సోయగ మొల్కఁ బోసెదవు సోగగ సోలుచు, నే పురాణగా
తీయమహోన్నతాశయప్రతిష్ఠకు జీవముఁగొన్న భారతీ
నాయికవో! అగాధనయనమ్ముల తీరనిదాహ మూరెడిన్.

ద్యోమందారవనీహృదంతరప్రశాంతుల్ గోలె, మందాకినీ
శ్రీమత్పావనగర్భశైత్యమటులో సీమంతినీ! అక్షర
ప్రేమోదంత సజీవసార మధురావేశమ్ము నీమందవీ
థామందాక్షము లొయ్యనొయ్యన హృదాకాశాసీమలన్ జల్లెడిన్.

నవనవచంద్రికావిలసనాంకితసౌధపథాల మార్దవా
సవ ముఱలంగ నిర్దయ కృశాంగి! క్రమించితివెంత దవ్వొ మా
ర్కువ జెమరించు లేయలిక గ్రొంజిరుపాయపు పూపయిందముల్
నవయుట కెట్టు లోర్చితి వనాదరభావమలీమసాత్మవై ?

వెన్నెల కల్లితావి చెఱ విచ్చిన తళ్కు మొగాల పచ్చిపూ
గన్నెల పాలపాయఁపు సుగంధమధువ్రతలక్ష్మి వేమొ! నీ
సన్నిధి పూజరేకులయి జల్లన నాయెద విచ్చు మైకపున్
జిన్నెలు ప్రేమగర్వగుణి చిక్కఁగఁ గండతలాల గ్రమ్మగన్.

ప్రియదర్శికానాటికనుగురించిన గ్రంథకర్తృత్వాదినిర్ణయము

కీ॥ శే॥ శ్రీమన్మహోపాధ్యాయ బ్ర. కల్లూరి వేంకటరామశాస్త్రిగారు

I. ప్రియదర్శిక, రత్నావళి, నాగానందము ఈ మూఁడింటిని రచించినవాఁ డొక్కఁడు. శ్రీహర్షుండు సరసవాగ్వైభవ సంపదలతోఁ దులతూఁగు నట్టి మహాకవులలో నొకండు. ఇతండు ప్రియదర్శికనే కాకుండ, రత్నావళియనియు, నాగానందమనియు సుప్రసిద్ధములగు రెండు రూపకంబులను రచించినట్టులు తెలియుచున్నది. ఏలయనంగాఁ బైనిం జెప్పిన మూఁడు గ్రంథంబులయందును (1) "శ్రీహర్షో నిపుణః కవిః" అనిన శ్లోకంబును, (2) "నానాదిగ్దేశాగతేన రాజ్ఞః శ్రీహర్షస్య పాదపద్మోపజీవినా......అనిన" వాక్యంబును నొకరీతిగానే ప్రస్తావనయందు వ్రాయఁబడినవి. ఇంతియే కాక "వ్యక్తి ర్వ్యంజనధాతునా......" ఇత్యాదులైన కొన్ని పద్యంబులుకూడ నాయాయిప్రకరణ సందర్భంబులకు నుచితంబుగాఁ బైనిం జెప్పఁబడిన యట్టి గ్రంథములయందుఁ బ్రయోగింపఁ బడియున్నవి. కవులకు మిక్కిలి యభిరుచికరంబగు వాక్యంబునుగాని, శ్లోకంబును గాని, లేక యట్టియర్థమునే విశదీకరించునట్టి వేఱొక పదసందర్భమును గాని స్వకల్పితగ్రంథములయందు నన్యోన్యంబున జొనుపుట కవులకు స్వాభావికమై యున్నది. ఆబాలగోపాలము రఘువంశ, కుమార సంభవంబులు రెండు గ్రంథములకును కర్తగాఁ దెలియఁబడుచున్న కాళిదాసకవియును "అపవాద ఇవోత్సర్గం వ్యావర్తయితు మీశ్వరః" అని రఘువంశమందును, "అపవాదైరివోత్సర్గాః కృతవ్యావృత్తయః పరైః" అని కుమారసంభవ కావ్యమందును నొకటియే తాత్పర్య మిచ్చునట్టుగా బింబ ప్రతిబింబరీతిని శ్లోకద్వయంబు రచించెను. ఇట్లే భవభూతి విరచిత నాటకములయందుం గూడ "వ్యతిషజతి పదార్థాన్" ఇత్యాద్యనేక శ్లోకంబులు పరస్పరంబును జొప్పింపఁబడియున్నవి. కాళిదాస భవభూత్యాది కృతములగు గ్రంథములలో నొకదానిలోని శ్లోకములు వేఱొకదానిలోఁ గానిపించినట్లు ప్రకృతమున (1) ప్రియదర్శిక, (2) రత్నావళి, (3) నాగానందములలోఁ గనఁబడుచున్నందున నీమూఁడు గ్రంథములకును శ్రీహర్షుం డొకఁడే కర్తయని తేటతెల్లమగుచున్నది.

II. శ్రీహర్షులనేకు లున్నందున నితం డే శ్రీహర్షుఁడని యాశంకకలుగఁగాఁ దన్నిర్ణయము సలుపఁబడుచున్నది.

(1) శ్రీహర్షశబ్దము వినినతోడనే మామల్లదేవికిని శ్రీహీరునకును జనించి నైషధకావ్యమును రచియించిన మహాకవి బుద్ధికి స్ఫురించుచుండును.

(2) తర్వాత, కావ్యప్రదీపగ్రంథకర్తయైన గోవిందఠక్కురునకుఁ గనిష్ఠభ్రాతయైన వేఱొక శ్రీహర్షుండును గూడఁ గలండని యాలోచనవలనంబునఁ బొడకట్టును.

కాని వీరిద్దఱును రాజులు కానందున 1. ప్రియదర్శికా 2. రత్నావళీ 3. నాగానందములకు గ్రంథకర్తలని చెప్ప వలనుపడదు.

(3) ప్రకృతములగు గ్రంథములకు మూఁడింటికిని శ్రీహర్షుఁ డనునట్టిరాజు కర్త యైనట్టులు ఈ గ్రంథముల మొదటి ప్రస్తావనవలనఁ గరతలామలకముగాఁ గానిపించు చున్నది.

(4) ఈకారణ మొక్కటియేకాక వేఱొకహేతువును గలదు. నైషధకర్తయైన శ్రీహర్షుఁడు తాను రచించిన నైషధ సర్గలచివరను విస్పష్టముగ స్వకృతంబులగు స్థైర్యవిచారణాప్రకరణాది గ్రంథముల నామంబులను బఠించి కనఁబఱచుచున్నాఁడు. ఆ శ్రీహర్షుఁడే ప్రియదర్శికాది గ్రంథత్రయమునకురచనాకర్త యయ్యెనేని నైషధసర్గాం

తములయందుఁ జక్కని స్వరచిత గ్రంథాంతరములతో పాటుగాఁ బ్రకృతరూపకములను మూడింటిని నేల చేర్చకుండును ? కావునఁ బైనిం జూపిన కారణములనుబట్టి రాజులు కానట్టి యిద్దఱు శ్రీహర్షులును బ్రకృతరూపకత్రయమునకు రచనాకర్తలు కారనిన యంశము తేటపడుచున్నది. అనఁగా శ్రీహర్షుఁడనిన రాజే యీరూపకత్రయమునకుఁ గర్తయని స్పష్టమగుచున్నది.

III. శ్రీహర్ష శబ్దముతో మిళితమైన నామంబులు గల రాజులును పెక్కురు కానవచ్చుచున్నందున వారిలో నితం డెవరనిన తృతీయప్రశ్నమునకు సమాధానము వ్రాయఁ బడుచున్నది.

(1) సాతవాహన వంశంబునఁ గలశరాజపుత్రుం డను శ్రీహర్ష దేవుం డొకఁడు గలఁడు. అనంతరాజునకుఁ బట్టమహిషియైన పరమవిదుషి యని ప్రసిద్ధిం గాంచిన సూర్యవతీదేవి యితనికిఁ బితామహి యగును (సూర్యవతీ దేవికి నితండు మనుమఁడు.) ఈదేవికి వినోదమునిమిత్తమే సోమదేవకవి కథాసరిత్సాగరమును రచియించినట్లు తెలియుచున్నది.

(2) ధారానగరంబు రాజధానిగాఁ గలిగిన భోజ మహారాజునకుఁ దాత యొక శ్రీహర్ష దేవుం డుండెనట్లు ప్రాచీనలేఖమాల యను గ్రంథమువలన విశదమగుచున్నది.

ఇట్లిద్దఱున్నను వీర లిద్దఱును ప్రియదర్శికాది ప్రకృతరూపక త్రయంబునకు రచనాకర్తలుగా నుండుట సంభవింప నేరదు.

పైవారిలో మొదటివాఁడు క్రీస్తు పండ్రెండవ శతాబ్దములో మొదటి యర్ధభాగంబునఁ గాశ్మీరదేశ రాజైనట్లు రాజతరంగిణీ గ్రంథాంతభాగంబున వచింపఁ బడినది.

భోజరాజ పితామహ శ్రీహర్ష దేవుండు క్రీస్తు పదవశతాబ్దముయొక్క ప్రారంభకాలంబున జనించి యుండవలయును. ఇతనికిఁ గుమారుండును, భోజునకుఁ దండ్రి సోదరుఁడైన ముంజరాజు క్రీస్తు పదవశతాబ్దము యొక్క మధ్యభాగంబున జనించిన యంశము సర్వజనులకును సుప్రసిద్ధముగదా! ఈముంజరాజు సభలోఁ బ్రతిష్ఠానం తుఁడైన ధనికకవి దశరూపావలోకమందు నీమూఁడు రూపకములను (ప్రియదర్శికాది రూపకములు) నుదాహరించెను.

మఱియు, క్రీస్తువత్సరముల తొమ్మిదవశతము మధ్యభాగంబున జనించి జాయాపీడునకు మంత్రియైన దామోదరగుప్తుండనువాఁడు తన కుట్టినీమత గ్రంథమునందు శ్రీహర్షకృత రత్నావళీకథను సవిస్తరంబుగా వర్ణించియుండెను. ఆ గ్రంథమందు ప్రసంగవశంబున "ఉదయనగాంతరిత మియం" అనిన రత్నావళిలోని పద్యంబును పైకము దామోదరగుప్తుండు సంకేశనము కావించెను. "అశ్లిష్టసంధిబంధం సత్పాత్రసువర్ణయోజితం సుతరాం, నిపుణపరీక్షకదృష్టం రాజతి రత్నావళీరత్నం" అనిన కుట్టినీమతగ్రంథమందలి పద్యముకూడ స్పష్టముగా రత్నావళీ నాటికను స్ఫురింపఁజేయుచున్నది. ఇట్లు రత్నావళీ నాటికలోని పద్యమును క్రీస్తువత్సరముల తొమ్మిదవశతము మధ్యభాగంబున జనించిన దామోదరగుప్తుండు తనగ్రంథంబున సంధించుటవలన రత్నావళ్యాదిరూపకత్రయకర్తయగు శ్రీహర్ష మహారాజు తొమ్మిదవశతాబ్దమునకు ముందే యుండక తీరదు.

ఇట్లు తొమ్మిదవ శతమునకు ముందే వ్యవహారములో నుండిన ప్రియదర్శికారత్నావళ్యాది రూపకంబులకుఁ బండ్రెండవ శతాబ్దమందు జనింపఁబోవునట్టి కలశరాజపుత్ర శ్రీహర్ష దేవుండును, పదవశతాబ్దమందు నుప్పతిల్లంబోవునట్టి భోజరాజపితామహ శ్రీహర్ష దేవుండును నెట్లు రచనాకర్తలు గాఁగలరు?

కావున వారికంటె నన్యుండేయైన శ్రీహర్షుండు ప్రియదర్శికాదులకుఁ గర్తయని సిద్ధాంతమగుచున్నది.

మఱియు, నైషధకర్త శ్రీహర్షుఁడును, కావ్యప్రదీపకర్తయగు గోవిందఠక్కురునకుఁ గనిష్ఠభ్రాతయైన శ్రీహర్షుఁడును నీరూపకత్రయంబునకును రచనాకర్తలు గారనుటకు రాజులు గారనెడి హేతువే కాక యీకాల నిరూపణముకూడ కారణముగా నుండును.

నైషధకర్త శ్రీహర్షుఁడు పంద్రెండవశతాబ్దమందును, గోవిందశక్కురకనిష్ఠభ్రాత శ్రీహర్షుఁడు పదునేనవ శతాబ్దమందును జనించిరి.

పైకారణములనుబట్టి విల్సన్ విద్యాధికారి యీరూపకత్రయంబునకును గర్తయైన శ్రీహర్షుని పైనిం జూపిన శ్రీహర్షులకంటె నన్యునిగా నిర్ణయించెను.

కావునఁ దక్కిన శ్రీహర్ష నామధేయులపైని నీరూపకత్రయ నిర్మాణభారము మోపుట కలవి గానందునఁ గాన్యకుబ్జాధీశ్వరుండును, బాణమయూరాది కవులచే సేవ్యుండును, విద్వత్పక్షపాతియును, స్వయం వేత్తయునైన శ్రీహర్షమహారాజు పైని నిట్టి రచనాకర్తృత్వంబారోపింపక తప్పదని గ్రహింపవలయును.

IV. ఈకవి బౌద్ధమతాభిమానియా లేక మహేశ్వరభక్తుఁడా యనిన నాల్గవప్రశ్నమునకు సమాధానము.

(1) క్రీస్తుసంవత్సరముల యేడవశతంబు ప్రారంభభాగంబునందు చీనాదేశస్థుండైన హ్యూన్‌త్సాంగు భారతవర్షమును జూడ వచ్చినపుడు ఈ శ్రీహర్షవర్ధనుఁడు బౌద్ధమతమందభిమానము గలవాఁడైనను దక్కిన సిద్ధాంతములయందు ద్వేషబుద్ధి లేనివాఁడనియును, బ్రాహ్మణులను, బౌద్ధులను సమదృష్టితోనే గౌరవించువాఁడనియును తన దేశసంచారచరిత్రయందు వ్రాసెను. బౌద్ధమతాభిమాని గనుకనే యితండు నాగానందనాటకమందు భూతదయాముఖ్యమును (బౌద్ధమతస్థులకు ప్రధానమతధర్మము) ప్రధానముగా వర్ణించెనని మఱికొందఱు చెప్పుచున్నారు.

(2) మాదృష్టికి నితండు బౌద్ధమతాభిమాని యైనట్లు తలంచుటకయే కారణము గానిపింపకున్నది. బౌద్ధమతప్రియుండై యుండెనేని యితండు రూపకంబుల మొదలను శివశక్తిస్తుతులతో నాందీశ్లోకముల నెట్లు రచించెడివాఁడయ్యెను? చీనాయాత్రికుఁడైన హ్యూన్‌త్సాంగు ఇతనికి నన్యమతస్థులయందు ద్వేషము లేకపోవుటను జూచి యట్లు భ్రమపడియుండును. పూర్వకాలమందు అశోకచక్రవర్తి తమతమ మతములయందు నభిమానవంతుఁడని వివిధమతముల వారిచేతను భావింపఁబడినట్లు వినుచున్నారము గదా! క్రీస్తుయొక్క యేడవశతాబ్దమందు బౌద్ధమతము మడుగంటించుటకుఁ బ్రయత్నించిన రాజులే యుండిరి. హ్యూన్‌త్సాంగ్ గనువాఁడే తనసంచారచరిత్రయందు నట్టి కాలంబున మిహిరకులుం డనురాజు బౌద్ధమత నిర్మూలనంబునకుఁ బ్రయత్నించెనని చెప్పుచున్నాఁడు.

(3) నాగానందనాటకమువలన నితండు బౌద్ధమతావలంబి యనుటకు వీలుపడదు. ఆనాటకమందు భూతదయ ముఖ్యముగా వర్ణింపఁబడినది. "అహింసా పరమో ధర్మః" అనుస్మృతిచేతను, "నహింస్యాత్సర్వాభూతాని" అను శ్రుతిచేతను బ్రాహ్మణులకుంగూడ భూతదయ ముఖ్యమతధర్మమే కాని వేఱొకటి కాదు. యజ్ఞములయందు పశుహింస శాస్త్రప్రామాణ్యంబునఁ బారమార్థిక దృష్టి గలవారికి హింస కాదని తాత్పర్యము. లౌకికదృష్టినే ప్రధానముగా నెంచిన బౌద్ధులకు యజ్ఞపశుమారణంబు సైతము హింసగాఁదోఁచి దూష్యమయ్యె. నాగానంద నాటకంబున సర్పమారణము యజ్ఞములోనిది కానందున బౌద్ధులకుంబోలె బ్రాహ్మణులకుంగూడ నిందితమైనదియగుటచే శోచనీయముగా వర్ణింపఁబడినది. నాగానందనాటకనాందీశ్లోకంబు నందలి బుద్ధదేవస్తుతిని, గ్రంథమధ్యమందున నచ్చటచ్చట బోధిసత్త్వుని మతవాక్యముల యుద్ఘాటనమును, సాధారణముగాఁ జేసికొనిన యంతమాత్రమున నితండు బౌద్ధమతావలంబి యని నిర్ధారణము చేయుట శక్యము గాదు. గ్రంథకర్త యితరమతద్వేషి కానందునను, సర్వమతసామరస్యంబున లోకతంత్ర ప్రవర్తనాచతురుండైనందునను, బుద్ధదేవుఁడు భగవంతుని తొమ్మిదవ యవతారమని యాదిశంకరులే స్తుతించినందునను, తాను మహేశ్వరభక్తుండయ్యును వారింగా స్తుతించి యుండవచ్చును. మఱియు, నాగానందము బృహత్కథను ననుసరించి వ్రాయఁబడినది గాన మూలానుసారముగ బోధిసత్త్వ మతాంశములు వర్ణింపఁబడినవి గాని యామతమం దభినివేశముచేతను గాదని తెలియునది. నాగానందనాటకములోని గౌరీవర్ణనాదికముగూడ మూలానుసారముగానే వ్రాయఁబడినందున మహేశ్వరభక్తుండని చెప్పుటకును నవకాశము లేదని పూర్వపక్షులాక్షేపింతురేని యట్లనవలదు. నాగానందనాటకమును బట్టి యితనిమత మేదియో మనము నిర్ణయింప

శక్యము గాకున్నను దక్కినరూపకములలోని పరమశివాదివర్ణనములవలన నితండు పరమశివభక్తుండని చెప్పుటకు సంశయము లేదు.

V. ఈకవిస్వభావమెట్టిది? యనిన పంచమప్రశ్నమునకు సమాధానము.

(1) బలాధికుండును, వీరాగ్రగణ్యుండును, నతిదయాస్వరూపుండైన శ్రీహర్షవర్ధనుఁడు స్వాభావమునుబట్టి వీరరసమును, కరుణారసమును వర్ణింపఁదలంచినను "శృంగారఏవ మధురః పరమాహ్లాదకో రసః, తన్మయం కావ్యమాశ్రిత్య మాధుర్యం ప్రతితిష్ఠతి; శృంగారీచేత్ కవిః కావ్యే జాతం రసమయం జగత్." అనిన పెద్దలవాక్యంబునంజేసి వీరరసముతో సాంకరింపఁబడినట్టియు, కరుణారసముతోఁ జిత్రితమైనట్టియు శృంగారమును నవలంబించి రెండు నాటికలను, నొకనాటకంబును రచియించెను. ఈ కవి వీరరసము, కరుణారసము స్వాభావికములుగాఁ గలవాఁడు గనుకనే తన రచియించిన రెండు నాటికలయందును చివరను విజయవృత్తాంతమును, నాటకము యొక్క మొదలు మొదలుకొని సమాప్తిపర్యంతము వైరాగ్యమును, భూతదయాధిక్యమును కనుపఱిచెను. కనుక నీకవియొక్క స్వభావము వీరరస భూతదయా రసములు ముఖ్యములుగాఁ గలదని గ్రహింపవలయును.

VI. ఈక్రిందియంశముచేతను నితండు మహేశ్వరభక్తుండని గ్రహింపవలయును, నాటకశాబ్దము చివరనున్నట్లును చెప్పఁబడును

వాస్తవ మిట్లుండఁగా యథార్థమును దెలిసికోలేక కొందఱు నాగానందనాటకము బుద్ధసిద్ధాంతము ప్రధానముగా నెంచుకొని వ్రాయఁబడినదని యభిమానించుచు దూరాలోచనము విడిచి నాగానంద నాటకమునకును, రత్నావళికిని నొకఁడే గ్రంథకర్త కాఁడని నిర్ణయించిరి. ఈ శ్రీహర్షవర్ధనుఁడు మహేశ్వరభక్తుఁడయ్యును సౌగతమతాభిమానియైన తనయన్నగారు రాజ్యవర్ధనునికిఁ బ్రీతినిమిత్తము కాని, బౌద్ధమతమందు ద్వేషము లేక తన సమదృష్టి చూపుట నిమిత్తము గాని, రచించినట్లు నాగానందనాటకమును సమన్వయము చేసికొన్నచో నానాటకము బౌద్ధసిద్ధాంత బోధనపరముగా వ్రాయఁబడిన దన్న వారికిని నీకవి బుద్ధమతస్థుండని చెప్పుటకును వలను కాకుండును: కాన రత్నావళీ నాగానందములకుఁ గవి యొక్కఁడు గాఁడని చెప్పఁగూడదు. ఈ సంగతి యతనిచరిత్రము పరిశీలించిన వారికిఁ దెలియఁగలదు. శ్రీహర్షవర్ధనుఁడు పరమశివభక్తుఁడన్నయంశ మితని రాజ్యారంభకాలమందలి శాసనపత్రములవలనంగూడ స్పష్టమగుచున్నది.

ఇంతియె కాక శ్రీహర్షచరిత్రములోఁ బరమశివభక్తుండైన భాస్కరవర్మ యితనికిఁ బ్రియమిత్రుఁడని స్పష్టముగాఁ జెప్పఁబడ్డది. నిజముగా శ్రీహర్షుఁడు బౌద్ధమతావలంబియే యయ్యెనేని తనకు నితరమతములయందు నెంతె సమరసబుద్ధియున్నను, పరమశివభక్తుఁడు తనకుఁ బ్రియమిత్రుఁడై యుండుట మిక్కిలి దుర్లభమైన యంశము. కనుక సర్వవిధంబులను నాలోచింపఁగాఁ బరమాదిత్యభక్తుండగు ప్రభాకరవర్ధనుని పుత్రుండును, పరమసౌగతుండగు రాజ్యవర్ధనుని కనిష్ఠభ్రాతయును, బాణమయూరాది కవులకు పోషకుండును, బరమశివభక్తుండును, మతాంతరద్వేషి కానివాఁడును నైన యీ శ్రీహర్షుండు క్రీస్తు షష్ఠశతాబ్దముయొక్క చివరభాగంబునందుఁ గన్యాకుబ్జదేశంబున జనించి చిరకాలము రాజ్యము చేసి గ్రంథత్రయము లిఖించెనని స్పష్టమగుచున్నది.

VII. ఈక్రింద వ్రాసినరీతిగా నొకప్రవాదము కలదు—ఈ గ్రంథత్రయమును శ్రీహర్ష రచితములా? కాదా? అనిన యంశము స్థిరపఱచుట.

(1) ధావకుఁ డనునట్టి కవి యీ గ్రంథత్రయమును రచించి ధనాశతో శ్రీహర్షవర్ధనునకు నమ్మివేసినవాఁడని లోకులు చెప్పుదురు. కనుకనే కావ్యప్రకాశవ్యాఖ్యాతయు మమ్మటభట్టును "శ్లో. కావ్యం యశసేఽర్థకృతే" అను శ్లోకంబున "కాళిదాసాదేరివ యశః"—కాళిదాసు యశస్సునకే కావ్యము రచియించినట్టుదాహరణముగాఁ జూపెను. "శ్రీహర్షాదేర్ధావకాదీనామివ ధనం"—శ్రీహర్షాదులవలన ధావకకవి మొదలైనవారు రత్నావళీ నాటికను రచించి ధనసంగ్రహణము చేసినట్టుగా దృష్టాం

తముగాఁ జూపెను. కావ్యప్రదీప ప్రభాకారుఁడును నిట్టే యభిప్రాయ పడియెను.

(2) డాక్టరు హాల్విద్యాధికారి తాను సంపాదించిన యొక కావ్యప్రకాశిక పుస్తకమందు "శ్రీహర్షాదేర్బాణాదీనామివధనమ్"—శ్రీహర్షాదుల వలన బాణకవి ప్రభృతులు ధనసంగ్రహణమునకై రచించినట్టు దృష్టాంతముగాఁ జెప్పఁబడిరియని తాను జూచినరీతిని వ్రాయుచున్నాఁడు. ఇంతియ కాక బాణకవిచేత రచియింపఁబడెనని నిర్వివాదముగా నొప్పుకొనఁదగిన హర్షచరిత్రమందలి పద్యమే రత్నావళీ నాటకమందును గనఁబడినదనియు డాక్టరు హాల్విద్యాధికారియే వ్రాసెను.

(3) కవల్విద్యాధికారి రత్నావళీ నాటకమును బాణకవియే రచియించెననిన యంశమును నామోదించుచు నాగానందమునకు మాత్రము గ్రంథకర్త వేఱొకండని యభిప్రాయపడెను.

(4) రమేశదత్తవర్యుండును రత్నావళీ నాటకము బాణకవి కృతియేయని యంగీకరించెను.

(5) మెగ్డానలు విద్వాంసుఁడును పార్వతీపరిణయ నాటకంబును రచించిన యట్టి బాణకవియే యీగ్రంథంబుల రచించెనని తన యాశయంబును వెల్లడించెను.

(6) దుర్గాప్రసాదవిద్వాంసుఁడు బాణభట్టు తన ప్రభువైన శ్రీహర్షుఁడు స్వకృతి(రత్నావళీ నాటకమును) రచియించునట్టుగా ప్రకటించెనన్న యంశము కాశ్మీరదేశస్థులు చెప్పుదురనియు, "శ్రీహర్షాదేర్బాణాదీనామివధనమ్" అని ఆదేశస్థులు పఠింతురనియు, నన్యదేశమందలి పుస్తకంబులకంటెఁ గాశ్మీరదేశస్థుల పుస్తకమునందుఁ గొంచెము ప్రామాణ్య మంగీకరింపక తీరదనియు (కావ్యప్రకాశికకర్తయైన రాజానకమమ్మటుఁడు కాశ్మీరదేశస్థుండౌటచేతను) తన యభిప్రాయమును బ్రకటించుచున్నాఁడు.

VIII. రూపకత్రయమును శ్రీహర్షుఁడే రచించెను గాని ధావక బాణకవులు రచింపలేదను సంగతికి కారణములు.

(1) డాక్టరు హాల్ విద్వాంసుఁడు ప్రమాణముగాఁ దీసికొనిన యాయొక్క పుస్తకమందే బాణుఁడు రత్నావళీ నాటికను రచించెననిన యంశము కనఁబడుచున్నది. దుర్గాప్రసాద పండితుఁడును నొకవేళ హాల్విద్వాంసుని యభిప్రాయము ననుసరించిగాని, లేక యతని పుస్తకమును జూచిగాని తానుగూడ నట్టియభిప్రాయమును బొందియుండ వచ్చును. కావ్యప్రకాశ పుస్తకము లెన్నియో చూచినాము గాని హాల్విద్వాంసుని పుస్తకమందున్నరీతి యేపుస్తకమందును గానరాదు. ఒకవేళ కాశ్మీరదేశస్థుల పుస్తకములు కొన్నిటిలో బాణుఁడు ధనాశచేతనచేసిన రత్నావళీగ్రంథమును శ్రీహర్షకృతిగా వ్రాసినట్టి విధము కనఁబడినను నంతమాత్రముచేతను నావ్రాఁత విశ్వసింపఁదగినది కాదు. నిగుడంగప్పిన నిష్పూనలె నండి కీర్తికై ప్రయత్నింపని యే బుద్ధిమంతుఁడైనను నొక మంచిగ్రంథము రచించెనేని యాగ్రంథ మతఁడు సేసినట్టునమ్మక ధారదనాభారమును వేఱొక ప్రసిద్ధకవి శిరముపైని మోపుట లోకములో నాడుకగా నున్న సంగతియే గదా! ఈ కారణమును బట్టియే మెగ్డానలు రమేశదత్తులు శ్రీహర్షకృతిని బాణునికృతిగా మార్చియుందురు. బాణకృత శ్రీహర్షచరిత్రములోని పద్యమే రత్నావళీ నాటికయందును గనఁబడుచున్నదని చెప్పుచున్న హాల్విద్వాంసుని వాక్యముగూడ నాకంతసలక్షణముగాఁ గానిపింపదు. ఏలయనఁగా వివరింపుదు—

శ్రీహర్ష చరితమందు "ద్వీపోపగీతగుణమపి....." ఇట్టిరీతినిపద్యము వ్రాయఁబడియున్నది. రత్నావళీ నాటికయందన్ననో, "ద్వీపాదన్యస్మాత్......." ఈవిధముగాఁ గనఁబడుచున్నది. ఈపద్యములలో ద్వీప శబ్దముతో పద్య మారంభించుట మాత్రమే యొక్కటి గాక తక్కిన శబ్దస్వరూపఘటనను బట్టిగాని, యర్థఘటనను బట్టిగాని యెంతమాత్రమును రెండుపద్యములకుఁ బోలిక యైనను గానరాకున్నది.

హాల్విద్వాంసుఁడైనను, లేక తన్మతావలంబులగు రమేశదత్తాదులైనను రత్నావళివలనం గాని, హర్షచరిత వలనం గాని తగినంతకారణ మెత్తి చూపుచు రత్నావళి బాణకృతి యనిన యంశమును ధ్రువపఱుపఁజాలకున్నారు.

చీనాయాత్రికుఁడైన హ్యూయన్ త్సాంగు పెక్కురు కవులను, పండితులను శ్రీహర్షుఁడు పోషించుచున్నట్టులు తనయాత్రాచరిత్రయందు వ్రాయుచున్నాఁడు. సంఖ్యకు మీఱిన పండితులు శ్రీహర్షునియొద్ద నంకుటం జేసి వారిలో నొకండైన బాణకవియే రత్నావళ్యాది నాటికలను రచియించి విక్రయించి తనప్రభుకృతులుగా ప్రకటించుట యుక్తియుక్తముగానే యున్నదనియు, నిట్టి యర్థమును వివరించు వాక్య మొకానొక పుస్తకమందును జూచి హాల్ప్రాంసుఁడు లోనైనవారుకూడ నట్టి గ్రంథములను బాణకృతులుగా నూహించుటయు సరసముగానే యున్నదనియు నెవ్వరైనను సకాఁడించులేని యవధానముతో వినుండు. ఈ గ్రంథములను ధావకకవియే రచించి శ్రీహర్షకృతులుగాఁ బ్రకటించెనని మమ్మట భట్టారకులు వ్రాసినట్టుగా కొన్ని పుస్తకంబులఁ గనఁబడుచున్నందున వానిని విశ్వసించి ధావకకవియే యీగ్రంథములకుఁ గర్తయని యేల వచింపఁగూడదు? హ్యూయన్ త్సాంగు తన యాత్రాప్రబంధమందు శ్రీహర్షునియొద్దను ధావకకవి యున్నట్టులు లిఖింపనందున నతండు కర్తయగుట యసంగత మందురేని, యట్లైనచో నతండు యాత్రాప్రబంధమందు బాణనామధేయమును సహితము దుద్ఘాటింపనందున బాణకృతియని వాదించువారికిని స్వవచనవ్యాఘాతంబే సమకూరును.

(2) ఇంతియ కాక హర్షచరితంబును పరికించి చూడఁగా బాణుఁ డాగర్భశ్రీమంతుఁ డైనట్టులు కనఁబడుచున్నది గాని దారిద్ర్యమునఁ దనకృతుల నితరులకు విక్రయించునంతటి దుర్దశపట్టినవాఁడుగాఁ గానిపించఁడు. మఱియు రత్నావళీ ప్రియదర్శికలు రెండును మాలవికాగ్నిమిత్రంబునకుఁ బ్రతిబింబంబులే కాని వేఱొకటి కాదు. "సంతిశ్వాన ఇవాసంఖ్యా" ఇత్యాదివచనంబులచేఁ బరగ్రంథార్థ చోరులైన కవులను నెత్తి పొడుచునట్టి బాణుఁడే కాళిదాసకృత మాళవికాగ్నిమిత్రరూపకార్థంబును నపహరించి రెండు నాటికలను రచియించినాఁడనుటకంటెఁ బరిహాసాస్పదమైనయంశము వేఱొండు గానరాదు. పోనిండు. తమరు చెప్పిన చొప్పున నొక వేళ బాణుఁడే యీగ్రంథంబులను విక్రయించెఁ గాక! అతం డింతకంటె రసవత్తరములైన కాదంబరీ హర్షచరితల నేల విక్రయింప లేదో యుత్తరమిండు.

కావునఁ గొన్ని పుస్తకంబులలోని పాఠంబులంబట్టి ధావకకవి రచించినాఁడని కాని, మఱికొన్ని పొత్తంబులలోని పాఠభేదమూలంజేసి బాణకవి యీగ్రంథములను రచించినాఁడని కాని చెప్పుట యసందర్భము. రెండు విధములగా నున్నది సత్యము కానేరదు. కావున సుందోపసుందన్యాయమున రెండువాదంబులును బ్రతిహతంబు లగును. ఇంతియ కాక ప్రస్తావనయందు (1) ప్రియదర్శికయు (2) రత్నావళియు (3) నాగానందము ననునట్టి మూడురూపకములును శ్రీహర్షకృతు లైనట్టులు స్పష్టమగుచుండఁగా పైనిం జెప్పిన గ్రంథములలో నొకరత్నావళీ నాటికమాత్రమే ధావకకృతియనియు శ్రీహర్షునకు విక్రయింపబడ్డది యనియుఁ జెప్పినకావ్యప్రకాశవ్యాఖ్యాతల యసందర్భవాక్యము లెట్లు విశ్వసింపఁదగియుండును? రత్నావళి కాక తక్కిన రెండురూపకంబులను రచింపఁజాలిన శ్రీహర్షుఁడు కావ్యప్రకాశవ్యాఖ్యాతలమతమందది మాత్రము (రత్నావళి) ఏలరచింపఁగా నసమర్థుఁ డగును? కాని ప్రస్తావనయందు ప్రస్తుతింపఁబడిన రూపకత్రయ నిర్మాణాంశంబునకు విపరీతముగా నూహించుట సాహసమూలకంబని మా తాత్పర్యము. పూర్వకాలమందు రామాభ్యుదయ కర్తయైన (1) యశోవర్మ (2) భోజరాజు (3) శూద్రకమహారాజు మొదలైనవారెందఱో రాజులు భారతవర్షమందు మహాకవులై యుండుట వింత కాదు కాన శ్రీహర్షుండును మహాకవి యనుటకు సంశయింపవలదు.

IX. (1) ఈప్రియదర్శికా నాటికయందలి కథ పురాణేతిహాస మూలకము గాదు. బృహత్కథ ననుసరించుచుఁ గొన్నిమార్పులతో నిండియున్నది. బృహత్కథయందు "బంధుమతి" అనిన యామెయే ప్రియదర్శిక యనిన నామాంతర మిడఁబడినది. (2) ఉజ్జయినీపతియైన చండమహాసేన మహారాజు తనకుఁ బుత్రజననమందు నింద్రోత్సవము సలుపఁగా నింద్రుండు సంతసించి పుత్రికారత్నము గలుగునట్టుల ప్రసాదించెను గాన వాసవదత్తయను నామంబు గలిగెను.

X. (1) మహారాష్ట్రయైన వాసవదత్తను నామె యున్నతస్థానంబునకుఁ దగిన యుదారస్వభావముతో నున్నదానినిగా నీకవి వర్ణింపలేదు. ఆమెపట్టమహిషిత్వమునకు నర్హత సహితము లేఁబడినది. ఆమెయందు (1) గాంభీర్యము (2) సాధుతనంబు (3) లోకోపకారబుద్ధి మొదలైన సుగుణంబులు కనఁబడవు సరిగదా, మితిమీఱిన యైశ్వర్యగౌరవగర్వంబును, మాటిమాటికిఁ గోపప్రాబల్యమును, దీర్ఘరోషము లోనైన వ్యతిరేకగుణంబులు కూడఁ గానవచ్చును. లోకులు నిలుపరాను తమ్ము చేసుకొందురో యని జడిసి వహించుటయే యామెకు గుణముగాఁ జూపఁబడినది. నాటికాంతమునందు ప్రియదర్శిక తనభగినియని తెలిసి వత్సరాజునకు భార్యగా వాసవదత్త యంగీకరించెనని వర్ణింపఁబడినది. పోనీ సంబంధము తనకు గోచరింపనిచో వట్టి యుదారస్వభావ మామెయందు నెంతమాత్రము లేదనియే స్పష్టమగుచున్నది.

(2) ప్రియదర్శికమీఁది పరమానురాగం బొకటి నగాగ్రంబునకు నాయకుని మెట్లుపరుసను క్రమక్రమముగా రాఁజేయక ద్వితీయాంకమందు నొక్కుమ్మడిగా చూచిన వెంటనే మోహసముద్రములో మునింగినటులు వర్ణించుట యితర నాటకములలోని వర్ణనకు వ్యతిరేకమై యన్యాయముగాఁ దోఁచక మానదని మా తాత్పర్యము. ప్రియదర్శికకు వివాహమునకు నీడు గాని కన్యాత్వావస్థ మొదల్కొని యామెకు వివాహమునకుఁ దగిన యవస్థవఱకును వర్ణింపఁబడినందున నీనాటిక చరిత్ర ప్రథమాంబులో లోకచర్యగా జరుగుటకు నైదాఱువత్సరంబులు పట్టినదని యూహింపవలయును.

శివరాత్రిప్రభ

కవికొండల వేంకటరావుగారు

[గీతిక]

౧

కాలకంఠుని నాగసర్పము
    కుబుస మూడ్చి పడగ బున్నంది,
రెండు నాల్కలు ... ...
గండు మీసాలట్లు దూసింది,
చెవులు మూసింది; ... ...
"నాగసార" మూదేది యెవరోయి?
రాగ మొలికించేది యెవరోయి?
కాటు నల్లని కాళరాత్రి.

౨

నొసట గొనరిన మూఁడోకన్ను
నివురు లూదిన కొలిమి సెగడి
సెగడి చిప్పింది, ...
పొగలు గప్పింది; ... ...
కమ్మరయితే యినుము కరగ,
సోమరయితే చలిని కాగ,
నెవరు వచ్చేరోయి?

ఎవరు మెచ్చేరోయి?
కాఱు నల్లని కాళరాత్రి.

౩

అర్ధ భాగపు మహాంకాళీ
కర్థ మది కాలేదో? ... ...
ఏమో? ... ...
పునుకులా గలగలలు వింటూ
కునుకు గన్నాదో? ... ...
నాథునీ వద్దనదు నాట్యము,
నాదు నీ కద్దనదు: ... ...
అరరే! ఆడిపోతున్నాయి.

వాడి ముమ్మొన వాలు, ...
హుతభుక్, ...
అజకపాలం, ...
ఢాక్కా డుబుడక్, ...
నాల్గు సేతుల నాడు లౌతున్నాయి:
అశ్శరరభ! శరభ! ... ...
పందెమూ వేసేది యెవరోయి?
కుందనము గాసేది యెవరోయి?
కాఱునల్లని కాళరాత్రి.

౪

చంద్ర మకుటము, ...
జటాజూటము, ...
సాంద్రనీలపుఁ జడలపాఁట
సురిగిపోతున్నాయి,
చక్కనీ మువ్వన్నె చర్మము
అక్కళించిన పొట్టపైని
అంటియుండీ అంటకున్నాదోయి,
ఆకలా అని యనే దెవరు?
సోకులా అని కనే దెవరు?
కాఱునల్లని కాళరాత్రి.

౫

మోకరింపులు గావు:
అది మఱి ... ...
బూకరింపుల నిలువు గాదు:
అకడకుఁ బడు నొక్కయంజ
యీకడకుఁ బడు నొక్కయంజ
ఏకముగఁ జేయుచును
నడు మొక ... ...
రేఖగాఁ దా వంగిగొంచు:
సందియం లే కెంచువా రెవరు?
చిందు-అని తోఁతెంచు వా రెవరు?
కాఱునల్లని కాళరాత్రి.

౬

అహంకారము లేదు లోలో
మహర్ణటనము మొగము చాటదు,
మహాదేవా! యుభయ మిడు మన
అభినయానకు హస్తమే లేమా!
రభసమునఁ దనముందు వెనుకల
ప్రభల గలిపించు:
ప్రభలలో ప్రభ నిలుప నెవరోయి?
ప్రభలలో ప్రభ గలుప నెవరోయి?
కాఱునల్లని కాళరాత్రి.



శ్రీ ఆర్. కె. సిధ్వాగారు
స్వాగతసమితి కార్యదర్శి



శ్రీ సేఠ్ లాల్ పనచందుగారు
స్వాగతసమితి కోశాధికారి



శ్రీ కుమారి పార్వతి టి. గిద్వానిగారు
శ్రీ స్వాగతసమితి కార్యదర్శిని



శ్రీ శాంతిదాసు ఇదన్మాల్ గారు
శాంతిసైనిక దళాధిపతి

స్వాగతసమితి ఉపాధ్యక్షులు



శ్రీ లాలా యశ్వంతరాయి చురమనిగారు



శ్రీమతి కికిబెన్ చబ్లాను లాల్వానిగారు



శ్రీ స్వామి గోవిందానందుగారు

మయూర మహాకవి

ప్రమోదూత సంవత్స రాశ్వయుజమాస భారతియందు శ్రీయుతులు ఆకుండి వెంకట శాస్త్రిగారు 'మయూర మహాకవి' యను పేర నొక వ్యాసమును ప్రకటించిరి. అందు సూర్య శతక కర్త యగు మయూర మహాకవి రచియించినట్లు పేర్కొనబడిన మయూరాష్ట కము గలదు. దానిని జదువ సమన్వయము కుదురమి నయ్యది నిర్దుష్టముగా దేమో యను సంశయము పొడమెను. దానికి మాతృకయగు 'మయూరుని సంస్కృత కావ్యములు* అను పుస్తకమును బరిశీలింప మూలము దోషజుష్ట మగుట తెల్లమయ్యెను. ఆంగ్లలిపినున్న మూల మాంధ్రలిపిని సరిగా నుండకుండెను. యథా మాతృకమగు మూలము సైతము సుసంబద్ధ ముగ గానిపింపమి సూర్యశతకకర్తయే యీ యష్టకమునురచియించెనన వలనుగాకున్నది.† యథామాతృకమగు మూలము†—

౧. ఏషా కా ప్రస్తుతాంగీ
ప్రచలితనయనా హంసలీలా వ్రజంతీ
ద్వౌ హస్తౌ కుంకుమార్ద్రౌ
కనకవిరచితా..........,
......ఊం (గామ్)......గే గతాసా
బహుకుసుమయుతా బద్ధవీణా హసంతీ
తాంబూలం వామహస్తే
మదనవశగతా గుహ్యశాలాం ప్రవిష్టా.

౨. ఏషా కా భుక్తముక్తా
ప్రచలితనయనా స్వేదలగ్నాంగవస్త్రా
ప్రత్యూషే. యాతి బాలా
మృగ ఇవ చకితా సర్వత శ్శంకయంతీ,
కే నేదం వక్త్రపద్మం
స్ఫురదధరరసం షట్పదేనేవ పీతం
స్వర్గః కేనాఽద్య భుక్తో
హరనయనహతో మన్మథః కస్యతుష్టః.

3. ఏషా కా స్తనపీనభార కఠినా,
మధ్యే దరిద్రావతీ
విభ్రాంతా హరిణీ విలోలనయనా
సంత్రస్తయూథోద్గతా,
అంతః స్వేదగజేంద్రగండ గళితా
సంలీలయా గచ్ఛతీ

---

* 'మయూరుని సంస్కృత కావ్యములు' అను గ్రంథమును రచియించిన క్వాకెన్ బోసు దొరగారు ఈ యష్టకమును, సూర్యశతకమును మయూరుడే రచియించెననియు, అందును నీయష్టకమే సూర్యశతకరచనమునకు గారణమనియును తలచుట కనుకూలములగు, ప్రతికూలములగు గాథలను, ఇతర ప్రమాణములను చెక్కించెని పేర్కొని, యీ రెండును నేకకర్తృకములు గావని నిశ్చయించుటకు ఇంకను ప్రబలములగు ప్రమాణములు లభించువరకు వీని నేకకర్తృకములుగనే భావింపదగు నని నిశ్చయించియున్నారు.

† "గృహలక్ష్మి" మూడవసంపుటపు టెనిమిదవసంచికయందు పండిత శ్రీ వేదుల సూర్యనారాయణశాస్త్రి గారు 'మయూరమహాకవి' అను పేరున నొకవ్యాసమును ప్రకటించియున్నారు. అందును నీయష్టకము గలదు. అది దోషజుష్ట మగుటయే కాక, పాఠములతో గూడ నున్నది. అది వారి కెచట లభించెనో!

8. 4- 6 [illegible]

దృష్ట్వా రూప మిదం ప్రియాంగ గహనం
వృద్ధోఽపి కామాయతే.

౪. వామేనాఽఽవేష్టయంతీ
ప్రవిరళకుసుమం కేశభారం కరేణ
ప్రభ్రష్టం చోత్తరీయం
రతిపతిగుణాం మేఖలాం దక్షిణేన,
తాంబూలం చోద్వహంతీ
వికసితవదనా ముక్తకేశా నరాగా
నిష్క్రాంతా గుహ్యదేశా
న్మదనవశగతా మారుతం ప్రార్థయంతీ.

౫. ఏషా కా నవయౌవనా శశిముఖీ
కాంతాఽఽపథిగచ్ఛతి
నిద్రావ్యాకులితా విఘూర్ణనయనా
సంపక్వబింబాధరా,
కేశైర్వ్యాకులితా నఖైర్విదళితా
దంతైశ్చ ఖండీకృతా
కేనేదం రతిరాక్షసేన రమితా
శార్దూలవిక్రీడితా.

౬. ఏషా కా పరిపూర్ణచంద్రవదనా
గౌరీమృగాక్షోభిణీ
లీలామత్తగజేంద్ర హంసగమనా
... ...
నిశ్వాసాధరగంధశీతలముఖీ
వాచా మృదూల్లాసినీ
న శ్లాఘ్యః పురుషః స జీవతి నరో
యస్య ప్రియా హీదృశీ.

౭. ఏ షా కా జఘనస్థలీ సులలితా
ప్రోన్మత్తకామాధికా
భ్రూభంగం కుటిలం త్వనంగధనుషః
ప్రఖ్యం ప్రభా చంద్రవత్,
రాకాచంద్రకపోలపంకజ ముఖీ
క్షామోదరీ సుందరీ
వీణీదండ మిదం విభాతి తులితం
వేలద్భుజం గచ్ఛతి.

౮. ఏషా కా రతిహావభావ విలస
చ్చంద్రాననం బిభ్రతీ
గాత్రం చంపకదామ గౌరసదృశం
పీనస్తనాలంబితా,
పద్భ్యాం సంచరతి ప్రగల్భహారిణీ
సంలీలయా స్వేచ్ఛయా
కిం స్వైషా గగనాంగనా భువితలే
సంపాదితా బ్రహ్మణా.

వ్యాసమున నుదాహృతము లయిన యొండు రెండితర శ్లోకములు నిట్లున్నవి:

శ్లో. దర్పం కవిభుజంగానామ్
గతా శ్రవణ గోచరమ్,
విషవిద్యేవ మాయూరీ
మాయూరీ వాఙ్ నికృతంతి.

శ్లో. భక్తమాయూరవక్త్రాబ్జ
పదవిన్యాసశాలినీ,
నర్తకీవ సరీనర్తి
సభామధ్యే సరస్వతీ.

శ్లో. ఏణీదృశః పాణిపుటే నిరుద్ధా
వేణి ర్వ్యరేజే శయనోత్థితాయాః,
సరోజకోశాదివ నిస్సరంతీ
శ్రేణీ ఘనీభూయ మధువ్రతానాం.

(శ్రీ) శాస్త్రిగా రించుక జాగరూకత వహించియుండిన నిపుడీచర్విత చర్వణ మనావశ్యకమయి యుండెడిది.

—'భారతి' పాఠకుడు.

మోహిని

మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు

ప్రకృతి సౌందర్యంబుఁ బరికించువేళఁ
బురుషుని మహిమంబు నరసెడువేళ
వివిధంబులై తోఁచుఁ బ్రేమ తత్త్వంబు;
తల్లియై, పడఁతియై, తనయయై యొప్పి
భువనమోహనమైన మూర్తి ధరించి,
ప్రకృతి యానందంబు పరఁగించుచుండఁ,
గొడుకయి, మగఁడయి, వడిఁ దండ్రి యౌచుఁ
బురుషుఁ డానందంబుఁ బొందుచు నుండు;
ప్రకృతి పూరుషు లైక్య భావంబు నొంది
యద్వైతమైన బ్రహ్మానందమందు
మునుఁగుచుఁ దేలుచు మునుఁగుచున్నప్పా
డానంద మిమ్మాడ్కి ననుభవింపంగఁ
గోటి జన్మము లెత్తఁ గోరుచునుండు;
అనుభవించినవాఁడె సాక్షి దీనికిని.

శ్రీసర్వ మంగలాకృతిఁ బొల్చుచుండి
యార్యాభిధేయ భవ్యయశంబు నొంది,
తగునపర్ణత్వంబు తఱిగిపోకుండ
నన్నపూర్ణ ఖ్యాతి నతిశయం బంది
యర్థి సతీత్వ మనర్ఘమై యొప్పఁ
దన్నుఁ గొల్చుచునున్న తనయున్న మిన్నఁ
బ్రోవంగఁ దలఁ పొంది ప్రోడ మీఱంగఁ
దనువునఁ సను విచ్చి తని వొందఁ జేసి,
మనసున మనసిచ్చి మనియుండఁ జేసి,
యాత్మ నాత్మ యొసంగి యలరారఁ జేసి,
తనశివాభిఖ్యాతి ధన్యమౌనట్లు
బుధ గురు శేఖర భూరియశుండు
సర్వజ్ఞుఁ డైశ్వర్య సహితుండు హితుఁడు
క్షీరంబు శర్కరఁ జేరియున్నట్లు
లేకరూపంబున నింతితోఁ గూడి
యేకమై యొప్పారు నీ దివ్యమహిమ
యెఱిఁగి దేవునిఁ గొల్వ నేర్పడ్డ దినము
శివరాత్రి యనుపేరఁ జెలువొందు దినము
చనుదెంచి నాకు నుత్సాహం బొసంగె.

తనివి తీరఁగ నీశుఁ దలఁచితిఁ గొలువ.

ఈశుఁ గొల్వఁగ నెంచి యిలు వీడిపోయి
యందంబుఁ దిరుగాడి, యల్లన నడచి
యబ్ధిఁ జేరితిని సంధ్యాకాలమునకు
సంజ కెంజాయలు సరసంబులగుచు
నంబుధిలోఁ బ్రతిబింబించు చుండి
యెన్న శక్యము గాని హృత్ప్రీతి నొసఁగె.
అంత నొయ్యొయ్యన నంధకారంబు
వ్యాపింపఁగాఁ జొచ్చె నన్ని తావులను.

ఆకాశపథమున నలరు నీలిమము
నంభోధితలమున నలరు నీలిమము
నంధకారంబున నలరు నీలిమము
మూఁడు త్రోవలయందు ముత్తెఱంగులుగ
నేకమై మనమున కింపు గావించె;

మూఁడు స్త్రోవలయందు మొనసియున్నట్టి
పరమేశ్వరుని మహాభావంబుఁ బోలె
మూఁడు తెఱంగుల మొనసి యున్నట్టి
యంధకారంబున నద్భుతంబైన
జ్యోతిస్స్వరూప మత్యుత్సాహ మొసఁగె.

....

లోకజాలమ్ములు, లోకనాయకులు,
లోకస్థు లడఁగ నలోకమైనట్టి
యంధకారంబున కవ్వలి స్త్రోవ
నాదిత్యకాంతి నేకాకార మగుచు
నలరుదివ్యజ్యోతి యద్భుతం బొసఁగె.

....

....

ఆరభటీవృత్తి నలరుతాండవము
కైశికవృత్తిసంగతుల లాస్యంబు
సంగవిశేషవిద్యలను నృత్యంబు
వివిధరసంబుల వెలయునాట్యంబు
గావించి, కావించి, ఘనత మీఱంగ
నలుదెఱంగుల నృత్తనైపుణిం జూపి
నృత్తానువృత్తమై నెగడుచందమున
మంద్ర మధ్యమ తారమహిమముల్ వెలయ
భావానురూపమై పరఁగురాగంబు
రాగానురూపమై ప్రబలుభావంబు
ప్రకటించి గీతవైభవములం జూపి;
గీతానురూప విఖ్యాతరీతులను
దత్త్వమిత్యాదిశబ్దములఁ గొల్పుచును
రాగభావముల మార్గములందు నిలిపి
లయయుక్తవాద్యలీలలఁ గోరి చూపి;
వాద్యవైభవములవాసి నొప్పారు
నృత్తగీతంబులనిపుణతల్ మెఱయు
తౌర్యత్రికంబు నందంబు మీఱంగఁ
బ్రకటించి భావముల్ రసములు నొకట
వివిధభేదంబుల వివిధరీతులను
వెలయించుచున్నట్టి వీచికాతతుల
క్రీడావిశేషముల్ ప్రీతి గావించె.

....

....

అంధకారములోని యద్భుతంబైన
జ్యోతిస్స్వరూపంపుఁ జోద్యంబునడుమ
వీచికానృత్తంపువిభవంబు నూచి
తన్మయం బయ్యెఁ జిత్తం బంత నాకు.

....

వీచికానృత్తంబు వీక్షించుచుండి
తన్మయం బైన చిత్తంబందు నంత
వింతయానందంబు విలసిల్లుచుండె.

....

అంత, వింతగ మార్పు లందెఁ జిత్తంబు.
లేవు తరంగముల్, లేదు సంద్రంబు,
లే దంధకారంబు, లేదు రావంబు;
కోటిభాస్కరు లొక్కచోటనే కూడి
భాసిల్లురీతి దివ్యజ్యోతి యొప్పె.
ఆజ్యోతిమధ్యంబునం దొక్కకోటి
మన్మథుల్ గుమి గూడి మనియున్నరీతి
సౌందర్యరాశియై జానొందుచున్న
మోహినీరూప మొక్కమోలఁ గన్పట్టె.
కహ్లార కస్తూరికాగంధములకు
భిన్నమై యున్న నెమ్మేనిగంధంబు
పృథ్వీస్వరూపమై ప్రీతి నింపంగ,

జాలుజాలుగఁ బెక్కు లీలలం జూపు
లావణ్యరసము జలం బయి యొప్పఁ
దళుకు తళు క్కని తనివి గావించు
తనుకాంతి తేజోవితానంబు నింప
సరసశీతల మృదుస్పర్శలం గొల్పు
చూపులు వాయుసంశోభలం జూపఁ
గలదు లే దనురీతి నలరుమధ్యంబు
గగనతత్త్వంబును గన్పట్టఁ జేయ,
భూతపంచకమునఁ బొల్పారుచున్న
యంద మంతయు నొక్క యాకార మంది
మూఁడులోకంబులు మోహింపఁ జేయు
నా మోహినీరూప మటు చూచి చూచి,
మోహజాలంబున మునిఁగితి నేను.

మోహినీరూపంబు మ్రోలఁ గన్గొనుచు,
మోహజాలంబున మునిఁగిపోవుచును,
జెదరని బెదరని చిత్తంబుతోడఁ
గదలక మెదలక............
..................యెదుటఁ గూర్చుంటి.

కదలక మెదలక కనుచున్న నన్నుఁ
గదలక మెదలక కనుచుండెఁ గాంత;
కాంత నిశ్చలబుద్ధిఁ గనుచుండె నన్ను
నేను నిశ్చలబుద్ధి నింతిఁ గంచుంటి;
నేను మోహినిని మోహించి కంచుంటి,
మోహినియును నన్ను మోహించి చూచె.

నిశ్చలయై యట్లు నిలుచున్న కాంత
నిశ్చలత్వము మాని నృత్తంబు సలిపె.
... ...
... ...
... ...

నృత్తానువృత్తమై నెగడు చందానఁ
దాళమానములు పాదంబులం గొల్పె;
హస్తనేత్రగ్రీవహారిభేదముల
నభినయ మ్మొనరించి యందంబుఁ గొల్పె;
భావరాగంబుల ప్రౌఢి చెన్నొంద
ననువులు పుట్ట గానంబులు గొల్పె;
భావానుగుణమైన వసిత రాగంబు,
రాగానుగుణమైన రమణీభావంబు,
తాళానుగుణములై తనరారుచుండె.
... ...
భరతశాస్త్రప్రౌఢి పరిఢవిల్లంగ
నృత్త మిమ్మెయి నాచరించుచున్న
భువనమోహనరూపమును గాంచి కాంచి
తన్మయం బయ్యెఁ జిత్తం బంత నాకు.
... ...
భువనమోహినియైన మోహినిం జూచి
మోహించి మోహించి మోహించి యంతఁ
దన్మయంబైన చిత్తము తత్తఱింపఁ
గౌఁగిలింపఁ దలంచి, కాంత చెంతకును
వడివడివడిగాఁగఁ బరువులెత్తితిని.

పరువెత్తి తనవైపు వచ్చు న న్గాంచి
వడివడిఁ గాంతయుఁ బాఱిపోసాగె.

భువనమోహిని ముందు పోవుచునుండ
నింతిని వెన్నాడి యేఁ బోవుచుంటి.

పరువెత్తి పరువెత్తి వచ్చు నన్ జూచి
వడివడిఁ గాంతయుఁ బరువెత్తుచుండె.

అలసియు సొలసియు,నాయాస మొప్ప,
మెల్ల మెల్లఁగ నేను మెలఁగుచునుండ,
మెలమెల్లఁ జెంతనే మెలఁగె నింతియును;

మెల్లమెల్లఁగఁ జెంత మెలఁగుచునున్నఁ
జిక్కి మోహిని చేతఁ జిక్కి నం చెంచి
వడివడి నింతిని బట్టుకోఁబోవ,
వడివడి దవ్వుగాఁ బాఱె నింతియును.

కాంత చెంతకు రాఁగఁ గడు నాశఁ బొంది,
కాంత దవ్వుగఁ బోవఁ గడు వంత నొంది,
యాశయు, వంతయు నట్టిట్టుకొల్ప,
నట్టూఁతయుయ్యాల లూఁగెఁ జిత్తంబు.

మోహినిఁ గనుఁగొని మోహంబు నొంది
మోహంబు విడువ కుత్సాహంబుతోడఁ
బట్టుకోఁ గౌఁగింటఁ బెట్టుకో నెంచి,
పరుగెత్తి పరుగెత్తి పరుగెత్తలేక,
యలసియు సొలసియు నాయాస మొంది,
యాయాసమందు దుఃఖానంద మొంది,
నిట్టూర్పు నిగుడించి, నిలిచి, నిరాశ
ననునయాలాపదీనాస్యుండ నగుచు
నతికరుణంబుగాఁ బ్రార్థించుచుంటి.

అతిదీనమైన నాయాలాప మింతి
యాలించి నాపైని జాలి చూపించె-
జాలితో నింతి నాసరస కేతెంచె
సరస నాకౌఁగిటఁ జనవున నిమిడె.

కాంత కౌఁగిటిలోనఁ గలసియున్నప్పు
డానందవార్ధి మున్గాడుచునుంటి,
నానందరూపుండ నై వెల్గుచుంటి.

...   .

అంతలోఁ గను విచ్చి యరసితి మరల.
మోహినియై నన్ను మోహజాలమున
ముంచిన మోహినీపూర్వరూపంబు
పూర్వరూపము లే కపూర్వమై తోఁచె.

...   .

తనువునఁ దను వుంచి తని వొందునట్లు,
మనసున మన సుంచి మనియుండునట్లు,
ఆత్మైక్యమును బొంది యలరారునట్లు
తలఁ పొంది యాశ నేఁ దన్ను వెన్నాడఁ
గాంత కౌఁగిటఁ జేరి కరుణఁ జూపించి,
యంతలోఁ దనరూప మప్పుడే మార్చె.

...   .

...   .

మోహిని భార్యయై మోహింపఁ జేయ
నేనె భర్త నటన్న మెలుకతో నుంటి.
భార్యచందానఁ గన్పట్టి మోహినియు
భార్యాస్వరూపంబుఁ బాసె తత్క్షణమ.

...   .

ప్రేమ చూపులలోన వెలయుచునుండఁ
జల్లనిచేతులు చాఁపి, కౌఁగింట
ననుఁ జేర్చి, తనివార నన్ను ముద్దాడి
యననుభూతానందమందు నన్ ముంచె.

ప్రేమస్వరూపమై ప్రీతి నింపుచును,
బ్రోలఁ గన్పడుచున్న మోహినిఁ జూచి,
సాష్టాంగముగ నమస్కారమ్ము చేసి,
"అమ్మ నిన్నెన్నాళ్లు కరసితి నమ్మ!
నిన్నుఁ జూడనియొక్క నిముసంబు నాకు
యుగమయి తోఁచు న న్నోమవే తల్లి,
చల్లని నీచేయి చాలు నోయమ్మ
చల్లని నీచూపు చాలునోయమ్మ"
యనుచు నిమ్మెయిఁ బల్కి యమ్మపాదములు
కరములఁ బట్టుచుఁ, గనుల నద్దుచును,
భక్తిభావంబు, విశ్వాసభావంబుఁ

జూపించి, ముదమునఁ బొక్కుచునుండ,
మఱియొక్క రీతిగా మాట నింతియును.

... ...

... ...

ముద్దు గాఱుచునుండె ముద్దునెమ్మోము,
ముద్దు గాఱుచునుండె ముద్దు చూపులును,
ముద్దు గాఱుచునుండె ముద్దు చేతులును,
ముద్దు గాఱుచునుండె ముద్దు పాదములు.

ముద్దుల మూటయై మ్రోల నిల్చున్న
ముద్దుబిడ్డను జూచి ముదమందుచుంటి.

చిన్నారి పొన్నారి చిగురుఁజేతులను
నవ్వుచుఁ గేరుచు నను గౌఁగిలించి,
ముద్దాడుచున్నట్టి ముద్దులబిడ్డఁ
గనుఁగొని, విసియును గవియును దొల్లి
యనుభవింపఁ యపూర్వానందమందు
మునుఁగుచుఁ దేలుచు మునుఁగుచునుంటి,
ముద్దులు గురియుచు మ్రోల నిల్చున్న
ముద్దుబిడ్డను జూచి, ముద్దులాడుచును,
గౌఁగింట నిలుచుచుఁ, గౌఁగిలించుచును,
ననుభూతానందమందు మున్గాడి
యలరారుచున్న స్వప్నమంతంత—వింత—
ఒకమార్పు కనుపట్టె నొక్కసారిగను

... ...

... ...

ఎదుట నొప్పుచునున్న యింతిని జూడఁ
బరిపూర్ణమౌ ప్రేమ పరగె నాయెదను.

కౌఁగింటఁ జేర్చితిఁ గౌఁగిట నుంటి,
ముద్దాడుచుంటిని, ముద్దిడుచుంటి;
గాని,... ... ...
... ... సందేహంబుకలిగె నాయెదను.

మోహంబు గొల్పుచు, మ్రోల నిల్చున్న
యింతి యెవ్వతెయొ, నే నెవ్వాఁడనొక్కొ,
యేర్పఱ్పలేనైతి నించుకంతయును.

ముదుఁజూపులతోడ మురిపెంబు నింపి
కన్నతల్లి యటన్న కరణి నొప్పారెఁ;
ముద్దుఁజూపులతోడ మురిపెంబు నింపి
ప్రాణేశ్వరి యటన్న పగిదిఁ గన్పట్టెఁ;
ముద్దుఁ జూపులతోడ మురిపెంబు నింపి
యనుఁగుబిడ్డ యటన్న హొరువునఁ దనరె.

పడఁతినై, తల్లినై, కడుఁ బ్రీతి నొసఁగి,
తల్లినై, పిల్లనై, తనివోందఁ జేసి,
బిడ్డనై, యింతినై, ప్రియమందఁ జేసి,
వివిధవిధంబుల విలసిల్లుచున్న
ప్రేమస్వరూపంబు ప్రీతి మీఱంగ
ననుభవింపఁగఁ జేసి యానందవార్ధి
నన్ను ముంచుచునుండ, నన్నిరీతులను,
మగఁడనై కొడుకనై మఱి తండ్రి నగుచుఁ,
బరిపరివిధములఁ బరిఢవిల్లంగ
నానందవార్ధి మున్గాడుచునుంటి,
నానందపీయూష మది గ్రోలుచుంటి,
నానందరూపుండనై వెల్గుచుంటి.

... ...

... ...

... ...

ఎంతసే పుంటినో యెఱుఁగ నిమ్మాడ్కి—
ఇంతలో—అక్కటా—యేకతంబుననొ,
చప్పున నొక్కింత చైతన్య మబ్బె—
చైతన్య మబ్బిన సమయంబునందు
గాఢాంధకారంబు క్రప్పె నద్దెసల—
తడిసిన ట్లుండెఁ బాదంబులు రెండు.

కెరట మొక్కటి వెన్క కరుగుచునుండె—
సంపూర్ణ మైనట్టి చైతన్య మబ్బె.

... ...

... ...

ఆకాశపథమున నలరు నీలిమము,
నబ్ధితలంబున నలరునీలిమము,
నంధకారంబున నలరునీలిమము,
మూఁడుత్రోవలఁ గప్పి, మొనసి కన్పట్టె.

తరఁగల నురుఁగులు తళ్కు తళ్కనుచు
నంధకారముఁ జీల్చి యలరారుచుండె.

పాటలఁ బాడుచు, నాట లాడుచును,
గెరటంబు లెదురనే క్రీడించుచుండె.

... ...

... ...

అట్టిచీఁకటివేళ నంబుధిచెంత
నొక్కండ నుండుట కుత్సహింపమిని
బరమేశుఁ దలఁచుచుఁ బరిపూర్ణభక్తి
నింటికి నొక్కండ నే తెంచుచుంటి.

చీఁకటి యంతటం జిక్కనై యుండెఁ,
ద్రోవ కన్పడకుండెఁ ద్రోవుపాటయ్యెఁ;
జిత్త మీశునిపైని జేరియేయుండె.

"హా పరమేశ్వరా, హా కన్నతండ్రీ,
చిత్రంబు నీచర్య, చిత్రంబు తండ్రీ;
ప్రకృతిపూరుషులరూపంబులఁ దాల్చి,
చిత్రవిచిత్రమై చెలువారు చున్న
ప్రేమామృతంబును వివిధరీతులను
సంపూర్ణమైన యుత్సాహంబుతోడ
ననుభవింపఁగఁ జేసి, యానంద మిచ్చి,
నిన్నుఁ సేవింపంగ, నిన్నుఁ గూడంగ,
నిన్నుఁ జేరంగను, నిన్నుఁ బొందంగఁ,
దగురీతులం జూపి తనివొందఁ జేసి,
నను బ్రోచుచున్న నీనవ్యవైభవము
కొనియాడ నేర్తునే కోటివేలైన
జన్మంబు లెత్తఁగా శంక నా కేల?
నీవు నన్నరయని నిముసంబు లేదు,
నీవు నన్ బ్రోవని నిముసంబు లేదు.

వివిధవిధంబులఁ బ్రేమ చూపించి,
నన్నుఁ బ్రోచుచు నీవు ననుఁ జూచుచుండ,
నానందమే కాని యన్యంబు లేదు;—
ఆనందరూపమై యలరు నంతయును."

... ...

... ...

అనుచు నేమేమియో యనుకొంచు, మఱల,
నందియు నందక, యాయాస పెట్టి,
దొరకియు దొరకక, తొందర పెట్టి,
తనుఁ బట్టుకోఁ జూడ, ననుఁ జేరరాక,
ననుఁ బట్టుకో వచ్చి, నా కందరాక,
యలయించి, సొలయించి, యాయాస పెట్టి,
యాయాసమం దొక్క యద్భుతంబైన
యానంద మిచ్చి, నన్నాదరం బొప్పఁ
గనుఁగొన్న మోహిని కన్నులం గట్టి
నట్టులు కన్పట్టిన ట్లున్నకతన,
జరిగిన దంతయు మఱవఁ పోలేక,
మఱిమఱి తలఁచుచు నఱిముఱి గొనుచు,
నల్ల నల్లన నింటి కరుగుదెంచితిని.

... ...

... ...

... ...

ప్రకృతిసౌందర్యంబుఁ బరికించువేళఁ,
బురుషునిమహిమంబు నరసెడువేళ,
వివిధంబులై తోఁచుఁ బ్రేమతత్త్వంబు
ననుభవించినవాఁడు సాక్షి యొక్కండె,

పెలియాజ్-మెలిజాండాలు
(మారిస్ మిాటర్‌లింకునుండి అనువాదము)

దేశరాజు రామదాసు గారు

పాత్రములు

ఆర్కెల్—అల్లిమాండ్ దేశపురాజు.
గెనివీవు—పెలియాజ్, గోలాడులతల్లి.
పెలియాజ్ } ఆర్కెల్ మనుమలు.
గోలాడ్ }
మెలిజాండా.
న్యిహోల్డు—గోలాడ్ మొదటిభార్యవల్ల గలిగినపుత్రుడు.
ఒకవైద్యుడు.
ఒక ద్వారపాలకుడు.
దాసీలు, భిక్షుకులు, మొదలైనవారు.

అంకము ౧.

రంగము ౧.

కోటతలుపు.

దాసీలు—(లోపల)తలుపు తియ్యి! తలుపు తియ్యి!

ద్వారపాలకుడు—(లోపల)ఎవరక్కడ? ఎందుకు వచ్చి నన్ను లేపేరు? పైకి వెళ్లడానికి దార్లులేవు? పోండి కావలసినన్నున్నాయి.

ఒకదాసి—(లోపల) మేము గడప కడగడానికి వచ్చాము. తలుపూ మెట్లు కడగాలి. తలుపు తియ్యి! తలుపు తియ్యి!

మరొకదాసి—(లోపల) ఇంకా చాలా పనులు చెయ్యాలి.

మూడోదాసి—(లోపల) గొప్ప శోభస్కరంగా చెయ్యాలి. వేగం తియ్యి!

అందరూ—తియ్యి. తియ్యి.

ద్వార—ఉండండి. ఉండండి. నేను తలుపు తియ్యడానికి వీలవుతుందో లేదో నాకు తెలియదు... అదెప్పుడు రాత్రి తియ్యడము లేదు...తెల్లవారిందాకా ఉండండి.

మొదటిదాసి—బయట కావలసినంత వెలుగొచ్చింది. కన్నాలగుండా నాకు సూర్యుడు కనబడుతున్నాడు.

ద్వార—ఇవిగో పెద్దతాళాలు......అబ్బబ్బ! తాళాలు ఘడియలు ఎలా అరుస్తున్నాయో. సాయం చెయ్యండి, సాయం చెయ్యండి.

అందరు— మేము లాగుతున్నాము, మేము లాగుతున్నాము.

రెండోదాసి—అది రాదు.

మొదటిదాసి— అదిగో వస్తున్నాది! మెల్లగా వస్తున్నాది.

ద్వార—ఏలాగు అరుస్తున్నాదో! ఇంటందరిని లేపేస్తుంది.

రెండోదాసి—(గుమ్మముకడ కనబడి)

ఓహో! అప్పుడే యివతల ఎంత వెలుగొచ్చిందో!

మొదటిదాసి—సూర్యుడు సముద్రంమీద ఉదయిస్తున్నాడు.

ద్వార—అది వచ్చింది...బాగా తెరవబడింది.
[దాసీలందరు గుమ్మముకడ కనబడి,అది దాటి వెడలుదురు.]

మొదటి దాసి—నేను ద్వారంరాయి కడగడం ప్రారంభిస్తాను.

రెండోదాసి—ఇదంతా మన మెప్పటికీ కడగలేము.

మిగిలిన దాసీలు—నీళ్లు తే, నీళ్లు తే.

ద్వార—అవునవును. నీళ్లు పొయ్యండి, నీళ్లు పొయ్యండి. పారుతున్న నీళ్లన్నీ పోసినా మీరు పూర్తి చెయ్యలేరు......

రంగము ౨.

అడవి.

[ఒక బావివద్ద మెలిజాండా కనబడును. ప్రవేశము గోలాడ్.]

గోలాడ్—ఈ యరణ్యమునుండి నేను మరి బయటకుదారి కనుక్కోలేను. నన్నా జంతువెక్కడికి తీసుకు వచ్చినదో దేవునికే యెరుక. నేను కొట్టినదెబ్బ కది చచ్చిందనుకొన్నాను. ఇదిగో రక్తపుజాడలు. అయినా అది నాకంటికి కనబడలేదు. నేను దారి తప్పిపోయినట్టున్నాను—నాజాగిలములు నన్ను కనుక్కోలేవు. నే నింటికి తిరిగి పోతాను......ఆఁ ఆఁ. ఆనీటిదగ్గ రదేమిటి? ఒక చిన్నపడుచు నీటిదగ్గర యేడుస్తున్నదా?......(ఆతడు దగ్గును.) ఆమె నన్ను వినుపించుకున్నట్టు కనబడదు. నే నామెను చూడలేను. (అతడు మెల్లమెల్లగా దగ్గరకు వచ్చి, మెలిజాండా భుజముపై చేయి వైచి) ఎందు కేడుస్తున్నావు? (మెలిజాండా ఉలుక్కుపడి, పరుగెత్తి పారిపోబోవును.) భయపడకు, నువ్వు భయపడ నక్కరలేదు. నువ్వెందు కొక్కర్తెవే యేడుస్తున్నావు?

మెలిజాండా—నన్ను ముట్టుకోవద్దు, నన్ను ముట్టుకోవద్దు.

గోలాడ్—భయపడవద్దు. నేను నిన్నేమి......ఆహా! నీ వెంత చక్కగా నున్నావు!

మెలిజాండా—నన్ను ముట్టుకోవద్దు. నన్ను ముట్టుకోవద్దు. ముట్టుకుంటే నీట్లో పడిపోతాను.

గోలాడ్—నేను నిన్ను ముట్టుకోలేదు...చూడు. నే నీచెట్టు నానుకొని నిలబడతాను. నువ్వు జడవకూడదు. నిన్నెవరైనా నొప్పించారా?

మెలిజాండా—ఆఁ! అవును. (వెక్కి వెక్కి యేడ్చును.)

గోలాడ్—నిన్ను నొప్పించిన దెవరు?

మెలిజాండా—వాళ్లందరూనూ, వాళ్లందరునూ.

గోలాడ్—నిన్నెలాగు వాళ్లు నొప్పించారు?

మెలిజాండా—నేను చెప్పను. చెప్పలేను.

గోలాడ్—రా! నువ్విలా యేడవ గూడదు. నువ్వెక్కడినుండి వచ్చావు?

మెలిజాండా—నేను పరుగెత్తుకు వచ్చాను. పరుగెత్తుకు వచ్చాను.

గోలాడ్—అవును. ఎక్కడనుండి ఆపరుగెత్తుకు వచ్చినది?

మెలిజాండా—నేను తప్పి యిక్కడకొచ్చి పడ్డాను,....ఇక్కడ దాన్ని కాను...ఇక్కడ పుట్టనూ లేదు.

గోలాడ్—నువ్వెక్కడ నుంచి వస్తున్నావు? ఎక్కడ జన్మించావు?

మెలిజాండా—అయ్యో! అయ్యో! ఇక్కడకు చాలదూరము......చాలా......చాలా....

గోలాడ్—ఆనీటియడుగున మెరుస్తున్న దేమిటి?

మెలిజాండా—ఎక్కడ? ఆఁ, అది అతడిచ్చిన కిరీటము. ఏడుస్తున్నప్పుడు పడిపోయింది......

గోలాడ్—కిరీటమా?—నీకు ఎవరా కిరీటమిచ్చారు?—నే నందుకోడానికి ప్రయత్నిస్తాను.

మెలిజాండా—వద్దు. వద్దు. నాకది అవసరము లేదు. నేను త్వరలో మరణిస్తాను. ఈక్షణమే మరణిస్తాను......

గోలాడ్—నేను సులభంగా పైకి తియ్యగలను. నీ రంత లోతుగా లేదు.

మెలిజాండా—నా కది వద్దు. నీ వది పైకి తీస్తే, దానికి బదులు నేను నీట్లో పడిపోతాను.

గోలాడ్—నేను దాని నక్కడ విడిచిపెట్టేస్తాను. కష్టం లేకుండా అందుకొంది అయినప్పటికీ......అది చక్కని కిరీటంలాగ కనబడుతున్నది.— నువ్వు పరుగెత్తుకు వచ్చి చాలా కాల మైందా?

మెలిజాండా—ఆఁ. అవును. నువ్వెవరు?

గోలాడ్—నేను యువరాజును. నా పేరు గోలాడు. అల్లిమాండీదేశమునకు మహరాజైన ఆర్కేల్ మనుమడను.

మెలిజాండా—అయ్యో! నీజుత్తు అప్పుడే పండి పోతున్నదే.

గొలాడ్—అవును. ఇక్కడ కణతలమీద కొంచెము.

మెలిజాండా—నీగడ్డముకూడాను...నువ్వెందుకు నాకట్లాగు చూస్తున్నావు?

గొలాడ్—నేను నీకళ్లవైపు చూస్తున్నాను. నువ్వెప్పుడు కళ్లు మూసుకోవు?

మెలిజాండా—మూస్తాను, మూస్తాను. రాత్రి నిద్రపోయేటప్పుడు.

గొలాడ్—నువ్వెందుకంత అద్భుతపడి చూస్తున్నావు?

మెలిజాండా—నువ్వు రాక్షసివా?

గొలాడ్—నేను తక్కినమనుష్యులవంటి మనిషిని...

మెలిజాండా—నువ్విక్కడకెందుకొచ్చావు?

గొలాడ్—నాకే తెలియదు. నేను అడవిలో వేటాడుతూవుంటిని. ఒక అడవిపందిని వెంట తరుముతూ వచ్చి దారి తప్పిపోయాను... నువ్వు మిక్కిలి చిన్నదానిలాగ కనిపిస్తున్నావు. నీవయస్సెంత?

మెలిజాండా—నాకు చలి వేస్తున్నది...

గొలాడ్—నువ్వు నాతో వస్తావా?

మెలిజాండా—రాను రాను. నే నిక్కడే ఉంటాను.

గొలాడ్—నువ్వొక్కర్తవే యిక్కడుండలేవు. నువ్వీరాత్రంతా యిక్కడుండలేవు. నీపేరేమిటి?

మెలిజాండా—మెలిజాండా.

గొలాడ్—నువ్వొంటరిగా నుంటే జడుస్తావు. ఇక్కడేముంటాయో యెవ్వరూ చెప్పలేరు. రాత్రంతా ...ఒంటిగా...ఉండడం సాధ్యం కాదు. మెలిజాండా! రా! చెయ్యియ్యి.

మెలిజాండా—అబ్బా! నన్ను ముట్టకు.

గొలాడ్—నువ్వు పై కేడవకూడదు. నేను నిన్ను మరి ముట్టను. నాతో మాత్రము రా. రాత్రి మిక్కిలి చీకటిగాను, మిక్కిలి చలిగాను ఉంటుంది. నాతో రా...

మెలిజాండా—నువ్వేదారిని వెళుతున్నావు?

గొలాడ్—నాకు తెలియదు. నేనూ దారి తప్పిపోయాను.

(నిష్క్రమింతురు.)

రంగము 3.

కోటలో నొక సావడి.

[ఆర్కెల్, గెనివీవులు కనబడుదురు.]

గెనివీవు—వాడు తనతమ్ముడైన పెలియాజ్ పేర వ్రాసిన దిది:—

"ఒకనాటి సాయంసమయమున, ఏడుస్తూ బావి వద్దకూలబడిన యీమెను, అడవిలో నేను దారి తప్పిపోయి చూశాను. నాకామెవయస్సు గాని, ఆమె యెవరో, యెక్కడనుంచి వచ్చినదో గాని తెలియదు. అని ప్రశ్నించ డానికిగూడా నేను సాహసించలేదు. ఎందుకంటే, యేమి జరిగిందని యెప్పుడడిగినా యేడువ నారంభించి చూచిన వారికి భయం వేసేనంత యేడ్చును. నే నామెనద్దకా బావి కడకు వెళ్లేటప్పటికి, ఒక బంగారుకిరీట మామెశిరస్సు నుండిజారి లోతునీటిలోనికి బడిపోయెను. అదిగాక యీమెవస్త్రములు ముళ్లవల్ల పీలికలగా చినిగిపోయినప్పటికీ, ఆమె రాజపుత్రికవలెనే దుస్తులు ధరించినది. నేనామెను వివాహమాడి యీరుమాసము లైనది. మే మిద్దరము మొదట కలసిననాటికంటే నాకు మరేమి తెలియదు. ఈమధ్యన, సోదరా! పెలియాజ్—మన మిద్దరమొక తండ్రికి పుట్టినవారము కాకపోయినను, నాస్వంతతమ్మునికన్న హెచ్చుగా ప్రేమించిననీవు, నారాకకై సన్నాహము చేయుము... నాతల్లి నన్ను క్షమించునని నాకు తెలుసును. కాని రాజైన మనతాతగారికి నేను భయపడతాను, దయామయుడైనప్పటికి ఆర్కెల్ నకు నేను జడుస్తాను. ఏలనందువా యీ విచిత్రపువివాహమువలన నతని రాజకీయ యోజనల కన్నిటికి నంతరాయము కలిగించితిని. ఆ

మేధానిధి మెలిజాండాచక్కదనము చూచియైనను నన్ను క్షమిస్తాడో లేదోయని జడుస్తున్నాను. ఏదెలాగైనను, అతడు తనకుమార్తెంాక కంగీకరించినట్టు, ఆమె స్వాగతాన్నికనుమతించినయెడల, ఈ ఉత్తర మందిన మూడోనాటిసాయంకాలము కోటబురుజుమీద, సముద్రంమీద నుండి కనబడేలాగు ఒక దీపం పెట్టు. నౌకోపరిభాగము నుండి దానిని నేను చూస్తాను. లేకపోతే దూరంగా పోయి మరి తిరిగి రాను." మీరు దీని కేమంటారు ?

ఆర్కెల్—ఏమీ లేదు. వాడు చెయ్యవలసిందే బహుశా వాడు చేశాడు. నేను మిక్కిలి ముసలివాడిని. అయినప్పటికీ ఒక్కక్షణమైనా నాయంతరాత్మను పరిశీలించలేదు. అట్టియెడ పైవారిచర్య లెటు విచారించేది! నేను కాటికి కాళ్లు చాచుకుని కూర్చున్నాను. నేను నామట్టుకే విచారణ చేసుకునేశక్తిలో లేను. ఎవడైన ఆత్మపరీక్ష చేసుకోనియెడల ఎప్పుడూ తప్పుదారిలోనే బడతాడు. వాడు చేసినది మనకు విపరీతంగా కనబడవచ్చును. వాడు వయస్సు ముదిరినవాడు. ఒకబాలిక బావిపద్ద కనబడితే, ఒకబాలుడేమి చేస్తాడో, ఆలాగు వాడు తనమట్టుకానే పెండ్లి చేసుకున్నాడు...ఇది మనకు విపరీతంగానే కనబడవచ్చును; ఏలనంటే మనవిధినియోగము నెరుగము ...ఒక్కొక్కతరి మనము చేసినప్పుడూ అట్లే తప్పుత్రోవనే యనుసరింతుము......వా డెప్పుడు నిదివరకు నాసలహా ననుసరించేవాడు. ఊర్సులరాజకుమార్తె నడుగబంపేటప్పుడు నేను వానిని సౌఖ్యపెట్టాలని తలచేను. వాడు ఒంటరితనమును భరింపలేకపోయెను. తనభార్య మరణించిన నాటినుండియును నొంటరిగా నుండుటకు వాడు విచారించుచుండెను. ఈవివాహము దీర్ఘసంగ్రామములను, పురాతన వైరములను నశింపజేసియుండును...వాడట్లు కోరలేదు. వాడు కోరినట్లే కానీ. విధినియోగమునకు వ్యతిరేకించి నే నెప్పుడూ జోక్యము చేసుకోను. వానికి వానిభావిస్థితి నాకంటే బాగా తెలుసును. బహుశా అకారణకార్యములు జరగడ మన్నది ఉండదు...

గనివీవు—వా డెప్పుడూ తెలివిగా, గంభీరంగా, స్థిరంగా ప్రవర్తించేవాడు...పెలియాజ్ గాని యిలా చేసియుంటే నా కర్థమయ్యేది...కాని వాడు...ఈవయస్సులో......మనమధ్య కొరిని తీసుకురానున్నాడో? దారిప్రక్క దొరికిన ఒక యజ్ఞాతబాలికను...తనభార్య మరణించిననుండి వాడు బ్రతికడం తనకుమారుడైన నియోయాల్డు కొరకే. ఇప్పుడు తిరిగీ వివాహం చేసుకోవాలని యత్నపడడం మీరు కోరినారని...మరి యిప్పుడు...అడవిలో నొకచిన్నపిల్ల...వాడింతామరిచిపోయాడు...మన మేమి చెయ్యడం? [ప్రవేశము పెలియాజ్.]

ఆర్కెల్—అలో పలికి వస్తున్న దెవరు ?

గనివీవు—పెలియాజు. వా డేడుస్తున్నాడు.

ఆర్కెల్—నువ్వా పెలియాజ్ ? వెలుగులో చూస్తాను కొంచెము దగ్గరకు రా......

పెలియాజ్—తాతయ్య! మా నేస్తం మార్సిలస్ దిగ్గరనుండి మరియొక ఉత్తరం వచ్చింది. అతడు చనిపోయేస్థితిలో నున్నాడు. నన్ను రమ్మని వ్రాశాడు. అతడు మరణించే లోపుగా నన్ను చూడాలని కోరుతున్నాడు.

ఆర్కెల్—మీఅన్న రాకముందే నువ్వు వెళ్లిపోగోరుతున్నావా ?—నీ స్నేహితు డనుకున్నంత జబ్బుగా లేడేమో......

పెలియాజ్—ఆ పంక్తులమధ్యను అతని చావు ప్రత్యక్షముగా కనబడుతున్నది. అతని ఉత్తర మంత విచారం కలిగిస్తున్నాది...సరీగా చా వెప్పుడు తప్పక వస్తుందో తనకు తెలుసునని వ్రాస్తున్నాడు. నేను కోరితే అతని మరణమునుండి తప్పించగలనని వ్రాస్తున్నాడు; కాలవిలంబమునకు వ్యవధి లేదు. ప్రయాణము చాల దీర్ఘము. గొలాడ్ రాకకై నిరీక్షిస్తే మిక్కిలి యాలస్యము కావచ్చును...

ఆర్కెల్—అయినప్పటికీ కొంచెమాగడం మంచిది. ప్రస్తుత మింటికి వారిరాక వల్ల నేమి వస్తుందో మనము చెప్పలేము. అది గాక, పైని మీనాన్నగారు బహుశా నీస్నేహితునికంటే గూడ మిక్కిలి అపాయస్థితిలో నున్నారేమో!...నీ తండ్రి, స్నేహితుల మధ్య నెవరు ముఖ్యమో నిర్ణయం చెయ్యగలిగేవా?...

(నిష్క్రమించును.)

గెనివీవు—పెలియాజ్! ఈసాయంత్రము దీపం వెలిగించడము మాత్రము మరిచిపోకు...

(వేరువేరుగా నిష్క్రమింతురు.)

రంగము ౪.

కోటముందర.

[ప్రవేశము: గెనివీవు, మెలిజాండాలు.]

మెలిజాండా—ఈ తోటలో చీకటిగా నుంది. ఎంత పెద్ద అడవులో! ఈ మేడచుట్టూ ఎంతపెద్ద అడవులో!......

గెనివీవు—అవును; నేను మొట్టమొదట వచ్చేటప్పుడు నాకుగూడ ఆశ్చర్యం కలిగించింది. అది అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. కొన్నికొన్ని చోట్లలో సూర్యుడెప్పుడూ కనబడడు. కాని అలవాటైన తరువాత అంతా కనబడుతుంది....చాలా కాలం క్రిందట, చాలా చాలా కాలం క్రిందట......నేనిక్కడ కాపురానికి వచ్చి నలభై సంవత్సరాలైంది......రెండో వైపు చూడు. నీకు సముద్రంవెలుగు కనబడుతుంది.......

మెలిజాండా—క్రింద ఏదో శబ్దం వినబడుతున్నది.......

గెనివీవు—అవును; ఎవరో మీదికి వస్తున్నారు... అదిగో పెలియాజే. ఇంతకాలం వేచియున్నందుకు వాడు చికాకు చెందినట్లుగా కనబడుతున్నాడు.

మెలిజాండా—ఇంకా మన జాడను చూడలేదు.

గెనివీవు— చూశా డనుకుంటాను. కాని ఏం చెయ్యవలెనో వానికి తెలియకుండావుంది... పెలియాజ్, పెలియాజ్! నువ్వేనా?

పెలియాజ్— అవును...నేను సముద్రంతట్టు వస్తున్నాను...

గెనివీవు—మేము కూడాను. మేము వెలుగుకోసము వెతుకులాడుతున్నాము. ఇక్కడ మిగిలినచోట్లకంటే కొంచెము వెలుగుగా నుంది. కాని సముద్రంమాత్రము చిదాడిగానే యున్నది.

పెలియాజ్—ఈరాత్రి తుపాను పెడుతుంది. కొంతకాలం ప్రతీరాత్రి తుపానుండేది. అయినప్పటికి యిప్పుడెంత నెమ్మదిగా నుంది...ఎవ్వరైన తెలిసి యెక్కువ తనం చేసి సావాసిస్తే మరి తిరిగి రాడు......

మెలిజాండా—ఏదో నావాశ్రయమును విడిచి పెడుతున్నాది...

పెలియాజ్—అది ఒక పెద్దపడవై యుండాలి... దానిదీపాలెత్తుగా నున్నాయి...ఆ వెలుగులో కది వస్తే మన మిప్పుడే చూస్తాము...

గెనివీవు—దానిని చూడగలమని నాకు తోచదు. సముద్రంమీద నింకా మంచున్నాది.

పెలియాజ్—మంచు మెల్లగా లేచిపోతున్నట్టున్నాది.

మెలిజాండా—అవును; ఇందాక కనబడని దీప మిప్పుడు కనబడుతున్నాది.

పెలియాజ్—అది యొక్క పెద్దదీపం. మనకు కనబడనివి మరికొన్ని ఉన్నాయి.

మెలిజాండా—ఓడ వెలుగులోనికి వచ్చింది... అప్పుడే చాలాదూరం పోయింది.

పెలియాజ్—అది యొక విదేశనౌక; మనపడవల కంటే పెద్దదిగా కనబడుతున్నది.

మెలిజాండా—నన్ను ఇక్కడకు తెచ్చినపడవ యిదే!

పెలియాజ్—చాల జోరుగా వెళిపోతున్నాది.

మెలిజాండా—నే నొచ్చిన పడవే......దానికి పెద్ద తెరచాపలున్నాయి...దాని తెరచాపలవల్లనే నేను పోల్చగలను.

పెలియాజ్—ఆపడవకీ రాత్రి సముద్రముపై అపాయము సంభవిస్తుంది.

మెలిజాండా—ఏమిటికి? అది యీరాత్రే వెళ్లిపోతున్నాదా?...దాని నిప్పుడు చూడడము దుర్లభము ...బహుశా అది దెబ్బతింటుందేమో!......

పెలియాస్—వేగంగా రాత్రయి పోతున్నది...

[నిశ్శబ్దము.]

గొలీవు—ఇక ఎవరూ మాట్లాడరా? ...మీ రొకరితో నొకరు చెప్పుకోడానికింకా మరేమిలేదా?... మన యింటికి పోడాని వేళైంది. పెలియాస్, నువ్వు మెలిజాండాను తీసుకురా. నేను పోయి ఒకసారి న్యియోల్లుని చూడాలి. (నిష్క్రమించును.)

పెలియాస్—ఇప్పుడింకా సముద్రంమీద కనబడ్డాని కేమీ లేదు.

మెలిజాండా—నేను మిగిలిన దీపాలు చూస్తున్నాను.

పెలియాస్—అవి మిగతా పెద్దదీపాలు... .. నీ కింకా సముద్రఘోష వినబడుతున్నదా?...... అదిగో గాలి సాగుతున్నది......మన మీ దారిని వెళ్లి పోదాము. ఏదీ! నీచెయ్యిస్తావా?

మెలిజాండా—చూస్తున్నావా, నాచేతులు నిండుగా నుండడం.

పెలియాస్—సరే నేను బుజము పట్టుకుంటాను. దారి జారుగాను, చీకటిగాను ఉన్నాది ...బహుశా నేను రేపు వెళ్లి పోతున్నాను.

మెలిజాండా—అయ్యో!........ఎందుకు వెళ్లి పోతున్నావు? (నిష్క్రమింతురు.)

మృగీరోదనము

డాక్టరు నిడమర్తి ఈశ్వరప్ప గారు,
B. A., M. D. B., F. M. H. C.

మృగయుఁడా! నాయెడ నీకుఁ బగ యదేడ?-ఆకు నలమును దిని యరణ్యములలోన
మనుచు నజ్ఞాతవాసమ్మునను జరించు-నిరపరాధను నన్నుఁ జంప నిరతి యేల?
"ఫలిత మెన్నక పోరపి వ్యసన మంద్రు-వేఁటఁ బోలెడి వేడ్కొండు నేడు కేది?"
యనెద వకట! "పిల్లికిఁ జెరలాట గాని-యెలుకకుం బ్రాణపోకడ" నెఱుఁగవొక్కొ?

కుక్కలమందలం బిలిచికొం చుసికొల్పుచు నన్ను నేల న
ల్దిక్కులఁ జుట్టి ముట్టెదవు? దీనను, దిక్కుఁక వేఱ లేదు; న
న్నక్కఁగఁ బట్టి చీల్చునవి; ధైర్యముఁ గల్గినవాఁడవేని నీ
వొక్కఁడ నన్ను మార్కొనఁగ నోపెదె? చూపెక నా ప్రలాపమున్.

కుక్క కొఱికిన వస్తువుల్ క్షుద్రములని-ముట్టుకో నొల్లరే నాఁడు బుధవరేణ్యు
లట్టి యెంగిలి నీనోటి కెట్టు వోవు?- వేపి సావాసమునఁ గాదె వెలితి బుద్ధి?

మించిన వేడ్క-త్రోడుత నిమేషములో ననుఁ గూల్ప నారి సా
రించి శరమ్ము వేసెదు, పరిశ్రమమెల్లను మమ్ముఁ బోంట్లఁ గా
రించుటకే యొనర్చితో? పరిస్రుతరక్తముఁ గాంచునప్పుడే
నించుక పొక్క-వో శబర! నీదగు గుండియ ఱాతిగుండొకో!

సడి గిడి సేయ కేదొ పొదచాటున దాఁగి తుపాకిఁ బేల్చి న
న్నడుగిడనీక కూల్చెఁ గఠినాత్ముఁ డెవండొ. జముం డతండె నా
బుడుతని కెవ్వ రేమగడ? బుజ్జవ మెవ్వరు చేయువారు? పా
ల్గుడిపెడివార లేరి? యిదె గోడున నేడ్చెద నేను కూలఁగన్.

మొఱఁగు కుక్కలగమి కను మొఱఁగఁ గల్గి-సాయకము బాధ కోడక సైఁపఁ గల్గి
నీయమోఘంపు గుఱిఁ దప్పనేర నహహ-పాపముం గట్టికొంటె తుపాకివాఁడ!

సంతతము నింద్రుఁ డంతరంగము నిల్చి మెచ్చి యెవ్వరిఁ గూడి మెలఁగుచుండు
హస్తాంగుళులఁ బురహరుఁ డెవ్వరిం దాల్చి యమితమోదమున నాట్యమ్ము సల్పుఁ
బాఱువేగము నెంచి వాయుదేవుం డెవ్వరి న్నాన్వరియై సంచరించుచుండుఁ
దమసంతతింబోలెఁ దాపసవర్యు లెవ్వరి నాశ్రమంబుల నరసి పెంతు
రెవరి కనుసొంపు లింతుల కింపు నింపు-నట్టి మాన్యతం దివి భువి నందినట్టి
కులమునం బుట్టి న న్నిట్లు కూలనేయఁ-జేతు లెటువచ్చెనోయి నీ కాతతాయి?

అడవిని వసించి శాకము లాస్వదించి-స్వాదు శీతోదకముఁ ద్రావి స్వచ్ఛబుద్ధి
హరిని స్మరియించు మాకు మహర్షులకును-భేద మిసుమంత గలదె వివేకహీన?

నిండు ప్రేమంబున నొండొరుల న్నాకు జింకజంటను బాపి చీఱినానొ?
చేఁపువచ్చినపాలఁ జిఱుతలం గుడుపు లేబాలెంతలం బడవైచినానొ?
పెనుసీస హాయిగాఁ గను మూసి నిదురించు సాధుసత్వంబులం జదిమినానొ?
చివురాకుమేఁత నేర్చెడివేళ దయ మాని శాబకంబులఁ బట్టి చంపినానొ?
వేటకాఁడనై పాపము స్మృతి లేక-తొలిభవమ్మునం జేజేత నలిపినట్టి
ఘోరకృత్యమ్ము లిటఁ గట్టి కుడుపకున్నె?-దైవముం దూఱఁగా నేల తగుదునంచు?

కొంటెవేటకాఁడ! కొంత నీ నెమ్మది-నరసి చేయు మిట్టి యలఁతిపనులు
ముందు జన్మసుఖము నందఁ గోరెదవేని-జంతుహింస నింక సలుపఁబోకు.

కొట్టితివె పో నను బొట్టఁ బెట్టికొనఁగఁ-బరువు లిడలేని నాముద్దుపట్టి నకట
పెంతువో గొంతుఁ గోతువో పంతగించి-కడుపుతీపిని ప్రాణమ్ము వెడల దయరొ.

దినమున కొకరుచొప్పున మీరు వీనినిఁ జనుఁ గుడ్పి నెనరునఁ బెనుపుఁడమ్మ
చిన్నతనమున మీ చిన్నిగున్నలతోడఁ గయ్యమాడిన సైఁచి గావుఁడమ్మ
ఆటలసందడి నాఁకలి స్మరించిన వేళఁ జెంగటఁ జేరఁ బిలువుఁడమ్మ
మంకుపట్టులఁ బట్టి మాఱ్మ్రోగ మిమ్ముదునెడ నింపుమాటల బుజ్జగింపుఁడమ్మ
వీఁడు మీవాఁడె గాని నావాఁడు కాఁడు-ఔరసునిఁబోలె ముద్దుగాఁ జేరఁ జీరి
తల్లి లోపమ్ముఁ గనరాక దయను బ్రోవ-రండు కొనిపొండు, కృష్ణసారమ్ములార!

మోహబంధమ్మున మోము మోముం జేర్చి కులసతి నీవునుం గులుకువేళ
ముద్దుల న్మురిచి నీ బుడుతని నడ్డాల నిడికొని తల్లి చన్నిచ్చువేళఁ
బ్రాంగణంబునఁ బసివా రాడుకొన మీరు మోదాబ్ధి మున్గి యుప్పొంగువేళ
బందుగులును మీరుఁ బండువ దినమంకు విందువేడుకల మున్నందువేళ
జాడ్యమే లేక నీసతి చచ్చునపుడు-పిడుగుసోఁకి నీ తనయుఁడు మడియునెడను
వగలఁ బొగిలి నన్ దలఁచవే స్వాంతమందు-వ్యాధ! నీఘాతములకు నయ్యదె ఫలంబు.

కడుపునఁ గన్న నిన్నుఁ బడసితిఁ గాని కొడుక!-సుంత నీముద్దుముచ్చటల్ చూడనోఁచ
మొగముదఱిఁ జేర్పరా, తుదిముద్దుఁ గొందు-తీపి నీముద్దు స్వర్గపాథేయ మిపుడు.

తనయా! చెల్లె ఋణమ్ము నాకు. "మనదౌ దౌర్భాగ్య మిట్లయ్యెఁగా"
యని నీ వెన్నఁడు బెంగటిల్లకుము ని న్నాప్యాయ మొందించి మిం
చిన ప్రేమంబున నిట్టు లోమెడిని, నిశ్చింతం జిరంజీవివై
మనుమా, పెద్దలు చెప్పినట్లు నడుమా, మాటాడలే నీపయిన్.

౧

చిన్నీ...చిన్నీ...

ఓ. వొస్తున్నా.

ఎక్కడ... వస్తావు, ఆయుర్దాయం మూడే లోపల.

అబ్బ, వొస్తున్నానండీ. అప్పుడే మొదలు. ఇంటికి రావడం భయంగద!...

అయితే ఏం చెయ్యమంటావు. ఇంటికి రాకుండాను, నీకంటికి కనపడకుండాను ఊడ్చిపెట్టుకుని ఉప్పినీళ్లు చల్లుకొని పొమ్మంటావా ఏమిటి, ఖర్మం?

అబ్బ. ఎందుకండీ, అంతవిసవిస. ఇంటినల్లగడప ఎక్కేసరికి, నా ముఖం చూచేసరికినా ఏమిటి? తల దువ్వుకుంటూ టేని. చేతులో జడవున్న దామె. వస్తున్నా నంటిని. దానమ్మకడుపు బంగారంగాను, అప్పుడే యింత నాటకమా. ఇల్లాగైతే బయ టెట్లా నెగ్గుకొస్తారు బాబు...?

ఇంకా యేం. మాటలున్నాయి కోటలు దాటేటట్లు. పనిశూన్యం...... ఇదిగో యీ ఉత్తరియ్యం తీసుకు వెళ్లి, మంచినీళ్లు పట్టుకు రా. త్వరగా వెళ్లాలి...

అయితే మంచినీళ్లు ఉత్తరియ్యంతో పట్టుకు రమ్మనా యేం, మీఅభిప్రాయం?

చాల్లే. తెలివికి సంతోషించా గాని, త్వరగా తీసుకు రా? పోవాలి.

ఏమో, కవులుగా. మీ చమత్కారాలు నాకర్థం కావద్దూ?

రొంబ ఆనందం గాని... తీసుకు రా. వెళ్లాలి. అతను వచ్చేవేళకూడా అయింది.

ఎవరు, శర్మేనా? మిమ్మల్ని పట్టుకు వెళ్లాడ్డం తప్ప అతనికి వేరే పనేమీ లేదూ?

అబ్బ. ఊరుకోండూ. వాక్చాపల్యం జాస్తి. అతను వింటే ఏమనుకొంటాడు. ఏదో అట్లా ఉంటూంటై కొన్ని ఘటాలు.

ఏమనుకుంటాడేం. శనిగ్రహంలాగు అన్నిటికీ తయారు. అయినప్పుడూ, లేనప్పుడూ టీ, కాఫీ చెయ్యలేక రాముా (వంటవాడు) మచ్చ మాస్తోంది. మీకూ ఊరోకారామె.

పోనిస్తూ, చిన్నీ,...అదేమిటి జడ వొదులుగా వేశావేం.

అది అంతేలెండి. మాడర్న ఫేషన్.

సరే, అయితే. నాకు చదువు చెప్పేటట్టున్నావు చూస్తే. అదిగో అతను వస్తున్నాడు. నేను పోతున్నా.

పెందరాడే వస్తారుకదూ?

నువ్వు అడగాలీ? బయట అంతసేపుంటే నాకు మాత్రం ప్రాణం నిలుస్తుందీ.

ఓ చెంప అతను వింటున్నాడు. ఏమిటి ఊర్కే.

ఎబ్బే. ఏముంది. నిజమేగా చెప్పింది. పోతున్నా, గుడ్ యీవెనింగ్.

౨

ఆబట్ట కాకపోతే మరొకటి కట్టుకోకూడదూ. అంచంతా వెలిసి అసహ్యంగా ఉన్నది.

తమ పుట్టింటివా రిచ్చిందేనండి, ఇంకేలక్షణంగా ఉన్నది. మొన్ననే నాన్నింది. ఇది రెండో ఉతుకు.

అబ్బీ. ఎప్పుడూ వాళ్ల మీద సొడ్లు వెతకడం సరిపోతోంది. ఏదో శక్తి ఉన్నంతవరకు ఇచ్చారు. ఇచ్చిందానికి తృప్తిపడకూడదూ?

ఆహా. ఇచ్చారు. కట్టుకోలేక, ఉపయోగించుకోలేక ప్రాణం విసుగుతోంది. పెళ్లినాటివి, కాళ్లుకడుగుపళ్లెం, ముఖంకడుగుకుర్చీ ఇప్పటికి బాకీ. లిమిటేషన్ పట్టిపోయింది కూడాను. ఇచ్చినబట్టలు సరే గదా, ఇంత మహాయోగ్యంగాను, లక్షణంగాను ఉన్నాయి.

అబ్బ! పోనిస్తురూ. మనకు ఒకరు పెట్టే దేమిటి. మన కున్నది చాలదూ?

ఉన్నదంతా కట్టుకుపోతారా యేం. సగం యిట్లా పడవెయ్యరాదూ?

ఇంతకూ అది. సగం మన కివ్వడ మేం, వాళ్లు అనుభవించ లేరూ?

అబ్బీ,అట్లా వెనక వేసుకు రా. ఎక్కడికి పోతుంది అభిమానం. ఈమాటు దీపావళికి పట్టుబట్టలిస్తేనే గాని రానని చెప్పు.

పోనీండి పోకపోతే నేం. వాళ్లకే నయం. అయినా నే నెందుకు మధ్య సారథ్యం. మీరే చెప్పండి మామగారితో...

ఏమో, ఆయనమొత్తుకు నేను...

ఊహుఁ, ఏమి టామాటలు. అక్కడ నుంచి తెచ్చుకొనేవి తెచ్చుకోవడము, పైగా ఎత్తిపొడవడము. మామూలేగా అల్లుళ్లందరికీ...

ఈలా సద్దుకు రావడం కూతుళ్లకుకూడా మామూలేగా. మొత్తానికి మాట మీద ఉంచుకోరు, పాపం.

3

ఏమండీ; ఊఁ, ఏమండీ—

ఆఁ. ఏమిటీ?

ఏమంటారు, ఏమండీ.

అబ్బ! ప్రాణం తియ్యి. దేనికి?

ఈపూట వెడదామూ!

కొంప మునిగింది. ఎక్కడికి?

సినీమాకండీ. అది నాచేత అనిపించాలి.

ఏమిటి ఫిలిం, యివ్వాళ.

"చంద్రముఖి"—గోహర్ ఫిలిమండీ.

సాహో మె. నాకంటె ఎక్కువ తెలుసామె. ఏం బాగుంటుంది. గోహర్ ఫిలిం. కులకడం, ఏడ్చుకోడం, నవ్వడం తప్ప ఏముంటుంది?

గోహర్ బాగుండకపోవాలి. నవ్వేపోతారు ఎవరైనా వింటే. ఏముంది, అర్థం కాకపోతే సరి. ముందు ఏ దెట్లా వున్నా, పర్యవసానం అనుభవించేవాణ్ణి నేను.

ఏం అనుభవిస్తున్నారండీ బాబూ, యిన్నాళ్లనుంచీ. లేనిపోనిమాట అనక మంటే, మహా సరదా.

అవును. లేనిపోనివి కాదు, మరి. ఫిలిం చూచి రావడం,ఆచమత్కారాలన్నీ ఇంట్లో ప్రయోగించడమూను ప్రాలంబికం పైన వేసి, సిగ చుట్టూ గంపెడుపూలు దోపి, గోహార్ లాగా కులకడం; నడవడం, కదలకపోవడం.

ఇంతేగద. పోనీండి మీ-కేం కష్టం యిందులో.

కష్టమా, అంతా నాదే. ఫిలింలో నాయకుడల్లే నన్నుగూడా ప్రవర్తించమని నిర్బంధనామె. అట్లా సూటు వేసుకుని, అట్లా నవ్వుతూ, అట్లా కారెక్కి తిరుగుతూ, అట్లా చుంబనం చేస్తూ కాలం గడపమంటావు. ఎల్లా చెప్పు.

ఏమిటండీ, అబ్బ. ఎప్పుడో ఒకసారి తమాషాకు అంటే దాన్నే పట్టుకు వేళ్లాడుతారు.అవును నే నేం చేసినా అంతే... మొన్నేగా మీరు రాత్రి పద్యాలు వ్రాసుకుంటూ— "చిన్నీ, లారాకు మల్లే నన్ను ఉత్సాహపరచాలి" అని, కళ్లలోకి నిద్ర కూరుకు వస్తున్నా పద్యాలు వరుసగా చదివి వినిపించి తీరారు. అవును. ఎవరు చేసినవి వారికి జ్ఞాపక ముండవు. ఎందుకు లెండి.

సరే, గునుసు ప్రారంభించక బయల్దేరు త్వరగా.

ఎందుకు, ఇంత నిష్ఠూర్యంగా?

ఊఁ, బయల్దేరు త్వరితం. నవర తియ్యలేను మాటిమాటికి.

సరే నేను సిద్ధం.

అయితే, అదే నేమిటి చీర. దరిద్రం ఓడుతూండాలి. ఎన్ని ఉన్నా అంతే.

దీని కేమండీ నిక్షేపంలా గున్నది. నాలుగు పెళ్లిళ్లు చేయించవచ్చు. కొర్నాడచీర. తీసిపోయిందా యేమండీ?

సిల్కు ఊదాచీర ఏమైంది? అది కట్టుకుని రోజా క్రేప్ రవికె తొడుక్కో త్వరగా కానీ.

ఇల్లా చెప్పి కేపెట్టేదిన్నీ, పైగా నన్నే కీని. ఎందుకు లెండి. ఇంతకు యింతా.........

అనుభవిస్తా నంటావా?సరేగాని బ్రూచ్ ఏదీ? కాళ్లకు స్లిప్పర్సు ఏవి! అతురమతురం చెప్పాలిసి ఉండె. మళ్లీ అన్నీ తెలుసుకని ఖేపజం.

ఇప్పుడు స్లిప్పర్సుగూడా ఎందుకు పోనిస్తురూ. కొనిపెట్టిందాకా ప్రాణాలు తోడేశావు. ఇప్పుడు మొహమాటం...తొడుక్కో. వేషం పూర్తికావద్దూ.

ముందు నుఃకంటికి నచ్చాలిసుండె. సినీ గాంలో వేషం వేసేవాళ్లకన్న మనకు ఎక్కువ అలంకారాలు కావాలామె. చెప్తే వినడమా, ఏమన్నా నాః..

సరే, నడు. పుణ్యకాలం కాస్తా దాటుతోంది. ఊఁ. పద.

౪

అయితే,చిన్నీ,ఎంతసేపట్లో వస్తా వన్నమాట? ఎంతోసేపా ఒక అరగంట.

అరగంటంటే మనలెక్క ప్రకారం ఆరునెల లేగా.

అబ్బే. ఈవేళ చూడండి. సరిగ్గా అరగంట.

సరే, యిదివర కెన్నిసార్లు అయింది. చూసి చూసి కళ్లు బాత్త లడ్డాయి......అయితే ఇంజనీరుగారింట్లో ఏమి టీదినం.

వాళ్ల అబ్బాయికి ముద్దగోడుగులు యిప్పిస్తారు.

ఇంకా యిట్లాంటి అలవాట్లు పోలేదూ!

ఏంచిత్రమండీ. మన దంతా తల్లక్రిందులు పద్ధతేగా.

పుట్టెత్తమంటే పూర్వోత్తరాలు మెత్తుతావు, చిన్నీ. ఎరక్కపోయి అన్నాగాని, నీత్రోవని నీ వెళ్లు.

వచ్చిందాకా కాస్తవాకిలి చూస్తూండండి. రాముూమీద యిల్లు విడిచి పోకండి.

ఇలాగ పట్టింది ఖర్మం. నువ్వు తిరిగి వేంచేసే వరకూ ఇల్లు కాపలా కాయనా, జాతికుక్కల్లే? బాగానే వుంది అదృష్టం.

పోనీ లెండి, పేరంటం మానేస్తాను. ఎప్పుడూ నేను తల్చుకున్నదానికే గా విఘ్నం. ఛీ.

వెళ్లనమ్మా, వెళ్లు. పొరబాటు......చూడు, అయితే సైరోలోలకు లేని—పెట్టుకోలేదేం?

మళ్లీ మొదలు...ఏమో యెక్కడో వున్నాయి; తీయలేక బద్ధకించాను. ఈమారు పెట్టుకుంటూ లేస్తుమా.

ఫీల్లేదు. ముందు పెట్టుకో. కావాలని ఎంతో ప్రయత్నం జేసి తెప్పిస్తే ఉపయోగించడం తెలియదామె.

పోనీలెస్తుమా. ఏదో పిచ్చో, వెర్రో యిల్లాగ వుణ్ణండి.అయినా నాకీపురమాయింపు లేమిటి? మచ్చ మాపేస్తున్నారు మీఫేవన్లతోను, సలహాలతోను

వొప్పుకోను. నీకేం తెలుసు. ఆలోలకులతో నీకు జుబేడా రూపు వస్తుంది.

జుబేడా కాదు,సుల్తానా. నా మొహం. ఇహ లాభం లేదు. ఎవరో ఒకరికైనా వుండాలి...

చూడు అదిగో, నే చెప్పింది అబద్ధమా.ఎలాగ మెరుస్తున్నయో.సరిగ్గా జుబేడా. ఇల్లా రా—

ఎట్లాగైతే నేం, పంతం నెగ్గిందిగా. ఆనందించండి. వెడ్తున్నాను,ఆలస్య మైంది యిప్పటికే.

ఒక్కమా"......

తిరిగి వచ్చిన తర్వాత......

౫

ఏమండీ, ఇట్లా ఒకసారి వస్తారూ?......అబ్బ మాట్లాడ రేమండీ. పదిసార్లు పిలిచినా పలుకే లేదామె...బ్రహ్మ వ్రాత, నా ప్రాణానికి వచ్చింది. ఇరవైనాలుగు గంటలు వ్రాతే నామె. ఇవతలవాళ్లు ఏమైనా సరే...

ఏమిటీ అతిశ్రవణం. నా వ్రాతకోతల మాట గూడా నీ కెందుకు?

నా కెందు కేమిటి? తలప్రాణం తోక కొస్తోంది. ఇంత నిర్లక్ష్యమైతే యెల్లా. ఇవతలమనిషి ప్రాణం పోయినా అంతే.

అదే తలనొప్పి. ఊర్కే అయినదానికి కానిదానికకూడా చాటెత్తి చెరగడం. పోనీ ఏదో

యథాలోపాన వున్నానేమో అనుకొని ఆగకూడదా, లేక అంత తొందర వుంటే దగ్గరకు వచ్చి చెప్పకూడదా. అదీ గాక యిదీ గాక ఎక్కడనుంచో—ఏమండోయి, ఓహో, చూడండీ, మిమ్మన్నే—అని సోమిదేవమ్మ గారి ఫక్కీగా పిలుస్తే, ఏం తెలుస్తుంది? నువ్వు మాత్రం కేపిల్చిన పదిఘడియల దాకా నోరు తెరవకుండా, తరువాత, "వస్తున్నా; జడ వేసుకుంటున్నా ; చీర కట్టుకుంటున్నా; బొట్టు పెట్టుకుంటున్నా" అంటూ జాముసన్నర ఆలస్యం చేసినా ఫరవా లేదు. ఏం?

ఈ వసన, ప్రవర అయ్యేసరికి యీ టీ కాస్తా చల్లబడిపోయింది. అరగంట అయింది రామూ టీ తయారుచేసి.

పోనీ, ఆవిషయం తెలిసేటట్టు చెప్పగూడదూ? టీ కోసమంటే పరుగెట్టుకొని రాకపోదునా?

అవును. దానియందున్న లక్ష్యం నాయందుంటేనా?

ఉన్నది చాలదూ? దాసోహం అనమంటావా ఏమిటి?

ఆపాపం నాకెందుకు గానీండి. ఏమిటా వ్రాసేది.

నే వ్రాసే దేమిటో నీకు తెలియదూ?

కథా, పద్యమా?

రెండూను: ఒకదానితర్వాత ఒకటి.

ఏం విసుగు లేదండీ. మీారు వ్రాయడమూ అట్లాగే వుంది, వాళ్లు అచ్చు వేయడమూ అట్లాగే వుంది. అన్నీ అతికిపోయినై......మొత్తంమీాద అన్నీ శతమానం దాటినై అనుకుంటా......

అందులో సగం తమరివేనండి.

కాదుమరి—అయినవాటిల్లోను, కాని వాటిల్లోనూగూడా నన్ను యిరికిస్తూంటే.

పేరు చిరస్థాయిగా ఉంటుంది, పో.

ఇప్పడదే బెంగ.........ఎట్లా ఉంది, టీ?

రోజ్ పీక్ ఆ.

అవును. అది తెప్పించమంటిరిగా?

సరే గాని, చూడు, మరచిపోయాను. రావు టీకి వస్తాన్నాడు.

టీకిగూడా వారాలు చెప్పకుంటున్నాడా యేం?

పోనిస్తూ. రామూని టీ సిద్ధంగా ఉంచమను. అతను వచ్చే వేళైంది.........అదిగో డాక్టరు గారి భార్య వచ్చినట్టుంది నీకోసం, వెళ్లు...

౬

ఏమండీ, యీవేళైనా పట్టుకొచ్చారా?

ఏమిటి బాబు?

ఎంతతిన్నా పరగడుపైనట్టుగా, ఎన్నిసార్లు చెప్పినా కొత్తే. పేపర్ ప్లవర్సును, పటం కుట్టేటందుకు చంకీను తీసుకురమ్మంటిని గాదండీ?

సాహేబుసంపాదన బూబు కుట్టుపోగులకు సరిటు. ప్రస్తుతం మన ఆర్జనంతా యీవిధంగా అయినదానికి కాని దానికి వ్యయం. ఏమన్నా అంటే నోట్లో......

అంతా చిత్రమండీ మీది. చెయ్యమనేది మీరే, చెప్పమనేది మీరే. చివరకు మాటలు నాకు. మొన్నీ గా మీరు పదహారు రూపాయలు పెట్టి పెద్ద గజు ఫ్లవర్ వాజు కొనుక్కొచ్చారు. పొరబాటున చిల్లు మంటే ఎంతకూ కాకుండా రూపాంతరం పొందుతుంది.

సరే, ఏముంది? నిన్ను నేననా, నన్ను నీవనా. మొత్తానికి యిద్దరం కలిసి సంసారాన్ని చక్కబెడుతున్నా మన్న మాట.

ఇదిగో ఏమండోయ్ చూచారా. ఈకిటికీ దగ్గర ప్రాకించిన సన్నజాజి ఎంతలో పైకి వచ్చిందో. సరిగ్గా యిక్కడే పడక, పైన జాజి పొద. ఎల్లా వుందంటారు?

అనేదేమిటి; శేషశాయికి మూడింతలు పైగా వుంటే.

మొత్తానికి కవితాశక్తి, ఊహా, వ్యర్థం కాని చ్చా కాదు.

చెప్పవ్. టెస్టిమోనియల్ యిచ్చావుగద.

ఆమాత్రం తెలివే వుంటే మీ రిట్లా అంటారు ...ఇదిగో, ఏమండోయ్, మరచి పోయినాను. ఒక్క క్షణం కళ్లు మూసుకోండి తమాషా చూపిస్తా...

చంపావు, పో వేగిరం కానీ.

ఇప్పుడే అయిదు నిముషాల్లో వస్తాను......అదిగో కళ్లు తెరుస్తున్నారు. నేను వొప్పుకోను. ఊహు వాడావిడి. ఎవరు తెరిచారు?

ఊఁ. ఇప్పుడు చూడండి!

నువ్వేనా, చిన్నీ......ఎక్కడిది. నిండుగా చుక్క లమధ్య చంద్రుడల్లే వున్నావు. వొట్టు... అయ్యో, మీవొట్టు బంగారంగానూ. నేను కాదన్నానటండీ...మా అమ్మ కొని పంపించింది.

ఏదీ, యిల్లా రా, చూస్తాను. కొంచెం పెద్ద పువ్వల్లే వుందే?

మరీ అంతపెద్దది కాదులెండి. ఉన్నది సామాన్యంగానే. సిల్కు కూడా మంచిదే. ఏమంటారు.

అవునవును. చాలా మంచిది.

ఎప్పుడైనా మీ చేత్తో మీరు యిటువంటి దొకటి......

కొనలేదూ? ఎందుకు పక్షపాతం......పోనీలే గాని, అదేమిటి బుగ్గపైన. ఇట్లా రా.

ఉంటే వుండిలెండి, నే రాను. మీ మొత్తు నాకు తెలుసు.

ఎబ్బే. నిజంగా. ఉండు. ఇదిగో......

అబ్బ ఏమిటండీ, మోటుతనం చీరెంతా నలిగిపోయె. ఉండండి. అన్నిటికీ తొందరే.

ఆత్మసమర్పణము

శ్రీయుత దేశభక్త కొండ వెంకటప్పయ్యగారు

"కఱవుల్ మారియు ప్రజలన్ - బోరిగొనంగాఁ జొచ్చె; బందిపోటుల బాధల్
భరమయ్యె; గ్రామదేవత - కర మలుకం దాల్చె"నంచు గలఁగిరి జనముల్.

ప్రార్థన:— కాళిదేవి యను గ్రామదేవతనుఁ - బోనము పెట్టియుఁ బొగడిరి జనములు
"తల్లీ దండము తనయుల మమ్మా - తల్లీ నిక్కము దాసుల మమ్మా
ఏమితప్పిదమొ యేదోషంబో - ఏమి చేసితిమొ యెఱుఁగంజాలము
మఱవుము జననీ మాపాపంబులు - మన్నింపఁగదే మానేరంబులు
పేదఱికమ్మును పెద్దకాటకము - చీడలు పీడలు చెచ్చెర వచ్చెను
తాళఁజాల మిఁక తల్లీ దండము - నిల్వఁజాల మిఁక నీ కొకదండము
పెద్దయు కాలము పిలిచినఁ బలుకుచు - తోడునీడవై తోడ నిలిచితివి
కోరినకోర్కెలఁ గొంకక యిచ్చుచు - కంటికి రెప్పగఁ గాచితిమమ్ముల
చల్లఁదనంబున సాఁకితి బిడ్డల - నేమి కావలయు నేమి గోరెదవు
ప్రాణసమానుల ప్రాణంబైనను - మానక యిత్తుము మానుము కోపము.

అనుచు పురోహితులందఱు - వినయము, భక్తియు, భయంబుఁ బెనఁగొన ప్రార్థిం
చిన ఫలము గల్గకుండెను - జననాశము మేర మీఱె జనముల్ బెగడన్

కాలము గతించె నదియును గడువఁగడువ- "ముద్దుటిల్లాలు బిడ్డతో మఱియు తేఁడు
ప్రాణపద మైనవారిని బలి నొసంగ - మేలుచేకూరు"నం చిటు కాళి పల్కె.

నరపాలున్ ప్రతిబింబము - కరణిన్ వెలువారుచుండు కన్నకుమారున్
ధరయువరాజకుమారున్ - పరిపోషణ చేయు జనని వాత్సల్యమునన్.

ధరణీపాలుఁడు వనమున - కరిగెను మృగయావినోద మత్యధికముగా
నరపతిసుతుఁ గొని వచ్చుట - కరిగిరి భటజనము లప్పు డంతఃపురికిన్.

మరలి రాఁగ నృపాలుఁడు పురమువారు - బాలకునిఁ గొనిపోయిన వార్తఁ జెప్పె
"వాని దేవత బలి గోరె; దానఁ గల్గు - జనులకున్ మే"లటంచును వనిత పల్కె.

"సుతునిఁ గొనిపోయి రేల వానిగతియుఁ దెలిసె - నైన నడిగెద నొకమాట నవనిపాల
సుతునిఁ బ్రేమింతువో లేక సతిని నన్నొ - యెవరి నెక్కుడు ప్రేమింతు వెఱుఁగఁ జెపుమ."

మెడ వంచి, కేలు నుదుటన్ - దడవుచుఁ దాఁ బల్కె నృపతి తాలిమిదూలన్
"నుడివిన ఫలంబుఁ గలదే? - పడతీ నా కిద్దఱొక్క ప్రాణమె సుమ్మా"
"అతివరో! నీవు నాకు నర్ధాంగి వగుదు - వతఁడు పుత్రరూపమున నా కాత్మయగును
భార్య లేకున్న సుతుఁడున్న ఫలిత మేమి? - సుతుఁడు లేకున్న సతితోడి సుఖములున్నె?"

అతిముదము గూర్చు సుతు భూ - పతి దేవికి గాన్క నిచ్చి ప్రణతి యొనర్చెన్
కుతుకం బాదిరి జనములు - బ్రతుకంగా తెరవు దొరకె భాగ్య మటంచున్.

బాలకు బలి నిచ్చుటకున్ - కాళికిఁ బూజలను సల్పి ఖడ్గము మెడపై
వ్రాలఁగ వ్రేసెడిలోపల - తాలిమితో నడ్డువచ్చి తల్లి వచించెన్.

"ఆలింపుఁడు నామాటలు - పాలింపను ప్రేమ నవనిపాలుఁడు నన్నే
బాలుని కన్నను మిన్నగ - కాళికి నా ప్రాణములను కానుగ నిత్తున్."

ఇటుపలికి, బలికి కంఠము - పటురయమున సాఁచినంత వనితను పతి తా
నటు పోవ నీక లాగెను; - త్రుటిలోపల నిజము తెలిసె; తీఱెను శంకల్.

బాలునికన్న భూపతికి భార్యయె ప్రాణపదంబు; కాన నీ
బాలునిమారు దుర్గకును భార్యశరీరము నిత్తు మంచు పె
న్వాలున నామెకంఠమును వావిరి ద్రుంపఁ దలంచినంతనే
"చాలును; చాలు; మానుఁ" డని చండిక పల్కెను విస్మయంబుగన్.

"ప్రాణముకన్న తియ్యనగు బాలకు ప్రాణముఁ బ్రోవ సిద్ధమై
ప్రాణము లీయఁ బూని మము భామిని గొల్చెను చిత్తశుద్ధితో
ప్రాణము లేల మా కరయ పావనభక్తియె చాలు; నీమహో
రాణి మహాత్తదే ప్రజల త్రాణ మొనర్చి సుఖింపఁ జేసెడిన్."

చింతలు వంతలున్ దొలఁగు; చిత్తము పావనభక్తియుక్తమై,
శాంతినిధానమై; పరమసాధ్వి వలెన్ బలిదానయోగ్యమై,
సంతతమున్ జరింపఁదగు సాధన నల్పుఁడు; మీర లెల్ల ర
త్యంతము భోగభాగ్యముల నంది సుఖింతురు సర్వకాలమున్.

[టెన్నిసన్‌కవి రచించిన 'The Victim' అనుకావ్యమున కనువాదము.]

"ఓరేయి తమ్ముడూ!" "పది మాట్లు చెబుతుం దేమిటి యీ పిచ్చిముండ" అనుకోకు. నువ్వు చిన్నవాడవూ, నేను పెద్దదాన్నీనీ; కానయితే, పంచ శిఖలతో వుండగానే నీకు పెళ్లికావడం బాగానే వుంది; కాని జోగమ్మ యింత తొరగా కాపరానికి వస్తుం దని మే మెవళ్లమూ అనుకోలేదు. మొన్నటి పిల్ల కాదుట్రా తల్లి పెంపు సాంప్రదాయాన్ని పట్టి అలాగ బొబ్బిల్లా వుంది కానీ, పద్దానుగేళ్లు వెళ్లలేనురా యిం కానూ—ఇంతకీ కోడలు కాపరానికి రావడం అమ్మ కళ్లతో చూసుకుంది. వొక్క కొడుకు కైనా అమ్మకి ముచ్చట్లు బాగానే తీరాయి.........ముప్పయ్యెక రాల భూమీ, పెట్టెలాంటి యిల్లూ—నరువు పోతే పోయింది యేం లోటు నీకూ? పెట్టి పుట్టావు నువ్వు. బతికి వున్నంత కాలమూ నిన్నూ నాన్ననీ కనిపెట్టు కుని వుంటాను కదా నేనూ? చూడు తమ్ముడూ! మొగుడు చచ్చిన ముండని. ఇల్లు పట్టాను. నువ్వు నిస్సా కారంగా చూశా వంటే నా ప్రాణాలు యెగిరిపో తాయి సుమా. నీకు నామీద చాలా భక్తే వుంది. ఆ మాట నాకు తెలుసును. అయినా భయం అలా అనిపిస్తుంది.........చెప్పవచ్చిం దేమీ లేదూ. చేబోలువారి ఆడాళ్లు కజ్జాకోర్లు. పైగా నీ అత్తగారు చిం తావారి ఆడబడుచు కూడాను. నెలకి నూటయిరవై రూపాయలు తెస్తా డన్నమాటే కాని పెళ్లాంచేతులో పొయ్యడమే కదా నీ మామగారు? నీ పెళ్లాం అన్నివి ధాలా తల్లిని పోలిక పుచ్చుకుంది. ముడి మాటలూ అదీ —నీ భావమరిది పోయినప్పుడు వెళ్లి చూశా నంతా. కావలసినవాళ్లనీ, పుట్టెడు దుఃఖంలో వున్నారు కదా అనీ అక్కడ వున్న పదిరోజులూ వొండి పెట్టాను కా దూ? తల్లి దుఃఖంలో పడి వుండేది కనక తానైనా కాస్త సాయం కావచ్చునా నాకూ? అదేం చదువో గాని అస్తమానం పుస్తకం చేత్తో పట్టుకొని కూచునేది. ఎలా మానగలిగిందో ఆ పదిరోజులూ; అర్ఘడీ మాత్రం ముట్టుకోలేదు. ఆడపడుచుముండ నాదునా? ఈడు వచ్చిన పిల్ల కదా; కాస్త అపరా కాకూడదూ, చెప్పు తమ్ముడూ. "ఛీ! ఎప్పుడు వెళ్లిపోతానా అనిపించింది. ....నువ్వు చిన్నవాడవు కనక యింతగా చెబు తున్నాను. వెయ్యి కళ్లతో నేను కనిపెడుతూనే వుం టాను అయినా—నువు విచ్చా వంటే నెత్తికెక్కుతుంది సుమాను. వ్వంటే భయభక్తు లుండీలాగ మసులుకోవా లి. నాన్న వెర్రిబాగులవా డనీ, నేను మనోవర్తినుండని కదా అనీ, నిన్ను లోపు చేసుకో మని యిదివరకే చెప్పి వుంటుంది తల్లి. అబ్బో అసలు నీ పెళ్లామే నె ల్లూరు నెరజాణల రకమూ. అవతల పెద్దాళ్లు వున్నారు కదా మన కెందుకని దేనికేనా, కాస్తేనా నదురూ బెదురూ వుం దనుకున్నావా? నువ్వు చిన్నవాడవు కదా అనీ, వేషాలంటే సరదా పడతావనీ, అదనీ యిద నీ నగలికి పురమాయిస్తుంది. విన్నావు సుమా. కావలిస్తే అక్కణ్ణుంచి తెచ్చుకో మను డబ్బు. తను వొక్కత్తే కాదూ వారికి బిడ్డ? వారి ఆస్తంతా యిక తనకి వచ్చే దే కాదూ?" అని యీలాగ యింకా చాలా దూరం చె ప్పింది బుచ్చమ్మ. చలపతిరావు ముసిముసి నవ్వులతో కొంతసేపూ, సిగ్గుచేత కొంతసేపూ, యేమీ తోచక కొంతసేపూ వూరుకున్నాడు; గాని దేనికీ జవాబు చెప్ప లేదు. "ఇది బాగా విను" అని వొకటీ, "ఇది ముఖ్య మైనది సుమా" అని యింకొకటీ, "ఇది మరిచిపోయావు సుమా" అని మరొకటీ—యీలాగ యింకా కొన్ని సంగ తులు కూడా చెప్పి చివరికి "సిగ్గుపడుతున్నాడు తమ్ము డు" అనుకొని ఆమె కూడా అంతటితో వూరుకుంది.

౨

జగ్గయ్య సరిగా యేడుగంటలికి జోగమ్మని తీసుకువచ్చాడు. "గుఱ్ఱబ్బండయితే మాత్రం పేటలోకి పావలా యేమిటీ?" అని బుచ్చమ్మ తండ్రిమీద ధుమ

ధుమ లాడింది; కాని జోగమ్మని "మంచినీళ్లు కావాలా?" అనేనా అడగలేదు. బండివాడు సామాను వాకిట్లో పెట్టి, అద్దె పుచ్చుకుని వెళ్లిపోగా జగ్గయ్య "సామాను నీగదిలో సర్దుకోవే అమ్మాయీ" అని కోడలితో చెప్పి గోదావరికి చక్కాపోయాడు. దానిమీద బుచ్చమ్మ చుర చుర చూస్తూ "మామగారు చెప్పేదాకా అలా బొమ్మ లాగ నుంచోకపోతే సర్దుకోరామా?" అంటూ మూతి ముడుచుకుని వంటింటోకి వెళ్లిపోయింది.

"పెళ్లాం వచ్చేటప్పటికి యెదురుగా వుండకూడ" దని అప్పగారు చెప్పడంచేత "కామోసు" ననుకుని చలపతి గోదావరిగట్టుకి షికారు వెళ్లి యెనిమిదైతే గాని యింటికి రాలేదు. ఈలోపుగా జగ్గయ్య భోజనం చేసి "అబ్బాయి నెక్కడికి పంపించావే?" అని మాటిమాటికి కూతుర్ని అడుగుతూనే గాది సావిట్లోకి వెళ్లి వడకమంచం వాల్చుకుని పడుకున్నాడు.

పాపం జోగమ్మకి ఆ వంటలో పొద్దున్న తొమ్మిదిన్నరకి తిన్న మెతుకులు. దారిలో తిన మని తల్లి జంతికలిచ్చింది; కాని పడవలో మూట మామగారి దగ్గిర వుండడంచేతా, నిడదవోలు స్టేషనులో జనసమ్మర్దం అధికంగా వుండడంచేతా ఆపిల్ల వాట్లని తలుచుకుని గుటకలు మింగుతూనే కూచుంది. ఈసంగతి యేమీ యెరగని జగ్గయ్య స్టేషనులో "అరిటిపళ్లు కొన మంటావా?" అని అడిగాడు; గాని ఆమె సిగ్గుపడి వద్దంది. మొత్తాని కామె రాజమహేంద్రవరం వచ్చాక అడిగి పుచ్చుకునీదాకా పచ్చి మంచినీళ్లేనా యెరగదు. తాను స్వప్నంలో అడుగు పెట్టాటప్పటికి ఎంతో ప్రేమతో ఆడబడుచు పీట వేసి కూచోబెట్టి అన్నం పెడుతుం దనుకుంది. అది లేకపోయినా చివరికి చలపతి మొగం కనపడినా కాస్త బాగుండిపోను; గాని అదీ లేకపోయింది.

ఎనిమిదిన్నరకి వంచిన తల యెత్తకుండా గబగబా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, ఆసాయంత్రం తల అంటుకోవడంచేత నిద్ర కూరుకురాగా చలపతి స్వయంగా పక్క దులుపుకుని పడుకున్నాడు. తొమ్మిదయితే గాని జోగమ్మకి విస్తట్లోకి అన్నం రాలేదు. అప్పుడేనా తెములకుండా బుచ్చమ్మ పావకాలంగా అదనీ, యిదనీ ఆవంట గొడవ లడుగుతూ, వుండివుండి యిక్కడి కబుర్లు చెబుతూ, మధ్యమధ్య యిరుగుపొరుగు అనుకూలసంపతులికి పేర్లూ పద్దులూ పెడుతూ, కొత్తిమిరి కారంతోటీ, వంకాయపులుసు పచ్చితోటీ, మామిడికాయ పచ్చడిబద్దలతోటీ, మధ్యమధ్య వొట్టి కీతితోటీ, చివరికి మీగడ పెరుగుతోటి కాస్త కాస్త చొప్పున వుప్పుపిండి తిని, యిల్లంతా సర్దుకుని, పక్క సవరించుకుని, "రామయ్యతండ్రీ! నడుం లాక్కుపోయిం" దంటూ పడుకుని, "హాహ్వాహ్వా" అంటూ వొకమాటు అటూ యిటూ దొర్లి, జోగమ్మకి సెలవిచ్చేటప్పటికి పదిమ్మప్పా వయింది.

ఇదే తొలిసాటు రావడం కనక తన తమ్ముడు ముద్దుకోసం అయితే నేమి, తన ముచ్చటకోసం అయితే నేమి, లోకంలో వాళ్లని చూసి అయితే నేమి గంధం తీసీ, మల్లి మొగ్గలు తెప్పించీ, అగరువొత్తులు వెలిగించీ —యింకా యింకా యిలాంటివి చెయ్యవలసిన ఆశ బదులు యిలా చెయ్యాలేమో, ఇది యిలా అయినా, యింటోకి వెళ్లాటప్పటికి యెదురు వచ్చి, చెయ్యి పట్టుకు తీసుకు వెళ్లి, వొడిలోనో పక్కనో కూచోబెట్టుకుని, వొక్కమాటు గట్టిగా అదిమిపట్టి, ముద్దుపెట్టి మురిపెం చూపించవలసిన మొగుడు బుస్సుగొడుతూ నిద్రపోతూ వుండడమూ, చూసి పాపం ఆపిల్ల తెల్లపోయి, వునూరుమంటూ కాళ్లకాడదిక్కున పడుకుని నిద్రపోయింది.

3

మూడుగంటలికే బుచ్చమ్మకి మెళుకువ వచ్చింది. తరవాత మరి నిద్ర రానూ లేదూ, ఆమె అందుకోసం ప్రయత్నం చెయ్యనూ లేదూ; కాని ఏమిటో మింది పోతూ వున్నట్టు మనస్సు గుబగుబ లాడిపోయింది. వొకటి రెండు మాట్లామె గది గుమ్మంలోకి వెళ్లి తలుపుకి కసికి చెవి ఆనించి, శ్రద్ధగా ఆలకించింది. అయితే: దంపతులలో యెవరూ కూడా మేలుకుని వున్నట్టు తోచలేదు. తరవాత అతికష్టంమీద పూర్తిగా వొక్క గంట గడిపింది. నాలుగు కొట్టాటప్పటికి పూతుకో

లేక "తెల్లవారిపోతోంది లేచి చదువుకో తమ్ముడూ" అని కేక వేసింది.

మంచంమీద పడుకునే వుండి రెండు మూడు మాట్లిలాగే పిలిచింది; గాని జవాబు రాలేదు. నాలుగో మాటు పిలిచేటప్పటికి జోగమ్మకి మెలకువ వచ్చింది. అయిదో మాటు పిలవగా ఆమె భర్తను లేపి "మీ అక్క పిలుస్తూ వుం"దని చెప్పింది. దాని కతను ముస ముసలాడుతూ "వూరుకుందూ" అని చెప్పి గోడవేపుకి తిరిగి పడుకున్నాడు. అయితే బుచ్చమ్మమాత్రం వూరుకోలేదు. కేకమీద కేక చొప్పున ఆమె మళ్లీ రెండు మాట్లు పిలిచి, అప్పటికీ జవాబు రాకపోగా "మొగుడుకీ పెళ్లానికీగూడా పొద్దునిద్దరే. ఆడపిల్లకిగూడా బండ నిద్దరే అయితే యెలా గమ్మా వేగడం? పోనీ నీకేనా మెలకువ రాలేదుటే?" అని సాగదీసుకుంది. దానితో యింక లాభం లేదనుకుని జోగమ్మ లేచి వచ్చి తలుపు తీసింది.

తలుపు తీసీ తియ్యడంలోనే బుచ్చమ్మ లోపలికి దూకింది. అందుకు సిగ్గుపడి జోగమ్మ యివతలికి రాగా "మరీ మంచిదీ" అనుకుంటూ బుచ్చమ్మ మంచం దగ్గిరికి వెళ్లి "ఏదో చదువుకుంటూ వున్నట్టు నటించకపోతే నీ పెళ్లాం లోకువ చేస్తుందిరా" అని చెవిలో చెప్పి చలపతి నివతలికి లాక్కువచ్చింది. అప్పుడు జోగమ్మ మళ్లీ లోపలికి వెళ్లి తలుపు దగ్గిరగా వేసుకుని వుసూరు మంటూ పడుకుంది.

"దీపం పెద్దది చెయ్యనే" అని బుచ్చమ్మతో చెప్పాడు. గాని యే పుస్తకం చదవాలో చలపతికి తోచ లేదు. సంవత్సరం కిందట లోవరు సెకండరీ చదువుతూ పెళ్లాము రజస్వల అయిందన్న శుభలేఖ రాగానే బుచ్చమ్మ ప్రోత్సాహంచేత చదువు మానేశాడతను. అప్పటి పుస్తకాలన్నీ యేమయిపోయాయో సోదికి వెళ్లినా యెవరూ చెప్పలేరు. పొరుగింటి పుల్లయ్య దగ్గిర "రైల్వే లిస్టేపరు" దండిగానే వుంది; గాని యిప్పుడెలా వస్తుంది? తండ్రి దగ్గిర పంచాంగం తప్ప మరేమీ లేదు. అది చలపతికి సుతరామూ నచ్చదు. ఎంత ఆలోచించినా యేమీ తోచక నాలుగు మాట్లు ఆగూడదూ యీగూడదూ జరిగేటప్పటికి బుచ్చమ్మ చదువుకునే లంకారాయాగం దొరికింది. తానేదో మహా చదివేసి పొరగ తెస్తున్నాడని జోగమ్మ అనుకోవాలని కదా యీ పాట్లన్నీని? ఆమె గదిలో నిద్రపోతూ వున్నప్పుడు కాస్తనేపు కాగితా లటూ యిటూ తిరగవెయ్యడానికి యే పుస్తకమైతే యేమీ? ఇలాంటి ధైర్యంతో అతనదే పుచ్చుకుని దీపం దగ్గిర కూచున్నాడు. ఇదంతా చూస్తూ వున్న బుచ్చమ్మ "తెల్లవారడంతోటే నాన్నని పంపి బాలరామాయణ మేనా పెద్దచ్చు అమర మేనా తెప్పించా" లని నిశ్చయం చేసుకుంది.

అబ్బాయిచేత బి. యే. ప్యాసు చేయించి "మేస్ట్రీటు"పని చేయించాలని జగ్గయ్య యింగ్లీషు చదువులో ప్రవేశపెట్టగా చలపతి ఫస్టుఫారంలోనే దండయాత్రలికి మొదలుపెట్టి ఏడేళ్లు!—అంటే పద్ధతి మిగోరేట ఫర్డుఫారం చదువుతూ జమాబందీ పూర్తి చేసేశాడు. అంచేత అతని కింగ్లీషు అంటలేదు. పాఠశాలకే బలామూ రవడంచేత తెనుగు గుంటపువ్వులు పూసింది. పైగా ఆలంకారయాగం చెన్నపట్నంలో ధబడధక్కా మొదలియారు స్వయంగా పరిష్కరించి స్వకీయ ఆరుముగం ప్రెస్సులో అచ్చువేసింది కూడానూ.

అయితే యేమీ? చమురు నిండా వుండడంచేత దీపం బంతిపువ్వులాగ వెలిగిపోతూనూ వుంది. పుస్తకంలో మొదట్నుంచి చివరికీ, చివరనుంచి మొదటికీ కాగితాలు గిర్రున తిరిగిపోతూనూ వున్నాయి. "తమ్ముడు నామాట తీసెయ్యడు" అని బుచ్చమ్మ గర్వపడుతూనూ వుంది. ఇంటో జోగమ్మ యిక్కడ గొడవ లేమీ బోధపడక తెల్లపోతూనూ వుంది. ఇలాంటి సమయంలో యెప్పుడు వచ్చిందో యెవరికీ తెలవకుండా వచ్చి గాఢ నిద్ర అందర్నీ ఆలముకుంది. ధళ్లున తెల్లవారేక అప్పలమ్మ వచ్చి "బుచ్చమ్మగోరూ, బుచ్చమ్మగోరూ" అని పదిమాట్లు తలుపు గుంజేదాకా యెవరికీ మెలకువ రాలేదు.

౪

అప్పు డేనా అందరిలోనూ ముందు జగ్గయ్య మేలుకున్నాడు. కళ్లు నులుముకుంటూ లేచి కూచుని యెదట చూశాటప్పటి కతనికి వెలవెలపోతూ వున్న దీపం దగ్గిర కొట్టేసిన పాములాగ పడివున్న దలపతి కని పించాడు. దానికి కారణం తెలవక తట్టి లేపి "యిక్కడ పడుకున్నావేం నాయనా" అని అత వడగ్గా దలపతి "అక్క చదువుకో మంటూ నాలుగ్గంటలికే లేపిం"దని చెబుతూ, తూలుతూ తూలుతూ దొడ్లోకి చక్కా పోయాడు.

ఇదయిన తరవాత వాకిట్లో బుచ్చమ్మ, యింట్లో జోగమ్మ వొక్కమాటే లేచారు. ఆలేవడంలోనూ కూడా బుచ్చమ్మ మరద లివతలికి వచ్చిందా లేదా అని చూస్తూనే లేచి కూచుంది. ఇద్దరూ మొగాలు కడుక్కొ నేటప్పటికి రెండు బారల పొద్దెక్కింది. అందు కేదో మునిగిపోయినట్టు కంగారుపడుతూ బుచ్చమ్మ తననీ, మరదలినీ కూడా కలిపి "వేడిసినట్టుగానే వుంది తెలివి. ఇంత పొద్దెక్కేదాకా లేవకపోతే యెలాగా?" అంటూ వొక్కమాటు సాగదీసుకుని, "వంటిల్లు అలుకు" అని మరదలికి పురమాయించి, వీధిలోకి వెళ్లింది. అప్పటి కప్పుడే పక్కయింటి సోదెమ్మ వీధిలో నుంచుని కరి వేపాకూ, కొత్తిమిరీ, పచ్చిమిరపకాయలూ—ఇలాం టివి కొంటోంది.

"వో సేవు సోదెమ్మోయి! రాత్రి మా మరదలు వచ్చింది సుమా" అంటూ బుచ్చమ్మ ఆగుమ్మంలోకి వెళ్లగా "నే నలాగే అనుకున్నాను అయితే "వొదినా సుఖంగా పడుకోకుండా నాలుగ్గంటలికే లేపా వెందుకే వాళ్లనీ" అని సోదెమ్మ అడిగింది. తరవాత యిద్దరూ ఆమాటా యీమాటా అనుకున్నారు. "ఇదిగో వచ్చే" అని యింటోవాళ్లకి బదులు చెబుతూనే సోదెమ్మ "వెళ్లాలి. బోలెడు పని వుంది" అంటూనే బుచ్చమ్మా అలాగే నుంచున్నారు. మొత్తానికి అరగంట అయితే గాని ఆయిద్దరూ అక్కణ్ణుంచి కదలలేదు. అప్పు డేనా "అయ్యో! నీ తెలివి తెల్లవారిపోనూ! చెప్పావే కాదే మీకేం మాకళ్లే?" అని వొకతే, "అయ్యో! నీ మొగం యీడ్వా! నేను మాత్రం చూశానా యేమిటే?" అని వొకతే అంటూ యిద్దరూ ఈయింటోకి చక్కావచ్చారు. అప్పటి కప్పుడే జోగమ్మ ఆడబడుచు చెప్పిన పని ముగించి, కళ్లకి కనపడిన వొకటి రెండు చిన్నపనులు కూడా చేసేసి, పుట్టింటినుంచి తెచ్చుకున్న సామాను గదిలో సద్దుకుంటోంది.

ఆమె, గుమ్మంలో అడుగు పెట్టాటప్పటికి మొట్ట మొదట కనిపించేలాగ బల్లమీద మునిముందు హార్మోని యం వుంచింది. దాని తరవాత ట్రంకూ, బొట్టుపెట్టీ, పాందానూ, పీకిదానూ, వెండిచెంబూ వరసగా పెట్టింది నవలలూ, పాటల పుస్తకాలూ, వసవభారతమూ, సంగీత దర్పణమూ వగైరా పుస్తకాల దొంతర ట్రంకుమీద పెట్టింది. ఇదయిన తరవాత పింగాణీవంటల బట్ట విప్పు తోంది. ఈసమయంలో వచ్చారు అక్కడికి ఆ విరం తువు లిద్దరూనూ.

బుచ్చమ్మ పరాయివాళ్ల యింటో చూసినట్టు చూసి మూతి ముడుచుకుంది. సోదెమ్మ మాత్రం అలా కాక అవన్నీ నిదానించి చూసి "మంచమూ, అవ్వి ఎప్పు డు పెడతారు మీ వాళ్లు?" అని అడిగింది. దానిమీద జోగమ్మ "మానాన్నా మా అమ్మా వెళ్లాళ్లలోవచ్చి, పందిరిపట్టె మంచమూ, పరుపూ, కావడిపెట్టీ, బిందెలూ తమ్మే, కుర్చీలూ, నిలువుటద్దమూ, కడవరాతిబల్లా, వెండికంచమూ- ఇంకా యిలాంటివి కొని యిస్తా" రని చెప్పింది. "బాగానే వుంది" అని అందుకు సోదెమ్మ సం తోషించగా బుచ్చమ్మ "భోగందాని కిచ్చినట్టు ముందు ఆరణ్ణీ యిచ్చారు కదా?" అంటూ సోదెమ్మ నివతలికి లాక్కువచ్చింది.

అది విని జోగమ్మ చిన్నపుచ్చుకుంది. "అలా అంటా వేమిటే" అని సోదెమ్మ నొచ్చుకుంది.

౫

తరవాత ఆ యిద్దరూ గోదావరికి వెళ్లిపోయారు. అప్పుడే కాఫీహోటలునుంచి వచ్చిన దలపతి హార్మోని

యం చూశాటప్పటికి కూనిరాగం వుబకగా "సంగీతం బాగా నేర్చుకున్నావా నువ్వు?" అంటూ గదిలోకి వెళ్లాడు.

"కొంచెం నేర్చుకున్నాను. మీరు కాఫీ పుచ్చుకున్నారా?"

"ఇప్పుడే వచ్చాను వరదారావు హోటలునుంచి"

"నాకు కాస్త వుప్మా తెచ్చిపెట్టరూ?"

"మా అక్కని రానియ్యి"

"ఎందుకూ?"

"మరి డబ్బులో?"

"మీ రెలా పుచ్చుకొని వచ్చారూ కాఫీ?"

"ఎప్పుడూ లేదు గాని యెంకేతో మా అక్క కనకి తాళే యిచ్చింది డబ్బు లివాళ"

"మీ దగ్గిర డబ్బేమీ లేదూ?"

"తాళం మా అక్క దగ్గిరే వుంటుంది"

"పోనీ నే నిస్తాను తెచ్చి పెట్టండి"

"ఛే"

"ఈ సంగతి రహస్యంగా వుంచుతారా?"

"ఏం?"

"ఏమీ లేదూ"

"మా అక్క అడిగితే?"

"ఆవిడ కెందుకు తెలవాలి?"

"నువ్వు తినడం చూస్తే?"

"నే నెవరూ చూసేలాగ తినను. మీరు కూడా ఎవరికీ కనపడకుండానే తేవాలి"

"తరవాత తెలిస్తే మాఅక్క "వాతో యెందుకు చెప్పావు కా"వని గదుముతుంది బాబూ"

"అయితే వొద్దు లెండి. కూచోండి. ఇలా అడిగానని మాత్రం చెప్పకండేం?"

"ఏమీ అనను లే"

"అవడా దాకా యెందుకూ? మీరు చెప్పనే వద్దూ"

"నీకు ముఖారిరాగం వచ్చునా?"

"వచ్చును. చెప్పకండేం"

"చల్ మోహనరంగా' వచ్చునా?"

"తప్పూతెప్పూ. అది నాకు రాదు. వుప్మా సంగతి మీ అక్కతో చెప్పకుండా వుంటారు కామా?"

"పోనీ" "సిరిసిరిమువ్వ పాడగలవా?"

"అవేమి టండీ అలాంటి వదుగుతారూ? మీరు నేర్చుకున్నారా యేమి టది?"

"వంచేసి పాడతాను నేను"

"మీ అక్క నేర్పిందా?"

"బండి అప్పలసామి నేర్పాడు. అలాంటివి చాలా వచ్చును నాకు. "అప్పనా తనా మనా" "ఓరోరి బండివాడా" "గోంగూరకీ—నేను పాడతాను నువ్వు హార్మనీ వాయిస్తావా?"

"అది నాకు రాదు. నేను వాయించలేను"

"మరేం నేర్చుకున్నావూ?"

"వాతాపిగణపతీ, రామభక్తి, రామ నీ సమానమూ, మనసు కరుగ దేమీ—"

"వోస! పూర్వకాల పాటలా? ఇప్పు డెవరికావాలీ అవి?—పోనీ నీకు వచ్చిం దేదో వొకటి పాడెయ్యి తొరగా"

జోగమ్మ మనస్సు చివుక్కు మంది. తన భర్త స్థితి అంతా ఆమెకి తెలిసిపోయింది. ఆడబతుకు సంగతి అలా వుండగా యీ వుద్యోగం కూడా యేమిటి? ఆ పద్ధాలుగేళ్ల పిల్లకి భవిష్యత్తేమీ బోధపడలేదు. తల తిరిగిపోయింది. ఈకారణంచేత ఆమె నుంచోలేక కుర్చీలో కూలబడగా అదేమిటో యెరగని చలపతి "మా అక్క రాకుండా తొరగా వొక పట్టు పాడేసెయ్యి" అని తొందరపెట్టాడు. దీనితో పుండుమీద కారం చల్లిన ట్టయిం దామెకి.

"మీ అక్క వస్తే యేమి?"

"తిడుతుంది"

"ఎవర్ని?"

"నిన్నూ నన్నూ కూడానూ"

"మీరా రింకా ఆవిడిచేత తిట్లు తింటున్నారా?"

"లేకపోతే చంపెయ్యడూ?"

"అం ఛే!"

"అన్నం పెట్టడు. గుమ్మంలోకి రానివ్వడు"

ఆమెకి మీది ప్రాణాలు మీదికే దొంగిరిపోయాయి వొక్కక్షణం ప్రపంచకం తెలవలేదు; కాని విచారిస్తేనూ, తెల్లపోతేనూ యేం లాభమూ! కన్నీటిని రెప్పలలోనే అప్పళించుకుంది. దుఃఖాన్ని దిగమింగుకుంది. కొంచెం ధైర్యం తెచ్చుకుని యేదో అనపోయింది; గాని అతను పడనివ్వలేదు. "వో పాట పాడు" అని మళ్లీ తొందర పెట్టాడు. హార్మోనియం తీసేదాకా తొందరలు విడిపించాడు కూడానూ.

మొగుడెంత తెలివితక్కువవాడైనా పెళ్లాం అన్నాక విధేయత చూపించక తప్పదు కాదూ? మూర్ఖులైన భర్తలు ఈ సద్గుణాన్ని దురుపయోగం చేసినా భారతస్త్రీకి సభ్యత కలిగించిన యోగ్యత యిదే. ఇది వొక్కొక్క చోట దంపతుల అనురాగానికీ సౌఖ్యానికీ భంగం కలిగిస్తూవుండడం నిజమే; కాని ప్రేమ వున్నచోట త్యాగానికి వెనకతీత వుండదు.

చేసేది లేక జోగమ్మ మాట రాకపోగా హార్మోనియం మట్టుకు వాయించసాగింది. "తొలి నే జేసిన పూజాఫలములు" అనే కృతి హార్మోనియంలోనుంచి నింపాదిగా మొలచుకువస్తోంది; కాని అతని కదేమీ నచ్చలేదు. ఈసరికి వచ్చిన మట్లన్నీ వొక్క నిమిషంలో దానిమీద పాడేయ్యాలని నాలుగు మెట్లమీద వేళ్లు పెట్టి "భాంయి" మనిపించి, యింకట్లో బుచ్చమ్మ వచ్చిన సవ్వడి కాగా గభీమని వొక్క గంతులో యివతలి కుడాయించాడు. జోగమ్మ అందుకే తెల్లపోతూ వుండగా బుచ్చమ్మ బింద బుజమ్మీద వుంచుకునే యేదురుగా వచ్చి "మా మర్యాదా తక్కనివ్వవూ? నేను బతికివున్నంత కాల మేనా అర్మణీ కట్టిపెట్టు. తరవాత నువ్వేలాగా భూమ్మీద మన్నవు" అంటూ గింజుకుంది.

౬

జోగమ్మ ఉలిక్కిపడింది. "ఎందు కిలా తిట్టడం? హార్మణీ వాయిస్తే యేం తప్పా?" అని ఆమె ఎంతో దేవుళ్లాడింది. కాస్తైతే వచ్చినప్పణ్ణుంచీ బుచ్చమ్మ వాలకం తెలుస్తూనే వుంది. అయినా అది యింతలో యింతగా ముదిరిపోతుం దని ఆమె అనుకోలేదు. ఆమె తల్లి అయిన పూర్ణమ్మ మాత్రం యిదివరకే కనిపెట్టింది సంగతంతానూ. బుచ్చమ్మ, వితంతువై వుండిన్నీ పెళ్లిలో అన్నింటికీ తనే ముందుకు వస్తూ ప్రతీదానికీ పెద్దరాలు తీసి, కసూస్తులు పన్నడమూ, నలపతిని ఫలహారానికి రానివ్వకపోవడమూ, అ క్రమం చంమీద తగని పట్టు పట్టించడమూ, నాగవిల్లి నాటి పట్టు చీర వెనక్కి పెట్టించి తన కూతురికి పాదాచీర యిప్పించడమూ, పూర్ణమ్మ మరిచిపోలేదు. తరువాత రెండు మూడు మాట్లు తమ్ముడుతో తమ యింటికి వచ్చినప్పుడామె చేసిన పెంకితనంగూడా ఆమె మరిచిపోలేదు. మొత్తంమీద మొగుడి అప్రయోజకత్వమూ, ఆడబడుచు రాగతనమూ, తన కూతురికి ముందు ముందు చాలా ముప్పు కలిగిస్తా యని ఆమె ముందే గ్రహించింది.

కనక ఆమె కూతుర్ని అందుకు తగినట్టుగానే తయారుచేసింది. జోగమ్మేనా సహజంగా పిరికిదీ గాని వాజమ్మ కాదు. ప్రొల్లో పట్టుచీర వెనక్కి పెట్టించినప్పణ్ణుంచీ ఆమెకి బుచ్చమ్మమీద గుర్రగానే వుంది. మొగుడు తులసీదా సని యిప్పుడు ప్రత్యక్షంగా తెలియడంతోటే ఆమె భవిష్యత్తుని గురించి ఆలోచనలో పడింది. పైగా "తాళాలు నీ మామగారి చేతుల్లో వుండాలి. లేకపోతే నీ మొగుడిచేతుల్లో వుండాలి; అలాగా లేకపోతే నీచేతుల్లో వుండాలి; గాని నీ యింటో పెత్తనం చెయ్యడానికి ఆపేను గెవరూ!" అని తల్లి చెప్పిన మాట ఆమెకిప్పుడు పట్టున జ్ఞాపకం కూడా వచ్చింది.

అయితే తోలిమాటు వచ్చాటప్పటికే కథ యిలా అడ్డం తిరిగింది. ఇప్పు డేమిటి చెయ్యడం? బుచ్చమ్మకి స్థానబలం వుంది. తండ్రిబలం వుంది. తమ్ముడిబలం వుంది.

ఇరుగూ పొరుగూ ఆసరా వుంది. జోగమ్మ కేం వుందీ పాపం! కాన్నైతే ఆమె పిసింగ్రీదే. అందుకు సందేహం లేదు; కాని బంగారపు పళ్లేనికైనా గోడ చేరుపు వుండాలి. వచ్చీరావడం తోటే కజ్జాకి సిద్ధపడితే జయం మాట యెలావున్నా లోకులు ఏకెయ్యరూ? ఏ పొరుగు ముసలమ్మైనా తనకి ఆసరా అవుతుందన్న భరవసా లేన ప్పుడు న్యాయపక్షం తన దైతే మాత్రం యేమి లాభ మూ? జోగమ్మ యిదంతా ఆలోచించింది. పైగా తల్లీ దండ్రీకూడా కొద్ది రోజుల్లోనే వస్తా రాయె. ఇంతలో తొందరెందుకూ?

ఇలా అనుకుని జోగమ్మ వోపిక పట్టింది. బుచ్చమ్మ యెప్పుడు చూసినా ధుమధుమ లాడు తూనే వుంటుంది. దీనికి సాయం చలపతి పెళ్లా మనీ, అచ్చటనీ, ముచ్చటనీ యెరగ డాయె. అయినా ఆమె తేలిపోలేదు. బుచ్చమ్మ యెన్ని మాట లంటూ వున్నా జవాబు లేదు. వచ్చిన మూడోనాటి రాత్రి తీరా యిక పడుకోడమే అనగా "ఇవాళ హరిశ్చంద్ర నాటకంట కాదూ? చూడవుట్రా తమ్ముడూ!" అని అర్ధరూపాయ చేతి కిచ్చి బుచ్చమ్మ చలపతిని పంపె య్యగా ఆరాత్రి మాత్రం బేలపోయి ఆమె వొక్క గంటసేపు కుమిలి కుమిలి యేడ్చింది.

౨

అసహాయస్థితిలో యెలాంటి వాళ్లకీ కూడా ధైర్యం తనంతట అదే వస్తుంది. పైగా అలాగ గంట సేపూ యేడ్చాటప్పటికి జోగమ్మకి కొంత భారం తగ్గి పోయినట్టయింది. హృదయం కొంచెం తేలికపడింది. పదకొం డయేటప్పటికి నిద్రకూడా పట్టింది.

మూడింటికి చలపతి యింటికి వచ్చాడు. అత గాడు పిలవడమూ, బుచ్చమ్మ తలుపు తియ్యడమూ, "నీ కిప్పుడు నాటకా లేమిటి, నాయనా?" అని జగ్గయ్య మందలించడమూ — యీ సందట్లో నిద్రాభం గం కాగా జోగమ్మ మొగుడు యింటికి వస్తా డని గడియ తీసి వుంచింది; గాని "తెల్లారిపోతోంది" అంటూ బుచ్చమ్మ చలపతి! వాకట్లో అరుగుమీద తుంగచాప పరిచింది.

దీనితో జోగమ్మకి యింతదాకటి కంటెనూ యె క్కువ దుఃఖం వచ్చింది. తనవల్ల యేదేనా తప్పుండినా, మొగుడికి తనమీద యేమేనా కోపం వుండినా యిందు కామెకి కష్టం లేకపోవును. కాని యిదేమిటీ?

తనే తమ్ముకుని తనకి తనే దీవించుకున్నట్టు జోగమ్మ కొంతసేపటికి తన్ను తానే వోదార్చుకుంది,

కళ్లనీళ్లు తుడుచుకుని గోడ వేపుకి తిరిగి పడుకుని. ఆమె ఆలోచన మొదలు పెట్టింది. "దీనికి వుపాయం యేమిటీ?" అని ఆమె సంగతి యెత్తుకు నేటప్పటికి "బుచ్చమ్మకి యీ పెత్తనం యెలా వచ్చిందీ?" అని యెవరో అడిగినట్టయింది ఏలా వచ్చిందీ? చలపతి తుంటరివాడు కనక. అతను బుచ్చమ్మ చేతులో వున్నాడు కనక. కనక యిప్పుడు చెయ్యవలసిం దేమిటీ? ముందు చలపతినీ, బుచ్చమ్మనీ విడతియ్యాలి. తమ్మాలంగా అత న్ని తాను లోపు చేసుకోవాలి. జగ్గయ్య యేమీ కలగ చేసుకోడం లేదు కనకనూ, చలపతి స్వయంగా సంసారం దిద్దుకునే టంతవాడు కాడు కనకనూ యింతకంటే మరో వుపాయం లేదు. ఇంకో మార్గం లేదు.

౩

జోగమ్మ యిలా నిశ్చయం చేసుకుని చదరంగపు ఆట మొదలు పెట్టింది; కాని రెండు దినాలు గడిచా టప్పటికే బుచ్చమ్మ యీ సంగతి కనిపెట్టేసింది. జోగ మ్మా, చలపతీ యేకం అయూ రంటే యిక తన కేం వుందీ? యథార్థంలో అంతే అయినా బుచ్చమ్మకి "మనోవృత్తిముండ" గా మాత్రమే వుండిపోవడం యిష్టం లేదు. ఇంటి పెత్తనం తనే చెయ్యాలి. జోగ మ్మని ముప్పతిప్పలూ పెట్టాలి.

మొదణ్ణుంచీ చలపతి తన చెప్పుచేతల్లోనే వుండ డంచేత బుచ్చమ్మ "తమ్ముడు నామాటే వింటా" డని మొదట గర్వించింది; కాని చివరికి విషమించేలాగ కన పడగా శ్రద్ధపట్టింది.

మొట్టమొదట బుచ్చమ్మ "పగలు పెళ్లాంతోటి అట్టే మాట్లాడకూడదు" అని వొక ధర్మసూత్రాన్ని తమ్ముడికి వుపదేశించింది. తరవాత వొకనాడు జోగమ్మ తల దువ్వడం కోసం మొగుణ్ణి యింటోకి రమ్మని సంజ్ఞ చేసి పిలవగా బుచ్చమ్మ అది కనిపెట్టి "పని వుంది యిలా రా తమ్ముడూ" అని పిలిచి వంటింటి వసారాలో కూచోపెట్టి తానే తల దువ్వేసి పంపేసింది. మర్నాడు తనే తొందరపనిలోనో వుండగా జోగమ్మ చటుక్కున మొగుణ్ణి యింటోకి పిలవడం గమనించి "ఎంత గొంతుక చించుకున్నా పలకవేమిటే మా తల్లీ!" అని విసుక్కుంటూ వెంటనే జోగమ్మని ఇవతలికి రప్పించింది. తను గోదావరికి వెళ్లినప్పుడు జోగమ్మ తమ్ముడికి యేం విరుగుడు మాటలు చెప్పి పోతుందో అని ఆమె రెండు మూడు మాట్లు తనతో రమ్మని పిలిచింది; గాని "గోదావరిలో దిగితే నాకు జబ్బు చేస్తుంది బాబూ" అని జోగమ్మ తిరస్కరించేసింది. అంతట "యిది కాదు మార్గం" అని బుచ్చమ్మ సరిగ్గా తను గోదావరికి వెళ్లేటప్పుడు తమ్ముడికి యేదో పని పురమాయించి వూళ్లోకి పంపడం ప్రారంభించింది. ఇది గ్రహించి వొకనాడు జోగమ్మ ఆడబడుచు గోదావరికి వెళ్లే ప్రయత్నంలో వుండగానే చలపతిని "తమలపాకులైపోయా" యని బజారుకి పంపి బుచ్చమ్మ సున్నం దిగిన వెంటనే యింటికి వచ్చేటట్టు చేసింది. ఇంకో రోజున సరిగా ఆసమయానికి పొరుగింటికి వెళ్లి యేదేనా కథల పుస్తకం తెచ్చిపెట్టమని పంపింది. మరో రోజున వొక కాని డబ్బు చేతులో పెట్టి "చీనా పంచదార తెచ్చిపెట్టండి" అని బజారుకి పంపి బుచ్చమ్మకి కనపడకుండా చేసింది. మర్నాడు బుచ్చమ్మ నెగ్గింది. ఆమర్నాడు మళ్లీ జోగమ్మ గెలిచింది.

౬

ఇలాగ వొక్క వారం గడిచిపోయింది. పైకేమీ గొడవలు కనపడవు; గాని లోపల్లోపల మాత్రం తాపాలు పెరిగిపోతున్నాయి.

ఒకనాడు సోదెమ్మ పెత్తనాలకి వచ్చి కూచుంది. అప్పటికి వాకట్లో కూచుని బుచ్చమ్మ చలపతికి తల దువ్వుతోంది. రూపొందిన అసంతృప్తి లాగ జోగమ్మ స్తంభాన్ని చేరబడి నుంచుని వుంది. సోదెమ్మ కూచుంటూ, కూచుంటూ జోగమ్మ కేసి చూడగా జోగమ్మ సోదెమ్మ కేసి గురగుర చూస్తూ యింటోకి చక్కాపోయింది.

జోగమ్మ చూపుల్లో సోదెమ్మ యేం కనిపెట్టిందో యేమిటో వూరికే కూచోక "నువ్వు దువ్వుతున్నావేమే?" అని బుచ్చమ్మనీ, "పెళ్లాంచేత దువ్వించుకోడానికి సిగ్గా యేమిటిరా బావా?" అని చలపతినీ అడిగి, అంతటితో పోనీయక "చక్కగా క్రాపింగు పెట్టుకోక ఆడదానికి లాగు అంత జుట్టేమిటిరా యీ రోజుల్లోనూ?" అని కూడా అడిగింది.

అసలలాంటప్పుడు సోదెమ్మ రావడమే బుచ్చమ్మ కిలాగో వుంది. వచ్చిన మనిషి వచ్చినట్టు నోరు మూసుకుని కూచోక తల దువ్వడం మాట తెచ్చేటప్పటికి ఆమెకి పిసాళం యెత్తుకొచ్చింది. ఆపైని క్రాపింగు మాట తెచ్చేటప్పటికి వొళ్లు మంటెత్తిపోయింది. దానితో బుచ్చమ్మ యిక వూరుకోలేకపోయింది. "నా మొగం చూసేనా అదివూరుకోనప్పుడు దాని మొగం చూసి నేను మాత్రం యెందుకు వూరుకోవాలి?" అనుకుంది. వెంటనే రుసరుస లాడుతూ "ఇంట్లో వున్న ఆడపిల్లలు తెలివితేటలూ, భయభక్తులూ వున్నవాళ్లయితే పైవాళ్లు తల దువ్వమ్మా అని పూనుకు వచ్చి యిలా అడగ్గలరా? సిగ్గు కాకపోతే మాత్రం పెళ్లాం వచ్చాక తక్కినవాళ్లందర్నీ తీసిపారెయ్యాలా యేమిటి? తల దువ్వి దిక్కు లేక క్రాపింగూ పెట్టించుకోక, బోడిగుండూ చేయించుకోకపోతే యిక యేం చేస్తాడూ మా వాడూ? గురివిందగింజ తన నలుపెరగదుట. వొకళ్ల యింట్లో మాత్రం యింతకంటే బాగా యేడుస్తోందా యేమిటి? అయినా కొంతమంది కదేమిటో కళ్లల్లోనే వుంటుంది విషం" అని విసిరి కొట్టింది.

సోదెమ్మ మనస్సు చివుక్కుమంది. "యేదో యథాలాపంగా అన్నమాటకి యింత అల్లరి యేమిటే మా తల్లీ" అని చాలా నొచ్చుకుని ఆమె యిక అక్కడ కూచో

లేక తటాలున లేచి వెళ్లిపోయింది. అది చూసి "వెళ్లిపో. నా కేం దిగదుడుపుంటా యేమిటి?" అనుకుంది బుచ్చమ్మ వీధిగుమ్మం దాటాక. "దీని కెప్పుడూ యిలాంటి వెధవ గుణాలే" అనుకుంది సోదెమ్మ.

బుచ్చమ్మ ఆరోజంతా సోదెమ్మమీద ధుమ ధుమలాడుతూనే వుంది; కాని యీ ప్రసంగం మాత్రం జోగమ్మకి చాలా వుపకరించింది. ఆరాత్రి ఆమె చలపతికి తమలపాకుల చిలక లందిస్తూ "ఇందాకా సోదెమ్మ అక్కగా రన్న మాటలు వినిపించుకున్నారా? ఏ మొగాడేనా యింట్లో పెళ్లాం వుండగా మరో ఆడదానిచేత తల దువ్వించుకుంటాడా? మీ అక్క మీకు నే చెప్పకుండా తల దువ్వేటట్టు ఎలా లేచిందో చూశారా?" అని ముద్దుముద్దుగా బుద్ధిచెప్పి, చివరికి "రేపట్నుంచి నాచేతే దువ్వించుకుంటారు కామా?" అని నిలవదీసి అడిగింది.

౧౦

నెల్లాళ్లలో వస్తామన్న జోగమ్మ తల్లీ దండ్రీ పదిహేనురోజులికే వచ్చారు. లెక్కకి పదిహేనే; కాని ఆరోజులు జోగమ్మకి సంవత్సరాలుగా తోచాయి. వారేనా వుండలేకపోవడంచేత నైతే యేమి, నెల ఆఖరుకి కాని రా దనుకున్న సెలవు పదిహేనో తేదీకే రావడంచేత నైతే యేమి పిలిచినట్టు వచ్చారు కనక సరిపోయింది; కాని లేకపోతే యెంత దృఢపరుచుకున్నా ధైర్యం చాలక జోగమ్మ కెంబేలుపడిపోవును. అక్కడికీ, పెట్టెలో పెట్టుకు వచ్చిన మినపసున్ని బుట్టా, అరిసెల బుట్టా పైకి తీస్తూ యేదో తలవని తలంపుగా తన మొహంకేసి చూసి "అదేమే మాతల్లీ అంతగా చిక్కిపోయావూ?" అని తల్లి అడిగేటప్పటికి దుఃఖం వుక్కెత్తుగా పొంగుకు రాగా జోగమ్మ తల్లిమీద వాలి భోరుమంది.

బుచ్చమ్మ కూడా కూడా తిరుగుతూ వేయి కళ్లతో కనిపెడుతూనే వచ్చింది; అయినా యెలాగో సందుచేసుకుని జోగమ్మ సంగ తంతా తల్లికి చెప్పేసింది. అదంతా వినేటప్పటికి పూర్ణమ్మకి అరికాలి మంట నెత్తికి వచ్చింది. వెంటనే ఆమె బుచ్చమ్మని దులిపెయ్యా లనుకుంది; గాని తాము వెళ్లాక ఆమె యింకా బరితెగిస్తుం దేమో అని పస్తాయించి, కోరలు తీసిన తాచులాగ బుస్సలు మాత్రం కొట్టింది. లేకపోతే, కంప మీద బట్ట పడినా, బట్టమీద కంప పడినా బట్టకే నష్టమైనట్టు పుట్టింటివారు తొందరపడినా, అత్తింటివారు తొందరపడినా కోడలుపిల్లకే చిక్కు కదూ?

నాటి మధ్యాహ్నమే అల్లుణ్ణీ, కూతుర్నీ వెంటబెట్టుకుని వేంకటాచలం సకళత్రంగా బజారుకి బయలుదేరాడు. కాని చలపతి వారితో వెళ్లడం బుచ్చమ్మకి సుతరామూ యిష్టం లేదు. వాకిట్లో కూచున్నవారు కూచున్నట్టుగానే బయలుదేరడంచేత ఆమెకి చెప్పడానికి వీలు లేకపోయింది. సంజ్ఞ చెయ్యా లని చూసింది; కాని ఆసమయంలో చలపతి బుచ్చమ్మకేసి చూడనే లేదు. సాయంత్రం యింటికి వచ్చాక ఆమె "వాళ్లు రమ్మంటే వెనకా ముందూ చూడకుండా కూడా చక్కా పోతావా?" అని మొంకట గదిమే తరవాత "ఏ మేం కొన్నా రేమిటి?" అని అడిగింది.

౧౧

మర్నాడు పొద్దున్న బుచ్చమ్మ "వాళ్లు బయలు దేరేదాకా యెందుకూ?" అని ముందే మేలుకుని "ఈ మూ డణాలూ పెట్టి పెసరట్లు తిని, కాఫీ తాగి ధవళేశ్వరం వెళ్లిరా. రానూ పోనూ జట్కాకి పావలా తగలెయ్యడం యెందుకూ? నడిచి వెళ్లి రా" అని చలపతితో చెప్పింది.

"బజారుకి వెళ్లవద్దూ?"

"నీ పెళ్లాం వెళుతోంది చాలదూ?"

"నేను కూడా వెడితే యేం?"

"నిన్ను లోకువ చేస్తారురా"

"..............."

"కాకపోయినా నీ పెళ్లానికి సామాను కొంటూంటే నువ్వు కూడా యెందుకూ?"

"ఏ వ్యక్తి నైనా అదీ నేనూ కొన మన్న వస్తువులే కొంటున్నారు!"

"మామగారు మాట వింటారు; గాని నీ మాట వింటా రనుకున్నావా యేమిటి?"

"వింటాం లేనే!"

"అయితే వెళ్లు. నీ ఖర్మం. నా కేం!"

చలపతికి కడుపులో రాయి పడింది. వెడితే యేమిటో, వెళ్లకపోతే యేమిటో? పది రోజుల కిందట అయితే అతని కీ తటపటాయింపు లేకపోవును. ఇప్పుడు ద్వంద్వ ప్రభుత్వం వచ్చింది. కానైతే బుచ్చమ్మ అధికారం ముందు జోగమ్మ అధికారం తీసికట్టే; అయినా నిరంకుశత్వానికి ప్రతిష్టంభనం అంటూ వొకటి ప్రత్యక్షం అయింది.

చలపతికి బజారుకి వెళ్లా లని యెంతైనా సరదాగా వుంది. వెడితే తనూ పెళ్లామూ వొక బండిలో కూచుని, నిన్నటి లాగ జోగమ్మ చాటుగా తమలపాకుల చిలక లందిస్తూ వుంటే పుచ్చుకుని దర్జాగా వేసుకో వచ్చు. పైగా—ఇవాళ మామగారు తనకి కోరిన కుర్చీ కొంటాడు.

కనక "ధవళేశ్వరం వెళ్లకపోతే యేం?" అను కున్నాడు; గాని అతనికి ధైర్యం చాలలేదు.

ఒకరి కేసి వొకరు చూసుకుంటూ అక్కా, తమ్ముడూ వొక్క క్షణం అలాగే నుంచున్నారు. ఉత్తరక్షణంలో అతని దుర్బలహృదయంలో వొక మెరుపు మెరిసింది. వెంటనే "రే" అని మూ డడాలా పుచ్చుకుని, బుచ్చమ్మ తలుపు తియ్యగా అతను దొడ్డిదారిని బయలుదేరాడు. నాలు గడుగులు వేశాక బుచ్చమ్మ చిటికెలు వేసి వెనక్కి పిలిచి, "పది గంటలికి. తెలిసిందా? ఈలోపుగ ఇంటికి రావద్దు" అని కళ్లు పులకరించుకుంటూ ఆజ్ఞాపించింది. "సరే" అని అతను వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ, కప్పలాగ వురుకుతూ నిమిషంలో మలుపు తిరిగాడు. "పిల్ల కింతే కావాలి" అని బ్రహ్మానందపడుతూ బుచ్చమ్మ యింటోకి చక్కాపోయింది.

౧౨

ఎనిమిదింబావయింది. "అమ్మా! ఈపాటికి కొట్లు తెరుస్తారు లేవండీ తొందరగానూ" అంటూ వెంకటాచలం కూతుర్నీ, భార్యనీ తొందరపెట్టి "చలపతీ!" అని పిలవగా జవాబు రాలేదు. జోగమ్మ పడకగదీ, వీధిగదీ చూసింది; గాని కనపడలేదు "మీ తమ్ముడేడీ?" అని పూర్ణమ్మ అడగ్గా "ఏమో? నే నేమెరుగుదునూ?" అని సాగదీసుకుంటూ బుచ్చమ్మ నూతికి వెళ్లిపోయింది.

వెంకటాచలం పూర్ణమ్మ కేసి చూశాడు. పూర్ణమ్మ జోగమ్మకేసి చూసింది. "ఎక్కడికో పంపేసింది" అని జోగమ్మ అనగా "అవును; ఆపేనుగు పనే యిదీ" అని పూర్ణమ్మ పళ్లు కొరికింది.

వెంకటాచలం వొక్క బండీ తీసుకు వచ్చి బజారుకి బయలుదేరదీశాడు. వాళ్లు గుమ్మం దిగడంతోటే బుచ్చమ్మ మండువాలోకి వచ్చి వీధి కేసి చూస్తూ "ఇక గింజుకోండి...మహా బాగా చేశానూ కాదూ?" అంటూ రాకాసినవ్వు నవ్వుకుంది.

* * * * *

బండి కూరల బజారు దగ్గిరికి వెళ్లింది. బండి వెనక్కాల నడుస్తూ వెంకటాచలం కూతురుతో యేమిటో చెబుతున్నాడు. పూర్ణమ్మ జోగమ్మకి దాన్నే నన్న చెబుతోంది. జోగమ్మ కొంచెం విచారంగా వున్నట్టు కనబడుతోంది.

ఎక్కణ్ణించి వచ్చాడో యిలాంటప్పుడు, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ చలపతి చక్కావచ్చాడు; గాని వెంకటాచలం "యెక్కడికి వెళ్లావోయి?" అని అడిగేదాకా పూర్ణమ్మా, జోగమ్మా కూడా అతగాణ్ణి చూడలేదు.

"ఎక్కడికి వెళ్లా రండీ?"

"..............."

"మాట్లాడ రేం?"

"..............."

"నువ్వే వెళ్ళావా యెవరైనా వెళ్ళ మన్నారా నిన్ను?"

"ఏ మయితే యేం? వూరుకో౦ డింక. సమయానికి వచ్చాడు కదా?"

దానిమీద యెవరూ మాట్లాడలేదు. చురుకూ చురుకూ చూస్తూ జోగమ్మ పోటిచ్చింది. మామగారు నడుస్తూవుండగా తాను బండెక్కవచ్చునా కూడదా? అని అనుమానిస్తూనే చలపతి బండెక్కాడు.

అత్తగారూ మామగారూ పరధ్యానంగా వున్న సమయం కనిపెట్టి చలపతి జోగమ్మ వొళ్ళో వొక కిళ్ళీ పడేశాడు. జోగమ్మ కూడా దాన్ని చడీ చప్పుడూ లేకుండానే నోట్లో వేసుకుని చలపతిలో కలుగుతూ వున్న మార్పుకి చాలా చాలా ఆనందించింది.

* * * * *

పదిన్నరకి, కొనవలసిన సామా నంతా అయింది. వైగ్రాం రోడ్డు దగ్గిరికి వచ్చాక చలపతి బండి దిగి నాళంవారి సత్రం కేసి వెళ్ళిపోయాడు.

వెంకటాచలం, జోగమ్మకోసం కొన్న సామా నంతా వాకట్లో పెట్టి వియ్యంకుడికి చూపిస్తూ వుండగా చలపతి యింటికి వచ్చాడు. అది చూసి "నువ్వు బజారుకి వెళ్ళలేదుట్రా నాయనా?" అని జగ్గయ్య అడిగాడు.

"ధవళేశ్వరం వెళ్ళి వచ్చాను!"

"ఎందుకూ?"

"అక్క వెళ్ళి రమ్మంది"

"ఏం పనీ!"

"..............."

"సంసారికి అనేక పను లుంటాయి. అడిగే దేమిటి బావగారూ?"

వెంకటాచలం యిలా అనేటప్పటికి దాని భావం బుచ్చమ్మమీదికి మొగ్గి వున్నట్టు జగ్గయ్య అనుమానపడ్డాడు. బుచ్చమ్మ తమ్ముణ్ణి వంటింట్లోకి పిలిచి "నేను ధవళేశ్వరం వెళ్ళి రమ్మన్నా నని వాళ్ళు వినేలాగ చెబుతావా నాన్నతోటీ?" అని కళ్ళెర్ర జేసింది.

౧౩

"మీ అమ్మా మీ నాన్నా వెళ్ళారా యింకా వున్నారా చెల్లాయీ?"

జోగమ్మ నూతిదగ్గిర వెండికంచం కడుగుతూ వుండగా యీ మాట వినపడింది. ఆమె అటూ యిటూ చూసింది గాని యెవరూ కనపడలేదు.

"ఇక్కడున్నాను నేను"

అని మళ్ళీ వోమాట వినపడింది. ఈమాటు వెనక్కి తిరిగి చూడగా గోడ అవతల కరివేపచెట్టు కొమ్మల్లో నక్కి సోదెమ్మ మాట్లాడుతోంది.

"ఇంకా వెళ్ళలేదు అక్కయ్యగారూ! ఇప్పుడే వచ్చి బజార్నుంచి, భోజనాలు చేశాము"

"సామా నంతా కొనడం అయిందా?"

"అయింది. వచ్చి చూడరూ?"

"నువ్వు రమ్మన్నప్పుడు వచ్చి చూస్తాను"

"ఇప్పుడు రమ్మనడం లేదూ?"

"ఇలా కాదు"

"............"

"............"

"ఈజన్మలో అలాంటి అదృష్టమే నాకూ?"

"అలా అనకు. అంతా నీదే. తక్కినవాళ్లు నాలుగు మెతుకులికి చేరినవాళ్ళు"

"నేనే యిప్పు డలా వున్నాను"

"నిన్ను చూస్తే నా కేడుపు వస్తోంది. దిక్కుమాలిన పీనుగు చూస్తే పీకేస్తుంది. మరోకప్పుడు మాట్లాడుకుందాము వెళ్ళమ్మా"

"ఉపాయం—"

జోగమ్మ మాట పూర్తి కాకుండానే సోదెమ్మ వెళ్ళిపోయింది. అందుకు జోగమ్మ చాలా యిదయింది;

గాని తటాలున ఆమె హృదయంలో కొన్ని ఆలోచనలు చెలరేగాయి. వెంటనే కంచం కడిగేసి ఆమె యింటోకి చక్కాపోయింది.

* * * * *

జోగమ్మా తల్లీ పడకగదిలో నుంచుని ఏమిటో చెప్పుకుంటున్నారు. కిటికీతలుపులు తీసివుండడంచేత వీధిలో వాళ్ళంతా వారికి కనపడుతున్నారు.

బుచ్చమ్మ వీధిగుమ్మంలో నుంచుంది. వొక వృద్ధబ్రాహ్మడు వీధిలో నుంచుని "ఈయిల్లు యెవరి దండీ?" అని అడిగాడు.

"మాదే"

"మీ యింటి పే రేవరండీ?"

"..............."

"మీ యింటి పే రేవ రండీ?"

"మా యింటి పేరా?"

"అవును"

"ఎందుకూ?"

"వూరికేనే"

"మా యింటి పేరు మద్దూరివారు"

"..............."

"మీ కెవరి యిల్లు కావాలీ?"

"కల్లూరివారిది"

"అలా వెళ్ళండి. ఆనాటా యిల్లే"

ఇలా చెప్పి బుచ్చమ్మ యింటోకి చక్కాపోయింది. ఈమాటలు గదిలో వున్న తల్లికీ కూతురికీ గూడా వినపడ్డాయి.

"ఈయిల్లు మద్దూరివారి దని తేల్చింది చూశావా?"

"ఇంకా రెండేళ్లు పోతే నీ యింటి పేరే పైకి రానివ్వదు. పెళ్లి అయింది; ముండామోసి యింటికి చేరుకుంది; గాని దాని యిల్లని నడివీధిలో నుంచుని చెబుతోంది"

"ఇందుకోసమే కాబోలు యిందాకా పోలెమ్మ అక్కగారు అలా అన్నారు. ఎలాగే అమ్మా మరీ?"

"ఎలాగే అంటే యేం వుందీ?...ఇంతకీ నీమామ గారికి కష్టంగా వుంటుం దేమో అని—"

ఇంతలో వెంకటాచలం వచ్చి "యేమి టమ్మా?" అని అడిగాడు. "ఏమీ లే దండీ నాన్నగారూ" అని జోగమ్మ బదులు చెప్పి కళ్ళల్లో నీళ్లు తెచ్చుకుంది. అది మానీ అతను "ఎందుకూ?" అని అడగ్గా పూర్ణమ్మ సంగతి అంతా చెప్పి "కందుకూరివారి యిల్లని చెప్పక పోవడం యేమిటి? అని అమ్మాయికి కష్టంగా వుంది" అని చెప్పింది.

"ఆమాటలు నేనూ విన్నాను; గాని మన బంగారం మంచిది కాదు. వూరుకోండి"

"అతనికి చేతగాకపోతే అమ్మాయి చేసుకుంటుంది పెత్తనం. మధ్య నీ పేరు గావ రండీ?"

"కొంచెం వోపిక పట్టాలి. కోడలికి కంటే ఆడ బడుచుకే అధికారం యెక్కువ వుండే యిళ్లుకూడా చాలా వున్నాయి. తొందరపడకండి"

"ఎన్నాళ్లూ?"

"దళపతికి జ్ఞానం వచ్చేదాకానూ"

"అందాకా అమ్మాయి బతుకుతుందా?"

"..............."

"ఇక నేను లేనని అనుకోండి నాన్నగారూ?"

జోగమ్మ యిలా అనేటప్పటికి వెంకటాచలానికి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. పూర్ణమ్మ కూతుర్ని పొదివి పట్టుకుని "నీకేం భయ మమ్మా? మనోవృత్తి మనిషి, అదేం చెయ్యగల దమ్మా నిన్ను?" అని వోదార్చి "ఇంకో వారం రోజులు సెలవు కావా లని పైకి రాయండీ. ఆవారమూ కూడా మానీ, వీలులేకపోతే అమ్మాయినీ, అల్లుణ్ణి కూడా మన యింటికే తీసుకువెడదాం" అంది.

"ఆపీనుగ రానిస్తుందిటే అమ్మా?"

"అదీ నిజమే. ఏమంటా రండీ మీరూ?"

"చలపతి మన యింటో వుంటే? ఇక్కడేమా తుందో?"

"అదీ నిజమే. గండ కత్తెర వచ్చి పడిం దండీ యీ భూతంతోటీ"

"సరే. ముందు సెలవు పుచ్చుకుని వస్తాను" ఇలా చెబుతూ వెంకటాచలం సూపర్నెంటు ఆఫీసుకి వెళ్లాడు.

౧౪

"ఇంతకం పై పరోార్థక్యలు వుండి యేడుస్తాయా యేమిటి ముందు? ఏ మయినా సరే వొక మాటు సోదెమ్మగారి యింటికి వెళ్లి వస్తానే"

"నేనూ రానా?"

"కళ్లల్లో నిప్పులు పోసుకోమా?"

"..... ...."

"పోనీ మీ నాన్నని యింటికి రానీ"

ఇలా అనుకుని తల్లీ కూతురూ వాకిట్లోకి వచ్చేటప్పటికి జగ్గయ్య వచ్చి "అమ్మా! గంటిల్లు పట్టాలి కామోసు చూడమ్మా" అన్నాడు. అది విని జోగమ్మ పూర్ణమ్మకేసి చూసింది. పూర్ణమ్మ "బతికాం" అని నింపాదిగా అని "నువ్వు కూడా అమ్మా! నేను వద్దు తాను" అని వంటింటోకి వెళ్లగా, చిటికెలు వేసుకుంటూ జోగమ్మకూడా తల్లి వెనకాల వంటింటోకి వెళ్లింది.

* * * * *

"అక్కయ్యగారూ!"

"..............."

"వీథిగదిలో వున్నట్టుంది. వినపడుతుం దేమోనే"

"వినపడదు... అక్కయ్యగారూ?"

"..............."

"ఆవిడ వాకిట్లో వుందేమోనే అమ్మాయీ"

"ఇంకా వంటింటోనే వున్నారు... "అక్కయ్యగారూ!"

"చెల్లీ!"

"ఏం చేస్తున్నా రండీ?"

"వంటింటో పని అయిపోయింది. వాకిట్లోకి వెళదాం అనుకుంటున్నాను"

"మూడు రోజులు పండుగు వచ్చిం దండీ నాకూ"

"వచ్చిందా? వెయ్యిమంది దేవుళ్లకి మొక్కుకుంటున్నాను మీ వాళ్లు వుండగా యిలా రావాలనీ. మీ అమ్మ ఏం చేస్తున్నారూ?"

"ఇక్కడే వుందండీ. మా అమ్మ మీ యింటికి రావా లనుకుంటూ వుండగా, మామగారు "యిల్లు పట్టమ్మా" అని చెప్పారు నాకు"

"వెర్రి బ్రాహ్మడు. ఏమీ తెలియదు పాపం. సత్యరుషీ. అంచేతే అలా ఆడుతోంది ఆట. పిన్నిగారూ!"

"వింటున్నా"

"అలా రండి దొడ్లోకి"

"వస్తున్నా. నువ్వు సద్దుకోవే తల్లీ వంటిల్లు"

ఇలాగ చెబుతూ పూర్ణమ్మ దొడ్లోకి వెళ్లగా "ఎక్కడికి పంపించిందో యింటో లేకుండానూ?..... ఈ మూడు రోజులూ కంట పడనివ్వకూడదు" అనుకుంటూ జోగమ్మ పనిలో ప్రవేశించింది.

౧౫

చలపతి బజారులో కిల్లీ కట్టించుకుంటూ వుండగా వెంకటాచలం చూసి "ఇంటో తమలపాకు లయిపోయాయిట తెలుసుగుదువా?" అని అడిగాడు.

"నే నెరగను"

"మరి కనుక్కోవద్దూ?"

"తమలపాకులు తెస్తే మా అక్క తిడుతుంది"

"ఏం?"

"ఏమో"

"మీ నాన్న తిడతారా?"

"మా నాన్న తెచ్చుకోమనే అంటాడు. "సంపార్లం కాదూ?" అని మా అక్కే వల్లకాదంటుంది"

"సంపార్లం కనకనే కావాలి. తెలిసిందా? మా అమ్మాయికి చిన్నప్పట్నుంచీ తాంబూలం అలవాటూ. అది లేని రోజు దానికి వుపవాసమే. మేము వెళ్లేదాకా నేనే కొంటాను. తరవాత నువ్వు తెస్తూ వుండాలి సుమా. డబ్బులు మా అమ్మాయే యిస్తుందిలే. భయపడకు."

"అలాగే లెండి"

"పూరల బజారు దగ్గిర కవటాకులు వున్నాయి. పుచ్చుకుందాము రా"

మామగారు కొన్న తమలపాకులూ, అవీ పట్టుకుని చలపతి ఆనందంతో యింటికి వచ్చాడు. మామగారి చేతులో యేవో రెండు పొట్లా లుండడం చూసి అవి ఫలహారపు వస్తువు లని ఆశను పూరుతూ వచ్చాడు; గాని గుమ్మంలోకి వచ్చాటప్పటికి అరుగుమీద బుచ్చమ్మ కనపడగా అతని మొగం గూక్కుపోయింది. పూర్ణమ్మా, వెంకటాచలమూ వుండగా తాను పైట చేరినందుకే వుడికిపోతూ వున్న బుచ్చమ్మ, యిది చూసి తల నేలకేసి కొట్టుకున్నంత యిదయింది."

* * * * *

"వెళ్లక్కర్లేదు"

"మా అక్క పిలుస్తోంది"

"మునిగిపోయే పనేమీ లేదు అవతల"

"ఇప్పుడే వస్తాను"

"ఇప్పుడే వెడుదురు గాని"

"............"

"మా నాన్నగారు ఫలహారాలు తెచ్చారు పుచ్చుకుందాం కుర్చీలో కూర్చోండి"

"............"

"కాఫీ కూడా వుంటే బాగుంటుంది కాదూ?"

"స్ట్రాంగు కాఫీ అయితే మరీ బాగుంటుంది"

"తెస్తారా?"

"............"

"డబ్బులు నేనే యిస్తాను బెంగపెట్టుకోకండి"

జోగమ్మ వాకట్లోకి వెళ్లగా, వెంకటాచలం చలపతిని పిలిచాడు. జోగమ్మ వెండిచెంబు అందించింది. వెంకటాచలం వొక రూపాయి చేతులో పెట్టి "అయిదు కప్పులు కాఫీ, పీబుసం కారాబూందీనీ" అని చెబుతూ వీధిగుమ్మం దాకా వచ్చి సాగనంపాడు. చలపతి బుచ్చమ్మకేసి చూసి బెదురుతూనే వెళ్ళగా "యీ మూడు రోజులూ యిక వీళ్ల భాగోతం ఆడేస్తారు" అనుకుంటూ ఆమె మొగం మాడ్చుకుంది.

౧౬

జోగమ్మ గదిలో కూచుని ఫలహారం చేయిస్తూ తాను కూడా చేస్తూ చలపతికి మరీబోధ చేస్తూ వుండగా పూర్ణమ్మ వంటింటి వసారాలో జగ్గయ్యకీ, వెంకటాచలానికీ ఫలహారాలు వడ్డించింది. అది మెక్కాటప్పటికి ప్రాణాలు లేచిరాగా జగ్గయ్య "ఇదేమిటండోయి భావగారూ? మా యింటో మీకు మేం చెయ్యవలసిన మర్యాదలు మాకు మీరే మొదలు పెట్టారేమిటి?

"మా యింటోనూ మేమే చెయ్యాలి, మీ యింటోనూ మేమే చెయ్యాలి మీకు. ఆడపిల్లని కన్నవాళ్ళం కాదుటండీ మేమూ? మా సంగతంతా మీ అనుగ్రహంమీదే ఆధారపడివుంది"

"మా అనుగ్రహం దెందుకూ? మీ అనుగ్రహమే వుండాలి మాకు. చలపతి భారం అంతా మీదే"

"మీ అమ్మాయి మా దాకా మిగిలిస్తే కదా?"

వెంకటాచలం యిలా అనగా పూర్ణమ్మ అందుకుని "ఈకాలపు మొగపిల్లలికి యెవరూ చెప్పనే అక్కర్లేదూ? అయినా ఆలోటు లేకుండా బుచ్చమ్మ దిద్దుతూనే వుంది చలపతిని" అని సన్నాయి నొక్కులు నొక్కింది.

జగ్గయ్య వులిక్కిపడ్డాడు. జోగమ్మ వచ్చినప్పట్నుంచీ బుచ్చమ్మ వాలకం అంతా కాకపోతే కొంతే

నా తెలుస్తూనే వుంది; గాని కజ్జా అంటే వెనక్కి తీసే వెంకటాచలం యిలా అవడంచేత అది దుర్భర మై పోయివుంటుం దని అతను వూహించాడు.

తరవాత యెవరూ మాట్లాడలేదు. వొకదాని తరవాత వొకటి చొప్పున వారు ఫలహారం పూర్తి చెయ్యగా పూర్ణమ్మ కాఫీ యిచ్చింది. అంతా అయి పురుషు లిద్దరూ లేచారు. లేస్తూ లేస్తూ జగ్గయ్య "భావగారూ! సంగతంతా మీకూ తెలుసును నాకూ తెలుసును. ఈపాటికి మీ రీవూరు బదిలీ చేయించు కోండి" అని చెప్పాడు.

ఇది విని వెంకటాచలం పూర్ణమ్మకేసి చూడగా ఆమె కళ్ళల్లో "వొప్పుకోండి" అన్నట్టు ఆగ్రహం తొణికిసలాడిపోతోంది.

"ఈ విషయం మీరు మీ అమ్మాయితో ఆలోచించారా?" అన్నాడు వెంకటాచలం.

"అవసరం లేదు. అలా చేస్తే మీరు మీ అమ్మాయికి సంరక్షణ చేసినవారూ అవుతారు. దళపతి బాగూ పడతాడు."

"పక్షులు కూడా యేమేనా—"

"మనం ద్వంద్వాతీతులం కాము. నా కొడుకు బాగుపడడమూ, నా వంశం వృద్ధి కావడమూ—ఇదే నాకు ప్రధానం. తప్పకుండా బదిలీ కోరుకోండి"

"మీ సెలవు"

"సెలవో, విధో మీకే తెలుసు"

"అలాగే చేస్తాను"

"అయితే సంతోషమే. ఇప్పటికి వొక భారం తగ్గి పోయింది నాకు"

ఇలా అనుకుంటూ పురుషు లిద్దరూ హాల్లోకి వెళ్ళిపోగా "ఆవున్న భారా లేమిటో యింకానూ?" అనుకుంటూ పూర్ణమ్మ స్థలశుద్ధి చేసేసి, ఈ సంగతి కూతురితో చెప్పడానికి వాకట్లోకి వెళ్ళింది. అప్పటి కప్పుడే జోగమ్మ తాంబూలాలు కూడా ముగించుకుని, గోడలికి తగిలించడానికి కొత్తగా కొన్న పటాలు దళపతి కందిస్తోంది.

౧౭

ఆవేళా, మర్నాడూ, ఆమర్నాడూ కూడా జోగమ్మ గాని, దళపతి గాని వీధిగుమ్మం తొక్కి చూడలేదు. ఎలాగేనా దళపతి నివతలికి రప్పించాలని బుచ్చమ్మ అభూతకల్పనలు చాలా చేసింది; గాని వొకటీ కూడా నెగ్గలేదు. ఎన్నిమాట్లు పిలిచినా దళపతి పలకడమే మానేశాడు. చాలా సేపు గుట్టుగానే పడివుండి చివరికి పట్టలేక పూర్ణమ్మ నడగ్గా "ఏమో! నే నే మెరుగుదునూ?" అని తన మాట తనకే అప్పగించేసి లోపలికి వెళ్ళిపోయింది. "ఇదిగూడా చూసే వొది లెద్దాం" అనుకుని "తమ్ముడేం చేస్తున్నాడు నాన్నా?" అని అడగ్గా అతను నిర్లక్ష్యంగా జవాబు చెప్పి వీధిలోకి వెళ్ళిపోయాడు.

దీనితో ఆమెకి వుక్రోషం వుధృత్తంగా పెరిగిపోయింది. వూసిపోడాని కేనా మాట్లాడేవాళ్ళు లేకపోవడంచేత సోదెమ్మని విసిరికొట్టిన దుడుకుతనం ఆమెకిప్పటికి బోధపడింది. ఇంతకీ "సోదెమ్మగూడా వాళ్ళతో కలిసిం దేమో" అని ఆమెకి అనుమానం కూడా కలిగింది.

ఇక యేమిటీ చెయ్యడం? వొళ్ళంతా చీమలూ, జెర్రిలూ పాకిన ట్టుండగా ఆమె ఆవేళ రాత్రి ఆకల్లేదని చెబుతూ పిండి తినడం మానేసింది. రెండో రోజు రాత్రి సగం సగం తిని మజ్జిగ పోసుకోకుండా లేచిపోయింది. మూడోనాడు మధ్యాహ్నం ఆర్యాపురం వెళ్ళి విందు కుడిచి వచ్చింది; గాని యేం చేసినా యెవరూ యేమీ అనలేదు.

ఏమీ తోచక మూడోనాడు సాయంత్రం గోదావరికేసి షికారు బయలుదేరగా అక్కడ బయట చేరిన వొక స్నేహితురాలు కనబడి లోకాభిరామాయణం విడేసింది. కొంతసేపటికి పుట్టింటూరు వచ్చి జోగమ్మకి సామాను కొనడం మాట వచ్చింది. అందులో దళ

పతి దగ్గిరవుండి స్వయంగా కుర్చీ వేయకున్న సూక్ష్మాతి సూక్ష్మవిషయం కూడా పైటికి వచ్చింది.

దానితో బుచ్చమ్మకి కొట్టినంత పనయింది. "కూడకాలు పుచ్చుకుని కూడా యింత పని చేసిన చల పతి యింకా యెంత పని చేస్తాడో—వాళ్లు చేయిస్తారో?" అని గాభరా పుట్టింది. వెంటనే—యిక అక్కడ క్షణ మేనా వుండలేక, కొంప మునిగిపోతోం దన్నంత కారణం యేదో కల్పించి, అమాంతంగా లేచి నుంచుని, "కాస్సేపు వుండకే మాతల్లీ" అని రెండో ఆమె కోసురుతూ వుండగానే గిరుక్కున వెనక్కి మళ్లింది.

౧౫

బుచ్చమ్మ యిలా గోదావరికి బయలుదేరగానే పూర్ణమ్మ కోవాబిళ్ళలు తెమ్మని చలపతిని కాఫీహోటలుకి పంపింది. ఆమె "వెంటనే రావాలి సుమా" అనే చెప్పింది. గాని వరదారావు హోటల్లో అవి అయిపోవడంచేత అతనికి దామోదరరావు హోటలుదాకా వెళ్లవలసివచ్చింది. అక్కడికీ కోవా పుచ్చుకున్న తరవాత అతగాడు వాయువేగ మనోవేగాలమీదే బయలుదేరాడు; గాని నోరివారి యింటి దగ్గిరికి వచ్చేటప్పటికి బుచ్చమ్మ కలుసుకుంది. దానితో ప్రాణాలు ఎగిరిందిపోయినట్టు కాగా నిర్ఘాంతుడై పోయి అతను కదలలేక పోయాడు.

"అనుగ్రహం తప్పినట్టుందే?"

"............."

"మాట్లాడవేం?"

"............."

"పోట్లన్నారా మేమిటి వాళ్లు?"

"............."

"మొగం అలా తిప్పుకుంటావేం?"

"............."

"వినపడ్డం లేదుట్రా?"

"ఏం?"

"ఏం జరుగుతోం దేమిటి?"

"............."

"ఇలా చూడరా"

"............."

"అయిపోయింది అత్య పని"

"............."

"ఎంతలో తిరిగిపోయిందిరా కాలం? ఏదో మందు రాశారు పెద్దమ్మవారుకి"

"............."

"నే ననుకుంటూనే వున్నాను. మాయలమారి పీనుగు లెంత పనేనా చేసేస్తారు. కాకపోతే వాళ్లిక్కడ వుండగానే నాకీ గ్రహచారం రావాలా? పండువంటి సంసారం యిక కుక్కలికీ నక్కలికీ అయిపోతుంది కామోసు"

"............."

"నోరి చెవలవాజమ్మా! ఇప్పటికేనా కళ్లు తెరుచుకో. చెడిపోతావు. పెళ్లాం పీనుగు చెప్పినట్టల్లా వింటావుట్రా?"

"............."

"మొన్న నువ్వెక్కడికి వెళ్లావు?"

"నువ్వు ధవళేశ్వరం వెళ్లమన్నావు కాదూ?"

"వెళ్లావా?"

"ఆ"

"ఛీ! నీ బతుకు కాల్చా! పెళ్లాం వెనకాలే బజారుకి తగులడి—ఏం పోగరు పట్టిందిరా?"

"ఎవరు చెప్పారమ్మా నీకూ?"

"ఇంకా బుకాయిస్తావా?"

"నే నక్కడికే వెళ్లాను"


"ఛి ఛీ! నోరు ముయ్యి"

"............."



ఏకతార

('విశాలభారతి' కళాంకమునుండి)



తిరుత్తని దృశ్యము

శ్రీ వి. దామోదరముగారు తీసిన ఫోటో.

"సరే. ఇక నీయిష్టం వచ్చినట్టు తగులడు. నాకేం? కాని మీనుగులి కెంత సాయం చేసినా బూడిదలో పోసిన పన్నీరే అయిపోతుంది"

"............"

"ఎంత కష్టపడ్డానురా నీకోసం? చివరికెంత గొంతు కోస్తావురా నువ్వు?"

"............"

"వెళ్లిపోతావుట్రా?"

"............"

"ఇలా రావూ!"

"............"

"ఇప్పుడేనా బుద్ధి తెచ్చుకో"

"............"

"నేను చెప్పినట్లు వినవూ?"

"ఏం చెయ్యమంటావూ?"

"నే నింటోకి వచ్చేదాకా వాళ్లతోటి మాట్లాడకు"

"............"

"నా మాట విను. ఆలోగం మీనుగు ని న్నెలాగా కనిపెట్టడూ దాని దగ్గిర పెద్ద తప్పు కనపడే దాకా వోపిక పట్టి తరవాత నిమిషంలో చేసేస్తాను నీకు పెళ్లి మంచి పిల్లని తెచ్చి. బోలెడు కట్నం వస్తుంది నీకు"

"............"

"ఏమంటావు?"

"నాకు మళ్లీ పెళ్లి చేస్తావా?"

"వొక దెబ్బని"

"............"

"వెళ్లిపోతావేం? వారితో చెబుతావా ఏమిట్రా యీమాటా? వోరేయ్! చలపతిగా! వోరి నీ యిల్లు వల్లకాడు—వోరేయ్!"

"............"

"సరే. తగులడు. జ్ఞాపకం పెట్టుకో"

౧౯

చలపతిని వైగ్రాలోద్దులో మంచం పెట్టి బుచ్చమ్మ తర్జనభర్జన చెయ్యడం పోదమ్మ చూసింది. ఆమె గోడ అవతలినుంచి పూర్ణమ్మతో చెబుతూ వుండగా ఆమాటలు జగ్గయ్య చెవిలో పడ్డాయి. గాదె సావిట్లోకి తీసుకువెళ్లి జగ్గయ్య అడగ్గా చలపతి జరిగిందంతా చెప్పేశాడు. అదంతా విని జగ్గయ్య నెత్తీ నోరూ బాదుకోగా చలపతి గజగజలాడిపోయాడు.

బుచ్చమ్మ యింటికి వచ్చింది గాని మనస్సు మనస్సులో లేదు. ఆ రాత్రి ఆమె తిండి మానేసి ఆపాదమస్తకమూ ముసుగుతన్నుకుని కడుపులో కాళ్లు పెట్టుకుని పడుకుంది.

మర్నాడు పొద్దున్న యింటోకి వచ్చింది; గాని ఆమెతో యెవరూ మాట్లాడ లేదు. అంతా కట్టు కట్టినట్టూ వెలివేసినట్టూ కనపడ్డారు. చలపతి వొకమాటు గదిలోకివెళ్లి జోగమ్మతో గుసగుసలాడి వస్తూ వుంటాడు. పూర్ణమ్మ వంటింటోకి వెంకటాచలం వీధి గదిలోకీ, అన్నీ పిలుస్తూ వుంటారు. మధ్యమధ్య జగ్గయ్య గాదెసావారాలోకి తీసుకు వెళ్లి యేవో అనుకుంటూ చెబుతూ వుంటాడు. ఇలాగ యెటుచూసినా గుసగుసలు ప్రబలిపోవడంచేత బుచ్చెమ్మ కేదో బెంగ పట్టుకుంది. గుసగుసశబ్దం కుండకి నష్టం అన్న మాట ఆమెకి తెలుసు; కాని అది యెవరిమీద విరుచుకుపడి పోతుందో.

భోజనాల వేళ బుచ్చమ్మ తాను కూడా పురుషులతోటే కూచుంది. పూర్ణమ్మ నెయ్యి వడ్డిస్తూ "అన్నయ్యగారూ! రాత్రికి నెయ్యి కావాలి" అని జగ్గయ్యతో చెప్పగా జగ్గయ్య చలపతితో చెప్పాడు. దానికే బుచ్చమ్మ ధుమధుమ లాడుతూ వుండగా జగ్గయ్య తనకి యేవూళ్లో యెంతెంత భూము లున్నాయో, యేభూమిమీద యెంతెంత శిస్తు వస్తుందో— ఇదంతా చెప్పడం మొదలుపెట్టాడు వెంకటాచలానికి.

బుచ్చమ్మ కిదంతా వప్పగింతలు లాగా, ఇక తన ఆవాహనా, విసర్జనా లేనట్టూ కనపడింది. పూర్ణమ్మ అది కావాలా, యిది కావాలా అని యేం వడ్డించడానికి వచ్చినా సంజ్ఞలతోటే భోజనం ముగించి బుచ్చమ్మ లేచిపోయింది.

౨౦

బుచ్చమ్మకి అంతా బోధపడింది. ఇది వరకి తాను రాజ్యం చేసిన యింటో యిక ముందు కూలిపని చెయ్యాలని గ్రహించింది. వొక్కమాటు కళ్లు తిరిగి పోయాయి; గాని వెంటనే ధైర్యం తెచ్చుకుని తనబట్టలు సర్దుకోవడం మొదలు పెట్టింది.

ఇదంతా కనిపెట్టి వెంకటాచలం పూర్ణమ్మతో చెప్పాడు. పూర్ణమ్మ జోగమ్మతో చెప్పింది. జోగమ్మ చలపతితో చెప్పగా చలపతి జగ్గయ్యతో చెప్పాడు. ఇదంతా యిలా అయేటప్పటికి తన సంగతి అందరికీ తెలిసిపోయిందని బుచ్చమ్మ గ్రహించేసింది.

యథాపూర్వంగా వియ్యంకు లిద్దరూ వాకట్లో కవాచీబల్లమీద కూచున్నారు. జోగమ్మ యేదో వూదగా చలపతిగూడా వాకట్లోనే పడకకుర్చీలో కూచున్నాడు. "పని తరవాత చేసుకోవచ్చు" అనుకుంటూ పూర్ణమ్మ వంటింటో నుంచుని తొంగిచూడడం మొదలుపెట్టింది. జోగమ్మకి యెప్పుడూ తీరుబడే కనక ఆమె గదిలో మంచంమీద కూచుని యేమిటో ఆలోచిస్తోంది. ఎక్కడా యేమీ చప్పుడేనా కావడం లేదు.

ఇలాంటప్పుడు బుచ్చమ్మ మూట చంకని పెట్టుకుని మెల్లిగా వాకట్లోకి వచ్చి నుంచుంది.

"అదేమిటే అమ్మాయీ?"

"నాయింటికి వెళుతున్నాను నాన్నా"

"ఎందుకూ?"

"ఇక్కడేం వుందీ నాకూ?"

"ఇప్పుడేం వచ్చిందీ?"

"నన్నడగవద్దు. అంతా నీకే తెలుస్తుంది ముందు ముందు"

"ఎప్పటి కప్పుడే తెలుస్తోంది నాకు వున్నదంతానూ. నీప్రయాణానికి కారణం యేమిటి?"

"తెలిసివుండి అడగడం యెందుకూ?"

"సరే మరి! ఇంతవరకూ వచ్చాక ఇక బతిమాలితే మాత్రం నువ్వు వుంటావా యేమిటి? బతిమాలడానికి నాకు పెత్తనం వుందా."

'ధారపోసుకుంటే యెలా వుంటుంది?"

"అదా సంగతి?"

"ఏది యేమయిపోతే నాకేం! నేను వెళ్లిపోతున్నాను"

ఇలా చెప్పి బుచ్చమ్మ వొక్క అడుగు ముందుకు వేసింది.

"అయితే తాళాలు ఇచ్చెయ్య మను నాన్నా"

"............"

"అడగవేం నాన్నా?"

"వినపడిందటే అమ్మాయీ?'

"వుచ్చుకోండి; నా కక్కర్లేదు'

ఇలా అని గుత్తి మండువాలోకి గిరవాటు వేసి బుచ్చమ్మ ముందుకు మళ్లీ అడుగువేసింది.

వెంటనే పూర్ణమ్మ తటాలున యివతలికి వచ్చి ఆమె కడ్డంగా నుంచుంది. "వెళ్లిపోడానికి యేం కారణం వచ్చిందీ?" అని వెంకటాచలం అడిగాడు. ఇది చూసి బాగుండదని జగ్గయ్య మూట లాక్కోపోయాడు; గాని ఆమె అందర్నీ విదిలించి కొట్టి "అంటరిపాలూ పొంగాయికదా" అంటూ బలవంతాన మూట విడిపించుకుంది.

జగ్గయ్య వెనక్కి తగ్గి "పోనివ్వండి" అనగా, వెంకటాచలం "తొందరపడకు సుమా" అన్నాడు. పూర్ణమ్మ కూడా యేదో అనపోయింది; గాని బుచ్చమ్మ వినిపించుకోకుండా "ఎంతలేసి ముండలేనా వున్నారు భూమ్మీద......నా వుసురు తగలదూ? ఈ పీనుగులు ముందుకి

వస్తారా?" అంటూ వొక్క గంతులో వీథిలోకి వెళ్లి పోయింది.

వాకిట్లో యీనాటకం యిలా జరుగుతూ వుండగా చలపతి గదిలోకి వెళ్లి "మాసుతో వామజా" అంటూ అమాంతంగా భోగమ్మని యెత్తి పట్టేసి వాకిట్లోకి చక్కావచ్చాడు.

౨౧

తరవాత మంచువాలో వున్న తాళాల గుత్తి తీసి కడిగి, తుడిచి, మొలలో పెట్టుకుని "రంకి భావగారూ!" అంటూ జగ్గయ్య గారి పావిట్లోకి దారితీశాడు. "ఎంత పని చేశింకోయి మీ అక్కా?" అంటూ బుగ్గమీద చెయ్యి పెట్టుకుని పూర్ణమ్మ చలపతిని పరా చేసింది.

భోగమ్మ రొంగిరొగిరిపడుతూ నూద్దగ్గిరికి "అక్కయ్యగారూ! నేను రమ్మన్నప్పుడు వస్తానవా మీరు. తొరగా—నంచున్న పళంగా రావాలి" చిటికెలు వేస్తూ పిలిచింది.

"ఏంకథా?"

"భామ వెళ్లిపోయింది"

"ఎక్కడికి?"

"అత్తారింటికి"

"ఏం?"

"చెబుతా నలా రంకి తొరగాను"

ఆ వే ద న

కుందుర్తి నరసింహారావు గ

ఏనగమందో మున్ను వసియించెడివాఁడను: వ్రేలు సూపి న
న్నేనరుఁ డింతచేలు పరికించి యొసంగఁ; డిదేమికర్మ? మీ
లో నెటనుండి వచ్చె నసువుల్ తినివేయఁగ, మాయదైవమా?
కేనఁడు పొట్ట వోసికొన సిగ్గు దొలంగుదు రొక్కొ మానవుల్?

ఈపోఁగాల మిదేమి వీరలకు?—పోనీ! వెంటనే చంపి, యే
దో, పుణ్యంబు రవంత కట్టుకొనరాదో? ప్రేవులన్ మాఁడ్చి న
న్నీ పాట్లన్నియుఁ బెట్ట నేమిటికి? నాకీ పంజరం బేల? ఆ
టోపంబింతయు నేల? ఈడగు నిదెట్లో మాఁనిపై గూటికిన్?

నాపలలం బిసీ! యెటు తినంగలవారలొ వింత యయ్యొ! న
న్నాపసికైన బంధనమునం దిడఁగాఁ దమ కేమి పుట్టె? లే
దా, పలుమాఱు నాకుశల మారయుచుండఁగ హేతు వేమి? పీ
రీపగిదిన్ ననుం బెనుప నిచ్చఁ దలంచిరొ ప్రీతి చొప్పునన్?

నన్నిటు ముద్దు గొందు రిది న్యాయమె యీచపలాత్ము? లింతసి
గ్గన్నది లేదె వీరి కకటా! పలుపోకలఁ బోవుచున్న నా

శీర్ష

చెన్నొక యింత చూచి, తమిచే ననుఁ జేరఁగ వీర వంచిరో
క్రన్ననఁ బూరుషాళి?—తనకాంతకుఁ దార్చు డెవండు నల్పెడిన్?
ఎంతో ప్రేముడి యున్నవారివలె నీ రీకండ్లు నీభత్స్యముల్
సంతోషంబునఁ దెచ్చి యిచ్చెదరు నాస్వాంతంబు మెప్పింపః నీ
గంతల్ బొంతలు నీరి కీడగును, నాకా? సర్వకాంతారభా
స్వంతుండన్, సహకారపల్లవనిజేచ్ఛాభోగినౌ రాజునే!

సేమము దయ్యమే యెఱుఁగు; చింత దొలంగుట వట్టిమాట; నా
కామిని యెందుఁ ద్రిమ్మరుచు గాసిలుచున్నదొ చెప్పవారు లే
రే! మనవాఁ డనంగ నిట నెవ్వఁడు గానఁ బడండు; నోటి మా
టా? మఱి కాంతఁ జూతు నెటు, లౌనుడ లున్నది దూర మక్కటా!

తెలతెలవాఱుచుండఁగనె తియ్యనిమామిడిపిందె లేరి, మేల్
పలుకుల నన్ను మేల్కొలిపి, బమ్మెరవోయిన బుజ్జగించి, నా
యలుక యొకింత దీర్చి, కడు నాఁకటి చిచ్చున నేడ్చుచున్న బి
డ్డల నఱగంటఁ జూచి యకటా! నను దేర్చెడి కాంత యేదిరా?

పం డొకయింత దాఁ గొఱికి పం డ్లికిలించుచు, నానతోడఁ గూ
ర్చుండిన నన్ను గన్గొని 'యిదొక్కటి యెంగిలి సు' మ్మటన్న, నో
రెండిన నేను నవ్వఁ, గను లించుక మూయుచు నిండుప్రీతి నా
దండను జేరి వచ్చునియెడన్ నను గ్రుచ్చు నెలంత యేదిరా?

వలవల యేడువం దుడుకు వచ్చెడిలాభము సున్న; ఊరటల్
గలిగినఁ గొంత మేలు గద? కామిని పోయినఁ బోయెఁ బో; యిఁకన్
వలపులబిడ్డ లెండ ఱెటు వమ్మయిపోయిన లెక్క యేమి? నే
నిలపయిఁ బుట్టినప్పుడె లభించిన స్వేచ్ఛ యదెందుఁ బోయెనో?

చల్లనికొండగాడుపులు చచ్చినప్రాణిని లేవ నెత్తు; ను
త్ఫుల్లపయోజ సంచయ విభూషితముల్ సరసుల్ విదుర్చు నా
మెల్లనిపిల్ల తెమ్మెరలు మే నవశత్వము నొందఁ జేయు; నీ
యిల్లిది యేమి? వాయువును హేయగవాక్షమునందు బద్ధమా?

మాటవరస 3

భమిడిపాటి కామేశ్వరరావుగారు, బి.

[24-1-31 తేదీని, రాజమండ్రీ ఆర్ట్సుకాలేజీలో, పాతవిద్యార్థిసంఘంతరఫున జరిగిన సాంవత్సరిక సమా సందర్భంలో, ఈముక్కలు పూర్తిగా చదవడానికి నాకు వీల్లేకొచ్చినా, చదివినంతపనీ జరిగింది. అదో పెద్ద గా

1. బలరామయ్యగారి ఇంగ్లీషుతమ్ముడు.

వెనక, మాఅందరికి మల్లేనే మా తమ్ముడుకూడా పెద్దబాలశిక్ష పట్టి, పలకా నదరా పుచ్చుకుని వీధిబళ్లోకి వెళ్లేవాడు. కాని, మాకు మరీ దగ్గరవాళ్లల్లో కొందరు ఇంగ్లీషులు వెలిగించడం ప్రారంభించారు. వాళ్లమీద పోటీకొద్దీ, వాళ్లు కాస్త పక్కవెదురుగా ఉంటూండడానికి, మావాణ్ణీ ఇంగ్లీషులో పడేశాం. ఇంగ్లీషు అనడంతోటే డబ్బుఖర్చు. ఖర్చు లేకుండా రాజవిద్య ఊరికే ఎల్లా అబ్బుతుంది చెప్పండి' అక్కడికీ, మావాడికి దులా ఫీఖర్చు లేదు. పైగా, మావాడు అయినకాడికి ప్రతీక్లాసులోనూ రెడ్డికం వేసుకుని కదలకుండా కూర్చుని, ఇల్లంతా ఓకడికి తీసుకురాలేదు, వాడేదక్మరూ అని. నే చెబితే గర్వంలా కనిపిస్తుంది—మావాడు అతిమనిషి, ఏకసంతగ్రాహి. తోటివాళ్లు చాలామంది పీక్లాసులో బడితే ఆక్లాసులో మకాం వేస్తూండడం, మావాడు ఎక్కడా మచ్చుటకైనా ఫేలవకుండా, చడీచప్పుడూ లేకుండా ఇట్టే దాటుకుపోతూండడం. అంచేత మావాడికి అన్నీ మెప్పులే, అన్నీ బహుమతీలే. వాడికి చదువుపిడుగు, పరీక్షపహిల్వాన్ అనే బిరుదులుకూడా ఉండేవి, సుప్రసిద్ధంగానిన్నీ. మరి పైక్లాసు చదివిస్తామా మాన్పిస్తామా అని ఒక్కొక్క పెద్దమెట్టుదగ్గర మేం లోపాయి కారీగా ఆలోచిస్తూ ఉండేవాళ్లం. ఆలోచన ఎందుకంటే, తరవాత తరవాత దేవుడు రక్షించి మావాడు చెయ్యగలఉద్యోగంలో, ఆర్జించగలసొమ్ములో ఖర్చులన్నీ పోగా మిగలగల డబ్బువల్ల, చదువు పెట్టుబడిసొమ్ముకి వడ్డీ డబ్బులేనా కిట్టుతాయా కిట్టవా అనే సందేహంచొప్పున. మరి లోపాయికారీగా ఎందుకంటే, డబ్బు ఖర్చుకి మేం సందేహిస్తున్నాం అని తెల్లిసిఅయితే, మా పరపతి సన్నగిల్లుతుందేమో అనే భయంచొప్పున. ఇంతలో ఎవరో పెద్దమనిషి వచ్చి, నాతో ఈమాటచెప్పి ఆమాట చెప్పి, "ఇంకా చూస్తారేమిటయ్యా, బలరామయ్యా! మీరు జవి దార్లు. మీవాడు సీమవచ్చిమిరపకాయంటివాడు చూపిస్తే అందుకుపోతాడు. వాణ్ణి చదువు మానిపించ గనక! నీరకం నారకం అయితే నేను మానిపించను పట్టుకుడునా. ఓముక్క వచ్చేవాడికి చెప్పించకపో త్వాష్ట్రినికిబయ్యా చెప్పించడం! చాల్చాల్లే. ఎవడే వింటే నవ్విపోతాడు. తక్షణం పట్నం పంపించెయ్, కేం లో పాస్తే గాని తీర్థం కాదు." అని నన్ను కోప్పడుతూ డడం, దాంతోటి నేను పొంగిపోయి, పైకిమా చప్పరిస్తూ, ఏకలో తాకట్టెట్టి మావాణ్ణి పైక్లాసుకి పం స్తూండడం. ఇల్లాగ్గా జరుగుతోచ్చేది. మెట్టుమీ మావాడు చదువులో సరసరా జువ్వలాగ పైకి లేచి, ఇం షులో బాహూ తడిసి, నాని, ఊరి ఊరుకున్నా మాలో వీడి కొక్కడికే ఇంగ్లీషు రావడంవల్ల, వీణ్ణి పే "ఇంగ్లీషుతమ్ముడు" అని వాడుతూంటాం.

మరి ప్రస్తుతం. మావాడితో కలిసి చదువుతూ చిన క్లాసులోనే పీలిపోయి మా నేసిన వాళ్లపని, ఇప్పుడ మాడుపుళ్ళులాఆరుకాయలూ గాఉంది. అబ్బే, మనోచ కారం! వాళ్లల్లోనూ ఎంత చిన్నక్లాసులో ఫెయిలై ఎం పెద్దాలే ఇంగ్లీషునా చేసినవాడై ఉంటే, అంతపనికొచ్చే వాడూ, అంత సంపాదనపరుడూ అయిపోయాడు. మ వాడో! చదువుకునేటప్పుడు వీడిపని ఎంత ప్రథ ఉండేదో ఇప్పుడు అంత నవ్మరంతిగా ఉంది. వీడి ఉద్యోగం ఇస్తానని జ్ఞాని ఎవడూ కనపడ్డు. ఎక్కడేన ఉద్యోగం ఖాళీగా ఉందని తెలిసి ప్రయత్నించడాని వెళితే (అనుకుంటే తప్పు, ఇల్లా వెళ్లడానికి బోలెడైంది ప్రతీఅధికారీ మావాడితో "నువ్వు ఏంపని చెయ్యగలవ్? అంటాడట గాని, "నువ్వు ఎంత పెద్దపరీక్ష ప్యాసయ్యా నావ్?" అని అడగనే అడగట్ట!! ఏమైతేం, వీడి ఒక్కడమ్మీడీ ఇంటో పడేద్దామనే ఊహ లేదు, పదేయ

...ల ప్రజ్ఞ లేదు. తనూ, పెళ్లాం (ఆవిడదగ్గర మేం అసలు మాట్లాడలేం!) ఇద్దరు కూతుళ్లూ (వీళ్లకి ఎప్పుడూ ఒళ్లు ...సిగా ఉండదు)—వీళ్లంతా ఉమ్మడి సంసారంలోనే. అంచేత మావాడికి ఊహాలా మొహమాటం. అసలు వాడికి నోట్లో నాలిక లేదు. పైగా వాడివంతా అతిసుకుమారం. పైమీద కండువా కూడా బరువే. ఓగజం నడవ లేడు—కారో, రిక్షావో కట్టిస్తాడు. ప్రతీదీ దర్జాగా ఉండా లంటాడు. సొమ్ము రావలిసినచోట దాక్షిణ్యం అంటాడు, ఇవ్వవలిసినచోట తూర్పుమొహంగా తిరిగి దణ్ణంపెట్టి ఇచ్చెయ్యమంటాడు. వీడు చదివింది ఏమిటో మాకు తెలియదు, ప్రపంచానికి అక్కర్లేదు, (వాడేం చేశాడు, మేమే చదివించాం లెండి!). దైవచింత ఉందేమో అంటే, దేవుణ్ణూనై నమూనై అంటాడు; పైగా మన దేవుళ్లు మనకంటే బొత్తిగా అన్యాయం అంటాడు. సరి, మతం చూద్దామంటే వాడిమతం నాకమతం ఒక్కమోస్తరుగానే ఉన్నాయి. పోనీ మనిషైనా రాయల్లా ఉన్నాడేమో అంటే, అబ్బే, ఆకోటు తొడిగినంతసేపే గాని, విప్పేస్తే మనిషికి వంట్లో పంప్రమాంసం లేదు. అడ్డిగెత్తు నెత్తురు లేదు. పొత్తి ఎముకలపోగు. ఎవడేనా తనికి అన్యాయం చేస్తే, వాణ్ణి కాస్త కళాయించడం [illegible] లేదు—వాడిపాపాన్ని వాడే పోతా డంటాడు, లేకపోతే ఇంటో వాళ్లమీదా నామీదా కోప్పడతాడు, లేకపోతే తనగదితలుపు రాత్రుల్లా పెద్దగడియ వేసుకుని ఒక్కడూ కూర్చుని అవతలవాణ్ణి తిడతాడు. ఎవళ్లేనా బంధువులు తటస్థించినప్పుడు వాళ్లతో—ఉన్న సంగతే అయితే, లేకపోతే లేనిసంగతాయితే—ఏదో వోటి యథాశక్తి ఆప్యాయం కనపరుస్తూ కలివిడిగా మాట్లాడ్డం మావాడు ఎరగడు. ఎక్కడేనా రక్తస్పర్శ ఉన్నవాళ్లల్లో ఏదేనా కష్టం వచ్చినప్పుడు వాళ్లని కాస్తపరామర్శ చెయ్యకపోతే బాగుండదని వీడికి తెలియదు, ఆవిధానం అసలు తెలియదు. తన సంసారాన్ని అత్తారింటిదగ్గిర్నించి తీసి తెచ్చుగోడం తనికి సిగ్గుట, ఇంకోర్ని వెళ్లి తీసుకురమ్మంటాడు; ఏమడుగుతారూ! శిస్తువసూలుకోసం పొలాలమీదికి వెళ్లి రారా అంటే, అక్కడ ఏమీ తోచదంటాడు. మొన్న మట్టుకి మెడపట్టుకు గెంటగా వెళ్లి, వసూలుసొమ్ము సాదరుఖర్చుకి చాలక, నోటు రాసుకుని ఇంటికొచ్చాడు. పోనీ, అయ్యా, ఎప్పుడేనా తేలొస్తే ఎవడేనా పైజా మచ్చుకుని పచ్చడికింద కొట్టనూ? మా తమ్ముడేం చేశాడూ! "తేలు ఎంత మంచి దనుకున్నారు! దోషం అంతా దాని కొండిది. కొండి పట్టేస్తే, అది ఎంతో సాధువై పోతుంది. నేను పట్టుకుంటున్నా, చూడండి!" అని రెండువేళ్లతో పట్టాలని యత్నించాడు నేర్పుగా. కాని, దానిముండమొయ్యా, తేలు, అంతకంటె ఎక్కువ నేర్పుగా ఒక్కదెబ్బని రెండువేళ్లమీదా కూడా కుట్టింది. ఇక, పాము అంటే అసలే ఆశ లేదు. మాతమ్ముడికి రాత్రిళ్లు చీకట్లో వెళ్లడం భయం. ఏమిరా అంటే, "పురుగూ బుట్రా ఉంటాయేమో అని బెదురుగాని దొంగభయం చిన్నప్పణ్ణించీ లేదు." అంటాడు. దొంగ లంటే జ్ఞాపకం వచ్చింది. మొన్న ఈమధ్య ఒక ముసిలాయన ఇంటో దొంగ లడ్డారు. ఆయన జీవితం అంతా మాటలు చెబుతూనే ఉన్నవాడైనా, దొంగాణ్ణి పట్టడంలో—ఎల్లాగనుకున్నారు మళ్లీ—భల్లూకప్పట్టు పట్టేశాడు. తరువాత వారానికి మాయింటికీ దొంగలొచ్చారు. అప్పుడు మాతమ్ముడు మెలుకువగానే ఉండి, మొహంమీదికి కూడా కొలువ లాగి కప్పుకుని పడుకున్నాడు గాని, వాళ్లు ఒక్కవరసని ఇల్లంతా తీస్తుంటే పెడుతూంటే కేకలేనా వెయ్యలేదు. ఏమిరా అని మొన్నాడు కనుక్కుంటే, కేకలేస్తే తనికి నామర్దాట. పైగా, తను అప్పుడు మెలుకువగా ఉన్నాడో, నిద్దరలో ఉన్నాడో అది ఓ పెద్ద స్వప్నసమస్యట, ఆ అవస్థగురించి మనోమయందు పుస్తకం రాస్తానన్నాడు. పోనీ, తనసొమ్ము లేకపోతే పోనాపోయింది, నేను ఎకో మాపికలుపడి తెచ్చిన దక్కేట్టి బజార్లోంచి ఏమున్నా వస్తువులు తేరా అంటే, టైం లేదంటాడు. ఒకొక్కప్పుడు ఇంట్లో పోరు పడలేక బజారికి వెడతాడా, ఆఖరికి కూరలు తేవడమేనా తెలియదు. ఎక్కడకి దాకా ఉంటుందని మావాడు ఎరగడు. కొనుక్కునే వస్తువులు మంచివో కావో ఎరగడు. టంకాయకి ముచిగి దళసరిగా ఉండాలనీ, ములక్కాడ మెలితిప్పితే తిరగాలనీ, బెండకాయలు చిటిక్కలు కొట్టి చూసుకోవాలనీ,

బెండకాయ చివర విరుగుడుపడాలనీ, ఆనపకాయ గోరు దిగేటట్టు ఉండాలనీ, వగైరాలు మావాడికి బొత్తిగా తెలియవు. అట్టా వెళ్లడం. వెళ్లి, దుకాణదార్ని 'ఈ సరుకు మంచిదేటయ్యా?' అనడం. అంటే అతడు 'బంగారం అండి. ఫస్టు. మానాణ్యమైన సరుకండి.' అంటాడు. లేకపోతే, అమ్మకోదల్చినవాడు తన సరుకు చవటచెత్త అంటాడా, చెప్పండి! దాంతోటి, మావాడు, "అయితే, ధర చవకేనా?" అంటాడు. అంతే గాని, పీచెంత, నారెంత, తూలం ఎంత అని అడగడు. ఎంచేతో తెలుసునా? ఏవస్తువు ఏ లెక్కని ఉంటుందో ఎరగడు. ఓమాటు కస్తూరికని వెళ్లి, 'పికెంత?' అని అడిగాట్ట. అది మొదలుచేసుకుని, ఉమ్మడి ప్రశ్నలు వేస్తున్నాడు. దుకాణదారు, "అయ్యా! మాదగ్గిర రొంపు మాట ల్లేవు. వాకబు చెయ్యండి. లేదా వస్తే రెట్టింపు ముదరా యిస్తాను" అంటాడు. అంటే మా వాడు, "అయ్యా బేరం చెయ్యడం నాకు అసహ్యం. ధర విషయమా! మీ యిష్టం వచ్చినట్టు పుచ్చుగోండి. ఓడబ్బు అయినా సరే. మనకి ఆ లక్ష్యం లేదు. సరుకు మంచిది కావాలి. త్వరగా యిప్పించండి, నాకు టైం లేదు' అంటాడు. అంత ముళ్లమీద నుంచుంటే బేరాలు ఎల్లా కుదురుతాయి! ఆపళంగా ఏవో తెచ్చి ఇంటో వేస్తాడు. అక్కణ్ణించి, స్నేహితుల్లో చేరి యెకాట, లేకపోతే, వాడిల్లాంటి వాడు, వీడిల్లాంటివాడంటూ ఊళ్లో వాళ్లమీద యాగీ. ఇంతోటి శ్రమకి మధ్యమధ్య ఉపహాసం. ఓవాడు సీతాఫలాలు ఇంటికి తెమ్మన్నే, మావాడే బేరంచేశాడు. అమ్మే అమ్మి అర్ధణాకి అయిదు చెప్పింది. మావాడు, "నాకు అయిదక్కర్లేదు. నాలుగే చాలు. ఏరి తీసుకుంటాను మంచివి" అన్నాడు. అసలు మంచివి ఏరితీసుకునే పద్ధతే అయిదని దాని ఉద్దేశం. ఏం చెప్పను! ఇవన్నీ అల్లా ఉండనీండి. పోనీ, ఇంత కొట్టుకుని తెచ్చేరకం కాకూడదా! సమస్తం ఇంట్లో ఉంటాయిగా! తనకేమన్నా లోటు రానిస్తామా? పొద్దస్తమానం తెగ చిరితిండి. చిరుతిండి వాళ్లకి అసలు తిండి చోటు. అయినా సరే, భోజనంవేళ అయేసరికి, గంటలప్రకారం, విస్తట్లో అన్నం పడాలంటాడు. కడుపు ఎల్లానూ గంటలప్రకారం జరుపుగోలేం, భోజనమేనా జరపాలని మావాడిపట్టుదల. ప్రతీరోజూ ఇంట్లో, రూల్సుప్రకారం ఎల్లా దేవుళ్లాడుతుంది, చెప్పండి! తింటే తిండని ఇంత బులబాటమే గాని, తీరా విస్తరిదగ్గిరికి, వచ్చేసరికి ఒక్కవాయేనా కలుపుగోకుండా, మెతుకులు, కోడిచిమ్మినట్టు చిమ్మి, విస్తరంతా కళ్లంఅల్లా చేసి చక్కాపోతాడు. అంచేత, "నాయనా, సంపాదనా వద్దు, సమారాధనా వద్దు, నువ్వు అనుకుంటూన్న ఆత్మగౌరవం చెడగొట్టుకోకు, లోకవ్యవహారం నేర్చుకోకు, పోనీ ఇంత భోజనం చెయ్యడమేనా నేర్చుకోరా. ఇంటికి మంచిది. 'శరీరమాద్యం'రా." అని అనేక కాలం నించి మాతమ్ముడికి నూరిపోస్తున్నాను. ఏమని నూరిపోతావూ అని అడగరేం? మనవి చేస్తున్నా! వెనక, మా ప్రెసిడెంటుగారు నాకు నూరిపోసినప్రకారమే. వారు ప్రతీ పెళ్లివిందుకీ వెళ్లేవారు. మాఘమి అడ్డొచ్చి కొన్ని పెళ్లిళ్లూ, తద్వారా విందులూ ఆగిపోవడం నించి వారాగ్రహించి మాఘమి అనగా మూర్ఖులు పెట్టిన శూన్య భోజన నియమం అనేవారు. శారదచట్టంవల్ల పెళ్లి విందులు అసలే మూలబడిపోయిన ఈ సంవత్సరం క్రితం వరకూ వారు సాలుకి యాభై అరవై విందులకేనా వెళ్లేవారు. వారు ఒకచోట కొంతకాలం మహాధ్యక్షులుగా ఉండి పిదప స్వయంకృషిచేత అఖిల ప్రపంచ భోజన మహామండలికి గౌరవాధ్యక్షులు అయారు. విశేషించి, భోజనానికి పనిగత్తారు. వారి పతాకానికి చిహ్నాలు— పీట, ఆకు, రాగిచెంబు, మామిడిచక్రం. ఈ క్రిందిమోస్తరగా వారు సెలవిచ్చేవారు.:

"విందులకి తప్పకుండా వెళుతూండు, దాటపెట్టకు. భోజనం పెడతా నన్నప్పుడు తినకపోతే, మళ్లీ అప్పట్లో దొరకదు. అన్నింటికీ తయారీ అవసరం. విందుకి మరీ అవసరం. టిక్కట్లవిందుకి తెగ అవసరం. విందుసంగతి రెండుమూడు రోజుల పూర్వం తెలిస్తే, దూచాయగా తెలిస్తే చాలు, ఫలహారం తగ్గించుకో, లేక భేది స్వీకరించు. మరీ శ్రోత్రియుల పక్కని కూచోవలిసొచ్చి, అధాట్టుగా మడిగట్టుకోడం అవసరం అయితే, చొక్కా తీసేసి, బిళ్లగోచీ పెట్టి, పైమీద పంచ సన్నంగా మడతెట్టి, ఎత్తి అడుగువేస్తూ, జనాన్ని తప్పుగోమను. అగ్రం ఉన్న ఆకు

మానుకుని, ఈశ్వ తీసెయ్! ప్రారంభించడానికి పూర్వం తెల్లబోయి మాట్లాడుతూ కూచుని సైంపాదు చేసుకోక, అంటులేని మిఠాయి వగైరాలు రుచిచూచి, చేసిన వస్తే, వడ్డించలేదను. జలపదార్థానికి కూడా స్థలాక్రమణరోగం ఉంది గనుక, భోజనం పూర్తికాం కే, ఉదకం తాగకు. తరువాత ఎక్కడేనా ఇంకోరింటో కాఫీరమే వింసు చూపు పేరలో ఉంటే తప్ప, పప్పు 'డబుల్ డోస్' చెయ్యి. కొండొకచో మాగాయి బెంక వడ్డించినట్టయితే, వెంటనే వజ్జిగ తెప్పించి అందులో అది ప్రప్రథమాస్నే వాశెయ్. ఆవడలు వడ్డించేటప్పుడు దిక్కులు చూస్తూ కూచోక అవి దధిసమేతంగా పడ్డాయో లేదో, సరిగా పడ్డాయో లేదో గమనించు."

అంటే మాతమ్ముడు, "సరిగా పడ్డంటేమిటి? నాకు తెలిసేట్టు చెబుతావేం అన్నయ్యా!" అన్నాడు.

"సరిగా అంటే సరిసంఖ్యలో, అనగా, రెండు, నాలుగు, ఆరు ఇల్లాపడకలసినవే గాని అవి, బేసిగా దిగకూడదు. అవి కొంతవరకు ముప్పటించి, వడ్డించేవార్ని దగ్గరికి పిల్చి, చెవులో చెప్పు, '"పూర్వాశ్రమం" తెప్పించండి' అని. "పూర్వాశ్రమం అంటే ఏమిటన్నయ్యా!" అన్నాడు మావాడు. "ఎంత సత్తెకాలంరా నీది. పూర్వాశ్రమం అంటే కారప్పూస. ఇంకా తెలుగులో పడ్డప్పుడు అదేగా మరి దాని జన్మ! అవి అందిన వెంటనే మరోసారి వడ్డించేవాణ్ణి పిల్చి (మొదటివాడే అయితే దిష్టి తగలన్వు) "విజన్వరూపం" పట్రమ్మను. అది కారంలేని అసలుగారె. క్షీరాన్నం పట్టాగానే ఎన్నదూ వడ్డించునోకు. తెచ్చిన గోకర్ణం లోది చాలా భాగం అయిపోయిన తరువాత, మిగిలిపోయినమడ్డి నీ విస్తట్లో బోర్లించమను; అప్పుడే నీకు జీడిపప్పు వగైరా గంభీర సామగ్రి దక్కుతుంది."

మావాడు—ఒకవేళ పైవి అవేళ చెయ్యకపోతే.

నేను—ఏదో ఓటి చెయ్యక మాన్రు. లడ్డూలు చేస్తారనుకో. ఏంచేస్తావు?

మావాడు—అమాంతంగా తినెయ్యడమే.

నే—పీడికిన పట్టే ఉంది. అవి ముందు నేతిలో నూనెలో పోల్చాలి. అందు నిమిత్తం, అవి చిదిపి వాటిల్లో నెయ్యి వడ్డించమను. అవితాయి నేతివా, నేతి మీద నెయ్యిమంచిది, నేగి లేదు. కాక అది నూనెదా, నెయ్యి కలిసింది గనక వాసన కొడుతుంది, విసర్జించు.

మావాడు—నాకు అట్టే సయించదన్నయ్యా?

నే—రీతి తెలియనప్పుడు వినోరి!

"ఏదైనా తీపిసరుకు ప్రత్యేకంగా తినడం పాపం. అది ఎప్పుడూ పకోడీలాంటి కారపుసరుకుతో చెరిసహోయిస్వావో లాగ లాగకలిసిందే."

మావాడు—ఏమో! కారమే ఎక్కువ తినాలని నా ఉద్దేశం!

నేను—"నీ ఉద్దేశం ఎవడికి కావాలిరా, ఇందులో ప్రవేశమేనా లేనివాడివి! కృష్ణుడి ఉద్దేశంరా అదీ! సుఖం అనగా, తీపేనా? దుఃఖం అంటే కళ్ళమ్మట నీళ్లు గనక, కారమేనా? అయితే విను. సుఖదుఃఖే అనగా తీపికారాలు రెంటినున్నా అనగా లడ్డూ పకోడీలు రెంటినీ, సమే కృత్వా అనగా రెంటిని సమరాసులుగా ఇదంతో అడంత చొప్పున చేసి, లాభాలాభౌ అనగా లడ్డూలలో ద్రాక్షలు గాని పకోడీలలో ఉల్లిపాయలు గాని లభించినా లభించకపోయినా, జయాజయౌ నీకు చాలా సయించినా సయించకపోయినా చలించక ఏకరూపంతో ఉండి, తతః తరువాత, యుద్ధాయ అనగా లడ్డూపకోడీ లడాయికి, యుజ్యస్వ అనగా తయారు కావోయ్ అబ్బాయీ! నైవం పాపం అవాప్స్యసి అనగా ఇల్లాచేస్తే నిన్ను చీమంతైనా పాపం ముట్టుకోదు—అని."

మాతమ్ముడు—నాకు చాలా చాలా వడ్డించమని అడగడం సిగ్గు అన్నయ్యా!

నేను—అప్పుడు నువ్వు వడ్డించే ఆయనతో, "ఇల్లా ఒక్కరవ్వ విదపండి" అని విస్తట్లో వేలు పెట్టి చూపించి, వేలు అల్లానే ఉంచి, ఒరిగి పక్కపంక్తిలో ఉన్న ఎల్లయ్యగారితో రాచకార్యం ఉన్నట్టు పెద్ద వాక్యం మాట్లాడుతూండు. కావలిసినంతా పడ్డదయినా

కీగంట గమనించి, అప్పుడు నువ్వు సరిగ్గా తిరిగి వడ్డించే వాడిమీద కమాషాగా ఉస్సుమను. వడ్డన ఆలస్యం ఎప్పుడేనా అయితే, ధప్పళం ముక్కలు పరామర్శించు. అందుకనే అవి పెద్దసైజులో ఉండడం. వీలైనప్పుడల్లా "రెడ్ విత్" చేస్తూండు—అనగా మిశ్రమం. ఒకవేళ పచ్చిమిరపకాయ తెప్పించి ఉప్పులో అద్ది పప్పులో కొరకచ్చు. అపనిసే పప్పులో పచ్చిమిరప 'రెడ్ విత్' సాల్ట్ యాక్టు అంటారు. అల్లాసే పప్పు రెడ్ విత్ ధప్పళం! మా ప్రెసిడెంటుగారు ఇల్లాంటి నూతన దాంపత్యాలు అనేకం కనిపెట్టి ప్రపంచానికి కళ్లు తెరుస్తూంటారు. జిలేబీ విశేషంగా తినేటందుకు వీలు ఏర్పడడానికి వారు జిలేబీ-రెడ్ విత్-మజ్జిగపుల్సు! అనేది స్వాతంత్ర్యం మీద కని పెట్టారు. అన్నట్టు మరిచిపోయాను. చేతికి చాలా జిడ్డు పట్టుకుంటే వీలునుబట్టి కాళ్లకో గడ్డానికో పట్టించు."

ఈరీతిగా, పెద్దలందర్ల విని, మావాడికి భోజనోపదేశం చేస్తున్నాను. ఉపదేశం ఆచరణలోకి రావడం మాటలే! దేశం ఆచరణలోకి వస్తే, ఉపదేశమూ వస్తుంది.

౨. (..........)

3. సంగతులు.

(౧) ఒకానొక జైలులో ఉన్న ఒక ఖైదీని చూడడానికి అనుజ్ఞ కోరుతూ, ఆ ఖైదీ పెళ్లాం దరఖాస్తు చేసింది. అనుజ్ఞ కాలేదు. కొన్నాళ్లకి ఆ ఖైదీయొక్క స్నేహితుడు ఒకాయన ఖైదీని చూడడానికి దరఖాస్తు చేశాడు, అనుజ్ఞ ఇచ్చారు, చూశాడు. మళ్లీ కొన్నాళ్లకి ఆ ఖైదీ భార్య చూడడానికి అనుజ్ఞకోసం దరఖాస్తు చేసింది. అనుజ్ఞ ఇచ్చారు కారు. వన్లోవనమాట, రెండోసారి వెళ్లి చూసినవెంగాడు, ఆవిడేట! కేసం! పగలంట!

(౨) 'బొంబాయిలో పగటి చుక్క కనపడిందిట. అది అసలు చుక్కే. తెల్లారకట్ల వచ్చే చుక్కని చాలా మంది ఎరగరు. వాళ్లు అసలు తెల్లారకట్ల అనేది చూడరు. ఆ చుక్క కాంతికి నీడ ఉంటుంది. అది పాలుకి రెండు వెల్లపైచిలుకు అల్లా పొడుస్తుంది. ఆ కాలంలో అది సూర్యోదయం తర్వాతగుడా కనిపిస్తుంది. ఈ వేళ ౧౦ గంటలకి నే చూశాను.' అని మా విలేఖరి వ్రాశాడు.

పగటిచుక్కకి ఇంతపట్టింపు ఎందుకన్నాడు ఒక ద్రావిక ప్రియుడు.

(3) 'లాటీ' అనే జంతువుయొక్క జననాభివృద్ధి క్రమాలగురించి రిసర్చి చేసి పర్యవసానం తేల్చడానికి ఒకచోట ఒకకమిటీ పెట్టారు. ఆకమిటీవారికి పోసగక వారు రెండింటికింద చీలిపోయారు. ఒకరు ఇంగ్లీషునా ఒకరు తెలుగునా ఆలోచించారు. ఇంగ్లీషు ఆలోచన పరులు అన్నదేమిటంటే,

"లాటీ అనే దాన్లో ఉంటున్న వస్తు తత్త్వం కర్ర—అనగా ఇంగ్లీషులో 'వుడ్'. ఈ 'వుడ్' ఉన్న ప్రదేశమే లాటీయొక్క జన్మస్థలం. ఈ 'వుడ్' ఎక్కడెక్కడ ఉందంటే—వెడ్జ్ వుడ్ బెన్న అనే పేరుగల ఇండియామంత్రిలోనూ, H. E. ఎడ్వర్డ్ ఫ్రెడరిక్ లిండ్లే వుడ్ అనే స్వంత పేరుగల రాజప్రతినిధిలోనూ, H. E. బర్డు వుడ్ అనే పేరు కల్గి వెళ్లిపోయిన ప్రధాన సేనాని లోనూ, ఉంది. ఆమాటకొస్తే, H. E. చెట్ వోడ్ అనే పేరుగల ప్రస్తుత ప్రధాన సేనాని పేరులో కూడా చాలాభాగం ఉంది.

ఇక తెలుగు కమిటీవారిలో కొందరు చెప్పిందేమిటంటే, అలా ఈలా కాకుండా సిసలైన తెలుగు "లా" అనేదానికి "టీ" పార్టీ పదమైనప్పుడు, ప్రయోగరీత్యా 'లాటీ' సిద్ధిస్తుంది—అని.

మరికొందరు అది అసలు 'లాఠీ' గారి 'లాటీ'గా దన్నారు. అనగా లా=లా అనేది, టీ=టీకెయ్ అని. అంటే నీ లా టీకెయ్, నా లా టీసోక—అని అన్వయించారు.

(౪) ఒకమునిసిపాలిటీలో ఉండే చాలానూతుల్లో మూడు నాలుగుమాత్రమే అదృష్టంకొద్దీ బాగుపడ్డాయి. ఎందుచేతంటే, వాటిల్లో మనుష్యులు పడి చచ్చిపోవడం మూలాన్ని నీళ్లు తోడించేసి, బురదా, మరి లోగడ పడిపోయినవాళ్ల ఎముకలూ వగైరాలు పైకి లాగించెయ్యడం చేత. తక్కిన వాటిల్లో కూడా ఎప్పుడు మనుష్యులు పడుదురా, ఎప్పుడు అవి బాగు చెయింది పుణ్యం కట్టుకుందామా అని మునిసిపాలిటీవారు శక్తివంచన లేకుండా

నిరీక్షిస్తున్నారు. పురుషుల్ని తీసెయ్యండి, స్త్రీలైనా నడుం కట్టి ముందుకి అంగ వెయ్యరా అని వారి ఆశ.

(౫) ఓ పట్టాన్ని ఏ ఉద్యోగమూ కాన్సీ ఈ కైములో, చాలామందికి, అయాచితంగా, వర్ణ విచక్షణలు లేకుండా, ఆశ్రయింపులూ, సిఫారసులూ, లంచాలూ లేకుండా అవడం గొప్ప శుభసూచన. ఏమి అంటే, మన సెన్సస్ ఉద్యోగాలు. కొందరు, ఇంగ్లీషు తిన్నగా రాకపోయినా, 'జనాభా లెక్కలు' అని వాడితే తేలికగా ఉంటుందని, ఏ తప్పుడుగానో ఇంగ్లీషే వాడుతూంటారు. 'మీకు సెన్సస్ ఉన్నాయిటండీ!' అని కొందర్ని అడుగుతూంటే అవతలవారు 'లేవండీ' అంటూండడం విని పిస్తూంటుంది.

(౬) ఆర్. టి. సి. (R. T. C.) యొక్క (అనగా రాజమండ్రీ ట్రైనింగు కాలేజీ కాదు, రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సు) ధోరణి చూస్తే అది మాంచి రసకందాయప్పట్టులోనే జరిగింది. ఆరసంయొక్క వయినం:— అక్కడికి స్త్రీలనికూడా పిలవడం, అదొకశృంగారం. ఒకళ్లు వెడతా రనుకున్నది మరొకళ్లువెళ్లడం హాస్యం. ఒక అఖండుడు మరణించడం కరుణం. ఇండియాకి ఇంకా ఏమిచ్చారో తెలియకుండానే, అంతా ఇచ్చేసేవా అని మేక్డొనాల్డు గారికి చర్చిల్ కంపెనీవారు కోప్పడడం, రౌద్రం. ఇంగ్లండులో లెఫ్టు వింగు లేబరైట్లు చేస్తూన్న ప్రయత్నం వీరరసం. ఆ సమయంలోనే, కర్మన కొత్త కొందరు తీసుకుంటూన్న చర్యలు భయానకం. ప్రజల్లో కొందరిస్థితి బీభత్సం. సైమన్ జట్టు వారి పంచాంగం మూలపడేశాం అని పైకి అని, అందులో చెప్పిన ప్రకారమే క్రియలు జరపడం, అద్భుతం. వెనకనించీ ఇండియాలో కోరుతూన్నదీ, ప్రస్తుతం ఇంగ్లండునించి వారు కోరుతూన్నదీ శాంతం.

(౭) ఓ పెద్దమనిషి ఓ అబ్బాయికి ఓ పెళ్లి సంబంధం తప్పించెయ్యాలని బయలుదేరి, వాణ్ణి నిరసిస్తూ, పిల్ల నివ్వదల్చిన ఆయనదగ్గిర ఇల్లా అన్నాడట:—

అయ్యా! మీరు పిల్ల నివ్వదల్చిన వాడికి 'మిర్రా మాలా బులా' అనేపాటకుడా రాదు. వాడు గవ్వొపా ఖ్యానం ఎరగడు. వాడు తెలుగు క్లాసులోకుడా అల్లరి చెయ్యలేదు. వాడు ముందు ముందుకి మేష్టరీ ట్రైనింగుకేనా పనికిరాడు. అతణ్ణి రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సుకేనా పంపడానికి వీల్లేదు, చివరికి.

(౮) ప్రస్తుతం ట్రేడ్ డిప్రెషన్‌లో ఉన్నాం, అనగా వర్తకమాంద్యం, అంటే డబ్బుకాటకం. దేనికైనా సరే సమాధానాలు చెప్పి పారెయ్యడానికి ఇది ఓ పెద్దకారణంకింద ఏర్పడింది. ఈమధ్య ఓ కుర్రాణ్ణి "ఏం అబ్బాయి, లేట్‌గా వచ్చావేం?" అని మేష్టరు అడిగితే, "ఏం లేదండి. ట్రేడ్ డిప్రెషన్ కాగదా!" అన్నాట్ట. మేష్టరు "అప్రస్తుతంగా మాట్లాడక సరియైన సమాధానం చెప్పు!" అన్నాడట. అంటే కుర్రాడు, "నిజమేనండీ, సార్! ఇదివరకు చేతులో డబ్బాడుతూంటే జట్కామీద వచ్చే వాణ్ణి, ఈ వేళ నడిచి వచ్చాను, లేటయింది" అన్నాట్ట. తినరాబడిని బట్టి చూసి, "డబ్బు కాటకంవల్ల, రోగాలు తగ్గిపోయినాయి" అన్నాడు ఓ డాక్టరు. "రోగాలసంఖ్య తగ్గలేదూ! డబ్బుకాటకంవల్ల రోగాలు ఇంటిదగ్గిరే కుదిరిపోతున్నాయి" అని వారి స్నేహితు డన్నాడు. దీనికి కారణం, పదహాలవెండి మాత్రమే గల మన రూపాయే అని కొంద రంటారు. కొందరు, అసలు ఈ తెగులు ప్రపంచానికే వచ్చింది, ఇండియాకిమాత్రమే కా దన్నారు. కొందరికి ఈ సంగతి ఇల్లా వస్తుందని అయిదేళ్లకిందటే తెలుసుట, మనతో చెప్పారట, మనం వినిపించుకోలేదు. ఏమైతేం? వస్తువు ఉన్నవాడినోట్లో మట్టి. ఈ మధ్య ఓ ఆయన క్షౌరం చెయించుకుని మంగలాడికి పదహారు కొబ్బరి కాయలు ఇచ్చాడు. ఋణదాతలు ఋణస్థుల్ని నిక్కచ్చి చేస్తున్నారు. అందేత ప్రస్తుతం అన్నీ చవక అయినట్టే, దివాలాలుకూడా చవక అయినాయి. ఇదివరలో కొన్నేసి వేలకే దివాలాలు గాని, ఇప్పుడు కొన్నికొన్ని వందలకే. టంకశాలల్లో రూపాయిలు కొట్టించి దేశంమీద చిమ్మిస్తే డబ్బుజబ్బు కుదురుతుంది అని ఒకాయన అన్నాడు. కొందరు, చూస్తూంటే సరి, ధరలు వాటంతట అవే పెరుగుతాయి అన్నారు. అని "ధర తగ్గుట హెచ్చు కొరకే" అనేది ప్రమాణంగా ఇచ్చారు.

(౯) ఆంధ్రా యూనివర్సిటీ ఫలనిర్ణయం రెండింటితో బయల్దేరి, మూడు మించి నాలుగులోకి వెళ్లింది. నాయకత్వానికి పోటీ ఇద్దరితో మాత్రమే బయల్దేరింది. ఇదికూడా ముగ్గుర్లోకి వెళ్లిందా, కలుగుల్లోమా పడిందన్నమాటే!

(౧౦) ఒక పల్లెటూరిశాస్త్రుల్లుగారు, పట్నవాసపు చుట్టంతో మాట్లాడుతూ:—

శా—చూడండీ! శారదాబిల్లుడుగారు పలాసాగా ఉన్నట్టా.

చుట్టం—ఆ. ఏం?

శా—ఆయనది మహాగొప్ప ముందుమాపు.

చు—ఏం? ఎల్లా కనిపెట్టారు?

శా—ఆయన అప్పుడు శాసనం చెయ్యించకపోతే, అన్ని పెళ్లిళ్లు అప్పుడు జరిగి ఉండవు. అప్పుడు గనక జరిగి ఉండకపోతే, ఇప్పుడు, డబ్బుకాటకం మూలాన్ని అసలే జరక్కపోను.

చు—చిత్తం. ఏమిట సెలవు.

శా—ఆయన గట్టివాడే!

చు—తమరి అనుగ్రహం!

(౧౧) ఇండియాలో డబ్బు కాటకం గురించి ఆలోచించి, సలహా చెప్పడానికి "సాల్టరు" దొరగారు వచ్చారు. ఇంతమంది ఉండగా 'సాల్టరు'వారే ఎందుకు వచ్చారంటే: ప్రజల్లో తగాదా ప్రారంభం "సాల్టు"తో అయింది గనక ప్రభుత్వంవారు ఓ డిగ్రీ పైన ఉండడాని "సాల్టరు"గారిని పిలిపించారు.


(౧౨) షణ్ముఖం అనే ఆయనకి ఈమధ్య లాటీ దెబ్బలు తగిలాయిట. అతనిమీద పోలీసువారు అక్రమ సంఘం (అన్‌లాఫుల్ ఎసెంబ్లీ) నేరం మోపారట. అతడొక్కడే ఉన్నాడని పోలీసువారు కూడా ఒప్పుకున్నా, అతనిపేరులో అయిదుకంటే ఎక్కువ ఉంది గనక అతనిమీద ఆకేసు పెట్ట వలిసొచ్చిందని సెలవిచ్చారట.

సెలవ్.

లాస్యతృష్ణ

శ్రీ. శ్రీనివాసరావు గారు (కవితాసమితి)

కడలి కెరటాల శ్రుతిలోన కలసి మెలసి
గగన గంధర్వ గానరాగములు మ్రోయ
తూర్పు దిక్కున పూర్ణిమా తుహినకరుడు
తరళధవళ విలాస వర్తనము తెరచె.
ఈ విశాల సమగ్ర వాతావరణము
కాంతి తంత్రీ సుధామృదు గానగీతు
లెగయు జగదీశ్వరాంఘ్రి మంజీర నటన
మటు లనంత లీలా నాట్య మభినయించె.
తారకలు లేని స్వచ్ఛ సౌందర్యబంధు
రాంబరాంగణ మొక ధవళాంబరి వలె,
అమృత వారాశి వలెనె చరాచరముల
కిడెను తనదివ్యలాస్య సాహిత్యరుచులు.
ఇది జలధినాథు నెదలోన నిముడలేని
ఎదురు లేని మహా సౌఖ్యమే మొ—శీత
వీచికా మేదుర తుషార సేచనమున
ఆకసము నంటుకో ప్రాకులాడు నితడు.
ఉరలునా నా ఎడంద ఈ దొరలు తరగ
లం దొక సుధాంశుకిరణమై, హర్ష గాన
కలకల శ్రావ్య నినదము లొలయుచున్, న
వీన ఫేనద్యుతులలోన లీనమగుచు.



భ ట్రా జు

వెంకి వాళ్ళమ్మతో కూడా లేచి అప్పుడే మొహం కడుక్కొంది. సూరీ సీతీ మరి రవంత సేపటికి లేచారు. ఇద్దరూ చెంబూ పుల్లా పుచ్చుకొని దొడ్లో కబుర్లు చెప్పుకుంటూ పళ్లు దోముకొని మొహం కడుక్కొన్నారు.

వాళ్లమ్మ ముగ్గురికీ పెరుగేసి చద్దివణ్ణం పెట్టింది. "నాకు ఆవకాయ నంచుకోవడానికి కావా" లని సూరి అంది. "నాకు రాత్రి చేసిన గోంగూరపచ్చడి కావా"లని సీతి అంది. "నాకేం, నాకేం, గోంగూర కావాలి" అని వెంకి అంది. అందరూ నవ్వారు. "గోంగూర తింటారుటే వెంకీ" అంది సీతి. "పచ్చడి తినరా ఏమి టమ్మా" అంది సూరి. "పత్తడి" అంది వెంకి. వాళ్లమ్మ రొంత గోంగూరపచ్చడి ముగ్గిరికీ వేసి తినమంది. ముగ్గురూ గబగబ తింటున్నారు.

"నిమ్మళంగా తినండి, గొంతుక పడుతుంది" అంది వాళ్ళమ్మ.

"ఈవాళ సూరిమీద నే సొడ్డేస్తాను" అంది సీతి.

"సీతమీద నే సొడ్డేస్తాను" అంది సూరి.

"నేనేత్తాను సొద్దు" అని వెంకికూడా గబగబ తినడం మొదలెట్టింది. కాని వెంకికి పలకమారి దగ్గు వచ్చింది.

"నే చెప్పలేదూ, నిమ్మళంగా తినమని" అంది వాళ్లమ్మ.

సూరి ముందస్తుగా తినేసి లేచింది. సీతి ఇంకా అన్నం ఉండగానే లేవబోయింది. కాని వాళ్లమ్మ కోప్పడి కూచోబెట్టి మిగిలిన అన్నం తినిపించింది.

"సీతి మీద సొడ్డు. వెంకి మీద సొడ్డు. సీతి మీద సొడ్డు. వెంకిమీద సొడ్డు" అంటూ నవ్వుతూ సూరి అంటచెయ్యి సీతి కంచం పక్కా వెంకికంచం పక్కా తిరగా మరగా అద్ది లేచి పెరట్లోకి వెళ్లింది.

"చూడవే అమ్మా మరి. నామీద సొడ్డుట" అంది సీతి.

"సీతి మీద సొడ్డోయి ఓయి ఓయి" అంది మళ్లీ సూరి.

"రాత్రి నీమీద సొడ్డేస్తా నుండు" అని సీతి లేచి ఎంగిలిచెయ్యి నాకుతూ దొడ్లోకి వెళ్లి చెయ్యి కడుక్కొంది.

వెంకికూడా అన్నం తిని లేచి, "సూలిమీదా సీతిమీదా సొడ్డోయి" అంటూ వెళ్లి చెయ్యి కడుక్కొంది.

ముగ్గురూ కలిసి వెళ్లి నడవలో కూర్చున్నారు. సూరి రెండోతరగతి వాచకమూ సీతి ఒకటో తరగతి వాచకమూ వెంకి పలకా పలకపుల్లా పట్టుకు కూర్చున్నారు.

సూరి పుస్తకం జాగ్రత్తగా అట్ట వేసుకొంది. కొత్తబట్టలమీది బొమ్మలు అట్టలమీద అంటించుకొంది. పుస్తకంలో ఒక నెమలి కన్నూ దాని దగ్గిరే పువ్వారమూ పెట్టింది. "సీతోయి. చూడవే చూడవే. ఈ నెమిలి కన్నే ఎంత పువ్వారం తినేసిందో. ఒక పిల్లనైనా పెట్టదు—పాడు" అంది సూరి. సీతి తనపుస్తకంలో నెమిలికన్నున్న పేజీ తీసి,

"నా పువ్వారం కొంచెం తింది నా నెమిలికన్ను. చూడే, అక్కా. చూడే, ఎంత చిన్నపిల్లని పెట్టిందో! చూడే ఒసే," అంటూ సీతి ఒక చిన్న నెమిలి వెంట్రుక సూరికి చూపింది.

"అది పిల్లా ఏమిటమ్మా?" అంది సూరి.

"కాదా ఏమిటమ్మా" అంది సీతి.

"నాకు దియ్యవూ" అంది వెంకి. వెంకిని మధ్య పెట్టి సీతి కన్ను దాచేసుకుంది.

సీతిపుస్తకము అంతా నలిగి చిరిగి ఉంది.

"అక్కయ్యా ఈపాఠము చెప్పవుటే నాకు" అంది సీతి.

"ఏంపాఠం" అని సూరి అడిగింది.

"కుక్కపాఠం" అంది సీతి.

"కుక్కపాఠ మేమిటి అనయ్యం. ఇంకా పాఠాల్లేవూ" అంది సూరి.

"పిల్లిపాఠం, ఏనుగపాఠం, సోమరిపిల్లవాడి పాఠం ఉన్నాయి" అంది సీతి.

"అవేంపాఠాలే పాడుపాఠాలు—కథలు లేవూ" అని సూరి అడిగింది.

"నృగునికథ, హరిశ్చంద్రునికథ, ఎడ్వర్డుకథ, ఫ్రాంక్లిన్ కథ—ఈ కథ లున్నాయే" అంది సీతి.

"అవేం కథలే. ఎంచక్కటి కథ లేమీ లేవూ, మనం చెప్పుకునేలాంటివి" అంది సూరి—

"ఏమో నమ్మా నాకు తెలియదు" అంది సీతి.

"పోనీ పద్యం చదువు" అంది సూరి.

"చివరున్నాయే పద్యాలూ చదవనా,—

క్షేత్రంబు పుణ్యప్రకారము
ధాత్రీశ్వర బీజమరయు దైవము రెండుగ
సూత్రపడ గూడె నేనియు—"

అని నట్టుతూ చదవింది సీతి.

"ఏమో నమ్మా ఆపద్యాలు నాకు తెలియవు. అవేం పద్యాలో గాని" అంది సూరి.

"సూరోయి, ఇదేం, నాలుగో వాచకం" అంది సీతి.

"ఆసి దొంగా. ఇంకా నీపుస్తకం అనుకుంటు న్నాను." అంది సూరి.

"పోనీ నీపుస్తకంలో కథలు చదవవే" అంది సీతి.

"నాపుస్తకమూ అలాగే ఉందమ్మా పాడు" అంది సూరి

"ఒకటి చదవ్వే పోనీ" అంది సీతి.

"అయితే చదువుతా విను." అని సూరి ఇలాగ చదివింది.

"పూర్వకాలంబున నుజ్జయిని నా బట్టణం బొండు కలదు......"

"బొండు బొండు బొండేమిటే సూరీ" అంది సీతి.

"వినవే మరి" అని సూరి చదవడం సాగించింది.

"అందు వీరసేనుండను భూతలేంద్రుండు రాజ్యంబు సేయుచుండెను. ఆతనికి చంద్రకళయను పేరంబరగు కళత్రంబు సకల గుణోపేత........"

"పేత పేత పేతేమిటి పీత" అంది సీతి.

"పోనీ అమ్మా నే చదవను" అని సూరి పుస్తకం మూసేసింది.

"నాపుస్తకంలోనూ లేవే మంచి పాఠాలు" అంది సీతి.

"నాపుస్తకమూ అంతే" అంది సూరి.

"పేత పేత పీత" అంటూ కూచుంది వెంకి.

"వెంకీ నీకు నేను అక్షరాలు రాసిపెట్టనులే" అంది సీతి.

"ఊఁ" అంది వెంకి.

ఇంతట్లోకే వాళ్లింట్లో గుమ్మందగ్గిరికి ఒక ముసిలబ్బి వచ్చి నిలబడ్డాడు. తలకు తీవిగా తలపాగా చుట్టుకొన్నాడు. కుడితినీ తొడుక్కున్నాడు. చేతిలో కర్ర ఉంది. చెవులకు ఎర్రరాళ్ల కమలాలున్నాయి. ఎర్ర కుంకం బొట్టు నిలువుగా పెట్టుకొన్నాడు. వచ్చి గుమ్మంలో నిలబడి సూరీ సీతీ వెంకి వీళ్లను చూచి నవ్వి, "అమ్మాయిగార్లు కూచున్నారా" అని ఇంట్లోకి చూచాడు.

"బూచాడు" అంది వెంకి.

"బూచివాడా రారా బుట్టలుకోరా
ఏడ్చేటి మా వెంకీ నెత్తుకుపోరా"
అని సీతి పాడింది.

"బూచాడు కాదమ్మా; అబ్బి" అంది సూరి.

వాళ్లు ముగ్గురూ ఆ అబ్బికేసి చూస్తూ కూచున్నారు.

ఆ అబ్బి ఇంట్లోకి చూస్తూ గట్టిగా ఇలాగ చదివాడు.

"శుభోజయం. శుభోజయం. సకలవిద్వజ్జనాధారా, సకలవిద్యా విశారదా, సకలభోగపురందరా, సకల కళాప్రవీణ, సంగీత రత్నాకర, సాహిత్య భువనమండల, సాహస విక్రమార్క, సత్యభాష హరిశ్చంద్ర,—జయ విజయీభవ దిగ్విజయీ భవ—శుభోజయం శుభోజయం అమ్మగారూ" అని కేకవేశాడు.

"అమ్మ దొడ్లో ఉంది" అంది సీత.

"నాన్నగారో తల్లీ" అన్నాడు భట్రాజు.

"నాన్నేం గదిలో రాసుకుంటున్నాడు" అంది సూరి.

వెంకి సూరి వళ్లో కూర్చుంది. అప్పుడు భట్రాజు గొంతు కత్తి గట్టిగా

"గగనమండల మదే గంటి నేడోయమ్మ
    గగనంబు కాదది గజము కొమ్మ
గజమైన నక్షత్ర గణములం దేమమ్మ
    నక్షత్రములు గావు నవ్యమణులు
మణులైన అరుణాభ మండలం బేమమ్మ
    అరుణాభ మది కాదు సురకజాలు
సురక జాలది యైన మెరపు లం దేమమ్మ
    మెరపులు జలతారు సరుకులమ్మ
సరుకు లవి యైనచో నిండుచంద్రు డేల
సాటి ఘన మేటి (శ్రీ)పూసపాటి విజయ
రామరాజేంద్రసుతుండు నారాయణగజ
పతి సుధీ రాజచంద్రుడే పద్మగంధి."

అని చదివి, "శుభోజయం శుభోజయం" అని మళ్లీ కేక వేసి ఇలాగ చదివాడు.

"పసముత్యె మొకటి చాలును
  కస వూడ్చినచిడిపెరాలు గంపెండేలా
  రసికుం డొక్కడె చాలును
  రసహీనులు పలువు రేల రాయని బాచా.

  డాబాపై కూర్చున్నా
  డే బాలుడు ముద్దుగుమ్మ! ఎవరే చెపుమా
  శాబాసు నీ పెరుంగవె
  బాబాజీ బుచ్చితిమ్మ బహాదరు చెలియా."

"శాబాసు, శాబా సేమిటీ. శాబాసుట" అంది సీత.

ఇంకో పద్యం చదువు అబ్బీ" అంది సూరి.

అమ్మాయిగారు—చదువుతాను:
  కలిమి గలనాడె మనుజుడు
  విలసితసత్కీర్తిచేత వెలయగ వలయున్
  కలి మేమి ఎల్ల కాలము
  కులగిరులా కదలకున్న గువ్వలచెన్నా."

"అవేం పద్యాలే చదువుతాడూ" అంది సీత.

"మంచివీ చదువుతా డుండు" అంది సూరి.

"పాటలు చదువు అబ్బీ" అంది సీత.

"పాటలు రావు తల్లీ పద్యాలు చదువుతాను" అన్నాడు భట్రాజు.

"మా సీతమీద పద్యం చదువు" అంది సూరి.

"చదువుతా తల్లీ:
  సీతమ్మలు ధర నెందరొ
  ఖ్యాతిని గన్నట్టివారు గలరట డొక్కా

సీతమ్మగారి వితరణ
నాతరమా కీర్తి చేయ నలువకు తరమా ”

అని భట్రాజు చదివాడు. అందరూ గొల్లున నవ్వారు.

“మళ్లీ చదువు అబ్బీ మళ్లీ చదువు” అంది సూరి.

భట్రాజు మళ్లీ చదివాడు.

“డొక్కా-సీతమ్మ కాదు. సీతి” అంది సూరి.

“అవును తల్లీ అవును” అన్నాడు భట్రాజు.

“అవునైతే ఇంకోపద్యం చదువూ” అంది సూరి.

“చదువుతా తల్లీ:

త్రువ్వట బాబా తలపై
పువ్వట జాబిల్లి మేన బూదట విషమే
బువ్వట చూడగను హుళి
క్కవ్వట అరయంగ నట్టి హరునకు జేజే.”

“ఉళక్కి ఉళిక్కి” అని సీతి నవ్వింది. వెంకి కూడా నవ్వింది.

“అది కాదు సీతిమీద పద్యం” అంది సూరి.

“అలాగేతల్లీ—అమ్మాయిగారూ చదువుతా:

సీతమ్మలు/ధర నెందరొ
ఖ్యాతిని గన్నట్టివారు కలరట డొక్కా
సీతమ్మగారి వితరణ
నాతరమా కీర్తిచేయ నలువకు తరమా”

అని చదివాడు.

“మళ్లీ ఆపద్యమే చదువుతాడేం” అంది సూరి.

“ఈ అబ్బికి పద్యాలూ రావు పాటలూ రావు” అంది సీతి.

“డొక్కా సీతమ్మాయి” అంది సూరి. సీతికి ఉడుకుబోత్తనం వచ్చి,

“మా సూరి మీద ఓపద్యం చదువబ్బీ” అంది.

“అమ్మాయిగారు-అమ్మగారి నడిగి బియ్యం తెచ్చి పెట్టండి” అన్నాడు భట్రాజు.

“సూరిమీద పద్యం చదివితే నీకు బియ్యం వేస్తా”నంది సీతి.

“సూరమ్మవంటి బాలిక
ఊరంతా తిరిగి తేను ఉంటుందమ్మా
సూరమ్మా నిను బోలగ
వేరమ్మా మంచిపిల్ల లీకాలమునన్.”

అని భట్రాజు చదివేటప్పటికి సీతీ వెంకీ చప్పట్లు కొట్టి నవ్వారు.

“అయిందా, అయిందామరి” అంది సీతి సూరిని చూచి.

“నాన్నగారితో చెప్పి బియ్యం వేయించరా అమ్మాయిగార్లు” అన్నాడు భట్రాజు.


“ఇంకా పద్యాలు చదువూ” అంది సీతి.

“బియ్యం తెండి - అలాగే చదువుతాను” అన్నాడు భట్రాజు.

“మావెంకిమీద పద్యం చదవవూ అబ్బీ” అంది సూరి.


“అలాగే తల్లీ:

ఒక్కడు మాంస మిచ్చె మరి
యొక్కడు చర్మము కోసి ఇచ్చె వే



సింహాచల దేవాలయము
ప్రశస్తశిల్పమునకు పేరు గన్నది.

శ్రీ బి. బుచ్చయ్యగారు తీసిన ఫోటో.



అయ్యంపాళయము దేవాలయము (తిరుచినాపల్లి జిల్లా)
సుందర శిల్పమునకు పేరుగన్నది.

శ్రీ యం. యస్. కుప్పుస్వామయ్యరుగారు తీసిన ఫోటో.

రొక్కరు దస్థి నిచ్చె మరి
　　యొక్కడు ప్రాణము నిచ్చె వీరిలో
నొక్కకపట్టునన్ బ్రదుక
　　నోపక యిచ్చిరొ కీర్తి కిచ్చిరో
చక్కగ చూడు మంత్రికుల
　　సంభవ రాయన మంత్రి భాస్కరా.

పడుచు నిడినవాని పద్య మిచ్చినవాని
కడుపు కిడినవాని నడుపవలయు
నడుపలేనివాని నయువిదు లెంతురా
భువిని భాస్కరేంద్రు పుత్ర కొండ."

"అవి చదువుతాడేం. అవి కాదు. వెంకిమీద పద్యం" అంది సూరి.

"వెంకిమీద పద్యం చదువబ్బీ" అంది సీతి.

"చదువుతా తల్లీ:

నవనవలాడే దేహము
చవులూరేపలుకు తీరు సంపదలోనన్
ప్రవిమలదానగుణంబున
భువిలో వెంకమ్మ తల్లి బోలంగలరే"

అని భట్రాజు చదివాడు. సూరీ సీతీ వెంకీ చప్పట్లు కొట్టి నవ్వారు.

ఇంతట్లోకీ వాళ్ల నాన్న గదిలోనుంచి నడవలోకి వచ్చి భట్రాజును చూచి,

"ఎవరవోయి నువ్వు" అని అడిగాడు.

"మేం భట్రాజులం అన్నదాతా. ఇది మా కులవిద్య తండ్రీ.

పలువిద్య లెన్ని నేర్చిన
కులవిద్యకు సాటి గావు కుంభిని లోనన్
వెలకాంత లెందరైనను
కులకాంతను బోల రన్న గువ్వలచెన్నా.

అమ్మాయిగార్లకు పద్యాలు చదివి వినిపిస్తున్నాను అన్నదాతా" అన్నాడు భట్రాజు.

"సూరీ, బియ్యం వేసి పంపించవే" అన్నాడు వాళ్ల నాన్న.

"తండ్రీ తమకు తొడిగి విడిచిన వస్త్రం ఒకటి దానం చేస్తే కలకాలమూ చెప్పుకుంటాను" అన్నాడు భట్రాజు.

వాళ్ల నాన్న ఒకచొక్కాయిచ్చాడుభట్రాజుకి.

సూరి సోలతో బియ్యం తెచ్చి భట్రాజు వళ్లో పోసింది.

"నేనూ బియ్యం పెడతా" నని సీతి కూడా సోలెడు భట్రాజువళ్లో పోసింది.

"నేనూ పెత్తా" అని వెంకి రెండు గుప్పిళ్లతోటే బియ్యం వళ్లో పోసింది.

"ఇక వెళ్లు" అన్నాడు వాళ్ల నాన్న.

"అయిదోతనంకలిగి ఐశ్వర్యం గలిగి ఆరోగ్యం కలిగి నూరేళ్లువర్ధిల్లండి అమ్మాయిగార్లునూరేళ్లు వర్ధిల్లండి" అనిచెప్పి భట్రాజువెళ్లి పోయాడు.

"బియ్యం అన్నీ పోసేస్తున్నారర్రా" అని వాళ్లమ్మ పెరట్లోంచి కేక వేసింది. "లేదే" అన్నారు సీతీ సూరీని.

"లేదు లే నేచూస్తున్నా"అన్నాడు వాళ్ల నాన్న.

సూరి సీతినిచూచి"డొక్కాసీతమ్మాయి"అంది.

సీతి సూరిని చూచి "ఊరంతా తిరిగి తేను ఉంటుందమ్మా సూరమ్మా" అంది.

సూరీ సీతీ వెంకిని చూచి

"వెంకమ్మ తల్లి బోలంగలరే" అన్నారు.

వాళ్ల నాన్న నవ్వాడు.

విరహగోపి

పాటిబండ మాధవశర్మగారు

శ్రీ వసియించు పట్టు నిరసించి కఠోర దరిద్రదేవతా
ప్రావరణమ్ములన్ నిజనివాసముగా వరియించుకున్న యా
నీ వరకీర్తి నా మెదటి నెత్తుటిరేఖల వ్రాసికొందు; త
ల్లీ! వచియింపు మాశిషము లీ నతశీర్షముమీద భారతీ!

శ్రీకరమై ముహుః పరవశీకృత గోపవధూకమై, సదా
లోకిత సమస్త లోకమయి, లోకవిమోహనకృద్విలోకమై,
ప్రాకటమైన నీవదనపంకజ లక్ష్మికి రక్షమైన యా
కేకిశిఖాకలాపమున కెత్తెద కప్రపు మంగళారతుల్.

నీవు సుధానిధానమవు నీ మురళీ మృదుగానమున్ సుధా
స్రావి సుధామయమ్ము గదరా! నిఖిలమ్మును నిన్ను గూర్చిన
స్థావర జంగమాత్మక విశాలజగాన త్వదీయదివ్యగా
నావశమై కరంగనిది యున్నది లేదుగదా! జగత్ప్రభూ!

కోటివరాలు సేయు కులుకుల్ తులకించెడు పాలబుగ్గలన్
కాటుకముంగురుల్ మురువుగా గుబురుల్ గొన చంద్రవంకపై
నీటగుపించియమ్ము తవణిల్లెడు ముందల గొప్ప ముద్దులన్
మూటలు గట్ట కొంటెతనముల్ గనిపింతువు రాగదో ప్రభూ!

పా లెగజేపుకున్న వాకపట్టున చేరెడు నేని రాల్ప వీ
యాలు; భవద్వియోగజనితాశ్రుముఖమ్ములు; నిల్వ నీరు గా
బోలును; రాల్ప వాక్కకణమున్ పసిపాపలకైన; ఇంత మో
హాలసలైన వీకదుపులైన; అదెంతటి దివ్యశక్తియో!

"రాతిరియున్ బవల్ మరపు" రావు గదా! భవదీయహస్తసం
పాతముమాత్రనే విరియబారెడివే? మరి నే డికేరినం
ప్రీతికిగా నటించు నరవిచ్చుట సైతము మానుకున్న వీ
లేత గులాబిమొగ్గలు; బళే! జగదేకమనోహరాకృతీ!

సన్నము సన్నమై విరహతాపహతిన్ లతలెల్ల గుజ్జులై
చన్నవి; గొల్లపల్లెపువుజప్పదయుల్ నిను లేక విన్ననై
యున్నవి; యేమి యెంచుకొననో గద! వెన్నలు వంగునట్లుగా
క్రొన్ననలున్ బువుల్ కలిపి గ్రుచ్చుచునున్నవి యేకదీక్షతో!

ద్వేషితకాళియోరగపతిన్, హృతజీవనపూతనాసురున్,
భూషితపింఛలాంఛనుని, పోషితగోకులు, బాలకృష్ణు న
న్వేషణకార్యమం దశన నీరనిరాకృతి నేకదీక్షతో
ఘోషకుటీ విటంకముల గ్రుమ్మరుదున్ నిశలన్ దివమ్ములన్.

గాటపు మోహ మాచికొనగా దరి గానక నీవు నేను ము
న్నాటల నాడుకొంచు తిరుగాడిన కానలలో తమాలపున్
వాటులవెంట నీవు కనవత్తువొ యన్నదురాశపొంటె నై
శాటపథమ్ము వట్టి తిరుగాడుచునుంటి గదా! జగత్ప్రభూ!

యామున నిమ్నగా తరళ హారి తరంగములందు వాలుకా
సీమలలో భవ మ్మొకము జేసుక శారదశీర్షయామినీ
యామములందు రాసరచనార్పిత జాగృతి నే మనోహర
శ్యాము దనించినానొ భరమయ్యెడు నాస్మృతి మోహనాకృతీ!

తే గను గూర్కులన్ గలువరించుచు మై పులకించుకొంచు నీ
లా గెటు లెట్టులో దినములన్ గ్రమియించితి నింతదాక నిం
కీగతి నెన్నినాళ్లు భరియింతు ప్రభూ! దయచేసి యీమనో
వేగము దీర్తు గాని కనుపింప గదోయి జగన్మనోహరా!

పిల్లసమీరముల్ మలయువేళ, సుధాంశుడు లేతవెన్నెలన్
జల్లెడువేళ, సప్రణయ సామృతదృక్కులతోడ నాపయిన్
జల్లని చూపు జూచినను చాలు నదే పదివే లటంచు మే
నెల్ల విషాదమై కలువరించెడు నన్నిటు సేతువో సఖా!

తీయని వెన్నపూస పగిదిన్ ద్రవియించెడు నీదుమానసం
బాయనకర్కశం బయినదా? ఇనదారుణదుర్వియోగదుః
ఖాయుతకీలికాజ్వరితమై పలవించెడు దాసి నిట్టు ల
న్యాయము సేతువా? ఘనఘనాఘన కాలవపుఃకళానిధీ!

నా రతినాలకుప్పవని, నా మురిపమ్ముల మూట వంచు, బం
గారపుకొండవంచు తమకమ్మున నిక్క బతిమాలుకొందు, నన్
చేరగ రమ్ము ముద్దిడుమ చెక్కిలి నొక్కుచు చక్కనయ్య! నిం
డారుకవుంగిటం బొదివి యందెద అందగరానిసౌఖ్యమున్.

సాగరనీలమున్ మధురసప్లుత మా తవసుందరాంగమున్
కౌగిటజేర్చి యొక్కత్రుటికాలము, లౌకికనారకవ్యథా
త్యాగ మొనర్చి పారవశతాధికతాసుఖతాత్మ నొందు; హం
సీగమనమ్ముతోడ నను చేరగ రాగదరా! మనోహరా!

మ్రోగనువడ్డ జాలు గదరా! యెదురయ్యెదు, వంశికాసుధా
రాగముతోడ, పింఛపరిరంభిత చూడముతోడ, భాగురో
భాగముతో లయానుగుణపాదయుగీగమనమ్ముతోడ; ఈ
యాగడ మేటికోయి, భరమయ్యెడు మోహము, మోహనాకృతీ!

నీ లలితస్వరూపము పునీతతమాలమహీజశాఖలన్
వ్రేలెడునాట దెచ్చి పదిలించితి నాహృదయమ్ములోన, గో
పాలక బాలలాలనకృపాళులు నాటికి నేటికి శ్రవో
గోళములందు హత్తె నివిగో భవదీయ మనోజ్ఞగానముల్.

విశ్వము "తల్లక్రిందయి" తపించియు పొందగ రానివై, సుధా
నిశ్వనప్రపూతమగు నీమురళిన్ పెదవిన్ దగిల్చి, వైం
ద్రాశ్వమనోజ్ఞరింగణశనైర్గమనమ్మున వచ్చి యొక్క నా
గస్వర మూది జీవభుజగమ్మును పట్టుకపొమ్ము! మోహనా!

వైరవిచారకారణము పాలకసేవకభావమై యహం
కార వికారదూషితము కశ్మలవేశ్మమునైన యీలమో
గారమునుండి యొక్కఋతుకాలవిభాగము లేని, క్షుద్రని
ద్రారతి లేని శాశ్వతపదమ్మును చేర్ప గదో జగత్ప్రభూ!

పాక్షికభావలుబ్ధము, స్వపక్షవిపక్ష విధావిభక్తమున్,
తత్క్షణమాత్ర ముగ్ధమును, తత్క్షణమాత్ర విరుద్ధమున్, విము
క్తక్షమమున్, సదాసుముఖతక్షయ మీ జగమున్ త్యజించి యే
యక్షయప్రేమరాజ్యమునకైనను పోదము రాగదో సఖా! (సశేషము.)

"మధుకణములు"నుండి.



తండ్రిప్రేమ

అనగాఅనగా వొకవూరు. ఆవూళ్లో తండ్రీ కొడుకులు భార్యాపిల్లలతో వొకవూరింట్లో కాపరముండేవాళ్లు. వొకమాటు ఆవూరిల్లు దిట్టంగా వుండకపోవడంవల్ల వానకు కురిసింది. మర్నాడు కొడుకు మీదికెక్కి కప్పు మరమ్మత్తు చేస్తున్నాడు. ఎండవేళ, మిట్టమధ్యాహ్నం. ఎండ పెళ్లున కాస్తూంది. కొడుకు యింటిమీద యింకా పనిచేస్తూనేవున్నాడు. తండ్రి వీధిలోకివచ్చేడు; ఇంటిమీద పనిచేస్తూన్న కొడుకును చూసేడు. ఎండమండిపోతూ ఒకమూల గుమాయించేస్తూంది. ఒకటే చెమట పొయ్యడం. నోట్లో తాపమెత్తిపోతూంది అదే నిప్పులు చెరిగెయ్యడం. తండ్రి యెండలో నిలుచోలేకపోయేడు. కాళ్లు కాలిపోతున్నాయి. అప్పుడు కొడుకువైపుచూసి "ఒరే అబ్బాయీ, యింతయెండ మండిపోతూవుంటే యింకా పనిచెయ్యడమేమిట్రా. దిగుదిగు యీపాటికి, చల్లపడ్డాక మళ్లీ చేద్దూగానిలే" అన్నాడు. కొడుకు "పోనీ లెద్దూ నాన్నా, మరేం ఫర్వాలేదులే. ఏమంతయెండ యెక్కువగావుందనీ" అన్నాడు. తండ్రి మళ్లా బతిమాలేడు. ఉపయోగంలేకపోయింది. తండ్రియింట్లోకివెళ్లిపోయి మనవణ్ణి (కొడుకుకొడుకుని) చంకబెట్టుకుని మళ్లీవీధిలోకివచ్చి మిడెండలో నిలుచుని "అబ్బాయీ, బాబూ, దిగిరారా, మళ్లీ సాయింత్రం చెయ్యవచ్చునులే. ఇంతయెండలో పనిచేసదేమిట్రా" అన్నాడు. కొడుకు 'ఫర్వాలేదులేనాన్నా' అని తలయెత్తి తండ్రివైపుచూసేడు. తండ్రిచేతుల్లోవున్న తనకొడుకునుచూసి "అదేమిటినాన్నా, పిల్లాణ్ణియిలాంటియెండలో యివతలికి తీసుకొచ్చేవు. తీసుకుపో తీసుకుపో తొందరగా యింట్లోకితీసుకుపో, బిడ్డడు వడగొట్టిపోతాడు" అన్నాడు. అప్పుడు తండ్రి నవ్వి "అబ్బాయి! నీకొడుకు యెండలోవుంటే నువ్వు వోర్చలేకపోయేవు. నాకొడుకువుకదా నువ్వు; నువ్వుయెండలోవుంటే నామనస్సెట్లావుతుందిట్రా నాన్నా" అన్నాడు. అప్పుడు కొడుకు తండ్రిప్రేమ యిలాగుంటుంది కదా అనుకుంటూ యింటిమీంచిదిగి యింట్లోకి వెళ్లిపోయేడు. కథకంచికి మనం ఇంటికి. కే. రా.

యుక్తి

శ్రీమతి వి. సంపూర్ణముగారు

అనగనగా ఓ రాజు. ఆ రాజుకో మంచి వజ్రాల ముద్దుటుంగరం వుండేది. దాన్ని ఎప్పుడూ తీయకుండా వేలినే పెట్టుకో వుండేవాడు ఆ రాజు. ఎప్పుడూ దాన్నే చూచుకొంటూ తన ప్రాణాలన్నీ దానిపైననే విడుస్తూ వుండేవాడు.

ఓ నాడు రాత్రి రాజు మంచినిద్దలో వుండగా ఓ పనివాడు వుంగరాన్ని తీసుకుపోయినాడు. రాజు మర్నాడు తెల్లవారలేచి వేలుచూసుకుంటే వుంగరం కనపడలేదు. పడక, యిల్లూ అంతా వెతికాడు. ఎక్కడా దొరకలేదు. పనివాళ్లందర్నీ అడిగాడు. 'మాకు తెలియదంటే మాకు తెలియ' దన్నారు అందరున్నూ. రాజు నాడు సాయంత్రానికి ఓ వుపాయం ఆలోచించాడు. రాత్రిపండుకోపోయేటప్పుడు నౌకర్లనందర్నీ పిలిపించాడు. పన్నెండంగుళాల పొడుగుండే కర్రలను తలకోటిచ్చాడు. 'ఒకే ఈ కర్రలను మీరు ఇండ్లకు తీసుకువెళ్లండి నావుంగరం దొంగిలించినవాడికర్ర తెల్లవారే సరికి ఓ అంగుళం పెరిగివుంటుంది. దొంగ చిక్కిపోతాడు; పొండి తెల్లవారే కర్రలు తీసుకొనిరండి' అని వాళ్లను పంపేశాడు.

ఉంగరం దొంగలించిన నౌకరు 'తెల్లవారికికదా కర్ర ఓ అంగుళం పెరుగుతుంది. కాబట్టి ఇప్పుడే ఓ అంగుళం ఇందులో నరికేస్తాను. తెల్లవారేటప్పటికి పన్నెండంగుళాల పొడుగేవుంటుంది. అందుచేత రాజు నన్ను పట్టుకోలేకపోతాడు' అని తన కర్రలో ఓ అంగుళం నరికేశాడు.

రాజు వుత్తరువు ప్రకారం అందరు తెల్లవారే మళ్లీ కర్రలుతీసుకొనిపోయి రాజుదగ్గర పెట్టినారు. అన్నికర్రలూ ఆయన చూచాడు. ఓకర్రమాత్రం పొట్టిగావుంది. దాన్ని మెత్తుకొని 'ఈ పొట్టికర్ర ఎవరి'దన్నాడు. 'నాది' అని దొంగవాడు దగ్గరికి వచ్చాడు. వాణ్ణి రాజు బాగా తన్నించాడు. వాడు 'కుయ్యో మొర్రో' అని యేడుస్తూ వుంగరం రాజుకు ఇచ్చేశాడు. కథ కంచికిపోయింది. మనం యింటికివచ్చాము.

కొడుకూనుగన్నా తల్లి బుడికీసలో

శ్రీ పాలంకిపాటి లక్ష్మీబాయమ్మ గారు

అనంగనంగా ఒక వూళ్లో ఒక తల్లి, కొడుకు, కోడలు వున్నారు. కోడలి తల్లి కూడా వాళ్లదగ్గిరే వుండేది. ఇలాకొన్నాళ్లు జరిగినతర్వాత అత్తగారుండడం యిష్టములేక కోడలు రోజూ, మొగుడుదగ్గిర కూర్చుని, "మాఅమ్మవుండగా మీఅమ్మ ఎందుకు ? మీ అమ్మను అర్ధరాత్రి తీసుకెళ్లి గోదావరిలో తోసిరా " అని పోరుతూండేది. ఆ మొగుడు

దీనిరోగం నే కుదిరిస్తా, నని మనసులో అనుకొని, "ఒసే ఈవాళ మీఅమ్మను మాఅమ్మను ఒకచోట పడుకోబెట్టు. వాళ్లు నిద్రపోతున్నప్పుడు నీవు నిమ్మళంగా మాఅమ్మకాలిదగ్గిర గుర్తుగా ఒకపీట పెట్టివుంచు. అది ఆనవాలు చేసుకొని నేను నిశిరాత్రివేళ మా అమ్మను తీసుకుపోతాను" అన్నాడు. పెళ్లాం సరేనంది. ముసలమ్మ లిద్దరూ నిద్రపోతూండగా చీకటిలో తెలియక అత్తగారి కాళ్లదగ్గర పెట్టవలసిన పీట తన తల్లి కాళ్లదగ్గర పెట్టింది.

మొగుడు అర్ధరాత్రిలేచి పీటఆనవాలున్నమనిషిని తీసుకొనిపోయి అడివిలో దింపివచ్చాడు. మొగుడు యింటికిరాగానే పెళ్లాము తన అత్తగారిని గోదావరిలో తోసివచ్చాడు గదా అన్న సంతోషం పట్టలేక చప్పట్లుకొడుతూ గంతులేస్తూ, "కొడుకూను గన్నాతల్లి బుడికీనలో; కొడుకూనుగన్నాతల్లి మునిగీనలో" అని పాడుతూంది.

ఇదంతా విని మొగుడు, "తెల్లారిలేస్తేను లభాయిలో తెల్లారిలేస్తేను దిభాయిలో" అని పాడేడు. పెళ్లాము తెల్లారి లేచి చూచింది. తనతల్లి లేదు. అత్తగారు పడుకునివుండడం చూసి ఏడుస్తు కూచ్చుంది. అక్కణ్ణించి ఈ ఏడుపంతా మొగుడు విని "భడవముండా! నీతల్లి నీ కేలాటిదో నాతల్లి నాకాలాంటిదికాదా ఇకఎప్పుడూ 'మీ అమ్మ పోవాలి మాఅమ్మ వుండాలి' అనకు" అని చీవాట్లుపెట్టి పెళ్లాం బతిమాలి కాళ్లు పట్టుకోగా మళ్లా అడవిలోకెళ్లి అత్తగారిని తీసుకొచ్చి భార్యకు అప్పచెప్పాడు.

అప్పటినుంచి అత్తగారంటే కోడలు చాలా భయభక్తులతో వుండి మర్యాదగా కాలం గడుపుతూంది.

బాదరాయణసంబంధం

అనగా అనగా ఓవ్వూరు. ఆవ్వూళ్లో ఒక బ్రాహ్మడు ఆయనభార్యాను. ఇద్దరూపూర్వకాలపు మనుషులే పాపం. ఒకజోలి ఒకప్రస్తావన లేదు. వారింటిపనులేమో వారేమోకాని. అయితే ఒకరినొకరు బాగా ప్రేమించుకునేవాళ్లు. ప్రతివిషయంలోను భర్తకు కోపంరాకుండా భార్య, భార్యకు కోపంవస్తుందేమోనని భర్త మాజాగ్రత్తగా ప్రవర్తించేవాళ్లు. ఒకరోజున భార్యమడికట్టుకొని యింట్లో వంట చేసుకుంటూంది. భర్త అప్పుడే యెక్కడికో పనిమీదవెళ్లివచ్చి అరుగుమీద విస్తళ్లు కుట్టుకుంటూన్నాడు. భోజనాలవేళైంది. కొంతసేపైన తర్వాత 'ఒసేవ్ స్నానం చెయ్యవచ్చునా'అన్నాడు బ్రాహ్మడు. 'ఆఁ, లేవండీ' అన్నది

భార్య. ఇంతలో వాకిట్లో యెక్కడిదో ఒక రెండెడ్లబండి వచ్చినిలిచింది. ఈబండి ఆసామీ కూడా బ్రాహ్మడే. ఆయన యేదో పొరుగూరికి వెళ్లుతున్నాడు. అక్కడికి వచ్చేటప్పటికి అకాలమైంది. అప్పటికి బ్రాహ్మడింటో బిచానా వేద్దా మనుకొన్నాడు. వాకిట్లో బండి దించి యెడ్లను రెంటిని మన బ్రాహ్మడిదొడ్లోవున్న రేగుచెట్టుకు కట్టేశాడు. ఎకాఎకిన యింట్లోకి పోయి చెంబుతో నీళ్లు దెచ్చుకొని పాదప్రక్షాళన చేశాడు. వంకెమీదవున్న కొల్లాయిగుడ్డ యెవ్వరుయివ్వకుండానే తీసికొని కాళ్లుతుడుచుకున్నాడు. అరుగుమీద మన బ్రాహ్మడిదగ్గఱ కూర్చొని తనుకూడ ఒక అంటు ముదలేశాడు. ఇది అంతా ఆ అమాయిక దంపతు లిద్దరు చూస్తూనేవున్నారు. 'భర్తవైపు చుట్టమైయుంటాడు లేకపోతే యింతస్వతంత్రంగా యింట్లోకి వస్తాడా!' అనుకుంది భార్య. 'భార్య కేదో కావలసివుంటాడు; లేకపోతే యింత చొరవచేసుకుంటాడా' అనుకున్నాడు భర్త. 'మావారికి మీ రేంకావాలి' అని అడిగితే మర్యాదాకులోపం అట్లావుండగా భర్తకు కోపంవస్తుందేమో నని భార్య పలకరించలేదు. 'మీరు మాయింటా విడతరఫుబంధువులా' అని అడగటం గృహస్థులక్షణం కాకపోవడమే కాకుండా భార్యకు కోపంవచ్చిపోతుందేమో నని భర్త పలకరించలేదు. సరే; యెట్లాఅయితే యేం బ్రాహ్మ లిద్దరు స్నానంచేసి ఒకరితో ఒకరు మాట్లాడక భోంచేశారు. భార్యకూడ పలకరించకుండానే వడ్డనచేసింది. భోజనంకాగానే కొంచెంసేపు పడుకొని ఎండతగ్గగానే కిక్కురు మనకుండా బండికట్టుకొని బయలుదేరాడు పొరుగూరు బ్రాహ్మడు. ఇంటి బ్రాహ్మడు యిక పలకరించక తప్ప దనుకొని, 'అయ్యా, తమ దేవ్వారు. మాఆవిడకు తమ రేం కావాలి. ఇంతవఱకు తమ రాకలితో వుంటారు భోం చేసిన తర్వాత పలకరిద్దా మనుకొన్నా' నన్నాడు. అనేటప్పటికి పొరుగూ రాయన:—

"శ్లో. అస్మాకం బదరీచక్రం
యుష్మాకం బదరీతరుః,
బాదరాయణసంబంధం
యూయం యూయం వయం వయం—

"మాబండికి రేగుకఱ్ఱచక్రాలు. మీ యింటివద్ద రేగుచెట్టున్నది. ఇది రేగుసంబంధమగు చుట్టరికము. మీరు, మీరు; మేము, మేము." అని తనదారిని తానుపోయినాడు. కథకు కాళ్లులేవు. ముంతకు చెవులులేవు.

చింతలపూడి శేషగిరిరావు.

సింహం చప్పిడిముక్కు

శ్రీ నరసింహస్వామిగారు

పూర్వం ఒకప్పుడు శివపార్వతు లిద్దరు నంది వాహనం ఎక్కి భూలోక సంచారం వెళ్లి తిరిగొస్తూ కైలాసానికి దగ్గిరసా వాహనం దిగి ముచ్చట్లాడుకుంటూ నందిని వెనక నించి రమ్మని వచ్చేస్తున్నారు. కొంతదూరం వచ్చేసరికి పార్వతీదేవి వాహనం అయిన సింహం తోవలో కూచొని భూమి ఊరికే వాసన చూస్తూంది. ఈశ్వరు డేం చేశాడూ, సింహం దగ్గిరసా వెళ్లి 'ఏమిటి వాసనచూస్తూందో చూద్దా' మని వంగి చూశాడు. ఏమీ కాన రాలే. అమట్టున సింహాన్ని అడిగాడు, ఏం చేస్తున్నావని. "ఏమీ లేదూ ఎదో పశువు వస్తూన్నట్టు వాసనేసింది. ఎంతదూరంలో ఉందో అని పసిచూస్తున్నా" నంది. ఓసి! నీతల తరగా ఇదా నువ్వు చేసేపని. నీక్రూరత్వానికితోడు! పసిగూడా పెట్టాడా బ్రహ్మ! ఇలా అయితే ప్రపంచంలో గల జీవరాసుల నన్నీ మీవంశమే యిట్టే కాచేసేస్తుందే. ఇహ ఏంలాభం నృష్టించి" అంటూ సింహం తలకాయ పట్టుకొని ముక్కు నేలనేసి గట్టిగా రాచేశాడు. అప్పట్నుండే దానిముక్కు చప్పబడ్డాది. పసి పట్టడం గూడా పోయింది. ఇది దాని జాతంతటికీ సంక్రమించింది. ఇలా శివుడు చేయకపోతే లోకం ఈపాటికి వెళ్లాల్సిందే యమలోకానికి. కథ కంచికీ. మనం ఇంటికీ.

మా చిన్ని కృష్ణమ్మ

చిలుకూరి లక్ష్మీనరసమ్మగారు

కాళ్లకు గజ్జలు - కట్టుకొని
చేతికి గొలుసులు - పెట్టుకొని
మెడలో సరములు - చుట్టుకొని
గునగున రారా - కృష్ణయ్య.

కస్తురితిలకము - దిద్దుకొని
కొప్పున పువ్వులు - తురుముకొని
పాపటను తురా - పెట్టుకొని
మొగముచూపరా - కృష్ణయ్య.

చందమామరా - నీమోము
చల్లని వెన్నెల - నీ నవ్వు
అమృతంమూట - నీమాట
ముద్దివ్వర నా - కృష్ణయ్య.

ఆవుల దూడల - తోలుకొని
చెట్టుల నీడల - చేరుకొని
వేణువు చేతను - పట్టుకొని
తియ్యగ పాడర - కృష్ణయ్య.

గొల్లల పిల్లల - కూడుకొని
గొల్లల యిండ్లను - గొల్లగొని
వెన్నా మీగడ - తెచ్చుకొని
నాకును పెట్టర - కృష్ణయ్య.

వెండి గిన్నెలో - వెనముద్ద
పైడిగిన్నెలో - పాయసము
ఉంచితి నీవును - జాబిల్లి
కూడుక తిందము - కృష్ణయ్య.

పిల్లలపాటలు



చీమ మొక్కడి కెళ్లింది
చిటికలోన వచ్చింది
పంచదార తెచ్చింది
పాయసమెంతో వండింది
పెరుగులన్నం తినకుండ
పరుగుపరుగున పోయింది.



దబ్బా చెట్టుకు దారీ లేదు
నిమ్మా చెట్టుకు నీరూ లేదు
కందికంపకు కాయా లేదు
పొందిక లేని పోకమల్లు
వానల్లేక యెండేనమ్మా.



చెట్టునివున్నా కాయలూ
చెలువుమీర కొయ్యండి
పొదలోవున్నా పువ్వులూ
పొందికగాను కొయ్యండి
కాయలు పువ్వులు ఉంచండి
సజ్జలో ఎంతో సందడిగా
రాముడి కన్ని కాయలూ
జానకి కన్ని పువ్వులూ
భక్తితోనే పంచండి.



ఉసిరికాయలకుండ
ఊరిబిండికుండ
కుండో కుండ.

పసిడివన్నెపుకుండ
పానకపుకుండ
కుండో కుండ.

చల్లవున్నా కుండ
చక్కదనాల కుండ
కుండో కుండ.

జోలపాటలు

శ్రీ శంకర సీతారత్నముగారు

ఓ జోలా;
జోలపాడినవారు జోకొట్టువారూ
అబ్బాయిని పాడినవారు ముద్దాడువారు

తాతలకి ముద్దమ్మా తండ్రులకి ముద్దూ
అంతకన్నా ముద్దు మేనమామలకీ
మేనమామలగారి పట్టె నిమ్మన్నీ

ఎక్కడి బాబయ్య వెలపొన్నమానూ
మంచిగంధపుచెక్క మామ లట్లాడా
మా పట్టి నిచ్చేము దిగవయ్య పొన్నా.

* * * *

ఓ జోలా ;
జోలలు బాడితే బాలలకు నిద్రా
నాగస్వరముబట్టితే నాగులకు ఆటా
ఆడంగ ముద్దమ్మా పాడంగ ముద్దూ
అందరికీ అమ్మాయి అల్లారిముద్దూ.

* * * *

చిచ్చీ చిచ్చీ చిగురుమామిడీ,
పళ్లేల పండవే పళ్ల మామిడీ
నే నెట్లు పండుకునూ చిలకల్ల చేతా
చిలకల్లు మాయింటి చెలికత్తెలమ్మా
చిలకల్లు మాయింటి చెలికత్తెలమ్మా
హంసల్లు మాయింటి ఆడపడుచుల్లూ
కోవెల్లు మాయింటి కొత్తకోడళ్లూ
కోవెల్లు మాయింటి కొత్తకోడళ్లూ
పావురాల్లు మాయింటి బాలపాపల్లూ:—

* * * *

ఓ జోలా;
జోలలకి జొన్నబువ్వ: అమ్మ కొరిబువ్వా
వేడ్చేటి అమ్మాయికి మెట్టావుపాలు
చిన్న నా అమ్మాయి పుట్టిన్నినాడూ
స్వాతివానలు గురిసె, సముద్రాలకడనూ
పాలవానలు గురిసె బంధువులకల్లా.

* * * *

ఓ, లాలీ!
లాలి కొండ రత్నాలు, రంగు నీలాలు
చీకటికి దీపాలు చిట్టితల్లి కళ్లు
మెవ్వ రేమన్నారూ; నిన్ను నా తల్లీ
వెలలేని వీథిలో యేనుగన్నారా
కంభానికట్టిన్న కనకమన్నారా.

* * * *

ఆటకూటమ్మిలో ఆడేవు నెమలీ
వేటగా డొచ్చాడు, ఆట చాలించూ
బంగారుమేడలో నవ్వావు అమ్మా,
నా అల్లు డొచ్చాడు, నవ్వుచాలించూ
నాగబంధపుచెవుల పోగు లున్నాయీ
మెట్టి చిన్నావాడు, మెవరల్లుడమ్మా.

* * * *

వెంకటేశుడు మొక్కు, మొక్కుకున్నామూ
దాగళ్ల వడపప్పు, దండిబెల్లాలూ
మండిగల దీపాలు, మరి పానకాలూ
గుడిచుట్టు దీపాలు, గుమ్మాడిపళ్లూ.

* * * *

నా చిన్న అమ్మాయి, నా చిన్న మోమూ
నిండుపున్నమనాటి చంద్రుణ్ని జోలూ
చిన్ని నా అమ్మాయి, చిరిమోము జూచీ
సిగ్గుపడి చంద్రూడు పొడవజాలాడూ
మర్నాడు, అమ్మాయి మాటల్లు వీసీ
మాణిక్యాలతోనూ పొడిచె చంద్రూడూ.

* * * *

శ్రీ ఝాన్సీ రాణి

పి. వి. రామారావు గారు

శ్రీ భారతాగార శోభిత ఝాన్సీరాజ్య గర్భాలయ రత్నకాంతి
ఆసేతుతుహినాచలావనీపక వనీపక మనోభీష్టద పద్మనిలయ
నిఖిలహిందూరాజ్య సుఖసాధన ప్రసాధన ధనాదికదాన దైవతమణి
అవనీసుపర్వాన్వయాంభోధిసంభూత శారదపూర్ణిమా చ [illegible]
అప్రతిమ ప్రతాప భానుప్రదీప్తి-సకల శరణాగతారి ప్రశా [illegible]
లలితగుణలక్ష్మి శ్రీ ఝాన్సి లక్ష్మిబాయి-క్రాంత [illegible]
కుటిల శాత్రవ దానకుంభిశుంభత్కుంభ పాటనపా [illegible]
పటుగర్వ దుర్వార వైరిభూభృద్భూభృదోఘ విదార [illegible]
చటులారిరాజన్యపటల ఘోరాటవీ దహన విజృంభణ దావకీల
కటురిపుక్ష్మాపాల కటకజ్వాలజ్జ్వాలనోపశాంతిక్రియాటోపవృష్టి
శత్రుకులతూల హేతి నిశాత హేతి-రాజలక్షణభద్ర! స్వరాజ్యముద్ర!
సరసవాగ్వాణి! వితరణ శస్త్రపాణి!-శత్రువేణుఘోణిశ్రేణి! ఝాన్సిరాణి!

సకలసద్విద్యా విశారద శారద వగు దగ్రజన్మ జన్మాప్తికతన
లలితసంపత్తి వాల్లభ్యలాలితలక్ష్మి వగుదు భూధరవివాహంబుకలిమి
సర్వమంగళకళాసర్వమంగళ వౌదు గంగాధరునకు నర్ధాంగి వగుట
భీషణద్వేషణ పృథుశిరోధిస్రుత రుధిరనీరధి మగ్నరూక్షమూర్తి
వగుచు బటుశక్తి వగుదు వీ వాదిశక్తి-మువురుమూర్తులు నీమూర్తి మ్రోల నిలువ
జాల రో తల్లి! వీరమాహామతల్లి!-సల్లలితకీర్తి హాసిప్రఫుల్లమల్లి!

అల శిరీషసుమమృద్వంగంబు సైచె నెబ్బంగి ఫరంగి ఫిరంగిగుండ్ల?
నుద్యానవిహారణం బోర్వని నీ వెట్లు 'కాల్పి' కేగితి తురంగంబు నెక్కి?
రాజన్యమకుటాగ్ర రత్నదీప్తాంఘ్రు లెట్లోర్చె మాంసాతతాయోధనోర్వి!
బుష్పాపచయకేలి బాగులు నీ కే లెట్టు లసి బూని పగతుర గసిమసంగె?
రాణివాసంబు బాయని రాణి వెట్లు-భరతపౌరుషబీజాలి వైరిరుధిర [కొమ్మ!
మనెడి నీ క్రొవ్వి పోషించి తమ్మ? 'గ్వాలి-యరు' గెలుపుగొమ్మ! గంగాధరార్య
సముదారిలోహిత కమలాకరక్రీడ కమలాకరక్రీడకరణి బరగె
చలితారినృపబల కలకలారావంబు కలకలారావంబునా కనరె

వైరిరాట్కారముక్త వరశిలీముఖములు వరశిలీముఖములభాతి నొప్ప
పరభూప శస్త్రాస్త్ర బర్హిసంరంభంబు బర్హిసంరంభంబుభంగి బొలిచె
హరివీరవిహారంబు లందు నీకు-ప్రథితగుణవ్రాత! నుతపరాక్రమ సమేత!
హతవిపక్షవిఘాత! సాహసనిశాత!- శూరకులజాత! రఘువనీ వీరమాత!
మాణిక్య గాణిక్య మహితాశ్వవర రథోద్భటభట పటలసంపత్తితోడ
పండితమండలీ మండనోద్దండ కవిప్రకాండ మనోజ్ఞవినుతితోడ
ధాళధళ్యప్రభాధవళితాశాంతరచామరాత్తప్రమదశ్వంబుతోడ
మహనీయతపనీయ మణిగణస్తవనీయ కంఠహారామల కాంతితోడ
నేవు దీపించు గెంబట్టుటోపితోడ- జెలగి రత్నసింహాసనాసీనవైన
నాటి నీమూర్తి మనముల నాటియుండె-లక్ష్మి! నిర్వక్రవిక్రమోల్లసితలక్ష్మి!
రోజు దాబన్నెండురోజులు ఘోరాజి రోజంగ జేసిన రాజవదన
అధ్వమధ్యంబునం దడ్డిన జౌకరు త్రుళ్లింత ద్రుంచిన తోయజాక్షి
హుసన్నారుదళము లొక్కమ్మడి జెలరేగ జించి చెండాడిన సింహమధ్య
అల ఫరంగి ఫిరంగు లగ్నుల గురియ హోరాహోరి బోరిన రమణిమిన్న
మాస్వరాజ్య యాత్రోరుపంబలము గాదె-భవదమేయబలం బిల భరతనారి?
మండలాగ్రిక సాహాయ్య ఖండితారి!-ధీనమంచిత భాగీరథీకుమారి!
హరహరమహా దేవటంచు మరాటీలు పటుతరాటోపులై పరిఢవిల్ల
నల్లాహొ యక్బ రటంచు ముసల్మాను లాయోధనోత్సాహులై తలిర్ప
బెబ్బులి మీసలం బెనిపెట్టి పెరికెకు నాఘనోద్భటభటు లవఘళింప
.... మోరోపంతు వీరుల కేపు జూప
గుటిలద ల్లాజితాకూరు కొంప గూల్చె-ద్రోహి దుగ్ధపానసురక్షితాహి వాడు
లేకయుండిన దల్లి! నీ దాశ వశమె?-యరులకైనను మరి కులగిరులకైన.
రవి క్రుంకనేరని రాజ్యంబువా రేడ? రవిరశ్మి జొరుగని రాణి వేడ?
మారణకారణ మహితయంత్రము లేడ? హస్తాసిమాత్ర సాహాయ్య మేడ?
ఆత్మమండలయుగపద్గ్రసనఘూర్వహు లేడ? స్వల్పరఘూన్వీ రాజపత్ని వేడ?
ప్రథితసామ్రాజ్యానుభవభారవహు లేడ? పాలు నీ రెరుగని గోల వేడ?
శత్రుఃవీరుల జెనకి పవిత్రవీర-నాకమును జూఱ గొంటి నాళీకవదన!
హైందవబాడిసియా భరతార్య జోన్సు-కీర్తి తాఖ్యాఖిలాశాంతకీర్తి సదన!

కన్నడిగలు-తెలుగలు

విద్వాన్ కూరిగనూరు నరసింగరావుగారు B. A., L. T

భా. వ. 'సులిదబాళెయ హణ్ణినంతది, కళెవసికురిద కబ్బినంతది అళిద ఉష్ణదహాలినంతది సులభవాగిరలి;
లలితవహా కన్నడదనుడియలి, తిళిదు తన్నొళు తన్న మోక్షవ, గళిసికొండరె సాలదే సంస్కృతదలిన్నేను.

—అనుభవామృతము.

కన్నడబాసకును తమిళు తెలుగు మున్నగుబాసలకును గలసంబంధములకు కనిపెట్టి, కన్నడబాషయే తదితరభాషలకు మూలభాష యని "కర్ణాటభాషా వ్యాకరణరహస్యములు" అను గ్రంథమునందు విస్తరించి నిరూపింపబడునని చూచితిని. వేడిమి వెలుతురు విశేషముగానుండు స్థలముననే సచుస్తవస్తువు లుద్భవించి పరిపక్వస్థితినిజెంది వ్యాపించును అను అనుభవవేద్య మగు ప్రాపంచిక ప్రాణిశాస్త్ర ప్రబలసిద్ధాంతముల నానావిధములు గాగాని ఆర్యుల ఆర్యేతరుల ఏకత్వమును సాధించుటకును, నానాజాతిప్రళయముల కోర్చి శ్రీమన్నారాయణుని పునస్సృష్టికినిలయము వస్తుదీవములలో కరణజమై వెలసినకర్ణాటమే కర్ణాటదేశమని స్థాపించుటకును "కర్ణాటకుల శాపకభూమి" అను గ్రంథము వ్రాయబడునని యు బలికితిని. ఇక కర్ణాటవాఙ్మయ వైభవము నింతే అవలోకింతము.

కర్ణాటవాఙ్మయవైభవము స్వజాతీయ స్వయంకృషివలననే సంభవించినది. గంగులు, రాష్ట్రకూటులు, చాళుక్యులు, కాకతీయులు, హొయ్సళులు, రట్టులు, శిలాహారులు, కొంగాళ్వులు, చెంగాళ్వులు, తులురాజులు, చోళులు, విజయనగరరాజులు, పాళెగారులు మొదలగువారు తామే స్త్రీ పురుషులు కొందఱు ఉద్గ్రంథములను వ్రాయుటవలనను కవిపుంగవులచేత వ్రాయించుటవలనను కర్ణాటసాహిత్యము నతిశయముగా పోషించి కర్ణాటకుల కృతజ్ఞతకు పాత్రులైయున్నారు. ప్రాచీనకాలమునందే జైనులు, శైవులు, వీరశైవులు, అద్వైతులు, ద్వైతవైష్ణవులు, విశిష్టాద్వైతులు, తదితరులు కర్ణాటభాషలో నుత్తమకావ్యములను పద్య గద్య చంపూరూపముల వ్రాసి ఆచంద్రతారార్కమైన కీర్తిని గడించినారు. ఇట్లుండియు ఆంధ్రవాఙ్మయ చరిత్రముయొక్క ఉపోద్ఘాతమునం దీ క్రింది వాక్యములు కనబడుచున్నవి. 'కన్నడవాఙ్మయము ప్రాచీనమైనది జైనులు వ్రాసినది కనబడుచున్నమాట సత్యము. కాని, ఆ వాఙ్మయములో ముఖ్యమైనదంతయు నాంధ్రులు రచియించినదని మాత్రము నమ్మదగు' ఈ వాక్యమున కుపబలముగా కొన్ని గ్రంథకర్తల పేరులు వ్రాయబడినవి. అయ్యవి యేమో వారు తెలుగ లను భ్రాంతిని పొగొట్టుచున్నవి—పైదున రామయ్య, మరుళ దేవకెరెయ పద్మరస. ముఖ్యమైనదంతయు నాంధ్రులు రచియించినదని మాత్రము వివేకపరు లెట్లు విశ్వసింపగలరు. 'ఇంతవుండియాంధ్రులు కన్నడదేశమునకుబోయి వారి లక్ష్యలక్షణగ్రంథముల వ్రాసి యార్యనాగరికతను కర్ణాటకమున వ్యాపింపజేసి కన్నడులకు మహోపకారమొనరించిరిగదా!' సంస్కృతమున్నగువారికిముందే దుర్వినీతమున్నగు వారి గద్యపద్య లక్ష్యగ్రంథములుండియుండుటంబట్టియు, నృపతుంగమున్నగువారి లక్షణగ్రంథములుండుటంబట్టియు, పై వాక్యము వాస్తవమైనది కాదు. 'మనము వారికిలిపి నెరువుపెచ్చుకొనునంతటిదీనులమా?' అల్పస్వల్ప భేదములతో నేటికిని కన్నడిగల తెలుగల లిపి శేషనము ఒక్కటియై యుండుట ఈ వాక్యమున నుపేక్షింపబడినది. 'వీరశైవ మతస్థాపకుడగు బసవన్న తెలుగువాడైనను కర్ణాటకుడైనను బిజ్జలరాజు మంత్రిగానుండి కర్ణాటదేశమున నుండెను. అతని చరిత్రమును వ్రాసినది పాల్కురికి సోమనాథుడు బసవపురాణము తెలుగులో వ్రాసిన వీమ్మటనే కర్ణాటకులది భాషాంతరీకరించుకొనిరి. మనము వారికి గురువులము కామా? కన్నడదేశస్థుని చరిత్ర

ముకు లిపిలేని తెలుగువాడా ముందు వ్రాయనేలసినది? గీటుంచిన వాక్యములనందు విరుద్ధోక్తుల లక్షించునది. పాల్కురికి సోమన్న కర్ణాటకుడని ముందే నుడివితిని. కన్నడదేశవాసుల బలికిన కన్నడిగ బసవన్న సోమనాథుని పరమగురువు. శిష్యుని పరమగురువునకు గురువనుట అక్రమము. 'కన్నడ గ్రంథములన్నియు తెలుగువకు విమ్మట బుట్టినవి యని నే వాదింపను. భారతభాగవత రామాయణాదులు మన తెలుగు గ్రంథములకు పిమ్మట బుట్టినవి. అంతేకాదు. ఈ మూడు ముఖ్యగ్రంథములను మన తెలుగు వారే కన్నడులకు వ్రాసిపెట్టిరి. తెలుగు వారు వ్రాసిన పిమ్మట కన్నడకవులుకూడ భారతరామాయణములను తిరిగి వ్రాసికొనిరి. ఇది బహుశః తెలుగు వారి భాషాంతరీకరణములకు తృప్తిలేకయై యుండవచ్చును' ఇవియన్నియు విపరీత సిద్ధాంతములు. తెలుగు కావ్యరచన పదునొకండవ శతాబ్దమునుండి విజృంభించినది. పంపని జైన భారత మంతకుముందే కర్ణాటభాషలో వ్రాయబడినది యున్నది. పంపడు తెలుగడు కాడని ముందే దెలిపినాను. మఱియు 'కవివ్యాస నెంబగర్వ మెనగిల్ల' అని పంపడు తనభారతమున నుడివియుండుటం బట్టి యతనికిముందు బ్రాహ్మణ భారత మొకటి యుండె ననియు వ్యాసకథానుసారముగా భారతమును పరివర్తించిన కవివ్యాసుడను నతడొకడుండెననియు దెలియవలె. పంపనితరువాత వ్రాయబడిన భారతభాగవత రామాయణగ్రంథములు జైనభారత రామాయణముల పరివర్తనలు కావు. అవన్నియు బ్రాహ్మణ భారతభాగవత రామాయణముల అనువాదములు. అందులో కొన్ని గ్రంథముల కర్తలు, తెలుగు బ్రాహ్మణ గ్రంథములకర్తలు, సమకాలికులు. కన్నడ తెలుగు బ్రాహ్మణ భారతభాగవత రామాయణములను బోల్చిచూచిన, పోలికలకంటె భేదములే హెచ్చుగానున్నవి. కర్ణాటకవుల గ్రంథములు విశేషముగా సమవాదములుగాని తు, ల కప్పని సంస్కృత గ్రంథ భాషాంతర పరివర్తనలు గావు. గ్రంథములు ఆయా దేశములనుండిన మతప్రోత్సాహానుసారముగా పొసగినవి. కర్ణాటభాషలో పురాతన బ్రాహ్మణ భారతము లేదనిన తెలుగున పురాతనజైనభారతము లేదనవలసి వచ్చును. అట్టిపోలిక జూపరాదు. పైజెప్పిన కారణములంబట్టి, ముఖ్యగ్రంథములను తెలుగువారే కన్నడులకు వ్రాసిపెట్టిరనుట అసంభవము. కర్ణాట వాఙ్మయ వైభవమును కనుగొనిన సత్యాంశమును స్పష్టముగా దెలియనగును.

వాఙ్మయ స్వరూపములనుబట్టిగాని, కాలమానమును బట్టిగాని రాజ పరంపరలనుబట్టిగాని, కవికులముల నుబట్టిగాని, మతావలంబనములనుబట్టిగాని, వాఙ్మయ చరిత్రమును వివిధ విభాగములు జేసి వ్రాయవచ్చును. హైందవులు స్వాభావికముగా మతనిష్ఠగలవారగుటం జేసి, మతదృష్టిని గ్రంథములను, గ్రంథకర్తలను విభజించి వ్రాయుటవలన గ్రంథసృష్టికి కలిగిన కాలదేశపాత్ర ప్రమాణసమష్టియు, తదితర కారణసాధనములును స్పష్టముగా కన్పట్టును. కావున నామార్గమే ఇందు అనుసరింపబడినది. అదిగాక, కర్ణాటవాఙ్మయవృద్ధి యామార్గమునసే కలిగినది. కర్ణాటవాఙ్మయమును, జైనులు వీరశైవులు, అద్వైతులు, ద్వైతవిశిష్టాద్వైత వైష్ణవులు, తదితరులు వ్రాసిపోషించినారు. అందు అనర్ఘములయిన మతశాస్త్రగ్రంథములు మనోహరమైనవి, నీతిమార్గదర్శకములైనవియున్నవి. స్థాలీపులాకన్యాయమున స్థూలముగా కొన్నిటిని ఇందు పరిశీలించుచూతము.

ఇట్టికావ్యావలోకమునకు ముందు, కర్ణాటదేశమున నిట్టి ప్రాచీనప్రశంసనీయ జైనకావ్యోత్పత్తికి ప్రబలకారణమేమియైయుండునని పరీక్షించి తెలిసికొనవలసినది. కర్ణాటవాఙ్మయము చిరకాలమునుండి వచ్చినది. నృపతుంగుని కవిరాజమార్గమునుండి యతనికి ముందే పద్యగద్య గ్రంథము లనేకము లుండెనని దెలిపితిమి. ప్రాచీనకాలమునుండి జైనులు ఉత్తమధ్వనికావ్యములను కర్ణాటజనాంగమునకు వ్రాసిపెట్టిరి. వారియుపకారమును కర్ణాటకు లెన్నటికిని తీర్పజాలరు. అంతయుంకె వారి యుపకారమదీర్ఘమైనవి వారి గ్రంథములనుజదివి వానియందలి కావ్యధర్మములను నీతులను అనుసరించుటయు. కర్ణాటకుల ప్రధానకావ్యములెల్ల జైనకృతములుగానుండుటకును అయ్యవిరోధపురాతనములుగానుండుటకును కారణములుండవలయును. దక్షిణహిందూదేశమున కర్ణాటప్రదేశమే జైనమతములకు జన్మభూమియు కేంద్రస్థలమునై యుండె

వనితో లంకకే కొంపెకొంటేమి. అనేకమతములలో జైన మతమొకటి. వైష్ణవము, శైవము, జైనము బహుకాలము నుండి దక్షిణ హిందూ దేశమున నుండెనని ప్రాచ్యపాశ్చాత్యపండితులందఱును ఒప్పుకొనియున్నారు. జైనము విషయమున, పాశ్చాత్యులు, ఉత్తరహిందూదేశమే జన్మభూమి కాని అభిప్రాయమిచ్చియున్నారు. జినమహావీరుడు అతని పూర్వికులలో కొందఱు ఉత్తరహిందూస్థానమున జన్మమెత్తియుండవచ్చునుగాని తీర్థంకరులందఱునందే పుట్టియుందురని భావించుటకు అవకాశము లేదు. జైనుల తీర్థంకరులలో ఆదితీర్థంకరుడు ఋషభుడు. భాగవతమున విష్ణ్వంశసంభూతునిగను ఋషభచక్రవర్తి చరిత్రమున్నది. భాగవతమున పాషండమతము పేర్కొనబడినది. జైనఋషభునకును భాగవత ఋషభునకును సంబంధమున్నట్లు తోచుచున్నది. జైనులకు వేదలక్షణములందలి పూజ్యతే. జైన వీరశైవులవలె వారు విష్ణువు నొప్పుకొనగాజాలరు. వైష్ణవులు, జైనులు, ఋషభునియందు విష్ణ్వంశమును, తీర్థంకరలక్షణములను కనియుందురు. వైష్ణవులు పేర్కొను ఏకవింశత్యవతారములలో ఋషభునికొకటి. ఈయుదాహరణము బాగుగా, వేంకటాచలమునకు, కృతయుగమున వృషభాచలమను పేరుండెనని శ్రీనివాసకల్యాణమున చెప్పబడియున్నది. ఋషభచరిత్రమునకుఁజెంది జైనవైష్ణవ కథాంశములందు భేదములు కన్పట్టుచుండినను, వేంకటాచలముక్రింద బలరామక్షేత్రముండుటయు, అందు బలరామకృష్ణులుండుటయు, పద్మావతీదేవి యుండుటయు కొండపై క్షేత్రస్వామి యను శ్రీ భూవరాహమూర్తి యుండుటయు అందు శ్రీనివాసమూర్తి పిదపపోయి నివాసము చేయుటయు, క్రమేణావృషభాచలము అంజనాద్రి పెంపలగునది యగుటయు, నేటికిని మొక్కులుగా భక్తులు కాషాయముల ధరించి కొండయెక్కుటయు, కేశఖండన మొనరించుటయు, కొండపైన తీర్థప్రసాదములు జాతికులభేదములులేక స్వీకరింపబడుటయు, మహాంతులు ధర్మకర్తలుగా నుండుటయు, వారు సమాధిని పొందుటయు జైనతీర్థక్షేత్ర సంప్రదాయములను తెలుపుచు వైష్ణవజైన సంబంధములనుసూచి జూపుచున్నవి. వైష్ణవజైనములయొక్క ఏకవింశత్యవతార పురుషులలో నొకడగు కపిలమహాముని యొక్క తీర్థమునందే కొండక్రింద నున్నది. వృషభాసురుని జంపి శ్రీమన్నారాయణుడు అందు నిలిచెనను పురాణోక్తినుండి తొలుత జైన వైష్ణవ కలహముండి పిదప నయ్యది పోగా స్థలము వైష్ణవపుణ్యక్షేత్రము మయ్యెనని సమాధానము నొందవచ్చును. జైనులకు శైవులకు మతమూల మొకటిరెండే యైనను వారివారిలో Protestantand Catholics కు గలభేదము కన్పట్టుచున్నది. అహింసయే పరమధర్మముగను ప్రథమధర్మముగను పరిగ్రహించి వేదప్రమాణమును నిరసించినందుకై పాషండమనిపించుకొను జైనము, ద్వైతాద్వైతములనుండి చీలినది. అయిన జైనులు ద్వైతాద్వైతులవలెనె త్రిమూర్తులను పూజింతురు. శైవము వైష్ణవ జైనముల వీరశైవమై జైనమును నిరసించినది. శ్రీనివాసమూర్తి శివనారాయణ చిహ్నములు కలిగియున్నాడని భక్తలోకోక్తి. ఇయ్యది శివనారాయణ సంబంధమును సమర్థించుచున్నది. శైవులకును వృషభుడు గలడు. అయిన నతనికి గణపతిస్థానము విధింపబడినది. ఇతనిని గురువుగా గొన్నవారు వీరశైవులు. వీరశైవులు జైనులవలె శివనారాయణ సామ్యమునకును అభేదమునకును సమ్మతింపరు, సహింపరు. అందుకే నాటిలో వీరశైవులు వేంకటాద్రికి పోవుదురు. ఇప్పుడు వేంకటాద్రి వైష్ణవులచే భూవైకుంఠముగా భావింపబడుచున్నది. శైవాను సంధాన భక్తిశక్తుల భక్తులకు కోరిన కోరిక లబ్బుచున్నవి. పురాతనకాలమునుండి కర్ణాటము జైనసంబంధముగలది యని తెలిసికొనుట కింత చెప్పవలసివచ్చె. ఈకారణము వలనే యుండవలయును, ఉత్తరహిందూస్థానమున ద్వాదశవర్ష క్షామము కలిగినపుడు, భద్రబాహుముని, చంద్రగుప్తచక్రవర్తి మున్నగు శిష్యులతో ఆది జైనజన్మభూమియగు దక్షిణ హిందూస్థానమందలి కర్ణాటదేశమునకు వచ్చినది. అందుకే కార్కళము, శ్రవణ బెళగొళ, కారకళ మున్నగుస్థలములు యున్నత జైనవిగ్రహములు, కర్ణాటదేశమున కాన్పించుచున్నవి. అందుకే కాలొలు మాతృభాషాభిమానులగు జైనులు తమతల్లి భాషకే తొలినాటినుండి కబ్బములను పలికిరి. కర్ణాటమున జైనమత


ప్రాబల్యమునకును జైనకావ్య బాహుళ్యమునకును కొన్నికారణముల నిట్లు అన్వేషించి జూచితిమి. ఇక జైనవాఙ్మయ మాధుర్యము నించుక పరికింతము.

జైనకవుల గ్రంథములు వారి మతధర్మములకును కావ్యధర్మములకును ఆదర్శప్రాయములుగా నున్నవి. జైనకవులు సంస్కృతమునను కన్నడమునను సమాన పాండిత్యమును కలిగియుండినందున మనోహరములైన మహాకావ్యములను వ్రాసినారు. తొల్లిటికవులు తల్లి బాస యందలి కూర్మిని కావ్యములందు అచ్చగన్నడబాసను జాతిన్యత్తములను హెచ్చుగనుపయోగించిరి. అందుచే తరువాతివారు అట్టిబాసను "హళగన్నడము" అనిరి. వాఙ్మయవాహిని, ప్రవహించుచు కాలక్రమమున మార్పు చెందుట సహజము. నిన్నటిబాస నేటికి ప్రాతదిగా నున్నను. హళగన్నడమనుట అట్టిమార్పునుబట్టియే యట్లు నదియని చెప్పనొప్పదు. అట్లుపిలుచుటకు ఏదో మతభాషా భేదమో లక్షణమో యుండవలెను. దక్షిణోత్తరమార్గములను నృపతుంగుడు మొదలిడినాడు. అయ్యదిదండికావ్యోక్తి పరివర్తనమని కొందఱనిరి. అట్టులయిన నతడు కర్ణాట భాషలో నుదాహరణముల నేల యొసగెను? అట్లొసగుటకు సాధ్య మెట్లయియుండు? అది దండి కావ్యోక్తిననుసరించియుండిన నుండవచ్చును గాని, కర్ణాట కావ్యములందును అట్టి దక్షిణోత్తరమార్గములు లేకుండిన నతడట్లు వ్రాసియుండడు. ఇదియట్లుండనుండు. నాగవర్మ, వైతాళికమునందు ప్రాచ్య, ఉదీచ్యములని భేదములు గలవని నాడే? దీనికేమి యుత్తరము చెప్పవలెను? కావున భేదములనుబట్టియే అట్లు చెప్పియుండును. ఇదిగాక—


క. 'పొసగన్నడదిం వ్యాకర
ణిసువెం సక్కృతియ నెందు కన్నడమంచిం
తిసినోడలాఱదిక్కుం
మిసుకద సక్కదమ నిక్కువవనుం కవియే.'
'సక్కదమం పేళ్వొడె నెఱె
సక్కదమం పేళ్గె, శుద్ధకన్నడదొళ్ తం
దిక్కువుదె సక్కదంగళ?
తక్కుదె బెరసల్కె ఘృతముమం తైలముమం.'
క్రీ. శ. ౧౧౧౨—నయసేనుడు.

దీనివలన నాటికే అచ్చగన్నడము గాని సంస్కృతమిశ్రితిని హొసగన్నడమని భావించినట్లు తెలియుచున్నది. ఉచ్చారణమొక్కటియైయుండు రెండక్షరములకు భేదనియమమేల యని హాళీశ్వరుడు గొంకుదిచ్చి చెప్పి వ్రాసినాడు. కేశిరాజు కాలమునాటికి కన్నడమునకు పసుసంస్కృతోక్తి యొకవిశేషలక్షణమై పోయినది. అతడు 'సమసంస్కృతోక్తి యిందరివర్తె కన్నడం' అని నాడు. ఱ, ళ, క్ష, ళ ప్రాసనియమమును, సహజ అనిర్ణయమును, ధాతునిర్ణయమును, ప్రయోగసారమును శబ్దార్థ నిర్ణయమును తనశబ్దమణిదర్పణమను వ్యాకరణమునకేర్చినాడు. నేతిలో నూనెగలసినట్లు అచ్చగన్నడములో సంస్కృతముగలపి యీ పదార్థవర్ణరుచి వాస్తవ్యవాసన స్వరూపములను చెదరజేసినది. అచ్చగన్నడమున గ్రంథములను వ్రాయగాదను సంతసులకు వచ్చినది. అప్పుడు ఆండయ్య క్రీ. శ. ౧౨౩౫ తన 'కబ్బిగరకావ' అను అచ్చగన్నడగబ్బము మధురముగాను మనోహరముగాను మహాకవులెల్ల మెచ్చ వ్రాసినాడు. కావున, కావ్యమందు అచ్చకర్ణాట సంస్కృత శబ్దస్వరూపసంఖ్యాధిక్యములనుబట్టియే 'హళగన్నడము=Pure ancient Kanarese అనియు, హొసగన్నడము=Mixed (with sanskrit) Modern Kanarese అనియు ఆమాటల కర్థము చెప్పవలయునుగాని, కాలమునుబట్టిగాదు. హళగన్నడమని హొసగన్నడమని తెలిపికొనుటకు పైచెప్పినదియ ప్రధానభేదము. హొసగన్నడమున వ్యాకరణ సూత్రబంధము వదలకుటయు వ్యవహారభాష లోచొచ్చుటయు పైచెప్పిన భేదపరిణామ లక్షణముగా తెలియనగు. దీనింబట్టి క్రీ. శ. ౧౧౬౦ నుండిన మడివాళమాచయ్య వచనములందలి భాష హొసగన్నడమగుచున్నది. అయ్యది వ్యవహారసిద్ధమైన గ్రామ్యభాషగా కనబడుచున్నది. కాలమునుబట్టిచూచిన అద్దానిని హళగన్నడమని చెప్ప వలసియుండును. పైచెప్పిన కారణములనుబట్టి దానినట్లు చెప్పతగదు. మఱియు నాధునిక, అత్యాధునిక గ్రంథములగు రామాశ్వమేధము, నీతిమంజరి మొదలగువానియందు ప్రయోగించిన భాషను పైచెప్పిన లక్షణములనుబట్టి హళగన్నడమనియే చెప్పనొప్పును. తెలుగునను ఇట్టిస్థితిగతులే,

కేదారనాథ చిత్రములు



౧. గౌరీకుండమునుండి కాన్పించు కేదారనాథ్ దృశ్యము



౨. కేదారనాథాలయము

కన్పట్టుచున్నవి. సంస్కృతవాఙ్మయాధికారమే వ్యాపించి యుండి, అప్పటినుండియు తెనుగన్నడాలకు తెల్లవారినది; తిమ్మకవినాటి కయ్యది తేజరిల్లి చేటిభావకవుల ఆస్యముల లాస్యమాడుచున్నది. ప్రాచీనకర్ణాటకవులు హళగన్నడమునే ప్రయోగించిరి. కబ్బములనెల్ల తల్లిబాసనే చక్కగా నల్లచాలిరి.

జైనులకావ్యము లెక్కువగా వారి మతతీర్థంకరుల జన్మజన్మాంతర చరిత్రకథనములుగానున్నవి. వీనిని వారు పురాణములందురు. అహింసయే వారి ప్రథమధర్మమును పరమధర్మమునగుట వశ్కావ్యములన్నియు శాంత కరుణరసములతో నిండి వాచకుల హృదయములను సదయములుగను సౌమ్యములుగను జేసి సౌఖ్యము నొసంగుచున్నవి. వీరరసము కర్ణాటకులకు సహజమైనది. అయ్యది వారి జాతిరసమని చెప్పవచ్చును. అందు రన్నని వీరరసపోషణ మత్యద్భుతము. దీని ననుభవించి యానందమొందవలయునన్న అక్కవి సాహస భీమవిజయము నాద్యంతము జదువవలయును. ఇందలి భావపోషణము భాసమహాకవి ఊరుభంగములోని భావపోషణమున కెనయగు. రన్ననికి మార్గదర్శకుడైన పంపమహాకవి విక్రమార్జునవిజయము గ్రంథమునుండి యొక భావప్రదర్శకమైన పద్యమునొకటిని వ్రాసి, రన్ననిపద్యము నొకటి వ్రాసెదను. పంపకవి గంభీరశైలిని సముచితవాక్య సంగ్రహములను తొలుత నొక రెండుపద్యముల గన్నాము. ఇందు, తెలుగున నొకవీరపత్ని వాక్యములుగా చెల్లింపబడు ప్రసిద్ధ చాటుపద్యములోని భావమును పంపడు తరతరములకుముందే తన కావ్యమున వ్రాసినాడు. అయ్యది అంబాలిక సాల్వుని పెండ్లియాడగోరిన సందర్భమున, భీష్మునిచే పరాజితుడైన సాల్వుడనుమాట:—

క. 'బెండాగి దొరెన్నొడిసి
కొండొయ్యం నిన్ననా పరిత్యక్త నానుం
పెండతిరయెనాడ వసరిం
పెండిర్ పెండిరొళెంతు పెరసువర బలే.'

విక్రమార్జునవిజయము.

'పగఱకు వెన్నిచ్చినచో
నగరే నీమగలేనంబు నాయకులెల్లన్.
ముగురాండ్రు వారమైతిమి
పగపేటికి జలకమాడవచ్చినచోటన్.

చాటుధార.

కన్నడ కవిత్వమున అసగునకు నాల్మడి సంస్కృతకవిత్వమున కాళిదాసునకు నాల్గుమడియని చెప్పికొనిన పొన్నని వచన పద్యరచనలను అతని శాంతి పురాణమునందు బలదేవ వాసుదేవులను వర్ణించుచోట చదివి తెలిసికొనవగును.

మ. స్ర.—

'ఉదయక్ష్మాభృత్తటం రంగము నడుమటలి పుష్పాంజలి
క్షేపమం ప. ర్వేసుర్వప్పంధకారం నవజవనికెయం
నాల్కెజానంగళింతి ప్పదె నాల్కెంకెంగళెం పోల్త
మర్దిరె హిమకృన్నాటికా సూత్రధారా। భవ్యనయ
ప్రారంభమింద్రాశెయొళె నెరెయె నెచెల్వాయ్తు శీతాం
శు బింబం.'

శాంతిపురాణము.

పంపపొన్నలశక్తి ననుసరించినను రన్నడు—

క. 'రసమం భావముమం కా
శసమం పణికెయుమనతిదు కవిమార్గదొళెం.
పొసదెనెయుమడిగళొళెం
పొసయిపబల్మెగె చతుర్ముఖం కవిరన్నం.'

పై పొగడ్తకుదగిన గద్యపద్యోదాహరణములను గదాయుద్ధ గ్రంథమున గనవగును. భారతవీరుల చరిత్రములను సింహావలోకన న్యాయమున సంగ్రహించి గదాయుద్ధ గ్రంథమున దుర్యోధనునినోట బలికించినాడు. అయ్యది రన్నకవి సంగ్రహరచనాశక్తిని చాటుచున్నది. ఈపద్యమున దుర్యోధనుని వీరభావ మెంతకొనియాడదగినదిగా జేసినాడో జూడుడు. అభిమన్యుడు సమరభూమి నిదీర్ఘనిద్రను శయనించియుండుటంజూచి వీరదుర్యోధనుడిట్లు ప్రార్థించుచున్నాడు:—

క. 'అసమబల! భవద్విక్రమ
మసంభవం పెంర్గె నిన్న నానిసెసంప్రా
ర్థిసువె నభిమన్యు నిజసా
హసైక దేశానుమరణ మెనగక్కెందుం'.

గదాయుద్ధము.

జగణమును రెండవగణముగను, నాల్గవగణముగను ఆరవగణముగను ప్రయోగించి రన్నడు తనకందపద్యముల నతిరమణీయములుగా జేసినాడు. కవిచక్రవర్తి బిరుదును బడసిన జన్ననికవిత్వమును జాన్నవనిగలది. గ్రంథవిస్తర భీతిని పద్యముల నుదాహరింపలేదు. ఇతని తరువాతి జైన మహాకవులు పలువురుగలరు. నాగచంద్రుడను మహాకవి అభినవ పంపబిరుదమును బెట్టుకొని అతిగంభీరమైన శైలిని జైనరామాయణమును వ్రాసినాడు. పంప కితనికి ఆదర్శప్రాయుడైన, నాగచంద్రుడు తన తరువాతివారికి ఆదర్శప్రాయుడైనాడు.

ఉ. 'రాగదబళ్ళిచాదగెగె కాంచన చంపకలాపల్లభుర్ఘరం
పోగెనదిగ్గె మేఘశెఖనాగమలక్ష్మిగె దీపమాలెకా
రాగమనక్కె జంత్రిదుకిరుజ్జావియోగిజనక్కె నల్వభో
భాగదొళందు చిత్తరిసిదత్తు రటిల్ల చెలాస్యలీలెయిం.'

వర్షర్తువర్ణనము

'ఓపదెవినా, పేచ, వృష, ఖాదిగళం క్రమదిందె నాథిపం
నేవిసిమత్తె కన్నెయొడగూడలొడం కిడెకన్నె తేజని
న్నావుదుగజ్జెమెందు తొలెయుం జనరంజనె నేటి తేజమం,
ధూపళియక్కె దీకిదవదెం ప్రభుమాడిదమారెయు పల్లదే.'

శరదృతువర్ణనము.

ఆండయ్య కబ్బిగరకావ—పొబగినవుగ్గియను గ్రంథమును అచ్చకన్నడమున నత్యద్భుతముగా వ్రాసినాడు.

చ. 'బిరయిగళంతజాలె పగలాణ్మనమెయ్యి బని ప్పెలె
మాగద, చ్పరదొళపాలె నీక్షగెదు ఇంచెగళొళ్కె
పడాలెతుంబిగళ్, పెఱదల త్రజాలె నవెయుం తర
దిందదిరుమ్మత్తె పేలెఅతా, ఐరెతలెపొలె తీడిదుదెం
కణగాళిజపంత దక్షియెొళ్.'

వసంతాగమనము,

ఉత్సాహరగడ.—

'తుంబినిండినం తెపాడి
జక్కవక్కియం తెకూడి
దిసెయనిచ్చియిందెనోడి
సొగయిపంచెయంతిరాడి,

ప. వ. తళెదిం తెనెవరెగం తెత్తిసిద
జ్జళిసువ పొసమాలికె మణిగళతని
కెళెగాగ సహం చుంబిసి బితిక భుజగభుజగం బరెగం,
ఇళిదగళ మళె దకదొళిరదెమా
పాంళెయల్లామ్ల లోక దొళినిసుళియదె
బళెసురిలింగం బొలకొం బెకరంకగ్గవిరాజిసితు.
నసెయుదిరిద పొసకమ్మంగళ వెయ
తెనెయ తుదియ తనిగంపం భుంజిస
లెనుకెను రాగది నవభోక్కెళ్ళిదాణ అడివసుళె
అనుకంపదెరువు తత్తైణరాజియ [గళు.
కొనెగచిణదహరినీలద పరలెన
వనెవిల్లన పసుగాణవిన విగ సాక్కెనపొసమిం
[బిరెయె."

—పంగరసు జయనృపకావ్యము.

మొదటిపద్యమును ఆముక్తమాల్యదలోని పరిఖావర్ణనముతో బోల్చిచూడుడు. రెండవ పద్యమునందు శుద్ధమైన యింద్రనీలము గడ్డిపురుగును బట్టుకొనుచున్నదను రత్నపరీక్షా లక్షణమాత్ర మెంత మనోహరముగా సూచింపబడినదో గనుడు.

వచనరచనయందును జైనకవులు సాటిలేని శైలి గలవారు. నృపతుంగునకు ముందే గద్యకావ్యములు వ్రాయబడియుండెను. అతనికి తరువాతను చాలమంది మనోహరమైన వచనకావ్యములను వ్రాసినారు. తెలుగు వచనకావ్యములు వెలువడుటకు శతాబ్దముల వెనుకనే కన్నడమున వచనకావ్యములు బయలుదేఱినవి. చంపూకావ్యములందలి వచనరచన మచ్చునకై ముందే వ్రాయబడెను. పదియవశతాబ్దమునందున్న చావుండరాయడు ప్రధానముగా వచనకావ్యమై యుండునట్లు వ్రాసిన కావ్యమును చదువవలసినది.

జైనులు శమదమశీలురును శాంతరసప్రియులునై యుండినందున వారి చరిత్రాత్మకమైన కబ్బములెల్ల దయావీరకరుణరస ప్రపూరితములై యున్నవి. వీతరాగులైన తీర్థంకరుల పురాణములను వ్రాయుచో గ్రంథకర్తలకు స్వాభావికముగా శృంగారరసమునకు చాల చోటు దొరకకపోయినది. అయిన వయ్యదిచ్చలసినచోట్ల

మిత భాషణ ప్రమాణముల వ్రాయబడినది. అందుకే కర్ణాటమున వీరకరుణరస ప్రధానములగు కావ్యములే మెండుగానున్నవి. తెలుగున శృంగారకావ్యము లధికముగా నున్నవనవచ్చును. ఇట్టి గతి, జాతిమత మనోభావముల ననుసరించియున్నది. కావ్యరచనయందు జైనకవులు జూపింపని మార్గమే లేదు. వారు కర్ణాటకవులకును తెలుగుకవులకును పురాణములు వ్రాయుటయందును, పద్య గద్య చంపూకావ్యరచన చేయుటయందును మాతృభాషనే మనోహరముగా నుపయోగించుట యందును, సమసంస్కృతోక్తిని ప్రయోగించుటయందును, జాతివృత్తముల వాడుట యందును, చిత్రకవిత్వము చేయుటయందును పైబంతి వ్రాసియిచ్చి వాసికెక్కిరి.

వీరశైవగురువగు బసవారాధ్యుడు తాను తన మత తత్త్వమును తన మాతృభాషలోనే వచనరూపమున వ్రాసి, తన ముఖ్య శిష్యులు మతగ్రంథములను కర్ణాట భాషనే లిఖింప మార్గమును జూపిన దెంతయు ప్రశంసనీయమైన మహోపకారముగా నున్నది. బసవారాధ్యుని వచనము లతి మధురములు. అయ్యది సంగీత సాహిత్య పారములు.

'గెలివెయెందిఫలవేను? శెక్క బొహళోదు హేళ లరియదు. జగవెల్ల కొంబ కణ్ణు తన్న కొంబకొళ్లదు కాణలరియదు. ఇది రగుణవ బల్లెనెంబరు శమ్మగుణన నరియరు. కూడలసంగమదేవ, లోకదడ్డొంక నీవేకె తిద్దువిరి? నిమ్మనిమ్మ తనువ సంతైసికొళ్ళి. నిమ్మనిమ్మ మనవ సంతైసికొళ్ళి.'

ఇటని కాలమునను, తరువాతను పలువురు వీరశైవ స్త్రీపురుషులు తమ మతతత్త్వబోధన అర్థగర్భితమైన అచ్చకన్నడమున గద్యపద్యముల వ్రాసినారు. హరీశ్వర రాఘవాంక మొదలగు వీరశైవకవులు సుప్రసిద్ధులు వారినిగురించి వెనుక వ్రాసినాను. విరుపాక్ష పండితుని చెన్న బసవపురాణమందలి సరళశైలి శ్లాఘనీయమైనది.

వా. మ. 'అంజదిరి! సురనికరవంజదిరి! దనుజకళ
శంజదిరి! భువనజనవంజదిరి! నాటక
భీకాంతిసుహెనీ కాలకూటమం నాసెనుతకరవెత్తి
[బారవల్కె
అంజానమహా ఫీతియిందె నిష్ఠురమాద
సంచరుణదళపనంగ్రైతళ దొళాత్మణం
మంజాళె సుమణి పరీక్షకనంతె శివనిర్వకలరుం
[నతియిసిదరు.

విరుపాక్ష శీలావర్ణనము.

రాజశేఖరవిలాసము, శబరశంకరవిలాసము వృషభేంద్ర విజయము మున్నగు శ్లేషాలంకృత ప్రఖ్యాత కావ్యములను వ్రాసి కర్ణాటవాఙ్మయమునకు నిరంతర కీర్తిని గడించిన మహాకవులలో నొకడగు షడక్షరి కవి కృత పద్యముల నొకటి నిం దుద్ధరించెదను.

మ. 'వెరెదొళ్చైదిల వాచిపంతె నగెతార నారి
[యనాడెబెం
బిరు వెన్నం కరదిందెముట్టిదనివం దోషాకరం
[వక్రిమం
ధరదిం ముచ్చిదకెందిదంగళి పాదవ్యాజదిం పేళె
[తా
వరె పాదాగ్రదె నూంకిదం ములిదసంవారాశియో
[ర్బుంద్రనం.

రాజశేఖరవిలాసము.

తిరువళ్ళువరి కురళ్ నీతుల బోలెను, వేమన వేదాంత పద్యముల బోలెను, హరిదాసకూటమువారి స్వమతసార బోధ బోలెను, అసంఖ్యాకములైన త్రిపదులయందు పలు తెఱగుల విషయములను బలికిన సర్వజ్ఞమూర్తి కవివాక్యములనుండి రెండు త్రిపదులను వ్రాసెదను.

త్రిపది. 'హెంగినరమనెగింత హెంగడెయుగిలేసు
తింగ బట్టంబ బిసియున్న కింతలా
తంగళెవలేసు సర్వజ్ఞ'
'తందెయూ గురువియూ ఒందె అంతరవుంటు
తందెతోరువ సద్గురువ 'గురురాయ
బంధనవకెళెవ సర్వజ్ఞ'

బ్రాహ్మణ కావ్యయుగమునందు శ్రీమతస్థులును ఉద్గ్రంథములను వ్రాసినారు. క్రమముగా నద్వైత, ద్వైత విశిష్టాద్వైత గ్రంథకర్తలలో ముద్దండకవులను గురించి మాత్రము కొంతపరిశీలించి పరమానంద మొందుదము. చంద్రరాజు, సరసచిత్ర బంధకవిత్వమున తనమదనతిలక మను సద్గ్రంథమును వ్రాసినాడు. అభినవదశకుమార చరిత్రము నతికోమలశైలిని రచించిన చౌండరస యను కవి (౧౩౦౦) 'సుగమార్గస్ఫుటశబ్దసుందరకిరద్వ్యాకాన్వేంద్రసం చంద్రమం' అని అత్యుచితవాక్యముల నుత్తిపలికినాడు. నాగచంద్రుడు (౧౧౦౫) తన రామాయణమున

క. 'శ్రుతకీర్తి త్రైవిద్య
ప్రతిరాఘవపాండవీయమం విబుధచమ
త్కృతిరెనిసిగతప్రత్యా
గతదిం పేళ్దులకీర్తియం ప్రకటిసిదం'

అని చెప్పియందున నాటికె జైనులచేత రాఘవపాండవీయమనంటెద్వ్యర్థి కావ్యము చేయబడినదియని చెప్పవలెను. కర్ణాటవాఙ్మయచరిత్రమున చిత్రకవిత్వముకూడ చిరకాలముక్రిందటనే జనించినదియని తెలియుచున్నది. చిత్రకవిత్వముసరసముగుట దుర్లభము. అట్లుండినను రసము చిలుకు చిత్రకవిత్వమును చంద్రరాజు ౧౦౨౫ నాటికే మనకు లభింపజేసినాడు. అనేకవృత్తముల నిమిడ్చిన పద్యము నొక్కదాని నిందు ఎత్తివ్రాసెదను.

వనమంజరి:

'అంగనృపాయతికుంగ భుజంకలియంగిత శిక్షితనింగుయ
శం, పింగజ దొంగతభృంగకచం కలిమంగళలక్షణయు
క్తనిజం, సంగరకేసరి సంగగణాబలి భృంగరదక్షమ
వాయకనుం, సంగదసన్నుతి నంగజహంసలతే గిరు
నీక్షిసిమాచన్నృపం.

ఇదియే ఎడెయక్కరము, కిడెయక్కరము, చౌపది, రెండు షట్పదులు, త్రిపదోన్నతి, పల్లవముఖత్రోటకము, చిత్రపదము, కమలము, చంద్రిక, ఇందుముఖి, మొదలగు ఎనుబదినాల్గువృత్తములు, పాదమురజబంధము, గోమూత్రికయుగునని తెలిపినాడు. అట్లు ఉద్ధరింపనగువృత్తములు బంధములు, కన్నడకవిచరిత్రమున విస్తరించివ్రాయబడినవి; చూడదగును. అర్థపాదగతప్రత్యాగతవిమలచక్రము, ఏకాక్షరి, ద్వ్యక్షరి, త్ర్యక్షరి, పద్యములు; అకారాంత కందము, నిరోష్ఠ్యకందము, ఓకారాంతపద్యము, మున్నగు వానిని సరసముగా వ్రాసియుండుట చూచిన ఆశ్చర్యము జనించుచున్నది. జగన్నాథవిజయమను గ్రంథమును వ్రాసిన రుద్రభట్టు కర్ణాటసరసకవి సార్వభౌముడన నొప్పును. తెలుగుకబ్బములతీపును చక్కగా తెలిసిన నా తెలుగు చెలికాండ్రలో నొకరు నాచేతినున్న ఆకావ్యమును చదివి యానందతుందిలమానసులై 'ఏమి యితని శైలి, పెద్దనశైలివలె పెద్దగా పారుచున్నదే!' అని మఱి మఱి పలికి మర్యాదజూపిరి ఇక కర్ణాటకులకది యెంత ఆనందదాయకమో యూహించి చూడదగును. ఆమహా కావ్యమునుండి యొకపద్యమును వ్రాసెదను.

క. విక్రమమూర్తిగ తారా
వక్రం కటిమాత్రమాగె తత్కటిమాత్రం
వక్రిగె బాల్యక్కమరూ
పక్రమవాద్యొనిసి మూర్తినుడెవణిదెయెసనుం.

కృష్ణబాలలీలావర్ణనము

తరువాత నెందరో కవిపుంగవులు కర్ణాటభాషలో ఘనకావ్యములను వ్రాసినారు. అయిన కర్ణాటజాతి వ్యక్తిత్వమును చాటు, సాటిలేని, బాదరాయణమహర్షి మహానువాదమగు కర్ణాటభారతము కర్ణాటకావ్యములలో నెల్ల అద్వితీయస్థానమును బడసి పండిత పామరజనాదరమునకు పాత్రమై యున్నది. ఇది గదుగుపట్టణమునకు కోడివాళ మను గ్రామమునకు అధికారియైయుండిన నారాయణప్ప యను బ్రాహ్మణోత్తముడు పలికినది. కవి ఈ కావ్యమును గదుగులోనుండు శ్రీ వీరనారాయణస్వామికి అంకితముగా జెప్పినాడు. నరాంకితములు గాక, నారాయణాది దైవాంకితములగు గ్రంథములే కర్ణాటమున నధికముగా గననగు. ముఖ్యములగు కర్ణాటభారత, భాగవత, రామాయణ జైమినిభారతములెల్ల దైవాంకితములు. నారాయణప్ప, వేదవ్యాస మహర్షి మూలగ్రంథమును తు, చ, తప్పకుండ పరివర్తించి దానిని నీరసముగా జేయక అందలి కథాసారాంశములను మాత్రము సంగ్రహించి నిరుపమశైలిని నీతిస్వారస్యముల గలిపినాడు. పర్వాంతగద్యమునందు 'ఇతి శ్రీమదచింత్యమహిమ

గదుగ వీరనారాయణ చరణారవింద మకరంద మధుపానమత్త షట్పదీనికాయ శ్రీమత్కుమారవ్యాస యోగీంద్ర విరచిత మప్ప కర్ణాటభారత కథామంజరి యొళ్' అని చెప్పికొనియుండుట వలన గ్రామాధికారియై యుండినందున నారాయణప్ప, నియోగి యొక్కటియే గాక, యోగియు నాతనిభక్తి ప్రయోగియునై యుండెనని తెలియవచ్చుచున్నది. యోగీంద్ర శబ్దము అతని పరమభాగవతశీలమును బలుకుచున్నది. ఈ పరమ భాగవతుడు శ్రీ పరమాత్ముని పాదములకు భారతకథా కుసుమమంజరిని భక్తిభావమున సమర్పించినాడు.

చం. లలితపదం ప్రసన్నకవితాగుణమిల్లదె ప్రౌఢపేర్చదె
　ర్గళకృతిబంధముం బరహకారరకై గళకేడు, వర్ణన
　ప్పళకదకేడు, పేళిసిదొడక్షరదకేడెనె పేర్చుదీగిపా
　ట్టళిపె నెగళ్తె గాటిసువనుక్కునియుం కవియెంబలె
　క్కమే.

అనిపలికి ప్రౌఢశైలిని కావ్యము వ్రాసిన పంపకవి వాగ్ధారణమించి కుమారవ్యాసుడు కబ్బమును బలికినాడు.

భా. ష. 'హలగ బళిహవపిడియదొంద
　గ్గళికె, పదవిట్టళుపదొంద
　గ్గళికె, పరకోడ్డవదరిత హిడియదగ్గళికె
　బళెసిబకెయలు కంకప్రత
　ఉలుహాకెడ దగ్గళికెయెంబీ
　బలుహుసలువుదు వీరనారాయణన కింకరగె.

అని నుడివి లోకులాదలు నెనవునన తన ప్రతిజ్ఞను పరిపూర్ణముగా సాధించినాడు. కుమారవ్యాసుని ఆకుధార వీరకరుణారసద్వయము ధారాపాలంకృతము. అతడు కంఠముతోగాక కబ్బమును నడపుట, కత్తితో. కర్ణాటకులజాతి రసము వీరము. అద్దానిని కుమారవ్యాసబిరుదాంచితుడైన నారాయణప్ప, ఉన్నత హిమవత్పర్వతమునుండి విశాల సమతటమున కుఱుకుస్వచ్ఛగంగాంబువులవలె తననాలుకనుండివెడలు భామినీషట్పదీ జీవనధారలను కర్ణాటరసిక కవిజన జీవనాధారములుగా పారించి వాచకుల హృదయములను పావనముచేసినాడు. ఈ మహాకవిని భామినీషట్పదులందు మందాకినీ మహావేగమును, మంజులస్వరమును మకరందమాధుర్యమును మూర్తిగొన్నవి, ఇతని వీరవాక్యములు పిరికిపందలను సహితము పౌరుషవంతులుగాజేసి వీరావేశమున విజృంభించునట్లు చేయుచున్నవి. ఇతనికిపూర్వము, వీరరసమును నీరసముజేయక, ధీమసారోక్తుల, వైశంపాయన సరోవరమున నీటడాగినదుర్యోధనుని చేయముసైన వదలజేసి చెకుటతో బయటికిరాబలికిన రన్నకావ్యోక్తులు మాత్రమే యొన్నదగినవి. అదే సందర్భమున కుమారవ్యాసోక్తుల బోల్చిచూడుడు.

భ. ష. 'ఏకుకౌరవరాయ సలిల
　వ్యాళనే నీనకట! జలకేళి
　గాళుదర! కాలాగ్నిరుద్రన్నలి గరుడశేఖరం శం
　కాళగదొళద్దిదె సహోదర
　జాల పుత్రజ్ఞాతి బంధువ్ర
　పాలరను, నీనీరొళడగిద, కష్ట! హోగెంద.'

నారాయణప్ప—
　'బణగు కవిగళ బగెవనేనా
　కెణెసదిరు శుకరూపవల్లదె
　కుణిసివగనే కవి కుమారవ్యాసనుళిదవర'

అని చెప్పినట్లు ఎవ్వరినెదురాడ శేశజాలడు? అందుకే భావలనెఱింగిన రసికశిఖామణులు వీరకరుణ రసాస్వాదమునకు కుమారవ్యాస కర్ణాటభారతమును, భక్తిరస భావానందము నొందుటకు బమ్మెరపోతన తెలుగుభాగవతమును, భక్తిస్వారస్యమును చవిగొనుటకు కంబతమిళ రామాయణమును చదువవలెనని స్వానుభవవేద్య సిద్ధాంతమును చాటినారు. కర్ణాటభాషలోను సంస్కృతభాషలోను అనుపమ పాండిత్యము కలిగి కుమారవ్యాసభారతశేషమును భవ్యశైలిని వ్రాసి, శ్రీ వేంకటాచలమూర్తిని కృష్ణదేవరాయ చక్రవర్తిని మెప్పించిన తిమ్మణ్ణ కవీంద్రుడు కుమారవ్యాసుని వాక్ప్రవాహమును పరమపావనియైన అభ్రగంగానిర్ఝరికి బోల్చి తన వాక్ప్రవాహమును యమునకు బోల్చికొన్నాడు. గంగాయమునా సంగమమునందు మంగళమహిమ నిది యొంకయు మనోహరముగా సూచించుచున్నది. గంగావాహినివలె పారు నారాయణప్ప వాగ్ధోరణికి వ్యాకరణము అంచందుపలా

యనమాత్రములకు పఠించినది. 'ప్రయోగశరణం వ్యాకరణం' అను శాస్త్రనిబద్ధోక్తికి శరణ్యము చూపవలయునన్న కర్ణాటభారతము నే కనుగొనవలయు. ఈకవిబ్రహ్మ సృష్టించిన శబ్దరత్నములకై భారతనిఘంటు వను ఒక నూతన కోశము నేగూర్పవలసివచ్చె. కుమారవ్యాసుని కవితాశక్తిని పరదేశకవులతో బోల్పవలసివచ్చిన ఆంగ్లేయభాషలోని షైరను కవితాశక్తికి చెప్పవచ్చును. ఈవాక్యమునందలి సత్యమును పరీక్షింపవలయునన్న కర్ణాటభారతపర్వసంధి సూచనల సంగ్రహోక్తులనుమాత్రము చదివి చవిజూచిన చాలును. కుమారవ్యాసమహాకవి వీరకరుణరసమాహాత్మ్యములను మనమునకు దెచ్చుకొనవలయునన్న యుద్ధపంచకభాగమును, ద్రౌపదీ మానసంరక్షణకాలమున బలికిన నుడులను స్మరించిన చాలును కరుణరస నిరూపణమునకై యొక పద్యము వ్రాసెదను.

భా. ష. 'పతిగళెన్న ను మారిషమళ
స్థితియకొండరు, భీష్మ మొదలా
దతిరథరు పరహితవ బినుటరువ్యర్థ భీతియలి;
సుతవ పిరికడు సాగసలాభూ
పతిగె గాంధారిగె, యనాథెగె
గతియకాణెను, శివశివా యెందొరలిదళు తరళె.'

కుమారవ్యాసకవి తన కావ్యమును నవరసభరితముగా జేసినాడు.

భా. ష. 'అరసుగళిగిదువీర, ద్విజరిగె
పరమవేదదసార, యోగీ
శ్వరర తత్త్వవిచార, మంత్రిజనక్కె బుద్ధిగుణ;
విరహిగళ శృంగార, విద్యా
పరిణతర సుప్రౌఢి, కావ్యక
గురువెనలు రచిసిద, కుమారవ్యాస భారతవ.'

అని తాను చెప్పికొన్నంత తిప్పక జేసినాడు. సారాంశమేమనిన, కుమారవ్యాసకవి కావ్యము, సప్తవిధ కవిగుణసారసాగరమని బాగుగా బలుకతగును. రసౌచిత్యము వరసి, వివేకమతిని, అతివ్యాప్తి అవ్యాప్తిదోషములకు పాల్పడక, జాతీయవాఙ్మయములతో భావాగ్రములకు సాంగత్యమును బొందించి వీరకథావర్ణనోచితభామినీషట్పదినే వెదికికొని సహజప్రతిభావిశేషమున పాదు సరసశైలిని కర్ణాటభారతమును ద్వితీయకావ్యముగా బలికినాడు. ఆ కారణమువలనే కర్ణాటబ్రాహ్మణ రామాయణమును వ్రాసిన కుమారవాల్మీకి యను బిరుదుగల కవియు అంబికావిజయము ను వీరరసప్రధానమగు కావ్యమును వ్రాసిన బబ్బూరు రంగకవియు తమశైలికి కుమారవ్యాసకవి శైలియే ఆదర్శమని చెప్పికొని పొంగినారు. కుమారవ్యాసకవిని త్రిమతస్థులును తమ మతస్థునిగా నెన్నికొనుచున్నారు. ఇదియొక్కటియే చాలు అతని వీరవాణికి నిచ్చు కానుక.

కర్ణాటభారతశేషమును వ్రాసిన మహాకవితిమ్మణ్ణ శైలియుకుమారవ్యాసకవిశైలినిబోలి, కలసిపోవుచున్నది. నీతికథలను స్వభావోక్తుల నతిమనోహరముగను వినోదకరముగను, నిర్దుష్టముగను వ్రాసినాడు.

భా. ష. 'బలెయొళగె నీసిక్కె రాత్రియొ
ళళలుతుపవాసదలి కాలన
కళెదె బలుహసివింద, పారణెమాడలెందెన్న
ఒళిదునయదలికరెవె ఈనుడి
గళను నా నెరెనంబిబహానే
గళపదిరుమోసగెలి, మాయెగెబిలువవనల్ల.'

ఆఖుబిడాలసంవాదము.

'పద సంచరణయులి లిపితిరిగి నోడన బిరుదుగల కుమారవాల్మీకి, తొరవె నరసింహమూర్తి కంకితమిచ్చి బలికిన రామాయణము సర్వజనస్తుత్యమైనది.

'జానకియేజానకి? జగత్త్రియ
వీరపాతివ్రతెయులా! నర
నారియేనై దేహి! నారాయణనపత్నియులా!
శ్రీరమణి చంచలెకణా! క్షై
పారిదళునివగెంబ నువద వి
కారవేకలెయణ్ణ! బిడుజానకియనీనెందు'

రావణ విభీషణసంవాదము.

నిత్యాత్మశుకయోగి విరచిత కర్ణాట భాగవతము నిర్మలశైలిని వ్రాయబడినది. కవి మాతృభాషయందు అత్యధికాభిమానముగల వాడు.

'కొందవగె కొలెతప్పలరివుదె!
తందె! బరిదేబ యులమాతిగె
కొందు నీ జేకెళివె నరక కెసంబళవగళిసి.
హొందిదవరేమగెళె కొలువరు
కొందవర నంతవర క్కై యలి
హొందువరో, హాగెహాలవు జన్మాంతరకె బిడదెంద.'
కంసవసుదేవసంవాదము.

కుమారవ్యాసుని కర్ణాటభారతమువలెనే ప్రతి గ్రామమునందు పండితపామరులుచేరి ప్రతినిత్యము చదువు మహాకావ్యము లక్ష్మీశుని కర్ణాట జైమినిభారతము. ఇతనికి 'కవిచూతవనచైత్ర' యను బిరుదుకలదు. ఇతడును వీరకరుణరసభరితంబగు అశ్వమేధపర్వాంతర్గత భారతకథనే గ్రంథవిషయముగా గొన్నాడు. కావ్యమును వరాంకితముజేయక దేవపుర లక్ష్మీరమణునకు సమర్పించినాడు. సాలంకార సార్థశబ్దసంగతమగు వార్ధకషట్పదితో రసవత్కావ్యమును రచించినాడు. సంస్కృతమూలమునకు స్వారస్యమున కేమిటం దక్కువలేదనునట్లు సాధించినాడు. కావ్యము సమస్త రసాలంకారములకు రత్నాకరముగానున్నది. కవిషడ్విధములగు షట్పదులలో వార్ధకమునే కొని వాడినాడు. ఇయ్యది, భక్తిప్రధానమగు అతని కావ్యమునకు చాల చక్కగా సాగుచున్నది. శృంగారరసమునకూడ మిగుల వృద్ధిజేసినది. అయిన, వీరరసపోషణమునందు వార్ధకషట్పది వాడియైన శిలీముఖమువలె పారక వీణవలె పాడుచున్నది. కుమారవ్యాసభామినీ షట్పదివలె వీరఘోషముజేసి యుద్రేకమునంతగా నుద్భవింపజేయదు. పౌరుషవర్ణనాసందర్భములందు పరుషశబ్దములుగల ప్రాసవాక్యముల శరణుపొందవలసివచ్చినది. లక్ష్మీరమణుడు వైష్ణవుడై, లక్ష్మీశకవివచనము వీణగాగొని, జైమినిభారతవాణిని, కర్ణాటభాషను బలికించినాడను ప్రశంసనీయమైన కవివినయోక్తికి ప్రమాణముగానున్నది. అమ్మలు రాగములందీయుచు యుద్ధభూమిని గ్రమ్ముచున్నవి. ఈకావ్యకథకు సామగానలోలుడును, భారత నాటకసూత్రధారుడునునైన శ్రీ లక్ష్మీరమణుడు నాయకుడగుటచేనిగా భక్తశృంగముల వీరవాక్యములు వార్ధకషట్పది శబ్దములై వరలుచున్నవి. సుధన్వ, బభ్రువాహన మున్నగువారి యుద్ధప్రసంగమును, మయూరధ్వజ చంద్రహాస మున్నగువారి భక్తిప్రసంగమును, శృంగార వీరకరుణరసములతో జెల్లువలై పారుచున్నవి. ఇతనిని సహితము త్రిమతస్థులును తమకవియని సాధింప తమకించుచున్నారు. ఈకవి భావభాషార్థసంపదను జూపుటకై మూడుపద్యముల వ్రాసెదను.

వా. ష. 'నాగేంద్రనం బిడదెకెలెవాగి కీర్తిసుర
నాగేంద్రనం బుద్ధిదొరెయిసితు పురమర్ద
నాగేంద్రనం నిందుబిరగాగిసి కీర్తిమలధర్మజనకీర్తిబళిక
నాగేంద్ర శయనాలయన జలధియెనిసి నుత
నాగేంద్ర వరదాయుధవపార్థగళెదు మఖ
నాగేంద్ర ధరసజాతెయ నిలువుగెడిసి సెరెరాజిసితు
[మూజగదొళు.'

'ఎందొడెలెతాయె కేళ్ చక్రిగె విముఖనాగి
బందెనాదొడె నిన్న గర్భదిందుదయిసిద
నందననె? హంసధ్వజనకుమారనె? మేణుహరికింక
[రనె? వీరనె?.

కొందపెం పార్థనపతాకినియ నవనడట
నందగెడిసువె నిన్నవిక్రమనవచ్యుతన
ముందెతోరిసువె నినితరకొలె సోలుగెలువదు పుణ్య
[వశమెందను.'

'ఇదెతొట్టిలల్లాడి సువదిల్ల నినగెపొం
దుడిగెయిల్లర నిశయమిల్ల బిడదెరవనీ
రుక్కడివాల్గళెణ్ణె ఎణ్ణెగళిల్ల లాలిసిక లివలందెతాగ్గుళిల్ల.
పాడిపతి కేరళాధీశ్వరం పరకెయొళ్
పడెదనిదకెనిన్నం నోడువెన్నక
ణ్ణొడెయదకటక కెంద బిసుకుద్దుళెల్లు మరుగువళాకె
[దినదినదొళు.'
చంద్రహాసుని బాల్యము.

ద్వైతమత వ్యాప్తితో కర్ణాటవాఙ్మయము ఘనముగా వర్ధిల్లినది. మాధ్వులు వీరశైవులుబోలె సులభమును సుందరమునైన తమ మాతృభాషయగు కర్ణాటకమునన్ ద్వైతతత్త్వ కావ్యములను నుడివిరి. హరిదాసో

హమ్మను మాధ్వుల మతగ్రంథములందు భావకవిత్వము ప్రబలినది. మాధ్వమతప్రచారకులు, మత ప్రచారకులకు నైజమగు మాత్సర్యబుద్ధిని, స్వమతబోధాత్మక సాహిత్యమును సంగీత సమన్వితముగా ప్రయోగించిరి. జైనులు గాని, వీరశైవులు గాని తమతమ మతబోధాత్మక సాహిత్యములనీ సాధనముతో నంతగా సమన్వయము చేయలేదు. సంస్కృతమున నిట్టిగేయములు శ్రీ శంకరాచార్యుల 'భజగోవిందం' జయదేవుని 'గీతగోవిందం' శ్రీ రామానుజాచార్యుల ప్రబంధము శ్రీ మధ్వాచార్యుల 'ద్వాదశ స్తోత్రము' మున్నగువాని రూపముల కొన్ని కన్పట్టుచున్నవి. కర్ణాటభాషలో పాడుంగబ్బ ననియొక ప్రత్యేక సాహిత్యభాగమే గలదని ముందే నుడివితిని. అయ్యది సాంగత్యసంగతమై యున్నది. హరిదాసకూటమునకు జేరిన ద్వైతులీ సాహిత్యభాగమును సుళాది, ఉగాభోగ, పాటలరూపమున మఱింతవృద్ధికిని ప్రచారమునకును దెచ్చిరి. చప్పగానోవు తత్త్వసాహిత్యమునకు సంగీతసుగంధమును జేర్చి మధురముగా జేసి పామరజనులకు సేవ్యమగునట్లొనర్చినారు. ఇట్టి గేయాత్మకమైన సాహిత్యమును మాధ్వ లతిమనోహరముగా నుడివినారు. ఈ దాసకూటకవులకు మార్గదర్శకుడు 'శ్రీతత్త్వవాదము' ను కన్నడభాసలో వ్రాసి ప్రోత్సహించిన శ్రీపాదరాయ లనవచ్చును. వారి శిష్యులును విజయనగర సామ్రాజ్య విద్యా పీఠాధిపులును నగు వ్యాసరాయలు, దానిని మఱింత వెలుగజేసిరి. వారి ముఖ్య శిష్యులలో పురందర దాసులు, వాదిరాజస్వాములు, కనకదాసు మున్నగు కర్ణాటకవులు కర్ణాట మహారాష్ట్రదేశములందు ద్వైత మతబోధను కర్ణాటమాతృభాషకు ప్రవర్ధింపజేసిరి. పురందరదాసపరంపరకుజేరిన విజయదాస ప్రముఖులును జగన్నాథదాస ప్రముఖులును, సారవంతమైన పాటలను, భామినీ షట్పదిలో 'హరికథామృతసారము' అను గ్రంథమును క్రమముగా జెప్పి కృతార్థులైరి. వీరి వ్రాతలలో నొకవిశేషము. పాటలు పద్యములు జాతీయపదములతో నిండియున్నవి. అవ్వి పామరులకును పండితులకును అర్థమగు ప్రసిద్ధవ్యావహారిక భాషలోనే వ్రాయబడినవి. సంపూర్ణ జీవకళలు గలిగిన సామాన్యమైన వాడుక భాషలో నవి వ్రాయబడియుండుట జనోపకారకములై యున్నవి. సాహిత్యము భావగర్భితముగా, నీతియుతముగా, భక్తిరసభరితముగా సంగీత సమన్వితముగా నున్నది. తెలుగు కవియగు త్యాగరాజులు పురందరదాసులనే ఆదర్శముగాగొని ఆచంద్రతారార్కము కీర్తిని ఘటింపచేయజాలు కీర్తనములను జేసిరి. ఆయన కీర్తనములందు సంగీతమే ప్రధానము. హరిదాసకూటమువారి సాహిత్యములందు భావము ప్రధానము. సంగీతమాకర్షణార్థ ముపయోగించిన సాధనము త్యాగరాజులు ఆత్మోన్నతికై కీర్తనముల దైవప్రార్థన జేసిరి. పురందరదాస ప్రముఖులన్ననో పతితజనోద్ధారార్థము శీలస్ఫూర్తిని భక్తినీతులను, పాటలతో బోధించిరి. పురందరదాస, త్యాగరాజ కృతులందు శ్రీ పరమాత్మదాసోహమ్మను సుజ్ఞానము స్పష్టముగా చూపట్టుచున్నది.

రాగం. బ్యాగ్-ఏకతాళము

'బేవు బెల్ల దొళిడలేను ఫల ?
నిత్యహోవిగావళెర దేవుఫల ?
కుటిలవబిడదిహకుజనరు మంత్రద
పత వెయమాడిదరేనుఫల ?
చటియ స్నాదు వమనుజరు మనదలి
వికసల జెసెదర దేనుఫల ?
కపటతనది వంచిసువ మనుజరు
జపగళ మాడిదరేనుఫల ?
కుపితబుద్ధియను త్యజిపదె నిత్యది
ఉపవాసవిద్దరేనుఫల?
మాతాపితరను బళలిసువామగ
యాత్రెయమాడిదరేనుఫల ?
ఘాతుకతనవను బిడదె నిరంతర
నీతియనోదిదరేనుఫల ?
పతియను నిందిసి బోగళసతియరు
వ్రతగళ మాడిదరేనుఫల ?
అతిథిగ రెడెయలి భేదమాడుత
గతియను బయసిదరేనుఫల ?
హీనకృత్యగళ మాడుత నడెయలి

ప్నానవమాడిదరేను ఫల?
శ్రీనిధిపురందరవిఠలన నెనెయదె
మానవమాడిదరేను ఫల?

పురందరదాసులు.

భా.వ. ఒడలనెళలందదలి హరి న
మ్మెడ నెతిరుగువ సౌందరకుణ
బిడదె జెంబలవాగి భక్తాధీననెందెనిసి
తడెవనరితౌఘగళ, కామగ,
కొడువ సకలేష్టగళ సంతత
నడెవ నమ్మంనదలి నపసువిశేషసన్మహిమా

జగన్నాథదాసు హరికథామృతసారము.

విశిష్టాద్వైత మహాకవులు మైసూరు మహారాజుల యాశ్రయమున మనోహరములైన అనేకగద్యపద్యగ్రంథములను వ్రాసినారు. అందు తిరుమలార్యుడు, చిక్కుపాధ్యాయుడు సుప్రసిద్ధులు. చిక్కుపాధ్యాయుడు రమారమి ౩౦ గ్రంథముల వ్రాసినాడు.

ఉ. 'గాడియపీమె చెల్వాగెవతాణ మలంపినసంతె పెం
పుసా, దానదునభూమి సాయ్యదడె పుణ్యదగొత్తు
వినోదదాగరం, మోడిమమంటపం సిరిమపెచ్చుగె
నొళ్మనె ముక్తికాంతెగై, గూడుపవీను కన్నడద
నాడు విరాజిపుదెంతు బణ్ణిపెం'

చిక్కుపాధ్యాయుని హస్తిగిరి మహాత్మ్యము.

తరువాతవచ్చిన మతగ్రంథము లంతగా లేవు మహమ్మదీయ, క్రైస్తవ, గ్రంథములరుదు. క్రైస్తవుల వేదము కర్ణాటమున పరివర్తనము జెందినది. మంగళూరు ప్రాంతమునం దయ్యది విశేషవ్యాప్తిలో నున్నది.

ఆధునికకవుల గద్యపద్యగ్రంథము లసంఖ్యాకములు. పాశ్చాత్యసారస్వతమార్గమున, తెలుగులో యతిప్రాసబద్ధములుగాని భావకవిత్వములు బయలుదేరినవి. అట్టి రచన, ప్రాచీన కాలమునుండియు స్వతంత్రమతులగు కర్ణాటకులకు క్రొత్తగాదు. యత్యుల్లంఘన 'జెందరిద త్తె కన్నడం' అరి తెలిపిదే యున్నది. ప్రాసమునాత్రము శ్రుతిశ్రావ్యతకై జ్ఞాపకార్థము వాడుచున్నారు. దానిని సయితము పారద్రోలి కొందఱు ఆధునిక కర్ణాటకవులు కబ్బముల నల్లుచున్నారు. అయ్యదింకను సర్వజనాదరణీయముకాలేదు. సమకాలికులగు కవులను ఇందు పేర్కొనుట సమంజసముగాదు. అయినను, పాశ్చాత్యవిద్య నభ్యసించి, నాగరికతను బడసియు, ప్రాక్తనవిమర్శన విచక్షణ రావుబహదూర్ ఆర్. నరసింహాచార్యులు M. A. గారు పురాతన శబ్దస్వరూప సంరక్షణార్థమై ఱఴళ భేదములనుపాటించి నిర్దుష్టమైన సరసశైలిని, హళెగన్నడములో నీతిమంజరి యను గ్రంథము వ్రాసి కర్ణాటసరస్వతికి సమర్పించి ఖ్యాతినిబడసియుండుట కన్నడిగల కందఱకును గౌరవాస్పదముగానున్నది. కీర్తిశేషులైన బి. వెంకటాచార్యులు బంగాలీభాషనుండి నవలలను కన్నడమునకు పరివర్తించినారు.

పందొమ్మిదవశతాబ్దమున కలిగిన కర్ణాటగ్రంథ విజృంభణమును, తెలుగు గ్రంథవిజృంభణమును, పరస్పర గుణగ్రహణజ్ఞాన పరిణామము లని పలుకవచ్చును. కీర్తిశేషులైన రావుబహదూర్ వీరేశలింగముగారి తెలుగు కవులచరిత్రము రావుబహదూర్ ఆర్. నరసింహాచార్యుల కన్నడకవుల జీవితములకు త్రోవజూపినది. కర్ణాటభాషాభిమానులగు రైసుదొరగారు మొదలగువారు కర్ణాటజాతి రాజకీయసాంఘిక మతవిషయిక పరిస్థితులనుబట్టి కావ్యకర్తలకాలదేశపాత్ర గ్రంథవిషయసమష్టినిగూర్చి ఆంగ్లేయభాషలో వ్రాసిన కర్ణాటవాఙ్మయచరిత్రము కీర్తిశేషులైన వంగూరి సుబ్బరావుగారి ఆంధ్రవాఙ్మయ చరిత్రమునకు ఆదర్శప్రాయమయ్యెను. ఆంధ్రపరిషత్కార్యపరిశ్రమము, మాసపత్రికా దినపత్రికా ముద్రణము, కర్ణాటక పరిషత్పత్రికాది గ్రంథముల ముద్రింప ప్రోత్సాహపరచెను. కర్ణాటభాషానుశాసనము, ఆంధ్రభాషానుశాసనమును వ్రాయ పురికొల్పెను. శాస్త్రీయ గ్రంథపరివర్తనములందు నిట్టి మార్గమే చూపట్టుచున్నది.

ఇట్లు కర్ణాటవాఙ్మయవైభవము, ప్రాచీనకాలమునుండి జైన, శైవ, వైష్ణవ మహాత్ముల పురాణ రత్నములతోను, దుర్గసింహ, నృపతుంగ, ముమ్మడి కృష్ణరాయ మున్నగువారి కావ్యముక్తములతోను, కంతి, బిజ్జలదేవి, మహాదేవియక్క, చెలువాంబె, సంచియహొన్నమ్మ

మహాలక్ష్మి, హొళవనహళ్ళి గిరియమ్మ మొదలగు వారి ప్రబంధ ప్రవాహములతోను, తదితర శాస్త్రీయ చరిత్రాత్మక కాల్పనిక గద్య పద్య చంపూ గ్రంథములతోను కర్ణాటవసుంధరా పరివేష్టిత సప్తరత్నాకరా మూల్యమును, గాంభీర్యమును, వైశాల్యమును గలిగి రాజిల్లుచున్నది అంతియేగాక, కన్నడ తెలుగు భాషలందు, సమాన పాండిత్యము గలిగి అసమానులై లిని సరసకావ్యములు వ్రాసిన నారాయణభట్టు, నన్నయభట్టు, పాల్కురికి సోమనాథుడు, భీమకవి, చక్రపాణి రంగనాథుడు శ్రీనాథుడు, కృష్ణదేవరాయలు, మున్నగు ఉభయభాషా పండితుల ప్రఖ్యాతిభాజనమై ప్రకాశించినది. ఈకారణముల తెలుగ లికనైన పూర్వ జాతిబాంధవ్యమును స్మరించి, స్నేహసౌభాగ్యం బగు గౌరవభావమును కర్ణాటకులయెడఁజూపి పరస్పర ప్రేమ నుండుట ఉభయపక్షము వారికి శుభప్రదము.

వ్యాసములోనలి కొన్ని అభిప్రాయములు కొందఱికి అరుచికరములుగా నుండవచ్చును. అయిన వానియందలి సత్యాంశములనమాత్రము సర్వస్వరూపుడైన శ్రీ పరమాత్మ అనంతములైన కాలదేశ పాత్రములచేత నభివృద్ధిజేయించుట కతనికి మ్రొక్కి మహాకవి భవభూతి వాక్యములతో నీ వ్యాసమును ముగింతును.

'యే నామ కేచిదిహ నః ప్రథయంత్యవజ్ఞాం,
జానంతి తే కిమపి తాన్ ప్రతి నైష యత్నః
ఉత్పత్స్యతే మమ తు కోఽపి సమానధర్మా
కాలో హ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ.

భద్రం! శుభం!! మంగళం!!!

శ్మశానము

కె. అన్నమరాజశర్మ గారు

౧

అది, యచైతన్యవృత్తియో, హృదయచలిత
భావవేగంబొ, తదవస్థ--పలుకరాదు___
మృత్యుదేవతపిలుపో, భరింప నైతి
ప్రేమజననిని శ్మశానఁ బెట్టినపుడు.

౨

దివ్యజనయిత్రి భౌతికదేహ మెచట
ప్రజ్వలించెడి చితిలోన భస్మమాయె
నాకతోరశ్మశాన మాశోకవాటి
పాఱఁ దెఱచెను నరకకవాటములను.

౩

అపుడు, దుఃఖానుభూతి దయార్ద్రదృష్టి
పాఱఁజూచిన తార లిప్పటికిఁ గూడ
యామినీశాంతి లగ్నరహస్సులందుఁ
గాంచుచున్నవి సహజానుకంప నొంది!

౪

అవిషాదాంధతమస మాభావ భగ్న
దుర్వ్యథాభారచింతనాందోళనంబు___
వేఁడి కన్నీటి యూటల విరతిఁ గొనక
ఘోష లిడుచుండె నామనఃకుహరమందు.

భారతప్రభుత్వ ఆదాయవ్యయపట్టిక

చా. వెం. హనుమంతరావుగారు
M. A., F. R. Econ. S.

౧

ఇండియా ప్రభుత్వపు ఆర్థికసభ్యుడగు సర్ జార్జి షూస్టర్‌గారు తమ మూడవ ఆదాయవ్యయపట్టికను లెజిస్లేటివ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టుచు హిందూదేశపు ఆర్థిక పరిస్థితులను గూర్చియు, రాజకీయ వాతావరణమునకును ఆర్థికపరిస్థితులకును గల పరస్పర సంబంధమును గురించియు విపులముగ నుపన్యసించిరి. ఆతని ఉపన్యాసమును చదివినవారికి మన ఆర్థికస్థితి చాల ఘోరముగ నున్నదని తెలియును. బడ్జెట్‌నందు ముఖ్యవిషయము ప్రభుత్వాదాయము ఈ సంవత్సరము చాల తగ్గిపోవుటయు, ఖర్చుమాత్రము హెచ్చుగనే యుండుటయు ఆదాయమునందు కల్గినలోటును పూర్తిచేయుటకు క్రొత్తపన్నులను విధించుటయు నై యున్నది.

గత సంవత్సరమంతయు దేశము నావరించియుండిన ఆర్థిక వర్తక దుస్థితియే ఈ బడ్జెట్‌లోని లోటునకు చాలవరకు కారణభూతమైనది. ఈ సంవత్సరము ఆదాయము ఖర్చులకన్న $17\frac{1}{4}$ కోట్లు తక్కువ కాన్పించెను. ఆ లోటును పూర్తిచేయుటకు ఆర్థికసభ్యునికి క్రొత్తపన్నులను విధించుటతప్ప వేరుమార్గము కన్పించలేదు. దేశము దుర్భిక్షస్థితియందున్న సమయములో ఇన్నికోట్ల క్రొత్తపన్నులు విధించుటవలన ప్రజల ఇబ్బందులను ప్రభుత్వమువారు సరిగ గమనించిరా యను సందేహము బయల్వెడలక మానదు. ఈ పరిస్థితులలో దేశముయొక్క ఆర్థికస్థితి "దివాలా" స్థితియం దున్నదని ఒకరు చెప్పిన మాటలో నిజము కలదు.

౨

సర్ షూస్టర్‌గారు ప్రభుత్వపు ఆదాయమునందలి లోటునకు కారణములుగ రెండింటిని వక్కాణించి యున్నారు. 1. దేశమునందు ప్రస్తుతము సాగుచున్న రాజకీయాందోళనము 2. ప్రపంచమందంతటను ప్రబలియున్న ఆర్థికదుస్థితి. కాని ఈ రెండు కారణములవలనను మాత్రమే బడ్జెట్ లోటును సమర్థింపజూచుట దేశస్థుల కన్నులలో దుమ్ము కొట్టుటకు ప్రయత్నించుటయే యగును. ప్రపంచకమునం దంతటను వ్యాపించియున్న వర్తకపు మందగింపువలన సుంకముల వలన వచ్చు ఆదాయములో కొంతవరకు తగ్గుదల కాన్పించవచ్చుననియు రాజకీయాందోళనము వలన మన దేశమునకు దిగుమతి యగుచుండిన విదేశబట్టల దిగుమతియందు కొంత తగ్గుదల కాన్పించినదనియు మన మొప్పుకొందుము. కాని మన దేశపు ప్రస్తుతపు దుస్థితికి, వర్తకము పడిపోవుటకు, ధరలు తగ్గిపోవుటకు ముఖ్యకా

రణము ప్రభుత్వమువారి మారకపు; కరెన్సీ (Exchange and Currency Policies)విధానము లేయని నొక్కి చెప్పవచ్చును. ప్రభుత్వము వారా విధానములను మార్చుకొనుటకు, దేశముయొక్క దుస్థితిని తగ్గించుటకు కాని తొలగించుటకు కాని ఏమి ప్రయత్నములు చేసియున్నారనీ మనము ప్రశ్నించి చూచిన ఏమియు లేదని ఒప్పుకొనక తీరదు. హిందూ దేశముయొక్క విదేశపువర్తకమునుగూర్చి చెప్పచు స్కూస్టర్ గారు దానియం దెక్కువ తగ్గుకల కాన్పింపలేదని చెప్పియున్నారు; కాని వారే హిందూదేశపు ఎగుమతులఖరీదు సుమారు 61 కోట్ల రూపాయిలవరకు తగ్గిపోయినదనియు, దిగుమతులు 56 కోట్ల రూపాయిలు తగ్గినదనియు ఒప్పుకొనుచున్నారు. దానికి కారణముగ హిందూదేశము ఎగుమతిచేయు సరకులు వ్యవసాయమునకు సంబంధించిన వగుటచేతను, ప్రపంచమం దంతటను ఆసరకులే ఎక్కువగ తయారుఅగుటవలనను ఈ పరిస్థితులేర్పాటుకాబడినవని సూచించిరి. కాని హిందూదేశపు వ్యవసాయపుసరకులను (ముఖ్యముగా ప్రత్తి, జనుము మొదలగువాటిని) ఇతర దేశములలో అమ్ముడువోవునట్లు ప్రభుత్వమువారు చేసిన పను లేవి,వారా పరిశ్రమల కిచ్చిన సహాయ మేమి యను ప్రశ్నలకు ఏవిధమైన సరియగు జవాబును ఈయకయే ప్రభుత్వ సభ్యుడు దాటవేసెను. దీనినుండి ఏమినీతిని మనము నేర్చుకొనవలెనో వేరుగ చెప్పనక్కరలేదు. ఇతరదేశములందలి ప్రభుత్వములు తమ తమ దేశీయపరిశ్రమలను అభివృద్ధి పొందించుటకు వర్తకమును హెచ్చుచేయుచున్న ప్రయత్నములను మనము చూచిన ఇండియాప్రభుత్వ మీవిషయములో చాల వెనుకబడియున్నదని చెప్పక తీరదు. ఆర్థికసభ్యుడే హిందూదేశపు ప్రత్తి ప్రపంచమందు హెచ్చుగ వాడుకలోనికి వచ్చుచున్నదని అంగీకరించియుండెను. ప్రస్తుతపు ఆర్థికస్థితిలో దానిని ఎక్కువగ ఇతర దేశములు తెప్పించుకొనునట్లు ప్రభుత్వమువారు కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేసిన ఇంకను హెచ్చుగ ఆసరకు అమ్ముడుపోవునని ఆర్థికసభ్యుడు గ్రహించలేడా ?

౩

బడ్జెట్ నందలి లోటును పూర్తిచేయుటకు ప్రభుత్వపుఖర్చును తగ్గించుట ఒక ప్రధానమార్గమని సర్ జార్జి స్కూస్టర్ గారు అంగీకరించుచున్నారు. కాని నిజముగ వ్యయమును తగ్గించువిషయ మాలోచనకు వచ్చినప్పుడు ఆయన తన సిద్ధాంతమును త్రోసిపుచ్చి పూర్వపుపరిస్థితులను సాగనిచ్చుటకే ఒప్పుకొనెను. ప్రభుత్వవ్యయము తగ్గవలెననిన మిలిటరీ సివిల్ శాఖల రెండింటియందును కూడ ఆ తగ్గుదల చేయుటకు అవసరము కలదు.మిలిటరీవ్యయము 55 కోట్లనుండి 50 కోట్లకు తగ్గించినఎడలను, సివిల్ వ్యయము అన్ని శాఖలలోను వీలగునంతవరకు తగ్గించుటవలనను ప్రస్తుతపు ఆదాయపులోటు నశించు ననుటకు సందేహము లేదు. అట్లు వెంటనే ఖర్చులను తగ్గించుటకు వీలు

లేదనియు, వీలగునంతవరకు త్వరలో ఆవిధానమును అమలునందుంచిన చాలుననియు మన మొప్పుకొనినప్పటికిని, ప్రభుత్వసభ్యుని ఉపన్యాసములో అట్టి ఉద్దేశ్యము ప్రభుత్వమునకు నిశ్చయముగ నున్నట్లు కాన్పించుటలేదు. ఆర్థికమంత్రి ప్రసంగము ప్రకారము ముందు సంవత్సరములో అక్కడక్కడ కొద్ది కొద్ది మార్పులవలనను, తగ్గించుటవలనను 1.75 కోట్లు మిలిటరీవ్యయములోను, 75 లక్షలు సివిల్ వ్యయమందును కూడిక కాన్పించుచున్నది. అసలు 17 కోట్ల ఆదాయపులోటులోను ఈ 2½ కోట్లు కూడిక పోగా మిగిలిన 14½ కోట్ల లోటునకును పూర్తియగునట్లు క్రొత్తపన్నుల నేర్పాటుచేయుటకు ప్రభుత్వమువారు పూనుకొనియున్నారు.

ఈ క్రొత్తగ విధింపబడినపన్నులు (వీటిని గురించి ముందు కొంతవరకు విపులముగ చర్చించెదము) చిరస్థాయిగ నుండున ట్లేర్పాటు చేయబడినవా, లేక ప్రస్తుతపు కష్టకాలము గట్టెక్కునంతవరకే అమలునందుంపబడి తరువాత తీసివేయబడునా యను ప్రశ్న ఆలోచనీయము. ఎల్లకాలము ఈ పన్నులు ఈ రేట్ల ప్రకారమే అమలునందుంపబడిన, ఎల్లకాలము వాటికి తోడుగ ప్రభుత్వవ్యయము ఏటేట పెరుగుచుండుట కవకాశము లీయబడిన, దేశ మిప్పటికన్నను బీదస్థితికి వచ్చునని వేరుగ చెప్పనక్కరలేదు. కాని ఆర్థికసభ్యుని అభిప్రాయము ప్రకారము ఈ క్రొత్తపన్నులు, అందు ముఖ్యముగ హెచ్చు ఆదాయపుపన్ను రేట్లు, కొలది కాలము మాత్రమే అమలునందుంచబడి తరువాత పరిస్థితులు కొంత సాధారణస్థితికి మారిన యనంతరము తీసివేయబడునని తలంపవలసియున్నది. ముందు ముందే పన్నులు తీసివేసినను వేటిని తీసివేయకపోయినను, సామాన్య ప్రజలు భరించుటకు కష్టముగా నుండునట్టియు, వారి ఆర్థికపరిస్థితులను ఇంకను ఇప్పటికంటె పాడుచేయునట్టియు పన్నులు వీలగునంత త్వరలో తీసివేయవలెనను సంగతి ప్రభుత్వమువారు గ్రహించుట మంచిది. ఇతరపన్నుల విషయములోకూడ దేశక్షేమమున కడ్డుగ నుండి, పారిశ్రామిక, వ్యావసాయిక, వర్తక, ఆర్థికఅభివృద్ధులకు ఆటంకములుగ నుండునట్టి వాటినికూడ జాగ్రత్తగ విచారించి తగ్గించుటయో తీసివేయుటయో చేయవలసిన ఆవశ్యకత ఎంతేని కలదు. అట్లే, దేశమునందు ప్రజలలోనున్న ఆర్థిక, సాంఘిక విభేదములను, హెచ్చుతగ్గులను వీలగునంతవరకు తగ్గించి ప్రజాబాహుళ్యమునకు హెచ్చు ఆదాయము నిచ్చునట్టి కాని, హెచ్చులాభము నిచ్చు పనులకొరకై వినియోగింపబడుటకు వీలుగ నుండునట్టిగాని పన్నులను విధించుటకూడ అవసరమే. ఈ విషయములు చాల ముఖ్యమైనవి. భావి భారతదేశ ఆర్థికసమస్యలను పరిష్కరించు సమయ మేతెంచినపుడు వీటిని మనస్సునందుంచుకొనియే ఏమార్పులనైనను చేయవలసియుండును.

౪

ప్రభుత్వ ఆర్థికసభ్యుడు ఒక విషయము నందుమాత్రము కొంత ప్రజాభిప్రాయమును గ్రహించి ప్రవర్తించినాడని తలంపవచ్చును. ప్రభుత్వసేవకుల జీతములను తగ్గించువిషయములో ఏయేవిధముగ ఎంతఎంత తగ్గుదల చేయవలెనో ఆలోచించి రిపోర్టుచేయుటకు అసెంబ్లీవా రంగీకరించిన ఒక రిట్రెంచ్ మెంటు కమిటీ(Retrenchment Committee)ని ఏర్పాటు చేసెదమని స్కూస్టరుగారు తెల్పిరి. ప్రస్తుత సందర్భములలో ఎంతవరకు రిట్రెంచిమెంటు అవసరమో ఆలోచించుటకే ఈ కమిటీవారికి అధికారము ఉండును. శాశ్వతముగు రిట్రెంచిమెంటును చేసి ప్రభుత్వపుఖర్చును శాశ్వతముగ తగ్గించుట కేర్పాట్లు చేయుటకు వేరుమార్గము లన్వేషింపబడుననియు, దానికి ప్రధానసోపానముగ రాష్ట్రీయ ఆర్థికసభ్యుల సమావేశము త్వరలో పిలిచెదమనియు కూడ స్కూస్టరుగారు వాగ్దానము చేసియున్నారు. పైన వివరపర్చబడిన రెండు సూచనలును ఆమోదకపాత్రములే కాని, ఈ కమిటీల నేర్పాటుచేయు పద్ధతివలన తొందరగ పని జరుగుటకవకాశములు తక్కువగ నున్న వనుసంగతి మాత్రము మరచిపోకూడదు. దేశమునకు లాభకరముగ నుండునట్లు ప్రభుత్వసేవకుల జీతములను అన్ని గ్రేడులందును నూటికి 10 వంతున తగ్గించుచు పెద్దయుద్యోగస్థుల జీతములలో, అనగా 500 రూపాయిలు మొదలుకొని 1,000 రూపాయిలవరకు గల జీతములలో నూటికి 15 వంతునను, 1,000 రూపాయిల మొదలుకొని 1,500 రూపాయిలవరకు గల జీతములలో నూటికి 20 వంతునను, అట్లే జీతము లెక్కువ యైనకొలది ఎక్కువవంతు తగ్గించుటకు ఏర్పాట్లు జరిగిన చాల సొమ్ము మిగులు నని చెప్పవచ్చును. ప్రభుత్వసేవకు లందరి జీతములందును 100 కి 10 వంతున తగ్గించుటవలన ఎక్కువలాభ ముండదనియు, అట్లు చేసిన దేశమున కంతకును (కేంద్రరాష్ట్రీయ ప్రభుత్వములన్నింటిని కలిపి) మొత్తము 160 లక్షలు మాత్రము సంవత్సరమునకు తగ్గుననియు, దానిలో కేంద్రప్రభుత్వపు పాలు 38 లక్షలు మాత్రమే యుండుననియు ఆర్థిక సభ్యుడు చెప్పియున్నాడు. అది నిజమే అయి యుండవచ్చును కాని అందరు ప్రభుత్వసేవకుల జీతములలోను నూటికి 10 వంతున మాత్రమే ఎందుకు తగ్గించవలెనో తెలియదు. పైన సూచించిన విధముగ జీతములు హెచ్చుగ నున్న కొలదిని ఎక్కువతగ్గుదల చేసిన ఇంత కంటె చాల సొమ్ము దేశోపయోగకార్యములకుపయోగించుటకు మిగులదా? పైగా బీదదేశమగు మన హిందూదేశమునకు ఎంత ప్రభుత్వపుఖర్చు తగ్గిన అంతవరకే లాభముగా పరిగణింపబడవలసి యుండును.

సివిల్ ఖర్చులలో తగ్గించుటవలన ఎక్కువ ఆదాయము కలసిరా దని ప్రభుత్వసభ్యుడు పదే పదే చెప్పను గొప్పజీతములను పుచ్చుకొనుచున్న అధికారులపై వెచ్చింపబడు ఖర్చును సమర్థించెను. హిందూదేశమునందు

చేయబడుచున్న ప్రభుత్వపుఖర్చును ఇతర దేశముల ప్రభుత్వపుఖర్చులతో పోల్చి చూచిన "చాల మితవ్యయమే" ఆ విషయములో చేయబడుచున్నదని స్కూస్టర్‌గారి వాదన ఆశ్చర్యమును గొల్పకమానదు "సెక్యూరిటీ సర్వీసస్" అగు I. C. S., I. P. S. మొదలగువాటిలోని ఉద్యోగీయుల జీతములు, ప్రభుత్వసభ్యులు, మంత్రులు, గవర్నరులు, వైస్రాయి మొదలగు పెద్దఅధికారుల కిచ్చుజీతములు, ఆవిధమగు ఉద్యోగీయులకే ఇతర దేశములలో ఈయబడుచున్న జీతములకన్న చాల ఎక్కువగా నున్నవని ఎల్లరకును తెలిసిన దే. స్వరాజ్య ప్రభుత్వము దేశమం దేర్పాటు చేయబడిన తరువాత వారు దేశముయొక్క ఆర్థికస్థితిని గుర్తెరింగి విచారించి ముందు ముందు ప్రభుత్వ సేవకులుగా చేరువారి జీతములను నియమింపవలసియుండును. అట్లు చేయునపుడు ఇప్పటికన్న జీతములు చాల తక్కువ యుండుననుటకు సందేహము లేదు. కాని స్వరాజ్య ప్రభుత్వము నిజముగా ఏర్పాటు కాబడక ముందు ప్రస్తుతము ప్రభుత్వమును నడపుచున్న వారు ఆ విషయములో ముందంజవేయుట సమంజసము కాదా? కాని ఆర్థికసభ్యుని విధానమునుబట్టి ఇట్టి ఆలోచన ప్రభుత్వము వారి కున్నట్లు కాన్పించదు.

ఈసందర్భములో జ్ఞాపక ముంచుకోవలసినవిషయ మింకొకటి కలదు. దేశమునకు లాభదాయకముగ ప్రజల సాంఘికనైతిక జీవిత మభివృద్ధిపొందుటకు వీలుగ నుండునట్లు చేయుటకు సామ్మును కూడికచేయవలెననిన సివిల్ ఖర్చులను మాత్రము తగ్గించిన చాలదు. ప్రభుత్వాదాయములో ఎక్కువ భాగమును మ్రింగివేయుచున్న మిలిటరీఖర్చును తగ్గించుట వలననే అట్టికూడిక చేయుటకు వీలుండును. ప్రస్తుతము కేంద్రప్రభుత్వపు ఆదాయములో సగమునకు సగము (సుమారు 55 కోట్ల రూపాయిలు) సైన్యపుఖర్చుక్రింద వినియోగపర్చబడుచున్నది. దానిని కనీసము 50 కోట్ల వరకైన తగ్గించిన దేశమునకు చాలవఱకు లాభమే. మిలిటరీలోని ఉద్యోగస్థులుగా హిందువులను ఏర్పాటు చేయుటవలనను, బ్రిటిష్ సైనికదళములను తగ్గించి జాతీయ సైనికదళములను చేర్చుకొనుటవలనను, ఇతర తగ్గుదలల వలనను 50 కోట్లకంటె కూడ మిలిటరీఖర్చును తగ్గించుటకు వీలగును. సైమన్‌కమీషనుకు ఆర్థిక సహాధికారిగా వచ్చిన సర్ వాల్టర్ లేటన్‌గారు హిందూదేశపు సైన్యపుఖర్చు చాల భరింపరానిదిగా నున్నదనియు, కొన్ని అవసరమగు మార్పులు సైన్యపుఖర్చునందు చేసిన 1940 వ సంవత్సరమునాటికి 48 కోట్ల లోనికి దానిని తగ్గించవచ్చుననియు సూచించియున్నారు. కాని ఆర్థికసభ్యుడు మాత్రము రౌండుటేబిల్ సమావేశపు దేశ సంరక్షణోప సంఘము (Defence Sub-Committee of the Round Table Conference) వారు సైన్యమునందు భారతీయులను ఆఫీసర్లుగా తయారు చేయుటకు కాలేజీ నేర్పర్చవలసినదని కావిం

చిన సూచనమాత్రము పునరుక్తిచేసి తృప్తి నొందిరి.

౫

ఆర్థికసభ్యుడు విధింపదలంచుకొన్న క్రొత్త పన్నులు కొంతవరకు ఆమోదజనకముగనే యున్నవి. బీదజనులకు కష్టముగా నుండునట్టి గాని, వారు భరింపరానట్టి కాని పన్నులను విధించుట కాతడు పూనుకొనలేదు. ఏపన్ను విధింపబడినప్పుడు గాని ఆపన్నును ఇచ్చుకొనువారు దానిని భరించుటకు శక్తికలిగియుండునట్లుగా చూచి విధింపవలెను అను పన్నుల విధానపు ప్రధానసూత్రమును బట్టి ఇప్పుడు విధింపబడబోవు పన్నులను విచారించిన, ప్రస్తుత పరిస్థితులలో అవి కొంతవర కాసూత్రమునకు వ్యతిరేకమేయని ఒప్పుకొనవలసి వచ్చును. కాని ముందు ముందు పరిస్థితులు బాగుపడిన తరువాత వాటిలో కొన్నిమైనను న్యాయముగ విధింపబడినవేయని తలంపవలసి యుండును.

క్రొత్తపన్నులను ఒక్కొటొక్కటిగ తీసుకొని వాటిమంచిచెడ్డల నాలోచింతము:—

I. ఆదాయపు పన్నురేట్లు హెచ్చించుట.

పన్ను విధించుటకు కనీసపుఆదాయము మొత్తము ఇదివరలో 2,000 రూపాయిలున్నది. దానియందేమియు మార్పు లేదు. కాని 2,000 నుండి 4,999 రూపాయిలవరకు గల ఆదాయములపై పన్ను రూపాయికి 4 పైసల చొప్పున హెచ్చుచేయబడినది. అట్లనే 40,000 రూపాయిల ఆదాయమువరకుకూడ రేటు రూపాయికి 5, 6, 7 పైసల చొప్పున తగురీతిని హెచ్చుచేయబడినవి. ఇట్లు ఆదాయపు పన్ను రేట్లు హెచ్చుచేయుటవలన భారము ధనవంతులైనవారే భరించవలసి యుండును కాని బీదజనులకు నష్టము లేదు. కాని ధనవంతులగువారు తమయొద్దనున్న పనిచేయువారిని తగ్గించి కాని, వారి జీతములను తగ్గించి కాని తమ పన్నులభారమును తగ్గించుకొనజూచిన ఆవిధముగ బీదజనులకు నష్టము సంభవించుటకుకూడ అవకాశము కలదు. మరియు 5,000 రూపాయిలవరకు గల రేటు హెచ్చించుటవలన ఆలోపు ఆదాయము కలవారికి కూడ కొంత కష్టముగా నుండవచ్చును. ఇంకొకవిషయ మేమన, ఇప్పుడు ప్రబలియున్న ఆర్థిక, పారిశ్రామిక దుస్థితివలన వర్తకులకు, పరిశ్రమాధికారులకు లాభములు తగ్గిపోయిన సందర్భములో వారికికూడ హెచ్చు పన్నులు భరించుట కష్టమే. ఈస్థితిగతులలో ఆదాయముపన్ను రేట్లు హెచ్చించుటవలన ప్రభుత్వమున కెక్కువ ఆదాయము చేకూరునాయనునది సందేహాస్పదమే.

ఈ సందర్భములో రెండు ముఖ్యమైన మార్పులు చేయవలసిన అవసర మున్నది:

1. ప్రస్తుతము మన దేశమునందు లాభములనుపొందుచు ఇతర దేశములయందు వాటిని అనుభవించువారికిని, మన దేశపు సొమ్మును పెన్షనులుగా అనుభవించుచు ఇతర దేశములందున్న వారికిని, మన దేశపు ఆదాయపుపన్ను రూల్సుప్రకారము పన్నును ఇచ్చునట్లుచేయుట

కధికారము లేదు. ఇది చాల అన్యాయమును, దేశమునకు నష్టదాయకమునై యున్నది. అట్టి ఆదాయము లన్నింటిపైనను పన్నును విధించుటకు వీలైన, ఈమార్గమున ప్రభుత్వా దాయము చాలవరకు హెచ్చునని తలంప వచ్చును.

2. మన దేశమునందు ఆదాయపు పన్ను విధించుటలో ప్రతిసంవత్సరపు ఆదాయమును లెక్కకట్టి, ఏసంవత్సరపు ఆదాయముపైన ఆసంవత్సరమే పన్నును వేయుపద్ధతి అమలునందున్నది. రెండుమూడు సంవత్సరముల ఆదాయమును తీసుకొని, "ఏవరేజి" (average) కట్టి, ఆ "ఏవరేజి" ఆదాయముపై పన్ను విధించిన కొంత పన్ను చెల్లించువారికి సౌకర్యముగ నుండును. ఎందువల్ల ననగా ఒక సంవత్సరము నష్టము, ఇంకొక సంవత్సరము లాభము వచ్చిన, మొదటిసంవత్సరము తక్కువ, రెండవసంవత్సరము అంతకు చాల ఎక్కువ, ఇట్లు పన్నును ఇచ్చుకొనుట భారముగా నుండకుండ నుండదు.

ఆర్థికసభ్యుడే రెండుమార్పులను త్వరలో ప్రవేశపెట్టుటకు ప్రయత్నములు చేయవలెను. అతని ఉపన్యాసధోరణినిబట్టి చూచిన ప్రభుత్వమువారుకూడ వాటి విషయమై ఆలోచించుచున్నట్లే కనబడుచున్నది.

II. సుంకముల నభివృద్ధిచేయుట:—

ఆర్థికసభ్యుడీ విధింపబోవు క్రొత్తపన్నులలో ఎగుమతి దిగుమతి పన్నులను హెచ్చుచేయుట మరొకటై యున్నది. కొన్ని కొన్ని వస్తువుల దిగుమతిపైనను, మరి కొన్నింటి ఎగుమతిపైనను సుంకములు విధింపబడనున్నవి.

1. పంచదార దిగుమతిపైన హంద్రెడ్ వైటుకు రూ 1-4-0 చొప్పున పన్ను హెచ్చింపబడినది. ఈ హెచ్చుపన్నువలన ప్రజలకు, అనగా పంచదార నుపయోగించు బీదజనులకు, కొంతవరకు నష్టమే. కాని ప్రభుత్వ సభ్యుని అభిప్రాయముప్రకారము ఇది ఆదాయముకొరకు విధించు పన్నే కాని, రక్షణకొరకు విధింపబడినది కాదు. ప్రభుత్వమువారు త్వరలో పంచదార పరిశ్రమకు రక్షణ నిచ్చుటకు ప్రయత్నములు చేయుచున్నట్లు కూడ ఆర్థికసభ్యుని యుపన్యాసమువలన స్పష్టమగుచున్నది. అట్లు నిజముగా ప్రభుత్వమువారు రక్షణ నీయదలంచుకొనినప్పుడు, దేశీయ పరిశ్రమను అభివృద్ధి పొందించుటకు సహాయము చేయుటకు సంసిద్ధులై యున్నప్పుడు, ప్రజలు హెచ్చుసుంకమును, దానివలన వచ్చు హెచ్చు పంచదారఖరీదును భరించుటకు సిద్ధమై యుండవలసిన న్యాయము కలదు. పంచదార పరిశ్రమను అభివృద్ధిపర్చుటకు ప్రభుత్వమువారు రాబోవు సంవత్సరములో 5 నుండి 10 లక్షల రూపాయిలవరకు సహాయము చేయుటకు పూనుకొనియున్నారు.

2. విదేశములనుండి దిగుమతియగు మత్తు పదార్థములు, త్రాగుడు ద్రావకములు (alcohol and beer) మొదలగు వాటిపై కూడ పన్ను హెచ్చుచేయబడినది. ఇది చాల మంచిదే. ఈపన్ను పూర్తిగ ఆవస్తువుల నుపయోగించు

ధనవంతులపైననే పడును. ఈపన్నును దేశమునందన్ని పక్షములవారును తప్పక ఆమోదింతురు.

3. వెండి దిగుమతిపన్ను ఔన్సునకు 2 అణాల చొప్పున హెచ్చుచేయబడినది. దేశమునందు తయారగు వెండిపైకూడ ఈహెచ్చుదల ఆచరణలో నుంచబడును. వెండికొనుట ప్రజలలో కొంతవరకు తగ్గిపోవు ననుటకు సందేహము లేదు; కాని ఆర్థికసభ్యుడు అట్టి తగ్గుదల ఆలోచింపవలసినంత హెచ్చుగా నుండదని తలంచుచున్నాడు.

4. విదేశవస్త్రముల దిగుమతిపై పన్ను నూటికి 15 నుండి 20 వరకు హెచ్చింపబడినది. అట్లే ఇతరవస్తువులపై కూడ పన్ను హెచ్చుచేయబడినది. స్వదేశవస్త్ర పరిశ్రమకిందుమూలమున కొంత సహాయముగా నుండునని తలంపవచ్చును.

5. చిట్టచివర హెచ్చుదల కిరసనాయిలు, మోటారు స్పిరిట్‌లపై నై యున్నది. కిరసనాయిలుపైన పన్ను గాలనుకు 9 పైసల చొప్పునను, మోటారు స్పిరిట్‌పైన పన్ను గాలనుకు 2 అణాల చొప్పునను హెచ్చింపబడినది. కిరసనాయిలుపై పన్ను బీదజనులకు కష్టమనిపించక తప్పదు. మోటారు స్పిరిట్‌పై పన్ను మోటారుకార్లున్నవారికిని, కొంతవరకు, బస్సులపై ప్రయాణము చేయు ప్రజలకునుకూడ బరువుగ తగులను. దేశమందు మోటారుబస్సుల ఉపయోగము క్రమముగ హెచ్చుగుచున్న ఈ కాలములో ఇట్టి పన్ను ఆ అభివృద్ధికి నిరోధము కల్గించిన కల్గించవచ్చును.

పైన చెప్పబడిన పన్ను లన్నింటివలనను రాబడి 14.81 కోట్ల రూపాయిలు వచ్చునని వేయబడిన అంచనా నిజమగుచో ప్రభుత్వము వారికి ఆదాయపులోటు పూడిపోను పైగా 31 లక్షలు నిల్వకూడ నుండును.

౬

సర్ జార్జి స్కూస్టర్ గారు మన దేశములో త్వరలో ప్రవేశపెట్టబడనున్న రాజకీయ సంస్కరణములనుగూర్చి విపులముగ ముచ్చటించుచు క్రొత్త అధికారులు (అనగా స్వరాజ్యప్రభుత్వమువారు) తమ కార్యమును కష్టములేకుండ నిర్వర్తించుటకు సహాయకారిగ నుండునట్టి ఆర్థికవిధానమును తా మేర్పాటుచేయుటకు ప్రయత్నించినా మని సెలవిచ్చిరి. అతడు చెప్పినమాటలను కొన్నిటిని క్రింద పొందుపర్చుచున్నాము: "మేము ప్రస్తుతము ఒక విధమైన వర్తకపుసంస్థను నడుపు అధికారులుగా నున్నాము. ఇప్పుడాసంస్థను క్రొత్త అధికారుల యాజమాన్యము క్రిందకు మార్చువిషయమై ఆలోచనలు జరుగుచున్నవి. మన మందరమును ఈమార్పుదల కాలములో జాగ్రత్తగ కలసిమెలసి పనిచేయవలసి యున్నది. నేను చేసిన సూచన లన్నిటిని (అనగా క్రొత్త పన్నులు వేయుట మొదలగు విషయములలో) మన అవసరములను ముందర నుంచుకొనియే

చేసియున్నాను. నాతరువాత వచ్చునట్టి ఆర్థిక మంత్రికి కట్టుదిట్టమైన సంస్థను ఒప్పచెప్పుటయే నా ప్రధానోద్దేశ్యమై యున్నది." ఈ మాటలు భావపూరితముగనే యున్నవి; కాని వాటిప్రకారము ఎంతవరకు స్కూస్టరుగారు ప్రవర్తించిరనునదియే కొంతవరకనుమానము. క్రొత్తగా ఏర్పాటుకాబడు స్వరాజ్యప్రభుత్వమువారు మన దేశపరిపాలనను తమ క్రిందకు తీసుకొనినప్పుడు ఒక పెద్ద పన్నుల బరువును, పెద్ద ప్రభుత్వపుఖర్చు బరువును వారి భుజములమీదికి మార్చబడు ఏర్పాట్లు ఆర్థిక సభ్యుడు చేసెనని చెప్పవలసివచ్చుచున్నది. రెండు సంవత్సరములలో సుమారు 20 కోట్ల రూపాయిలవరకు క్రొత్త పన్నులభారమును దేశముపై వైచి, కట్టుదిట్టమైన సంస్థను తనతరువాత వారికి ఒప్పచెప్పుచున్నానని స్కూస్టర్ గారు సంతోషించుటలో అంత న్యాయము కాన్పించదు. కాని అతడు కొన్ని అసాధారణపరిస్థితుల నెదుర్కొనవలసి వచ్చెననియు, వాటిని దాటుటకుగాను క్రొత్తపన్నులను విధింపవలసి వచ్చెననియు అంగీకరించవలసి యున్నది. ఆ అసాధారణపరిస్థితులు మారిపోయి సామాన్యపరిస్థితు లేర్పడచినతరువాత ఎప్పటి రేట్లకు పన్నులను తగ్గించుటకు వీలుగ నుండిన కొంతవరకు సంతోషదాయకమగు విషయమే యగును.

౨

తమ బడ్జెట్ ఉపన్యాసమునందు స్కూస్టర్ గారు ప్రభుత్వపు మారకపురేటు (Exchange)గూర్చియు, కరెన్సీవిధానమును Currency Policy గూర్చియు, ఆర్థికదుస్థితి (Economic depression) గూర్చియు, అప్పులను చేయు విధానమును (Government's Loan Policy) గూర్చియు విపులముగ తెల్పి ప్రభుత్వపు చర్యలను సమర్థింపజూచిరి. మారకపురేటును గూర్చి చెప్పుచు 1926 సంవత్సరములో రూపాయిమారకము 1 షిల్లింగు 6 పెన్సులు కాకుండ 1 షిల్లింగు 4 పెన్సులుగా ఏర్పాటు చేయబడినప్పటికిని ప్రపంచమందంతటను వస్తువుల ధరలు (commodity prices) పడిపోవుటచే, ప్రభుత్వమువారు కరెన్సీని తగ్గించుటకు (Contraction of Currency)అవసరము ఇప్పటివలెనే యుండునని తమ కరెన్సీకంట్రాక్షను పాలిసీని అనుకూల వాతావరణమునందు చూపుటకు ప్రయత్నించిరి. కాని ప్రభుత్వమువారి మారకపు విధానమువలననే దేశమునకు పారిశ్రామికముగ చాల నష్టము కల్గుచున్నదనియు, దేశముయొక్క వర్తకవ్యాపారము, ఎగుమతులు మందగించినవనియు స్కూస్టరుగారు అంగీకరించకుండ నుండగలరా? ప్రస్తుత సందర్భములో రెండు పద్ధతులుమాత్రమే యున్నవని అతడు చెప్పెను: (1) 1 షిల్లింగు 6 పెన్సుల రేషియోను స్థిరపరుచుట; (2) 1 షిల్లింగు 4 పెన్సుల రేషియోను తిరుగ ప్రవేశపెట్టి, నిలుకడ లేనిదియు, అస్థిరము నగు కరెన్సీవిధానమును మరల దేశములో నెలకొల్పుట. కాని షిల్లింగు ఆరుపెన్సుల మారకమువలన స్థిరమగు కరెన్సీపద్ధతి మన దేశములో ఇప్పుడేర్పా

టుచేయబడినదని స్పూన్టరు గారైనను చెప్ప సాహసింపలేదు. ఎందువల్ల ననగా, ఆ హెచ్చు మారకపు రేటును నిలువబెట్టుటకే ప్రభుత్వము వారు 1926 వ సంవత్సరమునుండి ఇప్పటివరకు సుమారు '40 కోట్ల రూపాయిల విలువగల కరెన్సీని సర్క్యులేషన్‌లో నుండి తగ్గింపవలసి వచ్చినది. ఇంతసొమ్ము వాడుకలోనుండి తగ్గి పోయినప్పుడు కూడ ధరలు ఆ మారకపు రేటునకు సరిపోవునట్లు సర్దుబాటు(అడ్జస్టు) కా లేదని చెప్పిన, మన దేశపు మారకపువిధానము ఎంత లోపభూయిష్ఠముగ నున్నదియు తేలును.

ఇతర విషయములనుగూర్చి విపులముగ వ్రాయ నవసర మిప్పుడు లేదు. మారకపు రేటును ఏర్పాటుచేయుట పైననే మన దేశపు ఆర్థిక, పారిశ్రామిక, వర్తక అభివృద్ధులు ఆధారపడియున్నవి; అది సరియగుపద్ధతిని నడిపింప బడిన, అప్పుడే ఈ ఇతరవిషయములందు కూడ మార్పు కాన్పించును. క్రొత్త సంస్కరణము లను ప్రవేశపెట్టు సందర్భములో హిందూ దేశ మున కంతకును రిజర్వుబ్యాంకు నొకదాని నేర్పర్చి పైవిషయముల నన్నింటిని నిర్వహిం చుటకు ఆ బ్యాంకువారికే అధికార ముండు నట్లు చేయవలెనను సూచన రౌండుటేబిల్ సభవారు చేసియున్నారు. కాని వాటిపై చివర అధికారము గవర్నరు జనరలుకే యుం డవలెనని వారి రిపోర్టునందు వ్రాయబడియు న్నది. ఈ సందర్భములలో ఇండియా పార్ల మెంటు అభిప్రాయము ప్రకారము మారకపు రేటును మార్చుటకు కాని, కరెన్సీవిధానమును క్రొత్తదానిని ప్రవేశపెట్టుటకు కాని, ఇతర ఆర్థికవిషయములలో కాని సావకాశ ముండు నా యను ప్రశ్న చాల ముఖ్యముగ ఆలోచ నీయమై యుండును. ముందు జరుగబోవు రౌం డుటేబిల్‌సభలో ఈవిషయమై ఆలోచించి దేశమునకు లాభదాయకముగ నుండు విధాన మును ప్రవేశపెట్టుటకు తీవ్రప్రయత్నములు చేయవలసియున్నది.

మా వ్యాసకర్తలకు

వ్యాసములు చిన్న సైజు కాగితములపై ఒకవైపున మాత్రమే విడిఅక్షరములతో బంతులు దూరదూరముగా, దిద్దుబాట్లు లేకుండ, తిన్నగా వ్రాసి వర్ణక్రమమునను తప్పులు లేకుండ చూచుకొని పంప వేడికోలు. లేకున్న ముద్రణకార్యములయందు మిగుల కష్టము కలుగుటయే కాక తప్పులుకూడ నిలిచిపోవునని మనవి.

సంపాదకుడు, 'భారతి'.

ఋష్యశృంగ జననము

కొడాలి వెంకట సుబ్బారావుగారు, బి. ఏ.; కామరాజుగడ్డ శివయోగానందరావు గారు

స్నాన మొనరించుచుండె ఉషస్సునందు-పరమవిజ్ఞాని మౌని విభాండకుండు
ఊర్వశియు నచ్చటికె వచ్చుచుంట చూచు-తత్పరతలోన పతితరేతస్కు డతడు

అది గ్రహించిన దూర్వశి అంతరంగ-మందు ఏవగించిన యది అట్టె నవ్వి
"పుండునకు పుల్లమగ"డన్న పోలికగను-సంయమిని హేళన మొనర్పసాగె నిట్లు.

ఊర్వశి:—

"కట్ట తెగిన మహానదిగతిని మనసు-కొంచెము చలించగా నిగ్రహించ లేక
నీరసంపడినావు మునీ యి దేల-శీతలము గ్రమ్ము స్నానము చేయ కింక.

నీతపస్సు విఘ్నము చేయ నిలిచి ఎదుట-ఆడలేదు పాడనులేదు అంతరంగ
హారవిలసనచారుశృంగారములను-వికలచిత్తుని గావింప వేడ్కపడను.

చూచినమాత్రనే సొగసు జారలుగొంటివి. గాలి పెద్దగా
వీచిన తూలిపోదువా? స్రవించునో శల్యవిశిష్ట రక్తధా
రాచరమాణువుల్ పటుతరంబుగ చిక్కిన దేహవల్లి కాం
తాచలనానిలాణువులు తాకిన తత్తర మేల తాపసీ.

కాల మెరుంగవో? స్థలము గానవా? లేచిగురాకు కెంపుతో
పోలిక గోరి తెల్లనయి పోవుగడుల్ సరిదిద్దు ఆ యుషః
శ్రీ లలితాంగరాగము గ్రసించు వికర్తనహస్తచాలనా
స్ఫాలన చూడవో? నదిని స్నాన మొనర్చెడి జాడ నెంచవో.

అంత దేహవిస్మృతి నైచ్యమందె కలుగ-తపసు సిద్ధింప ఎంత సంతసము గనెదొ
కామినీకాంచనంబుల గడవలేని-భోగు లెల్ల విరాగు లై పోయినారు.

అగును. మునీ స్వాయంభువు వనంగ శరానలదగ్ధనీతిపా
రగుడు, తనూజయౌవనపరంపర లెప్పటి కప్పె దోచినా

డుగద? తపస్సులో ప్రథముడున్ గద? నిగ్రహశక్తియింత లే
దు గద? భ్రమల్ వయసుతో సరియే గద దేహజాతముల్.

కోపమహాగ్ని విఘ్నము రగుల్ప తపశ్చ్యుతి భీతి లేకయే
శాపము లిచ్చి నష్టపడి చర్విత చర్వణ మాచరించు సం
తాపమునందు కొందరును తామరసాక్షులచేత కొందరున్
మీపితరుల్ వృథా వ్రతసమీకృతదంభవిరాగులే కదా?

కామమో క్రోధమో లేనినీమము గల-ఋషి. ఎవం డుండె నయ్యా ఈ రెంటి విడుచు నప్పుడే గద వైరాగ్య మర్థయుక్త-మగుట ముని యన్న పేరును తగుట చెపుమ.

హేమలతాభసోయగము లీడ్చిన విచ్చిన కచ్చడాలలో
నీమము నిష్ఠయా పలుక నేరనిబాలురు కామదోహద
స్త్రీమహనీయతారసము తేరనినాటిసునీతి సూతులా
యేమి చలింపకుంటకు వహించుటకున్ సిరి లేని పెన్నిధుల్.

వారమొ పక్షమో ఋతువో వత్సరమో యుగభాగమో తపో
భారమునన్ కృశించుచు ప్రపంచకవైఖరు లుజ్జగించి ని
ష్ఠారతి కన్నుదమ్ముల వశంబగు తైజసముగ్ధరోచులన్
దూరమొనర్చి మాకు ప్రణతుల్ పొనరించు టిదేల తాపసీ.

మోహిని బంతిసామున జార్చు పయ్యెదగాలి కూగినవాడు కామవైరి
మేనకనునుమెత్తమేని సంస్పర్శలో కంప మొందినవాడు గాధిసూతి
సహజన్మభార్యవర్చస్సు కన్నుల బ్రామ దిటవు తప్పినవాడు దేవగురువు
గౌతమపత్నిరాగస్ఫూర్తిలో మ్రగ్గి మండినవాడు మార్తండమూర్తి
స్త్రీల నఖరేఖనీడల శిరము మోపు-వీరలు మహాతపస్వులు గారో నీకు
పూర్వులును పూజ్యులుం గద బూటకంపు-యోగులట లోకరక్షణోద్యోగమంట.

తెగుదాకా బిగియించు సామెతకు నీదే గాథ యాదర్శకం
బగు షట్శత్రుల బిగ్గబట్టితివి తత్త్వప్రౌఢి నాశించి ను
గ్గుగ నిన్నాపి లయింపజేసినవి యోగుల్ నేర్చుకోలేదు బా
గుగ కాంతాజనకర్మమర్మములు గగ్గోలందు నైర్మల్యముల్.

కన్నులు మూసినంతదనుకన్ యుగకోట్లను లెక్కలేక ఆ
త్మోన్నతిలోన చూచుకొనుచుందువు కన్నులు విప్పి యోగ వి
చ్ఛిన్నత లిప్తలోననె రచింతువు ముందున కొక్కగంతు లే
కున్నను గంతు లాశ్వనుకకున్ భళి నిగ్రహ మిద్దియా మునీ.

తనువు నిమేషభోగపరతన్ బల మేది చెడున్ గదా తపో
ధనము ప్రతిక్షణాధికముదంబు గదా గుణతారతమ్యభే
దనం న మూఢమైనది గదా ఋషి చిత్తము తుచ్ఛవస్తువా
సన తెగలేనివారికి వశం బగునే పరమాత్మవైఖరుల్.

తపమున నీవు పొందెడిపదంబునకే గద మోక్షనామమం
త పదవి పొందజాలడు గదా గృహమేధి సదాంగనాజన
త్రప విడలేనివాడయి నిరంతరమున్ పురుషార్థసంగతిన్
నిపుణుడు మోక్షదూరుడు మునీ, చలచిత్తులు మీకు మోక్షముల్.

కామము రక్తవేగపరికల్పితమే గద ? అంతరాత్మ శ్ర
ద్ధామతియే గదా అది నితాంతసమున్నతయోగభాగ్యవి
శ్రామములోన తుష్టము విచక్షణ లేని క్షణాల్పభావనో
ద్దామము కామ ముందుకు గదా వృథపుచ్చితివీ తపస్సులన్.

రూపము జూచి ఊరెడికురూపులు రాగ విలాసనేత్రవి
క్షేపములో స్ఖలించు కృతవీర్య విరాగులు కామమంజులా
లాపరసంబునందున కరంగెడి మానులు దాంభికవ్రతో
ద్యాపన జేసికొంద్రు ప్రమదల్ కనుపించిన తక్షణంబునన్.

విభాండకుడు:—

శీతము వాతమున్ మదముచే మది తప్పి చరించు మానవ
వ్రాతముపాలు మానులతపస్సుల భంగ మొనర్చి విశ్వవి
ఖ్యాతుల బ్రహ్మతేజుల మహాత్ముల నుద్భవమంద జేయు ప్ర
జ్ఞాతిశయంబు లప్సరస లందినపాలు హిమాంశుహాసినీ.

ఆ దశకంఠకంఠదళనాకృతి విష్ణుమహస్సు భూమిపై
పాదుకొనంగ పంక్తిరథ భావితయాగపురోహితత్వదీ

తాదరణుండు మత్ స్ఖలిత మందు జనించును పోవె "సీరసా"
త్పాదనమే ప్రపంచకవిధానసముద్ధరణంబు భామినీ.

చెడి రక్షింతుము స్వీయనాశము జగచ్ఛ్రేయంబుగా మీకు లో
బడి వర్తింతు మటంచు పొంగెదరు దుర్భావల్ గదా స్త్రీలు మా
కుమతో లోకము మూసి నారమను భోగల్ మీకు గ్రాహ్యంబు ల
య్యెడినే బాల యమోఘవీర్య ఋషిమాళీచ్ఛాగతోద్వృత్తముల్.

సృష్టికర్తల మెటుల వర్తింపవలెనో - తెలియును త్రికాలవేదుల చలనములను
లోకములు నిల్చు నశియించు మీకు దాని-సోల యేల సదా కామలాలసలకు.


సావరణీయసృష్టికరణంబున కీవు నిమిత్తమాత్ర వై
నావు తరంగడోలికల నాట్య మొనర్చుచు పోవు తేజమున్
త్రావు నదే పిపాస ఋతుధర్మము నందిన జింకపెంటి న
ద్యోవహాగర్భనిర్గతసుతుం డతడే ఋషిశృంగు డంగనా.

అతని మాతృభావమున కర్హత జెందిన పుణ్యరాశి వై
పోతివి నాదుభావరతి పూచినపూతకు గేలి పల్కులో
పాతక మూడుకోవలదు బాలునిమాతము రమ్ము మత్తపః
పాతములో త్రిలోక మనపాయము భావిఫలప్రసూతిన్ చెలీ.

మా చందాదారులకు

మా కార్యాలయమునకు వ్రాయు ఉత్తరములు మొదలయినవానియందు తమ 'చందాదారు' సంఖ్య వ్రాయవలెను. లేకున్న ప్రత్యుత్తరములు మొదలయిన పనులను జరుపజాలము చందాదారుసంఖ్య భారతి కవరుకాగితముపై తమ విలాసమునకు ముందున్నది. చందాదారులకు భారతి ౧౦-వ తేది లోపల అందకపోయిన యెడల వెంటనే తపాలువారికిని, మా కార్యాలయమునకును తెలుప గోరెదము

మేనేజరు, 'భారతి.'



అలకనందనదిపయి ఇనుపవంతెన
గంట కిరువదిమైళ్ల వేగమున నక్కడ నది ప్రవహించుచుండును.



బదరీనాథ్ దారిదృశ్యము

హనుమాన్ ఘాటీ వద్దనుండి. త్రోవ కడ్డుగ నొక్కెడ మంచు పడియున్నది.

డొమినియను ప్రభుత్వము,* ఆస్ట్రేలియా కామన్వెల్తు

దిగవల్లి వేంకటశివరావుగారు, B.A., B.L.,

ఆస్ట్రేలియా కామన్వెల్తు రాజ్య మొక బ్రిటీషు డొమినియను; అనగా కెనాడా, దక్షిణాఫ్రికా, ఐర్లాండులవలెనె ఇంగ్లాండు దేశముతోపాటు సమాన గౌరవము కలిగి తన ఆంతరంగిక వ్యవహారములందు గాని, పరదేశములతోడి సంబంధములందుగాని ఇంకొక రాజ్యమునకు లోబడకుండగనే బ్రిటీషురాజును చక్రవర్తిగ అంగీకరించి చేరి, బ్రిటీషుసామ్రాజ్యమున నొకభాగముగ నుండి, సంపూర్ణ బాధ్యతాయుత స్వపరిపాలనము స్వాతంత్ర్యము కల రాజ్యము. బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వమునకు డొమినియనుల ఆంతరంగిక వ్యవహారములం దెట్టి యధికారములును లేవు. డొమినియనులకు గవర్నరుజనరలును గాని, గవర్నరులనుగాని నియమించుట, డొమినియను పార్లమెంటుల తీర్మానముల నొక్కొక్కప్పు డంగీకరింపకపోవుట, ఇంగ్లాండులోని ప్రీవికవున్సిలు సభవారికి డొమినియను హైకోర్టుల పైన కొన్ని విషయములలో అప్పీలు అభియోగములను తీర్మానించు నధికారముండుట, బ్రిటీషు పార్లమెంటునకు డొమినియనుల పరిస్థితులందు కొన్ని మార్పులను చేయు నధికార ముండుట మాత్రమే బ్రిటిషుసామ్రాజ్యమునకు గల యధికారములు. అయిన నీ యధికారములను బ్రిటీషుసామ్రాజ్యమువారు నిరంకుశముగ చెలాయించుటకు ప్రయత్నింప సాహసించుట లేదు. అట్లు చేసినచో స్వతంత్రుడైన కొమారునివలె తనపెత్తనమును డొమినియను ధిక్కరించి వేరుపడునని బ్రిటీషు సామ్రాజ్యమెఱుగును.

బ్రిటీషుసామ్రాజ్యమున కున్న స్వల్పపుటధికారములుగూడ డొమినియనుల కిష్టముగ లేవని దక్షిణాఫ్రికాలోను, ఐర్లాండులోను ప్రత్యేకపతాకముకొరకు పోరాడువారును, ప్రీవికవున్సిలుయొక్క అప్పీలు హక్కులను తిరస్కరించువారును స్పష్టపరచుచున్నారు.

ఇటీవల డొమినియనుల శాసనాధికారములను గూర్చి విచారించుటకు బ్రిటిషువా రేర్పరచిన కమిటీవారు డొమినియనులకు నిర్నిరోధ ప్రభుత్వాధికారములు కలవని శాసనమూలమున స్పష్టీకరింపవలసిన దనియు, డొమినియనుల శాసనములను బ్రిటీషుసార్వభౌముడు తిరస్కరింప రాదనియు, వానికి దేశాంతరము లందును గౌరవ ముండవలయుననియు, డొమినియనులు తమనౌకావ్యవస్థలను, వ్యాపారములనుగూర్చిన శాసనములను తమ యిచ్చవచ్చిన రీతిని చేసికొనవచ్చుననియు తీర్మానించిరి.

ఆస్ట్రేలియా కామన్వెల్తు కెనాడా రాజ్యమువలె "ఫెడరల్" రాజ్యాంగపద్ధతికి జెందినది. అనగా నిదియు కెనాడావలెనె స్వపరిపాలనము కల రాష్ట్రముల సమ్మేళనము. సమితి ప్రభుత్వమునకును, రాష్ట్రీయ ప్రభుత్వములకును రాజ్యాంగచట్టమువలన సమాన ప్రభుత్వాధికారము లీయబడినవి. సమితిశాసనసభలకును, రాష్ట్రీయశాసనసభలకును ప్రత్యేకముగ నిర్నిరోధశాసనాధికారములు కలవు. రాజ్యాంగ విధానమున వచ్చు సమస్యలు, వివాదములును సమితియొక్క ఉన్నతన్యాయస్థానమే పరిష్కరించును. ఈలక్షణములు కల రాజ్యాంగపద్ధతికి ఫెడరల్ ప్రభుత్వమని పేరు.

దక్షిణాఫ్రికా కూడ కొన్ని రాష్ట్రములయొక్క సమ్మేళనమే కాని పైన చెప్పబడినట్లు ప్రభుత్వాధికారము విభజింపబడి యుండలేదు. ప్రభుత్వాధికారము లే

* 'కనడా రాజ్యాంగము'—శుక్ల సం. మాఘమాస భారతి చూడుడు.

సమితి ప్రభుత్వమునందే యున్నవి. రాజ్యాంగమునందు సమితిశాసనసభకే (పార్లిమెంటు) సర్వాధికారములును కలవు. రాష్ట్రీయప్రభుత్వములు మనస్థానికస్వపరిపాలనా సంస్థలవలె స్థానికవ్యవహారములందుమాత్రమే శాసనములను చేయును. ముఖ్యవ్యవహారములందు సమితిపార్లిమెంటు వారు వీని కిచ్చిన శాసనాధికారము తప్ప ప్రత్యేకాధికారములు లేవు. ఈవిధానమునకు యూనిటరీ (Unitory) లేక ఏకైకప్రభుత్వపద్ధతియని పేరు. ఫెడరలువిధానమునందు రాష్ట్రములకు స్వేచ్ఛాస్వాతంత్ర్యము, నిర్నిరోధాధికారము నుండును ననుమాట నిజమె కాని దానివలన సమితి యొక్క కేంద్రపరిపాలనము బలహీనమైయుండును. అందు ముఖ్యముగ ఫెడరలు రాజ్యాంగమునందు రాజ్యాంగమున సమితికిని, రాష్ట్రములకును ప్రత్యేకింపగా మిగిలిన అనిర్దిష్టప్రభుత్వాధికారములు (Residuary Powers) సమితిప్రభుత్వమునందు గాక రాష్ట్రప్రభుత్వములందు నెలకొల్పబడినచో కేంద్రప్రభుత్వము మరియు బలహీనమగును.

ఆస్ట్రేలియా మన భరతఖండమునకు ఆగ్నేయమూలగా పసిఫికు మహాసముద్రమున నున్న గొప్పద్వీపము. దీనివిస్తీర్ణము 29,74,581 చదరపుమైళ్లు. ఇందలి జనసంఖ్య రమారమి 50,00,000. ఈద్వీపమును క్రీస్తుశకము 1770 సంవత్సరమున నై పాశ్చాత్యులు చూచిరి. బ్రిటీషు వారు ద్వీపాంతరవాసము ననుభవింపుడని శిక్షించినవారి నెల్లర నచ్చటికి దిగుమతి చేయసాగిరి. మొదట నీద్వీపమును బ్రిటీషుసేనానులే నిరంకుశముగ బరిపాలించుచుండిరి. కాని తరువాత నొక చిన్న శాసనసభ నేర్పరచి దానిలో కొందఱుసభ్యులను నియమించిరి. ఆస్ట్రేలియా రాజ్యమున న్యూసౌత్ వేల్సు, విక్టోరియా, సౌత్ ఆస్ట్రేలియా, క్వీన్సు లాండ్, వెస్ట్రన్ ఆస్ట్రేలియా, టాస్మేనియా అను రాష్ట్రములు కలవు. ఈ రాష్ట్రములభివృద్ధి కెంగగా 1860 లో బ్రిటీషుప్రభుత్వమువారు బాధ్యతాయుత స్వపరిపాలనము నొసగిరి. అనగా వీనిప్రభుత్వాధికారము ఒక గవర్నరును, ప్రజాప్రతినిధులు కల శాసనసభలను కలిసిన రాష్ట్రీయ "పార్లిమెంటు"లయందు నెలకొల్పబడినది. శాసనసభలకు బాధ్యులగు పరిపాలకమంత్రులే రాజ్యాంగవ్యవహారములను చక్కబెట్టుచుండురు. కొన్నివత్సరముల కీరాష్ట్రము లొకసమితిగ కలిసి ఒక సంయుక్తరాజ్యాంగమును స్థాపించుకొనుట మంచిదని రాజనీతిజ్ఞులకు తోచెను. దీనినిగూర్చి కార్యాలోచనము జరిగి కొన్నాళ్లకొకచిత్తు రాజ్యాంగచట్టమును తయారుచేసిరి. దానికి బ్రిటీషుపార్లిమెంటువారు 1900 సంవత్సరమున తమ యనుమతినొసగిరి. ఈ సంయుక్తసమితి ప్రభుత్వమునకు "ఆస్ట్రేలియాకామన్వెల్తు" అని పేరు. ఆస్ట్రేలియాలోని వివిధరాష్ట్రములు తమ క్షేమలాభములకొరకు సమితిలో చేరినవే గాని తమస్వాతంత్ర్యమును, స్వపరిపాలనాధికారములను గోల్పోవుట కిష్టపడలేదు. అందువలన వాని కిదివర కుండిన రాజ్యాంగ స్వపరిపాలనాధికారములెల్ల అట్లే యున్నవి. ఆరాష్ట్రములకు పరిపాలకులను (గవర్నరులను) బ్రిటీషువలస రాజ్యాంగమంత్రియె నియమించును. ఈరాష్ట్రములకెల్ల తమదేశములందు పన్నులు విధించుకొను నధికారము, శాసనములను చేసికొను నధికారమును గలవు. సమితియొక్క శాంతికి క్రమపరిపాలనకు నావశ్యకమగు ప్రభుత్వాధికారమును, శాసనాధికారములను ఈరాష్ట్రములు తమంతటతాము సమితిప్రభుత్వమున కొసగినవి. అట్లొసగబడిన శాసనాధికారము, ప్రభుత్వాధికారము లెల్ల రాజ్యాంగచట్టమున వివరింపబడినవి.* ఈ అధికారములు గాక మిగిలిన అనిర్దిష్టములగు శాసనాధికారములెల్ల రాష్ట్రీయశాసనసభలకే గలవు గాని సమితి శాసనసభలకు లేవు కెనడాలో అనిర్దిష్టములగు నధికారములెల్ల సమితి శాసనసభలకే కలవు గాని రాష్ట్రీయశాసనసభలకు లేవు. సమితి ప్రభుత్వాధికారము సమితియొక్క ఫెడరల్ పార్లిమెంటు అనగా సార్వభౌమప్రతినిధియగు గవర్నరుజనరలును, ప్రజాప్రతినిధులుగల సెనేటుసభ ప్రజాప్రతినిధులసభ యను శాసనసభలును కలిసిన రాజ్యాంగమున నెలకొల్పబడినది. సెనేటుసభకు ప్రతిరాష్ట్రము నుండి ఆరుగురుసభ్యులకు తక్కువ లేకుండగ బంపుచుందురు. వీరు 6 సంవత్సరము లుందురు. ప్రజాప్రతినిధుల

* అనుబంధము చూడుము.

డొమినియను ప్రభుత్వము,* ఆస్ట్రేలియా కామన్వెల్తు

దిగవల్లి వేంకటశివరావుగారు, B.A., B.L.,

ఆస్ట్రేలియా కామన్వెల్తు రాజ్య మొక బ్రిటీషు డొమినియను; అనగా కెనాడా, దక్షిణాఫ్రికా, ఐర్లాండులవలెనె ఇంగ్లాండు దేశముతోపాటు సమాన గౌరవము కలిగి తన ఆంతరంగిక వ్యవహారములందు గాని, పరదేశములతోడి సంబంధములందు గాని ఇంకొక రాజ్యమునకు లోబడకుండగనే బ్రిటీషు రాజును చక్రవర్తిగ అంగీకరించి చేరి బ్రిటీషు సామ్రాజ్యమున నొక భాగముగ నుండి, సంపూర్ణ బాధ్యతాయుత స్వపరిపాలనము స్వాతంత్ర్యము కల రాజ్యము. బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వమునకు డొమినియనుల ఆంతరంగిక వ్యవహారములం దెట్టి యధికారములును లేవు. డొమినియనులకు గవర్నరుజనరలును గాని, గవర్నరులను గాని నియమించుట, డొమినియను పార్లమెంటుల తీర్మానముల నొక్కొక్కప్పు డంగీకరింపకపోవుట, ఇంగ్లాండులోని ప్రీవికవున్సిలు సభవారికి డొమినియను హైకోర్టుల పైన కొన్ని విషయములలో అప్పీలు అభియోగములను తీర్మానించు నధికారముండుట, బ్రిటీషు పార్లమెంటునకు డొమినియనుల పరిస్థితులందు కొన్ని మార్పులను చేయు నధికార ముండుట మాత్రమే బ్రిటిషు సామ్రాజ్యమునకు గల యధికారములు. అయిన నీ యధికారములను బ్రిటీషు సామ్రాజ్యమువారు నిరంకుశముగ చెలాయించుటకు ప్రయత్నింప సాహసించుట లేదు. అట్లు చేసినచో స్వతంత్రుడైన కొమారునివలె తనపెత్తనమును డొమినియను ధిక్కరించి వేరుపడునని బ్రిటీషు సామ్రాజ్యమెఱుగును.

బ్రిటీషు సామ్రాజ్యమున కున్న స్వల్పపుటధికారములుగూడ డొమినియనుల కిష్టముగ లేవని దక్షిణాఫ్రికాలోను, ఐర్లాండులోను ప్రత్యేకపతాకముకొరకు పోరాడువారును, ప్రీవికవున్సిలుయొక్క అప్పీలు హక్కులను తిరస్కరించువారును స్పష్టపరచుచున్నారు.

ఇటీవల డొమినియనుల శాసనాధికారములను గూర్చి విచారించుటకు బ్రిటీషువా రేర్పరచిన కమిటీవారు డొమినియనులకు నిర్నిరోధ ప్రభుత్వాధికారములు కలవని శాసనమూలమున స్పష్టీకరింపవలసిన దనియు, డొమినియనుల శాసనములను బ్రిటీషుసార్వభౌముడు తిరస్కరింప రాదనియు, వానికి దేశాంతరము లందును గౌరవ ముండవలయుననియు, డొమినియనులు తమనౌకావ్యవస్థలను, వ్యాపారములనుగూర్చిన శాసనములను తమ యిచ్చవచ్చిన రీతిని చేసికొనవచ్చుననియు తీర్మానించిరి.

ఆస్ట్రేలియా కామన్వెల్తు కెనాడా రాజ్యమువలె "ఫెడరలు" రాజ్యాంగపద్ధతికి చెందినది. అనగా నిదియు కెనాడావలెనె స్వపరిపాలనము కల రాష్ట్రముల సమ్మేళనము. సమితి ప్రభుత్వమునకును, రాష్ట్రీయ ప్రభుత్వములకును రాజ్యాంగ చట్టమువలన సమాన ప్రభుత్వాధికారము లీయబడినవి. సమితిశాసనసభలకును, రాష్ట్రీయ శాసనసభలకును ప్రత్యేకములగు నిర్నిరోధశాసనాధికారములు కలవు. రాజ్యాంగ విధానమున సమ్భవించుసమస్యలు, వివాదములును సమితియొక్క ఉన్నతన్యాయస్థానమే పరిష్కరించును. ఈలక్షణములు కల రాజ్యాంగపద్ధతికి ఫెడరల్ ప్రభుత్వమని పేరు.

దక్షిణాఫ్రికా కూడ కొన్ని రాష్ట్రములయొక్క సమ్మేళనమే కాని పైన చెప్పబడినట్లు ప్రభుత్వాధికారము విభజింపబడి యుండలేదు. ప్రభుత్వాధికారము లె

* 'కెనడా రాజ్యాంగము'—శుక్ల సం. మాఘమాస భారతి చూడుడు.

సమితిప్రభుత్వమునందే యున్నవి. రాజ్యాంగమునందు సమితిశాసనసభకే (పార్లిమెంటు) సర్వాధికారములును కలవు. రాష్ట్రీయప్రభుత్వములు మనస్థానికస్వపరిపాలనా సంస్థలవలె స్థానికవ్యవహారములందుమాత్రమే శాసనములను చేయును. ముఖ్యవ్యవహారములందు సమితిపార్లిమెంటు వారు వీనికిచ్చిన శాసనాధికారము తప్ప ప్రత్యేకాధికారములు లేవు. ఈవిధానమునకు యూనిటరీ (Unitory) లేక ఏకైకప్రభుత్వపద్ధతియని పేరు. ఫెడరలు విధానమునందు రాష్ట్రములకు స్వేచ్ఛాస్వాతంత్ర్యము, నిర్ణీతాధికారము నుండును వనుమాట నిజమె కాని దానివలన సమితి యొక్క కేంద్రపరిపాలనము బలహీనమైయుండును. అందు ముఖ్యముగ ఫెడరలు రాజ్యాంగమునందు రాజ్యాంగమున సమితికిని, రాష్ట్రములకును ప్రత్యేకింపగా మిగిలిన అనిర్దిష్టప్రభుత్వాధికారములు (Residuary Powers) సమితిప్రభుత్వమునందు గాక రాష్ట్రప్రభుత్వములందు నెలకొల్పబడినచో కేంద్రప్రభుత్వము మరియు బలహీనమగును.

ఆస్ట్రేలియా మన భరతఖండమునకు ఆగ్నేయ మూలగా పసిఫిక్ మహాసముద్రమున నున్న గొప్పద్వీపము. దీనివిస్తీర్ణము 29,74,581 చదరపుమైళ్లు. ఇందలి జనసంఖ్య రమారమి 50,00,000. ఈద్వీపమును క్రీస్తుశకము 1770 సంవత్సరమునను పాశ్చాత్యులు చూచిరి. బ్రిటీషు వారు ద్వీపాంతరవాసము ననుభవింపుడని శిక్షించినవారి నెల్లర నిచ్చటికి దిగుమతి చేయసాగిరి. మొదట నీద్వీపమును బ్రిటీషుసేనానులే నిరంకుశముగ బరిపాలించుచుండిరి. కాని తరువాత నొక చిన్నశాసనసభ నేర్పరచి దానిలో కొందఱుసభ్యులను నియమించిరి. ఆస్ట్రేలియా రాజ్యమున న్యూసౌత్ వేల్స్, విక్టోరియా, సౌత్ ఆస్ట్రేలియా, క్వీన్స్ లాండ్, వెస్టర్న్ ఆస్ట్రేలియా, టాస్మానియా అను రాష్ట్రములు కలవు. ఈ రాష్ట్రములభివృద్ధిచెందగా 1860 లో బ్రిటీషుప్రభుత్వమువారు బాధ్యతాయుత స్వపరిపాలనము నొసగిరి. అనగా వీనిప్రభుత్వాధికారము ఒక గవర్నరును, ప్రజాప్రతినిధులు కల శాసనసభలును కలిసిన రాష్ట్రీయ "పార్లిమెంటు"లయందు నెలకొల్పబడినది. శాసనసభలకు బాధ్యులగు పరిపాలక మంత్రులే రాజ్యాంగవ్యవహారములను చక్కబెట్టుచుందురు. కొన్నివత్సరముల కీరాష్ట్రము లొకసమితిగ కలిసి ఒక సంయుక్తరాజ్యాంగమును స్థాపించుకొనుట మంచిదని రాజనీతిజ్ఞులకు తోచెను. దీనినిగూర్చి కార్యాలోచనము జరిగి కొన్నాళ్లకొకచిత్తు రాజ్యాంగచట్టమును తయారుచేసిరి. దానికి బ్రిటీషుపార్లిమెంటువారు 1900 సంవత్సరమున తమ యనుమతినొసగిరి. ఈ సంయుక్త సమితి ప్రభుత్వమునకు "ఆస్ట్రేలియాకామన్వెల్తు" అని పేరు. ఆస్ట్రేలియాలోని వివిధరాష్ట్రములు తమ క్షేమలాభములకొరకు సమితిలో చేరినవే గాని తమవ్యక్తిస్వాతంత్ర్యమును, స్వపరిపాలనాధికారములను గోల్పోవుట కిచ్చగింపలేదు. అందువలన వాని కిదివరకుండిన రాజ్యాంగ స్వపరిపాలనాధికారములెల్ల అట్లే యున్నవి. ఆరాష్ట్రములకు పరిపాలకులను (గవర్నరులను) బ్రిటీషు వలస రాజ్యాంగమంత్రియె నియమించును. ఈరాష్ట్రములకెల్ల తమదేశములందు పన్నులు విధించుకొను నధికారము, శాసనములను చేసికొను నధికారమును గలవు. సమితియొక్క శాంతికి క్రమపరిపాలనకు నావశ్యకమగు ప్రభుత్వాధికారమును, శాసనాధికారములును ఈరాష్ట్రములు తమంతటతాము సమితిప్రభుత్వమున కొసగినవి. అట్లొసగబడిన శాసనాధికారము, ప్రభుత్వాధికారము లెల్ల రాజ్యాంగచట్టమున వివరింపబడినవి.* ఈ అధికారములు గాక మిగిలిన అనిర్దిష్టములగు శాసనాధికారము లెల్ల రాష్ట్రీయశాసనసభలకే గలవు గాని సమితి శాసనసభలకు లేవు. కెనడాలో అనిర్దిష్టములగు నధికారములెల్ల సమితి శాసనసభలకే కలవు గాని రాష్ట్రీయశాసనసభలకు లేవు. సమితి ప్రభుత్వాధికారము సమితియొక్క ఫెడరల్ పార్లిమెంటు అనగా సార్వభౌమప్రతినిధియగు గవర్నరుజనరలును, ప్రజాప్రతినిధులుగల సెనేటుసభ ప్రజాప్రతినిధులసభ యను శాసనసభలును కలిసిన రాజ్యాంగమున నెలకొల్పబడినది. సెనేటుసభకు ప్రతిరాష్ట్రము నుండి ఆరుగురుసభ్యులకు తక్కువ లేకుండగ బంపుచుందురు. వీరు 6 సంవత్సరము లుందురు. ప్రజాప్రతినిధుల

* అనుబంధము చూడుము.

సభకు (House of Representatives) రాష్ట్రములలోని జనసంఖ్యనుబట్టి సభ్యుల నంపుదురు. ఎంత తక్కువ జనసంఖ్య యున్నను ౫ గురుకన్న తక్కువ సభ్యులను పంపరు. ఈ రెండు శాసనసభలకును అధ్యక్షుల నెన్నుకొందురు. సభ్యుల కెల్లరకు సాలుకు నాలుగు వందల పౌనుల వేతన మీయబడును. ప్రభుత్వాదాయము యొక్క వ్యయవిధానమునకు గవర్నరు జనరలు తన అంగీకారము నొసగవలయును. శాసనసభల కభిప్రాయ భేదములు కలిగినప్పుడు చేయవలసిన కర్తవ్యముకూడ రాజ్యాంగచట్టమున నిర్ణయింపబడినది. చట్టములెల్ల సార్వభౌముని అంగీకారము బడయవలయునను నియమము కలదు.

పరిపాలనాధికారము (Executive Power) గవర్నరుజనరలును, అతనికి సహాయముగ నుండు పరిపాలక సభయు (ఎక్జిక్యూటివు కవున్సిలు) నిర్వహింతురు. అందలి సభ్యులను గవర్నరు జనరలే నియమించును: సైనిక నావికదళము లతని అధికారముక్రింద నుండును. సమితి మంత్రుల నతడే నియమించును. మంత్రు లెల్లరు పరిపాలకసభలో సభ్యులుగ నుందురు. ఈమంత్రులు శాసనసభలో సభ్యులుగ నుండియుండవలెను లేనిచో; గవర్నరు జనరలు నియమించినది మొదలు 3 నెలలలో సభ్యత్వము సంపాదించుకొనవలయును.

న్యాయపరిపాలనాధికారము హైకోర్టునందును ఇతర సమితి న్యాయస్థానములందును కలదు. తక్కిన సమితి న్యాయస్థానములపైనను, రాష్ట్రీయ సుప్రీము కోర్టులపైనను ఉపర్యభియోగము (అప్పీలు) హైకోర్టునకు చేయుదురు. సమితిపార్లిమెంటువారు చేసిన శాసనముల నుగూర్చిన వ్యాజ్యములను, ఒక రాష్ట్రమున కింకొక రాష్ట్రమునకును గలుగు వ్యాజ్యములను పరదేశ ప్రతినిధులకు సంబంధించిన వ్యాజ్యములను పరిష్కరించు నధికారము హైకోర్టుకే కలదు. హైకోర్టు తీర్పులపైన ప్రీవీకవున్సిలు సభాయుక్తుడగు బ్రిటీషు సార్వభౌమునికి అప్పీలు చేయతగిన విశేష విషయములను నిర్ణయింప బడినవి.

రాష్ట్రముల పరిపాలనక్రిందినుండి సమితి పరిపాలనక్రిందికి మార్పు జెందు|మధ్యకాలమున ఆర్థిక వ్యాపార పద్ధతులందు నష్టము సంభవించకుండగ కొన్ని కట్టుదిట్టములు రాజ్యాంగచట్టమునను చేయబడెను. రాజ్యాంగ విధానమునందు మార్పు లేమైన గావలసినచో అట్టి మార్పులకు రాష్ట్రములు లోబడి అందలి ప్రజలు అంగీకరించినచో, అట్టిమార్పులు చేయుటకు సదుపాయములు రాజ్యాంగచట్టమున నిర్ణయింపబడెను.

అనుబంధము

ఆస్ట్రేలియా రాజ్యాంగవిధానము నిర్ణయింపబడిన ఆస్ట్రేలియా కామన్వెల్తు ఆక్టు ౫౧, ౫౨ సెక్షనులలో సమితి పార్లిమెంటుయొక్క అధికారములు చేర్చబడినవి.

౫౧వ సెక్షను:—ఈ రాజ్యాంగమునకు లోబడి సమితి 'పార్లిమెంటు' సమితియొక్క శాంతికి, క్రమపరిపాలనకు, సత్ప్రభుత్వమునకు వలయునట్లు ఈ క్రింది విషయములనుగూర్చి శాసనముల జేయుట కధికారముకలదు:

౧. వర్తకము ఇతర దేశములకును సమితికిని సమితిలోని రాష్ట్రములలో నొకదానికింకొకదానితోను గల వ్యాపారము.

౨. రాష్ట్రములందు గాని రాష్ట్రభాగములందు గాని పక్షపాతబుద్ధి లేకుండ సమితికి కావలసిన పన్నులు విధించుట.

3. పంటలుగాని ఎగుమతులుగాని ప్రోత్సహించుటకు బహుమానముల నిచ్చుట. ఇందు సమితిలోని వివిధభాగములలో హెచ్చుతగ్గు లుండరాదు.

౪. సమితియొక్క పరపతిపైన ఋణములు చేయుట.

౫. తపాలా, తంతివార్తలు, తంతిసంభాషణాలు మున్నగు వ్యవహారములు.

౬. నావిక సైనిక వ్యవస్థలు, సమితియొక్కయు, వివిధరాష్ట్రములయొక్కయు సంరక్షణము, సమితియొక్క

శాసనములను నిర్వర్తించుటకు, అమలుచేయుటకు బలములను వడపుట.

౭. దీపస్తంభములు, దీపపుటోడలు, సముద్ర మార్గదర్శక దీపములు, ప్లవములు (buoys).

౮. ఖగోళవాతావరణ పరిస్థితులనుగూర్చిన వ్యవహారములు.

౯. "క్వారంటైన్" అంటురోగము లున్నవని అనుమాన మున్నచో ఓడలను రేవులలో నిరోధించి యుంచుట.

౧౦. ఆస్ట్రేలియా ద్వీపముయొక్క సముద్రతీరమునకు మూడుమైళ్లదూరమున చేపలు పట్టు వర్తకమును గూర్చిన విషయములు.

౧౧. జనాభా ప్రజల స్థితిగతులను గూర్చిన వృత్తాంతము అంకెలు (statisties).

౧౨. చెలామణి, నాణెములు, సామాన్య చెలామణి,—అనగా దేశవ్యవహారమునందు చెలామణియగునట్లు ప్రభుత్వమువారు నిర్ణయించు ద్రవ్యము.

౧౩. రాష్ట్రీయ బ్యాంకులు గాక ఇతర బ్యాంకి వ్యవహారములు, రాష్ట్రముల పరిహద్దులు మీరి వ్యవహరించు బ్యాంకులు, బ్యాంకులను రిజిష్టరు చేయుట (Incorporation), కాగితపు ద్రవ్యములను ప్రచురించుట.

౧౪. రాష్ట్రీయ భీమావ్యాపారము గాక ఇతర భీమా వ్యాపారము.

౧౫. తూనికరాళ్లు, కొలపాత్రములు.

౧౬. హుండీలు, ప్రామిసరీ నోట్లు.

౧౭. దివాలా.

౧౮. కాపీరైటు హక్కులు, పరిశోధనలందలి హక్కులు, క్రొత్తవస్తువుల స్వరూపస్వభావములందు "పేటెంటు" స్వామ్యములను నిర్ణయించుట.

౧౯. పరదేశీయులు వారికి పౌరస్వత్వముల నొసగు నధికారము.

౨౦. పరదేశీయులయొక్క కంపెనీలు, సమితి హద్దులలో వ్యాపారమునుగూర్చి కాని, ఆర్థికవిషయములనుగూర్చి కాని స్థాపింపబడుసంఘములు.

౨౧. వివాహములు.

౨౨. వివాహబంధవిచ్ఛేదనము (Divorce), దానిని గూర్చిన వ్యాజ్యములు, తల్లిదండ్రులహక్కులు, మైనరుల సంరక్షణమునుగూర్చిన హక్కులు.

౨౩. ఆపదలు కలిగినవారికి గాని, ముదుసలివారికి గాని ఉపకారవేతనము లొసగుట.

౨౪. రాష్ట్రములయొక్క సివిలు క్రిమినలు న్యాయస్థానములతీర్పులను సమితిహద్దులలో అమలుజరిగించుట, వానియుత్తరువులను జారీచేయుట.

౨౫. రాష్ట్రముల శాసనములు, వాని ప్రభుత్వ తీర్మానములు, కార్యములు, నిదస్తావేజులు, న్యాయస్థానములతీర్పులనుసమితిహద్దులలో నెల్ల గౌరవింపజేయుట

౨౬. రాష్ట్రములలోని ఆదిమవాసులనుగూర్చి గాక ఇతరజాతులవారి యోగక్షేమములకు వలసిన శాసనములను చేయుట.

౨౭. వలసపోవువారిని గూర్చిన విషయములు, వలసవచ్చువారిని గూర్చిన విషయములు.

౨౮. శిక్షితుల సంఖ్యనుగూర్చియు, అభివృద్ధిని గూర్చియు విచారించుట.

౨౯. పరదేశములతోడి వ్యవహారములు.

౩౦. పసిఫికు మహాసముద్రమునగల ఇతరద్వీపములతోడి వ్యవహారములు.

౩౧. రాష్ట్రముల ప్రభుత్వముల దగ్గరనుండి కాని, దేశములోని ప్రజలవలన గాని, పార్లమెంటువారికి శాసనము చేయుట కధికారముగల పనికొరకు, ఆస్తిని వశము చేసికొనుట (Acquisition of Property).

౩౨. సమితియొక్క నావికదళమునుగాని, సైనికదళమును గాని పంపుచుండుటకు సమితిలోని రైళ్లపై నధికారము.

౩౩. రాష్ట్రీయములలోని రైలుదారి యవసరమైన చో నారాష్ట్రీయముతో ఏర్పాటుచేసికొని దానిని వశము చేసికొనుట.

౩౪. ఆయా రాష్ట్రీయముల యంగీకారముతో రైలుదారిని వృద్ధిచేయుట.

౩౫. రాష్ట్రీయముల పరిహద్దు దాటి వ్యాపారములను చేయువారి తగవులను తీర్మానించుట, రాజీలకు మధ్యస్థులను నియమించుట.

౩౬. పార్లిమెంటువారు మార్చివేయునవరకీ రాజ్యాంగచట్టము నిర్ణయించిన అన్ని విషయములందును సమితి పార్లిమెంటు కధికారము కలదు.

౩౭. రాష్ట్రీయముల పార్లిమెంటు సమితి పార్లిమెంటువారికి తీర్మానించుటకొరకంపు విషయములు. అట్టి తీర్మాన మారాష్ట్రీయములకు వర్తించును.

౩౮. ఈ రాజ్యాంగ నిర్మాణ సమయమునాటికి బ్రిటీషు పార్లిమెంటువారు గాని, ఆస్ట్రేలియా కవున్సిలు మాత్రమె గాని చలాయించుట కధికారము కలిగిన విషయములను గూర్చి రాష్ట్రీయులకోరికపైన గాని, అంగీకారముతో గాని సమితి దేశమున చలాయించుట.

౩౯. ఈ రాజ్యాంగమువలన పార్లిమెంటుకు సమితి ప్రభుత్వమునకు నొసగబడిన అధికారములు అమలు జరిగించుటకు వలసిన అధికారములు.

౫౨ వ శెక్షను:—సమితిలో నిశాంతికి క్రమ పరిపాలనమునకు, సత్ప్రభుత్వమునకు నీక్రింది విషయములను గూర్చిన శాసనములను జేయుటకు పార్లిమెంటునకు మాత్రమె సంపూర్ణాధికారము కలదు:

(౧) సమితి ప్రభుత్వముయొక్క కేంద్రస్థానము నిర్ణయించుట, సమితి ప్రభుత్వమువారు వశముచేసికొనిన ప్రదేశములు.

(౨) ఈ రాజ్యాంగమువలన సమితి ప్రభుత్వ కార్యనిర్వాహకవర్గమువారి యధికారము క్రింద నుంచబడిన పరిపాలన శాఖలోని ఉద్యోగులను గూర్చిన విషయములు.


(౩) ఈరాజ్యాంగమువలనపార్లిమెంటుకు ప్రత్యేకాధికారము కలదని నిర్ణయింపబడిన ఇతరవిషయములు.

పురాణగాయకుఁడు


బుద్ధవరపు నాగరాజుగారు

యౌవనోజ్జ్వలశుభవసంతాగమముల
నెంతిపాడిన నతని గొంతెండలేదు
జీరవోలేదు; బడలిక చెందలేదు
వాడలేదు మాధుర్యమ్ము వీడలేదు.
చివురులను మెక్కి యెలగొంతు చేవదేర్చి
పికము లపుడె వసంతగీతికలు పాడె
తెటివిరిదేనెఁ దనగొంతు తీపిజేసె
వెల్లివిరిసెను సెలయేట విరులపాట.
అతనిపాటలఁ బారవశ్యమ్మునంది
తరులు గిరులును జడగళత్వమ్ము విడిచి
స్తోత్ర మొనరింప, చిరునవ్వుతో నతండు
ప్రాఁతపాటలె పెక్కేండ్లు పాడినాఁడు.
ఇప్పు డామని తెఱలిపోయినది, నాఁటి
యళుల ఝుంకారములు మాయమయ్యె మూఁగ [X
వడెనో; కోయిలగొంతు నవ్వడియె లేదు
నిదురవోయెనో; సెలయేరు రొదలు మరచె.
నేఁ డతఁడు చాల ముసలియైనాఁడు, పూర్వ
కాలములయందు, నుత్సాహ కలన మీర
పాడి మించిన కంఠ మీ నాఁడ దేమొ
విడనె విడదాయె శాపమ్ము వెట్టినట్లు.
గొనుగువడి గొంతుపస యడంగిన కొలంది
పాటపై నాతనికి కోర్కె ప్రబలిపోయె
వడకినను గొంతు బీటలు వాఱుచున్న
పాడ నుంకించుఁ దుదిశుగార్పువర కతండు.
అతఁడు తీఱిచి దిద్దిన యట్టివారె
యతని త్రోవలఁ బోరిపు, దైనవాని
నాలకించి మహాహ్లాద మంది యతఁడు
ప్రాఁత క్రొత్తకుఁ జోటీయవలయు నను.

వోట్లకొరకు ప్రయత్నం



వోటర్లు, అభ్యర్థులు



రౌండుటేబిల్ ఫెడరల్ విధానము

శంకర వేంకటరావుగారు

లండను నగరమున గూడిన రౌండుటేబిలు సభవారు గావించిన సభాఫలితముగా ప్రధానమంత్రి వాగ్దత్తమొనర్చిన ఫెడరల్ విధానమునుగూర్చి సంశయము లొదవుటచే, వారీయదలంచిన ఫెడరల్ విధాన మెంతవఱకీ దేశమున కుపకరించుననువిషయము విచారింపవలసి వచ్చినది. ఆకారణమున నేనీ విషయమునుగూర్చి యీ వ్యాసమును వ్రాయదలంచితిని.

ఫెడరల్ విధానమున రాష్ట్రప్రభుత్వములకును, కేంద్రప్రభుత్వమునకును సంపూర్ణ స్వాతంత్ర్య మొసంగినం గాని మనదేశమున కనుగుణ్యము కాదనునది మొదటియంశము. ఈ యంశమును సమన్వయదృష్టితో దిలకించి ప్రధానమంత్రిగా రెంతవఱ కీయదలంచిరో వివరింతము. రాష్ట్రములకు సంపూర్ణస్వాతంత్ర్య మిచ్చెదమని వారు చెప్పిరి. కాని వీటో (Veto) చేయుటకు గల సంపూర్ణాధికారమును, పరిపాలనా విధానమును, అల్పసంఖ్యాకుల విషయమును గవర్నరు హస్తగతము గావించిరి. ఈ యధికారమును సంపూర్ణముగ గవర్నరు కిచ్చుటకు కారణ మేమి యని యడుగ నితర కేంద్రప్రభుత్వములయం దీ స్వాతంత్ర్యములు కలవని చెప్పుచున్నారు. ఇతర అధినివేశ స్వాతంత్ర్య దేశములలో గవర్నరు ప్రజానియోజితుడు; ఇచ్చట ప్రభుత్వనియోజితుడు. ఆకారణమున యీ యధికారములు ప్రభుత్వనియోజితుడగు గవర్నరుచేతియం దుండుట కన్న ప్రజానియోజితములగు శాసన సభాధికారమునకు లోబడియుండినను, లేక గవర్నరు ప్రజానియోజితుడుగ నున్నను బాగుండును. అప్పుడు గాని, సంపూర్ణస్వాతంత్ర్యము రాష్ట్రములకు చేకూరదు. అల్పసంఖ్యాకుల రక్షణ మొకటి యున్నది గదా యన్న, సర్వవిషయమున ప్రజలతో సంప్రతించినం గాని రక్షణ విధానము చేపట్టుటకు వీలు లేదు.

ఇక కేంద్రప్రభుత్వ స్వాతంత్ర్యమును గూర్చి యోజింతము. అధికారము లన్నియు ప్రజానియోజితుల కిచ్చినారా లేదా యనునది శంక. విదేశరాజ్యాంగ విధానము (Foreign Affairs) లం దేమి, సైనికపరిపాలనము (Military Affairs) నం దేమి, సంస్థానముల (States) విషయమునం దేమి, కల స్వాతంత్ర్యమును పూర్తిగ తామే యుంచుకొనిరి. రాజకీయ దృక్పథము ననుసరించి యీ విషయములలో వారే స్వాతంత్ర్యము వహించినను మున్ముందు భారత శాసనసభాధికారమునకు లోబడి యుండినం గాని కేంద్రమున స్వాతంత్ర్య ముండదు. కాలనిర్ణయ మొనర్చి యీ యధికారములు ప్రస్తుతము తమచేతిలో బెట్టుకొనవచ్చును, గాని, యింతకాలమువఱకే మేము వశమొనర్చికొందుమని చెప్పక తమచేతిలో

పెట్టుకొనుటవలన ప్రజాభీష్టము నెఱవేఱదు. ఇవి గాక, వర్తకము, వ్యవసాయము, పరిశ్రమలు, మారకము (Exchange) మొదలగువాని యందును ప్రజల జోక్యము లేకుండ పోవక, మన మంత్రులకు నిర్ణయాధికారము లుండవలెను. ఇవి లేకున్న దేశముయొక్క యార్థికాభివృద్ధి కేమాత్రము నవకాశ ముండ దని తలంప వచ్చును.

ఇక శాసనసభలలో ప్రజా ప్రాతినిధ్య మెంతవఱ కుండు నని విచారింపవలయును. నిర్ణీత సంఖ్యయందున నైదువంతులలో రెండు వంతులు సంస్థానములనుండి వచ్చిన ప్రతినిధు లుందురట! సంస్థానప్రతినిధు లనగా సంస్థానాధీశు లెన్నుకొనిన ప్రతినిధులు గాని సంస్థాన ప్రజ లెన్నికొనినవారు కారు. సంస్థానాధీశులు ప్రతినిధుల నెన్నికొనునపుడు సరియైన ప్రాతినిధ్యము లభించునా లభించదా యనునదియు, ఆ ప్రతినిధులు సంస్థానములందలి ప్రజాభిప్రాయముల సాధకబాధకముల నివేదింపగలవారా యనునదియు ననుమానాస్పదములు. అదియుం గాక, సంస్థాన ప్రజలయొక్కయు, సంస్థానముల యొక్కయు భాగోగులు: భారత శాసనసభ చర్చింప నవకాశము లేకపోవుట విమర్శింపవలసి యున్నది. ఇది యెంతయు హాస్యాస్పదము. సంస్థానములకు సంపూర్ణ స్వాతంత్ర్య ముండి, కేంద్రమునను, రాష్ట్రము లందును సంపూర్ణస్వాతంత్ర్య మున్నప్పుడే భారతదేశము సంయుక్తరాష్ట్ర మనిపించుకొనుటకును, అధినివేశ ప్రతిపత్తి యున్న దేశములతో పాటు తల యెత్తి తిరుగుటకును అవకాశ మున్నది కాని లేకున్న సంస్థానములను కేంద్రప్రభుత్వముక్రింద చేర్చుటవలన విశేష ప్రయోజనము గాన్పింపదు. మరియు సంస్థాన ప్రతినిధులు మాత్రము బ్రిటిషు ఇండియాకు సంబంధించిన కొన్ని విషయములలో, అనగా మంత్రివర్గమునందలి విశ్వాస రాహిత్యము (No-Confidence) మొదలగు తీర్మానములను గావించుపట్టున, వోటుచేయు నధికారము కలిగి యుందురట! ఇది కేవల మసందర్భము. అందుచేత అఖిలభారత దేశవిషయములలో తప్ప సంస్థానప్రతినిధులు తక్కిన బ్రిటిషుయిండియా విషయములలో వోటుచేయుట కధికారము లేకుండజేయుట సమంజసము. ఇక కేంద్రప్రభుత్వమున మంత్రులవిషయమై రాజప్రతినిధి కిచ్చిన యధికారము లసాధారణములైనవి. మంత్రుల నియమించుపట్టున నిజముగా సర్వాధికారము రాజప్రతినిధికే యున్నందున రాజప్రతినిధి కనుసన్నలలో మెలంగువారే మంత్రులుగ నుండు రనుటకు సందియము లేదు. మంత్రులను తొలగించువిషయమున రాజప్రతినిధికి పూర్తియగు నధికారము కలదు. కాని యీవిషయమున శాసనసభయందున్న సభ్యులలో మూడింట రెండువంతుల వారు అంగీకరించిననే గాని శాసనసభకు మంత్రుల తొలగించుటకు వీలు లేదట! శాసనసభయందు గల నిర్ణీతసంఖ్యయందు సంస్థాన ప్రతినిధులు, ప్రత్యేక సంఘప్రతినిధులు, అల్ప సంఖ్యాకుల ప్రతినిధులు, ప్రభుత్వనియోజితులు

సభకు (House of Representatives) రాష్ట్రములలోని జనసంఖ్యనుబట్టి సభ్యుల నంపుదురు. ఎంత తక్కువ జనసంఖ్య యున్నను ౫ గురుకన్న తక్కువ సభ్యులను పంపరు. ఈ రెండు శాసనసభలకును అధ్యక్షుల నెన్నుకొందురు. సభ్యుల కెల్లరకు సాలుకు నాలుగు వందలపౌనుల వేతన మీయబడును. ప్రభుత్వాదాయము యొక్క వ్యయవిధానమునకు గవర్నరు జనరలు తన అంగీకారము నొసగవలయును. శాసనసభల కభిప్రాయ భేదములు కలిగినప్పుడు చేయవలసిన కర్తవ్యముకూడ రాజ్యాంగచట్టమున నిర్ణయింపబడినది. చట్టములెల్ల సార్వభౌముని అంగీకారము బడయవలయునను నియమము కలదు.

పరిపాలనాధికారము (Executive Power) గవర్నరుజనరలును, అతనికి సహాయముగ నుండు పరిపాలక సభయు (ఎక్జిక్యూటివు కవున్సిలు) నిర్వహింతురు. అందలి సభ్యులను గవర్నరు జనరలే నియమించును: సైనిక నావికదళము లతని అధికారముక్రింద నుండును. సమితి మంత్రుల నతడే నియమించును. మంత్రు లెల్లరు పరిపాలకసభలో సభ్యులుగ నుందురు. ఈమంత్రులు శాసనసభలో సభ్యులుగ నుండియుండవలెను లేనిచో; గవర్నరు జనరలు నియమించినది మొదలు 3 నెలలలో సభ్యత్వము సంపాదించుకొనవలయును.

న్యాయపరిపాలనాధికారము హైకోర్టునందును ఇతర సమితి న్యాయస్థానములందును కలదు. తక్కిన సమితి న్యాయస్థానములపైనను, రాష్ట్రీయ సుప్రీము కోర్టులపైనను ఉపర్యభియోగము (అప్పీలు) హైకోర్టుకు చేయుదురు. సమితిపార్లిమెంటువారు చేసిన శాసనములనుగూర్చిన వ్యాజ్యములను, ఒక రాష్ట్రమున కింకొక రాష్ట్రమునకును గలుగు వ్యాజ్యములను పరదేశ ప్రతినిధులకు సంబంధించిన వ్యాజ్యములను పరిష్కరించు నధికారము హైకోర్టుకే కలదు. హైకోర్టు తీర్పులపైన ప్రీవీకవున్సిలు సభాయుతుడగు బ్రిటీషు సార్వభౌమునికి అప్పీలు చేయదగిన విశేష విషయములును నిర్ణయింపబడినవి.

రాష్ట్రముల పరిపాలనక్రిందినుండి సమితి పరిపాలనక్రిందికి మార్పు చెందు మధ్యకాలమున ఆర్థిక వ్యాపార పద్ధతులందు నష్టము సంభవించకుండగ కొన్ని కట్టుదిట్టములు రాజ్యాంగచట్టమునందే చేయబడెను. రాజ్యాంగ విధానమునందు మార్పు లేమైన గావలసినచో అట్టి మార్పులకు రాష్ట్రములు లోబడి అందలి ప్రజలు అంగీకరించినచో, అట్టిమార్పులు చేయుటకు సదుపాయములు రాజ్యాంగచట్టమున నిర్ణయింపబడెను.

అనుబంధము

ఆస్ట్రేలియా రాజ్యాంగవిధానము నిర్ణయింపబడిన ఆస్ట్రేలియా కామన్వెల్తు ఆక్టు ౫౧, ౫౨ సెక్షనులలో సమితి పార్లిమెంటుయొక్క అధికారములు పేర్కొనబడినవి.

౫౧వ సెక్షను:— ఈ రాజ్యాంగమునకు లోబడి సమితి 'పార్లిమెంటు' సమితియొక్క శాంతికి, క్రమపరిపాలనకు, సత్ప్రభుత్వమునకు వలయునట్లు ఈ క్రింది విషయములనుగూర్చి శాసనముల చేయుట కధికారముకలదు:

౧. వర్తకము ఇతర దేశములకును సమితికిని సమితిలోని రాష్ట్రములలో నొకదానికింకొకదానితోను గల వ్యాపారము.

౨. రాష్ట్రములందు గాని రాష్ట్రభాగములందు గాని పక్షపాతబుద్ధి లేకుండ సమితికి కావలసిన పన్నులు విధించుట.

3. పంటలుగాని ఎగుమతులుగాని ప్రోత్సహించుటకు బహుమానముల నిచ్చుట. ఇందు సమితిలోని వివిధభాగములలో హెచ్చుతగ్గు లుండరాదు.

౪. సమితియొక్క పరపతిపైన ఋణములు చేయుట.

౫. తపాలా, తంతివార్తలు, తంతిసంభాషణలు మున్నగు వ్యవహారములు.

౬. నావిక సైనిక వ్యవస్థలు, సమితియొక్కయు, వివిధరాష్ట్రములయొక్కయు సంరక్షణము, సమితియొక్క

శాసనములను నిర్వర్తించుటకు, అమలుచేయుటకు బలము లను వడయుట.

౭. దీపస్తంభములు, దీపపుటోడలు, సముద్ర మార్గదర్శక దీపములు, ప్లవములు (buoys).

౮. ఖగోళవాతావరణ పరిస్థితులనుగూర్చిన వ్యవహారములు.

౯. "క్వారంటైన్" అంటురోగము లున్నవని అనుమాన మున్నచో ఓడలను రేవులలో నిరోధించి యుంచుట.

౧౦. ఆస్ట్రేలియా ద్వీపముయొక్క సముద్రతీరమునకు మూడుమైళ్లదూరమున చేపలు పట్టు వర్తకమును గూర్చిన విషయములు.

౧౧. జనాభా ప్రజల స్థితిగతులను గూర్చిన వృత్తాంతము అంకెలు (statisties).

౧౨. చెలామణి, నాణెములు, సామాన్య చెలామణి,—అనగా దేశవ్యవహారమందు చెలామణియగునట్లు ప్రభుత్వమువారు నిర్ణయించుద్రవ్యము.

౧౩. రాష్ట్రీయ బ్యాంకులు గాక ఇతర బ్యాంకి వ్యవహారములు, రాష్ట్రముల పరిహద్దులు మీరి వ్యవహరించు బ్యాంకులు, బ్యాంకులను రిజిస్టరు చేయుట (Incorporation), కాగితపు ద్రవ్యములను ప్రచురించుట.

౧౪. రాష్ట్రీయ భీమావ్యాపారము గాక ఇతర భీమా వ్యాపారము.

౧౫. తూనికరాళ్లు, కొలపాత్రములు.

౧౬. హుండీలు, ప్రామిసరీ నోట్లు.

౧౭. దివాలా.

౧౮. కాపీరైటు హక్కులు, పరిశోధనలందలి హక్కులు, క్రొత్తవస్తువుల స్వరూపస్వభావములందు "పేటెంటు" స్వామ్యములను నిర్ణయించుట.

౧౯. పరదేశీయులు వారికి పౌరస్వత్వముల నొసగు నధికారము.

౨౦. పరదేశీయులయొక్క కంపెనీలు, సమితి హద్దులలో వ్యాపారమును గూర్చి కాని, ఆర్థికవిషయములనుగూర్చి కాని స్థాపింపబడుసంఘములు.

౨౧. వివాహములు.

౨౨. వివాహబంధవిచ్ఛేదనము(Divorce), దానిని గూర్చిన వ్యాజ్యములు, తల్లిదండ్రులహక్కులు, మైనరుల సంరక్షణమునుగూర్చిన హక్కులు.

౨౩. ఆపదలు కలిగినవారికి గాని, ముదుసలివారికి గాని ఉపకారవేతనము లొసగుట.

౨౪. రాష్ట్రములయొక్క సివిలు క్రిమినలు న్యాయస్థానములతీర్పులను సమితిహద్దులలో అమలుజరిగించుట, వానిఉత్తరువులను జారీచేయుట.

౨౫. రాష్ట్రముల శాసనములు, వాని ప్రభుత్వ తీర్మానములు, కార్యములు, నిదస్తావేజులు, న్యాయస్థానములతీర్పులను సమితిహద్దులలో చెల్లగౌరవింపజేయుట

౨౬. రాష్ట్రములలోని ఆదిమవాసులనుగూర్చి గాక ఇతరజాతులవారి యోగక్షేమములకు వలసిన శాసనములను చేయుట.

౨౭. వలసపోవువారిని గూర్చిన విషయములు, వలసవచ్చువారిని గూర్చిన విషయములు.

౨౮. ఖైదీల సంఖ్యనుగూర్చియు, అభివృద్ధిని గూర్చియు విచారించుట.

౨౯. పరదేశములతోడి వ్యవహారములు.

౩౦. పసిఫిక మహాసముద్రమునగల ఇతరద్వీపములతోడి వ్యవహారములు.

౩౧. రాష్ట్రముల ప్రభుత్వముల దగ్గరనుండి కాని, దేశములోని ప్రజలవలన గాని, పార్లమెంటువారికి శాసనము చేయుట కధికారము గల పనికొరకు, ఆస్తిని వశము చేసికొనుట (Acquisition of Property).

౩౨. సమితియొక్క నావికదళమునుగాని, సైనికదళమును గాని పంపుచుండుటకు సమితిలోని రైళ్లపై నధికారము.

౩౩. రాష్ట్రీయులలోని రైలుదారి యవసరమైనచో నారాష్ట్రీయులతో ఏర్పాటుచేసికొని దానిని వశము చేసికొనుట.

౩౪. ఆయారాష్ట్రీయుల యంగీకారముతో రైలుదారిని వృద్ధిచేయుట.

౩౫. రాష్ట్రీయుల పరిహద్దు దాటి వ్యాపారములను చేయువారి తగవులను తీర్మానించుట, రాశీలకు మధ్యస్థులను నియమించుట.

౩౬. పార్లిమెంటువారు మార్చివేయునర కీ రాజ్యాంగచట్టము నిర్ణయించిన అన్ని విషయములందు సమితి పార్లిమెంటు కధికారము కలదు.

౩౭. రాష్ట్రీయుల పార్లిమెంటు సమితి పార్లిమెంటువారికి తీర్మానించుటకొరకంపు విషయములు. ఆట్టి తీర్మాన మారాష్ట్రీయులకు వర్తించును.

౩౮. ఈ రాజ్యాంగ నిర్మాణ సమయము నాటికి బ్రిటీషు పార్లిమెంటువారు గాని, ఆస్ట్రేలియా కవున్సిలు మాత్రమె గాని చలాయించుట కధికారము కలిగిన విషయములను గూర్చి రాష్ట్రీయులకోరికపైన గాని, అంగీకారముతో గాని సమితి దేశమున చలాయించుట.

౩౯. ఈ రాజ్యాంగమువలన పార్లిమెంటుకు సమితి ప్రభుత్వమునకు నొసగబడిన అధికారములు అమలు జరిగించుటకు వలసిన అధికారములు.

౫౦ వ శెక్షను:—సమితిలో నిశాంతికి క్రమ పరిపాలనమునకు, సత్ప్రభుత్వమునకు నీక్రింది విషయములను గూర్చిన శాసనములను జేయుటకు పార్లిమెంటునకు మాత్రమె సంపూర్ణాధికారము కలదు:

(౧) సమితి ప్రభుత్వముయొక్క కేంద్రస్థానము నిర్ణయించుట, సమితి ప్రభుత్వమువారు వశముచేసికొనిన ప్రదేశములు.

(౨) ఈ రాజ్యాంగమువలన సమితి ప్రభుత్వ కార్యనిర్వాహకవర్గమువారి యధికారము క్రింద నుంచబడిన పరిపాలన శాఖలోని ఉద్యోగులను గూర్చిన విషయములు.

(౩) ఈరాజ్యాంగమువలనపార్లిమెంటుకు ప్రత్యేకాధికారము కలదని నిర్ణయింపబడిన ఇతరవిషయములు.

పురాణగాయకుఁడు

బుద్ధవరపు నాగరాజుగారు

యౌవనోజ్జ్వలశుభవసంతాగమముల
నెంతిపాడిన నతని గొంతెండలేదు
జీరవోలేదు; బడలిక చెందలేదు
వాడలేదు మాధుర్యమ్ము వీడలేదు.

చివురులను మెక్కి యెలగొంతు చేవదేర్చి
పికము లపుడె వసంతగీతికలు పాడె
తెటివిరిదేనెఁ దనగొంతు తీపు జేసె
వెల్లివిరిసెను సెలయేట విరులపాట.

అతనిపాటలఁ బారవశ్యమ్మునంది
తరులు గిరులును జడగళత్వమ్ము విడిచి
స్తోత్ర మొనరింప, చిరునవ్వుతో నతండు
ప్రాఁతపాటలె పెక్కేండ్లు పాడినాఁడు.


ఇప్పు డామని తెఱలిపోయినది, నాఁటి [౪
యళుల ఝుంకారములు మాయమయ్యె మూఁగ
వడెనో; కోయిలగొంతు సవ్వడియె లేదు
నిదురవోయెనో; సెలయేరు రొదలు మరచె.

నేఁ డతఁడు చాల ముసలివైనాఁడు, పూర్వ
కాలములయందు, నుత్సాహ కలన మీర
పాడి మించిన కంఠ మీనాఁడదేమొ
విడనె విడదాయె శాపమ్ము పెట్టినట్లు.


గొనుగువడి గొంతుపన యడంగిన కొలంది
పాటపై నాతనికి కోర్కె ప్రబలిపోయె
వడకినను గొంతు బీటలు వాఱుచున్న
పాడ నుంకించుఁ దుదిముహూర్తవర కతండు.

అతఁడు తీటిచి దిద్దిన యట్టివారె
యతని త్రోవలఁ బోరిపు, దైనవాని
నాలకించి మహాహ్లాద మంది యతఁడు
ప్రాఁత క్రొత్తకుఁ జోటీయవలయు ననును.

వోట్లకొరకు ప్రయత్నం



వోటర్లు, అభ్యర్థులు



రౌండుటేబిల్ ఫెడరల్ విధానము

శంకర వేంకటరావుగారు

లండను నగరమున గూడిన రౌండుటేబిలు సభవారు గావించిన సభాఫలితముగా ప్రధానమంత్రి వాగ్దత్తమొసర్చిన ఫెడరల్ విధానమునుగూర్చి సంశయము లోదవుటచే, వారీయదలంచిన ఫెడరల్ విధాన మెంతవఱకీ దేశమున కుపకరించుననువిషయము విచారింపవలసి వచ్చినది. ఆకారణమున నే నీ విషయమునుగూర్చి యీ వ్యాసమును వ్రాయదలంచితిని.

ఫెడరల్ విధానమున రాష్ట్రప్రభుత్వమునకును, కేంద్రప్రభుత్వమునకును సంపూర్ణ స్వాతంత్ర్య మొసంగినం గాని మన దేశమున కనుగుణ్యము కాదనునది మొదటియంశము. ఈ యంశమును సమన్వయదృష్టితో దిలకించి ప్రధానమంత్రిగా రెంతవఱ కీయదలంచిరో వివరింతము. రాష్ట్రములకు సంపూర్ణస్వాతంత్ర్య మిచ్చెదమని వారు చెప్పిరి. కాని వీటో (Veto) చేయుటకు గల సంపూర్ణాధికారమును, పరిపాలనా విధానమును, అల్పసంఖ్యాకుల విషయమును గవర్నరు హస్తగతము గావించిరి. ఈ యధికారమును సంపూర్ణముగ గవర్నరు కిచ్చుటకు కారణ మేమి యని యడుగ నితర కేంద్రప్రభుత్వములయం దీ స్వాతంత్ర్యములు కలవని చెప్పుచున్నారు. ఇతర అధినివేశ స్వాతంత్ర్య దేశములలో గవర్నరు ప్రజానియోజితుడు; ఇచ్చట ప్రభుత్వనియోజితుడు. అకారణమున యీ యధికారములు ప్రభుత్వనియోజితుడగు గవర్నరుచేతియం దుండుటకన్న ప్రజానియోజితములగు శాసన సభాధికారమునకు లోబడియుండినను, లేక గవర్నరు ప్రజానియోజితుడుగ నున్నను బాగుండును. అప్పుడు గాని, సంపూర్ణస్వాతంత్ర్యము రాష్ట్రములకు జేకూరదు. అల్పసంఖ్యాకుల రక్షణ మొకటి యున్నది గదా యన్న, తద్విషయమున ప్రజలతో సంప్రతించినం గాని రక్షణ విధానము చేపట్టుటకు వీలు లేదు.

ఇక కేంద్రప్రభుత్వ స్వాతంత్ర్యమును గూర్చి యోజింతము. అధికారము లన్నియు ప్రజానియోజితుల కిచ్చినారా లేదా యనునది శంక. విదేశరాజ్యాంగ విధానము (Foreign Affairs) లం దేమి, సైనికపరిపాలనము (Military Affairs) నం దేమి, సంస్థానముల (States) విషయమునం దేమి, కల స్వాతంత్ర్యమును పూర్తిగ తామే యుంచుకొనిరి. రాజకీయ దృక్పథము ననుసరించి యీ విషయములలో వారే స్వాతంత్ర్యము వహించినను మున్ముందు భారత శాసనసభాధికారమునకు లోబడి యుండినం గాని కేంద్రమున స్వాతంత్ర్య ముండదు. కాలనిర్ణయ మొసర్చి యీ యధికారములు ప్రస్తుతము తమచేతిలో బెట్టుకొనవచ్చును, గాని, యింతకాలమువఱకే మేము వశమొనర్చి కొందుమని చెప్పక తమచేతిలో

బెట్టుకొనుటవలన ప్రజాభీష్టము నెఱవేఱదు. ఇవి గాక, వర్తకము, వ్యవసాయము, పరిశ్రమలు, మారకము (Exchange) మొదలగువాని యందును ప్రజల జోక్యము లేకుండ పోవక, మన మంత్రులకు నిర్ణయాధికారము లుండవలెను. ఇవి లేకున్న దేశముయొక్క యార్థికాభివృద్ధి కేమాత్రము నవకాశ ముండ దని తలంప వచ్చును.

ఇక శాసనసభలలో ప్రజా ప్రాతినిధ్య మెంతవఱ కుండు నని విచారింపవలయును. నిర్ణీత సంఖ్యయందున నైదువంతులలో రెండు వంతులు సంస్థానములనుండి వచ్చిన ప్రతినిధు లుందురట! సంస్థానప్రతినిధు లనగా సంస్థానాధీశు లెన్నుకొనిన ప్రతినిధులు గాని సంస్థాన ప్రజ లెన్నుకొనినవారు కారు. సంస్థానాధీశులు ప్రతినిధుల నెన్నుకొనునపుడు సరియైన ప్రాతినిధ్యము లభించునా లభించదా యనునదియు, ఆ ప్రతినిధులు సంస్థానములందలి ప్రజాభిప్రాయముల సాధకబాధకముల నివేదింపగలవారా యనునదియు ననుమానాస్పదములు. అది యుం గాక, సంస్థాన ప్రజలయొక్కయు, సంస్థానముల యొక్కయు బాగోగులు: భారత శాసనసభ చర్చింప నవకాశము లేకపోవుట విమర్శింపవలసి యున్నది. ఇది యెంతయు హాస్యాస్పదము. సంస్థానములకు సంపూర్ణ స్వాతంత్ర్య ముండి, కేంద్రమునను, రాష్ట్రము లందును సంపూర్ణస్వాతంత్ర్య మున్నప్పుడే భారతదేశము సంయుక్తరాష్ట్ర మనిపించుకొనుటకును, అధినివేశ ప్రతిపత్తి యున్న దేశములతో పాటు తల యెత్తి తిరుగుటకును అవకాశ మున్నది కాని లేకున్న సంస్థానములను కేంద్రప్రభుత్వముక్రింద చేర్చుటవలన విశేష ప్రయోజనము గాన్పింపదు. మరియు సంస్థాన ప్రతినిధులు మాత్రము బ్రిటిషు ఇండియాకు సంబంధించిన కొన్ని విషయములలో, అనగా మంత్రివర్గమునందలి విశ్వాస రాహిత్యము (No-Confidence) మొదలగు తీర్మానములను గావించుపట్టున, వోటుచేయు నధికారము కలిగి యుందురట! ఇది కేవల మసందర్భము. అందుచేత అఖిలభారత దేశవిషయములలో తప్ప సంస్థానప్రతినిధులు తక్కిన బ్రిటిషుయిండియా విషయములలో వోటుచేయుట కధికారము లేకుండ జేయుట సమంజసము. ఇక కేంద్రప్రభుత్వమున మంత్రులవిషయమై రాజప్రతినిధి కిచ్చిన యధికారము లసాధారణములైనవి. మంత్రుల నియమించుపట్టున నిజముగా సర్వాధికారము రాజప్రతినిధికే యున్నందున రాజప్రతినిధి కనుసన్నలలో మెలంగువారే మంత్రులుగ నుందు రనుటకు సందియము లేదు. మంత్రులను తొలగించువిషయమున రాజప్రతినిధికి పూర్తియగు నధికారము కలదు. కాని యీవిషయమున శాసనసభయందున్న సభ్యులలో మూడింట రెండువంతుల వారు అంగీకరించిననే గాని శాసనసభకు మంత్రుల తొలగించుటకు పీలు లేదట! శాసనసభయందు గల నిర్ణీతసంఖ్యయందు సంస్థాన ప్రతినిధులు, ప్రత్యేక సంఘప్రతినిధులు, అల్పసంఖ్యాకుల ప్రతినిధులు, ప్రభుత్వనియోజితులు

ప్రభుత్వమువారికి తప్పనిసరిగా లొంగియుండకతీరని తదితర ప్రతినిధులును పోను, సుమారు ఐదవవంతుమాత్రము ప్రజాప్రతినిధు లుందురు. పైప్రాతినిధ్యము ననుసరించి మంత్రుల తొలగించువిషయమున మూడింట రెండువంతుల సభ్యు లంగీకరించుట దుర్ఘటము. ఒకవేళ పొసగినను, రాజప్రతినిధికి విటోయధికార ముండుట వలన మంత్రులను తొలగించువిషయమున, తన కిష్టముగుచో వీలు లేకుండ చేయుటకు తనకు సర్వాధికారము కలదు. దీనినిబట్టి మంత్రులను నియమించుట, తొలగించుట యను విషయములలో నధికారమంతయు రాజప్రతినిధికే గాని శాసనసభకు లేనట్లు కనుపించుచున్నది. ఈ కారణములనుబట్టి మంత్రులు రాజప్రతినిధి చెప్పినట్లు నడచుచు నెల్లప్పుడుగాకపోయినను, కొన్నిసమయములందైనను ప్రజాభిప్రాయమునకు వ్యతిరేకముగా వర్తింపక తప్పదు.

కావున ప్రధానమంత్రిగారు ప్రసాదింపదలచిన ఫెడరల్‌విధానమునందు కేంద్రప్రభుత్వాధికారము వట్టి బూటకమని కొందరనుకొనుట కవకాశ మున్నది. నామమాత్రముగనున్న యీ యధికారములవలన నిజమైన స్వాతంత్ర్యము కేంద్రమునకు లభింపలేదనియు, నిజమైన స్వాతంత్ర్యములేని ఫెడరల్ విధానము కొరవేరదనియు వా రభిప్రాయపడుచున్నారు. కనుక నిట్టితరుణముననైనను ప్రభుత్వమువారు దీర్ఘముగ నాలోచించి భారతప్రజాసామాన్యాభిప్రాయముల ననుసరించి ఫెడరల్ విధానమునందు అవసరమగు మార్పుల నొనరించుట ముఖ్యకర్తవ్యమని స్పష్టపడుచున్నది.

---

8. 4- 20 ఒ౫౩

నెమిలి నెలంత

జి. జాషువగారు

౧

తలపైఁ గల్కితురాయి, కంఠమున నిద్దాతళుక్కుఁ గ్రొమ్మెల్కఁ ప
చ్చలహారంబు ధరించి, కౌతుకవిలాసం బొప్ప వాల్గంటి తె
ప్పల నానందము చింద, నర్తితనిజ ప్రాణేశ్వరుం జూచు నె
మ్మిలరాణీ, యిటుచూడవే, సుతశతంబుల్ నీకు, నీభర్తకున్.

౨

పొన్నం గన్నులు నెత్తి కెక్కఁ, గులికింపుంగంఠగర్వంబునన్
నిన్ను న్నీ చెలికత్తెలం బ్రణయకంధి న్ముంచి తేలింప నీ
సాన్నిధ్యంబున నాట్యమాడు పతిపజ్జం బారవశ్యంబునన్
గన్నుల్ మోడ్తువు నిచ్చలు న్నెమిలిచానా! యెంతపుణ్యాత్మవో.

౩

కోరినపాఁపటో గిరముఁ గూరిచి, నీమది పల్లవింపఁ జి
న్నారి మనోజ్ఞషడ్జమ నినాదముల న్నినుఁ బుజ్జగించు, బం
గారపుఁ గంటికుల్కులమగండు, మహేంద్రుని యంతవాఁడు, నీ
చేరువ నాడెడి న్నెమిలిచేడియ! నీకుఁ గొఱంత కల్గునే?

౪

ఉరు ముతిమెం దళుక్కు మరుచున్నది మించను మోనకత్తె, యం
బరమున మబ్బు తేలినవి, మంజులకేంకృతు లొప్ప నీమనో
హరుఁ డురుపింఛదీధితుల నారతు లీయఁ దొడంగెఁ గేకిసుం
దరి! పాదరింఢ్లతీవెపరదాల మఱుంగున జెంగలింపవే!

౫

భర్త హారాంబట్టుజిలుఁగుటంబరముఁ దాల్చి - విపినవీథులలోఁ దాండవింపుమంచుఁ
జేరువను నిల్చి, మాసినచీరఁ గట్టి-మురిసికొనుపతివ్రతపు సుందరులలోన.

చేఁబడినది. నా రానాటకములో రెండుఘట్టములఁ దీయించుకొన్న నా యీ చిత్రము లేయిందుండు నవి. అందు మొదటిది సలీము తనపడకగదిలోఁ గూర్చుండి పంజరములోనున్న చిలుకను జూచి తనవిరహతాపమును వెలిఁబుచ్చునప్పటి ఘట్టము. రెండవది రాణీ యనార్కలీని గొరడాదెబ్బలఁ గొట్టింపఁ బంచెనని తెలిసినప్పుడు, దాసి సోఫియా యద్దుమాటల నాడుచుండ, సలీము కోపముతో నామెను జీదరించునప్పటి ఘట్టము.

వింజమూరి వేంకటలక్ష్మీనరసింహారావు.

తిరస్కృతి

వేంకట కాళిదాసకవులుగారు

నీటుగా దువ్వుకొనిన యీ నీలికురుల
సంపెగలు వాడిపోయిన సౌరభమ్ము;
లేఁత చెక్కిళ్ల మెడలోనఁ బూఁతవడిన
చందన మ్మెండిపోయిన సౌరభమ్ము.

నుదుటఁ దోఁచిన స్వేదబిందువుల చెలిమి
వలనఁ గరఁగుచుఁ జెరఁగిన తిలకరేఖ;
కన్ను రెప్పల యంచులు కలియు నెడల
నిలుచు సన్నని కాటుక నీలిరేఖ.

తొలివసంతపు లేఁజివురుల పొలుపులు
పూను పెదవుల విడని తాంబూలరక్తి;
సఖు లలంకరణమ్ముగాఁ జరణములకు
రమ్యముగఁ బూసినట్టి పారాణిరక్తి.

నీ తనూ విలసనము శయ్యా తలమున
మోహనము మన్మథుని చేతి పూవువోలె;
చెలియ, ప్రియు నింకఁ గనుఁగొమ్ము వలపుఁగ
మానమా ప్రేమ జీవ తాహ్వానములకు? [నుల;

నిరిగి నైల్యమ్ములోనుండి తొంగి తొంగి
చూచుచున్నవి జాలిగాఁ జుక్కలవిగొ
శ్యామలాలకములను-డి శయ్యమీఁదఁ
బ్రిదులు చున్నవి పూవుల రేకు లివిగొ!

పారవశ్యాన నా కరస్పర్శనమునఁ
బులకితమ్మగు నీతనువున మనోజ్ఞ
కోరకమ్ములు నిండునో, తారకమ్ము
లోరగా నోరగాఁ జూచునో, లతాంగి!

దూరపుంజూపునకు నవ్వ తోఁడునీడ
గా విరియఁజేయు నీ నవకంపుఁ బెదవి
నకట, లే దొక్క మృదుహాస శకలమైన
నీ రహస్యమాగమవేళ నేమొ కాని.

ఓరగా, రహస్యముగ, నన్యోన్యముగ, న
దృష్టముగ, నన్నుఁ జూచిన యున్ని చూపు
లేకరణి దాఁచితివి సుప్తి లేక మూఁత
వడిన తెలిగన్ను రెప్పల యడుగు నందు?

ఒక్కటొక్కటిగా వచ్చు నూరుపులకుఁ
బొలుపు లెడఁబాయు నీపెదవులు లతాంగి!
ముద్దుగా నొక చుంబన ముద్ర యిడుదు
ననిన, నటు త్రిప్పె దేల నీ యాననంబు?

మౌగ్ధ్యమో, ప్రగాఢత్రపా మధురిమమ్మొ,
నిర్మలప్రేమరూపమో, మర్మమెఱుఁగ
లేని హృదయవికాసనవీనభరమొ,
యీ తిరస్కారమున కర్థ మేమి చెలియ?

గోచరింపని నీడుసిగ్గు తెరలోన
దాఁచుకొన నెంతువో హృదంతరము బాల!
సంభ్రమితమైన నీ తిరస్కారమునకు
నిడుదునా కాన్కగా నాదు హృదయ మొకటె.

ఈ తిరస్కృతి ప్రేమరసాతిరేక
చిహ్నముగ, నూతనత్రపాశ్రీ శిరీష
పరిమళముగా, మధురముగ్ధ భావబింబ
ముగఁ, గనుంగొందునా చెలీ! * * *






సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారు
ఉపాధ్యాయులు, ఆంధ్ర విశ్వవిద్యాలయము.

కలగూరగంప

అదృశ్యకిరణము (Invisible Ray)



ఇది దొంగలను పట్టియిచ్చుటకు సాధన మగు నొక క్రొత్త యంత్రము. ప్రతిగదియందును ప్రతిద్వారమువద్దను ఇట్టి యంత్రముల నుంచదగును. ప్రధానయంత్రమున నొకమరను నొక్కినచో నిశ్శబ్దముగా భిన్న భిన్న స్థలములందున్న యీ యంత్రములనుండి కిరణములు వెలువడి ఇంట దొంగలుజొరబడుటను దెలుపుటయేకాక, వారెచ్చట జొరబడియున్నదియు తెలుపును. ఈయంత్రములకు విద్యుచ్ఛక్తిరాకుండ నెవరయిన నడ్డుపెట్టజూచినను, వెంటనే తెలియజేయును. ఈ యంత్రములు పర్షియను కళాప్రదర్శనమున రిజాఖాను పహ్లావీగారి అమూల్య సంపదను వేయికన్నుల కాపాడి ప్రసిద్ధి గాంచినవి.

(E. N. P. వారి ఫోటో)

శ్రీరంగపట్టణము

మైసూరు రాజ్యమునందున్న పట్టణములలో శ్రీరంగపట్టణము చరిత్రాత్మకముగ మిగుల ప్రాముఖ్యము వహించినది. 18వ శతాబ్దమునందు దీనిని ముఖ్యపట్టణముగా జేసుకొని హైదరాలీ, అతని అనంతరమున టిప్పుసుల్తాను రాజ్యపరిపాలన చేసియుండిరి. ఈపట్టణము కావేరీనదియం దేకద్వీపముపై కట్టబడినది. పట్టణము చుట్టును కావేరి త్రవ్వనికందకమై యొప్పారుచున్నది. టిప్పుసుల్తాను రాజ్యపరిపాలనమం దీపట్టణ మేడు ప్రాకారములతోను, అనేక హిందూదేవాలయములతోను, మహమ్మదీయమహలులతోను, ఉద్యానవనములతోను శోభాయమానమై మహదైశ్వర్యమును వహించియుండెను. కాని 1799 వ సంవత్సరములో ఇంగ్లీషువారికిని టిప్పుసుల్తానుకును జరిగిన యుద్ధములందు ఈ పట్టణపుగోడలు పగులగొట్టబడినవని ప్రసిద్ధి. ఇప్పటికిని ఇంగ్లీషువారు ఫిరంగీలు నిలిపినస్థలములును, పట్టణపు కోట గోడలలో ఫిరంగీగుండ్ల పాటువలన కలిగిన పగుళ్లును చూడనగును. ఒకప్పుడు రాజధానియై సకలసంపదల కాకరమైన పట్టణము నేడు కళావిహీనమై యొక చిన్నగ్రామముగ మారినది.

పట్టణపు ప్రాకారములకు వెలుపల కావేరీనది పాయ యొకటి యుత్తరవాహిని యను పేర ప్రవహించుచున్నది. ఇందూరిప్రజలకు స్నానపానాదుల కనుకూలమై యొప్పెడి ఘట్ట మొకటి కలదు. అచటి కనతిదూరముననే రైల్వేవారిచే నిర్మింపబడిన వంతెన యొకటి చూడనగును.

పట్టణ మెంత శిథిలమై యున్నను ప్రాకారములు, ద్వారములుమాత్రము చూపరులకు కొంత ఆనందాశ్చర్యజనకములు కాక మానవు. ప్రాకారము చుట్టు ప్రాకారము, ఈరీతి నగరు ప్రాకారసప్తకపరివేష్టితమై యుండెడిదని వాడుక. కాని ప్రస్తుతము మూడు ప్రాకారములు మాత్రము నిలిచియున్నవి. ప్రథమప్రాకారద్వారములు సుమారు 30 అడుగులయెత్తు, 20 అడుగుల వెడల్పు గలిగి, శిలానిర్మితములై మిగుల బలిష్ఠములై యున్నవి. సుమారు 200 సంవత్సరములక్రిందటనే శత్రువులదాడికి లోనయ్యును నేటివరకు నివి చెక్కుచెదరక యున్నవి.

ప్రాకారములు గడచినవెంటనే టిప్పుసుల్తానుచే నిర్మింపబడిన మసీదు గోచరమగును. అటువెనుక నొక శివాలయమును, దానికి కొలదిదూరముననే విష్ణ్వాలయమును, తదితర దేవాలయములును కలవు.


టిప్పుసుల్తాను మరణముతో శ్రీరంగపట్టణ వైభవముకూడ నంతమొందినది. కాని ప్రస్తుత మచటి భవనములను శిథిలముకాకుండ ప్రభుత్వమువారు కాపాడుచున్నారు. ఒకప్పుడు మహదౌన్నత్యైశ్వర్యములతో తులదూగిన పట్టణమగుటచే రాజభవనములు చూడదగియున్నవి. భవనమునకు ముందర ఉద్యానవనసంపత్తి నయనానందదాయకము కాకమానదు. భవనములో గల చిత్రశిల్పచాతుర్యము వ్రాయ నలవికాదు. టిప్పుసుల్తాను రాజ్యపాలనమందు జరిగిన యుద్ధములన్నియు వివిధములైన లాక్షావర్ణములతో భవనములోపలి కుడ్యముల (Palace interior walls) పై చిత్రింపబడియున్నవి. అయ్యవి పాడగనిదంతనే పురాతనచిత్రకళానైపుణ్యము చూపరులకు గోచరింపక మానదు.


సుప్రసిద్ధరాజధాని యగుటచే నందలి యుద్యానవనశ్రేణి విషయమై వేరుగ వ్రాయ నవసరము లేదు. పూర్వమందు హిందూ మహమ్మదీయ ప్రభువులు తమనగరములచుట్టును, రాజమందిరముల చుట్టును విహారార్థమై యుద్యానవనములను బహుశ్రద్ధతో పెంచెడివారు. అట్లే యీపురమునను సుందరోద్యానములు గలవు. ఇందలి వృక్షలతాపంక్తులును, అందములయిన కేళీమందిరములును, విహారార్థము నిర్మింపబడిన బాటలును కళాకౌశలమును చాటుచుండును. చూచి యానందించవలసిన యీయుద్యానవనములను గూర్చి యిట వర్ణించుటకు సాధ్యము కాజాలదు.


పట్టణమందు చూడవలసిన విశేషములు పెక్కు కలవు. వానిలో ముఖ్యముగా పట్టణమధ్యమందు జయపతాక మంబరస్థలి నాట్యమాడునట్లు కట్టుట కొక పెద్దధ్వజము (flag staff) లకడు ఇంతవరకును నది శిథిలముకాకుండ నిలుచుట యాశ్చర్యకరమయిన సంగతి. దీని కనతిదూరముననే యొక ఫ్రెంచి యింజనీరుచే నిర్మిం











శ్రీరంగపట్టణము చిత్రములు

టిప్పుసుల్తానుకోట ప్రాకారములు, ద్వారములు.

కావేరి-ఉత్తరవాహిని.

టిప్పుసుల్తాను సమాధి.


శ్రీరంగపట్టణము యుద్ధమున నిహతులయిన యోధుల స్మారక చిహ్నము.

టిప్పుసుల్తాను నగళ్లు.

నగళ్ల చెంత ఉద్యానము.

నగళ్లలోని శిల్పకళావిధానము.





ఛాయాచిత్రములు వ్యాసకర్తవి.

పబడిన suspension bridge ఒకటి కలదు. ఇది యినుకలతో నిర్మించబడినది. దాదాపు 60-80 అడుగుల పొడవు గలిగి, మధ్య ఏవిధమగు నాధారము లేక యిది నిలచియుండుట మానవుని యసమానబుద్ధికౌశలమునకు నిదర్శనము.

సుల్తానుగోరీసమీపమున గల వాటిలో యుద్ధమందు మృతినొందిన విదేశసైనికుల జ్ఞాపకార్థ మొక గొప్ప స్మారకచిహ్నము కట్టబడియున్నది. చుట్టును విశాలమగు బయలును, దానిమధ్య పెద్దనిర్మాణమును, ప్రక్కనే యొక పెద్దయూడల వటవృక్షంబును చూచినంతనే మానవులగుండెలు జల్లుమనక మానవు. మరుక్షణముననే ఘోరరణరంగమును, సైనికమృతకళేబరములును, రుధిరప్రవాహములును ప్రత్యక్షముగ చూచుచున్నట్లు తోచును.

నగరోపకంఠోద్యానవనమధ్యమున హైదరాలీ, టిప్పూసుల్తానుల గోరీలు అమర్చబడియున్నవి. ఈ ద్యానవనమున చెట్లు గుబురుగ పెరిగి అందముగ నుండును. గోరీలపై నిర్మించబడిన భవనమున గానవగు మహమ్మదీయ శిల్పచాతుర్య విశేషము మిగుల ప్రశంసనీయము.

పి. వి. సూర్యనారాయణరావు

కళావిషయమున గాంధీగారి అభిప్రాయము

కొంతకాలమునకు మునుపు గుజరాతీలో ప్రసిద్ధ మాసపత్రికయగు "ప్రస్థాన"మునందు "గాంధిగారు-కళ" అను శీర్షిక గల లేఖయొకటి ప్రకటితమయినది. అందీ క్రింది విధమునఁ జెప్పఁబడినది.—

"గాంధిగారు దేశమున నేయొక క్రొత్తజీవనమును పుట్టించిరో, ఆజీవనమువలన దేశమునందు కొన్ని విధములయిన యేజాగృతులు గలిగినవో వానిలో కళావిషయకమయిన జాగృతికూడఁ గొంచెమైనదియని చెప్పవీలు లేదు. ఆలోచింపఁగా గాంధిగారు స్వయముగా నేతత్సంబంధమునఁ బ్రత్యక్షముగా నేమియుఁ జేసియుండలేదు. గాంధిగారు ధర్మశాస్త్రమునుగుఱించి గహనముగాను, విశేషముగాను అభ్యాసము చేయకపోయినప్పటికిని, భాషావిషయమునఁగూడ విశేషాభ్యాసము చేయఁ బోయినప్పటికిని, ఈ రెంటి క్షేత్రములయందును మంచి పని చేసినారు. గుజరాతునందలి సంపూర్ణ భాష క్రొత్త స్వరూపమును ధరించుటకు వారు ప్రత్యక్షముగ చేయి చేసికొనిరి. కాని యితరకళాక్షేత్రమునందు వారు ప్రత్యక్షముగ నేమేని చేసినట్లు మాత్రము కనుపట్టదు. ఆయన చరిత్రమునందు రస్కిన్ టాల్‌స్టాయిలవంటి యిద్దఱు గొప్ప సత్పురుషులు, కళాకారులు నగు వారి ప్రభావము ప్రసరించినది. దీనిని వారుకూడ నంగీకరించినారు. కాని యీ కళాకారులు కారణముగ వారియందు కళావిషయకమయిన యభిరుచి కలిగినట్లు గాని, ఏతత్సంబంధముగ వారు యేమేని సొంతపని చేసినట్లు గాని కనుపట్టదు. ఆఁ. ఆయన సంగీతాభిరుచిని వృద్ధిచేసిరి. అంతే కాదు. లోకుల నటువయి పాకర్షించినారు కూడను. దీని యారంభ మొకవిధముగా ఆశ్రమమునం దధ్యాపకుఁడయిన శ్రీ నారాయణ మోరేశ్వర ఖరేగారి యోగమువలనఁ గలిగినది. అప్పటినుండి గుజరాతు ఏవిధముగా గానరస మాధుర్యమును గ్రోలుచున్నదియు సర్వత్ర విదితమే అయియున్నది. అయినప్పటికిని, ఖరే మహాశయుఁ డిన్నేండ్లనుండి ఆశ్రమమునందున్నను, గాంధిగారికి గానము వచ్చినట్లు మేము విని యెఱుఁగము. కాని వారికి సంగీతమంటే చాల ఇష్టమని మాత్ర మెఱుఁగుదుము. దేశోత్థానము విషయమున సంగీతమున కెట్టిస్థానమో అది వారు బాగుగా నెఱుఁగుదురు. కాని యీ సంబంధమున వారేమియు నధికముగ చర్చచేసియుండలేదు. ఇంచుమించుగా 5-6 సంవత్సరములకు మునుపు శ్రీ దిలీపకుమారరాయునితోఁ గొలఁదిగ సంగీతచర్చ జరపఁబడినది. అది వారి నవజీవనపత్రికలో ముద్రితమయినది కూడను. ఇంతకు మించి ప్రకటముగా వారు సంగీతమును గుఱించి స్వయముగా నేదేని చర్చించిరేమో దానిని గుఱించి మేము చెప్పఁజాలము.

సంగీతము గాక మతి యేదేని యితరకళ విషయమున వారెపుడేని ఏమేని చెప్పిరేమో మే మెఱుంగము. ఆశ్రమమునందలి మందిరములలోఁ గాని, వారు కట్టించిన గుజరాతు విద్యాపీఠము తాలూకు కట్టడములలోఁ గాని, కళాస్వరూప మేవిధముగాను కనుపఱుప లేదు. వారి యాత్మకథలో ఎక్కడను కళావిషయక మయిన చర్చ కనుపడలేదు.

గాంధిగారియందు టాల్స్టాయిగారి ప్రభావము సద్రూపముననే ప్రసరించినది. వారు సత్పురుషు లయినారు, కళాకారుఁడుగ కాలేదు. ఏతత్సంబంధమున మేము శ్రీ రవీంద్రనాథ ఠాకురుగారితో వారిని పోటిచేయఁగలము. గాంధిగారును, కవి ఠాకురుగారును వర్తమాన ప్రపంచమున రెండు గొప్పవ్యక్తులు. వారిద్దఱిలోను ఒకరిని మేము గొప్ప సత్పురుషునిరూపమునను, రెండవ వారిని కళాకారునిరూపమునను గ్రహింపఁ జాలుదుము.

గాంధిగారిని గుఱించి చెప్పునప్పుడు వారికి కళాక్షేత్రమున విహరించుటకు తగినసమయము చిక్కలేదేమో అనికూడ ననుకొనఁగలము. వారి మనోవృత్తియంతయును స్వరాజ్య సంబంధమునందే లగ్నమయి, తన్మయమగుటం జేసి వా రిటువైపు దృష్టిపాతము చేయలేకపోయినారేమో?

నే నా లేఖను చదివితిని. కనుక నామనసులో కళావిషయమున గాంధిగారి యుద్దేశము తెలిసికొందమన్న యిచ్ఛ కలిగినది. కాఁబట్టి గతించిన డిసెంబరు 15-వ తేదిని ఎఱవాడ మందిరమునకు పోవు మెయిలులో నేను వారి కొక్కసారిగానే కళావిషయమున కొన్ని ప్రశ్నములు వ్రాసి పంపితిని. 25-వ డిసెంబరునందు "చట్టిలో సముద్రము" అను సామెతను సార్థకము చేయునది బాపూజీ (గాంధీ)గారి పత్త్రము లభించినది. అందు వారు కళావిషయమున ప్రకటించిన సందర్భము ప్రతివ్యక్తికిని మననయోగ్యము. ఇందు ప్రశ్నోత్తరములు రెండును ప్రకటితములు.—

కళ తాలూకు స్థానము, రూపము.

ప్రశ్న—"మనుష్య జీవనమున కళకు ఎట్లు, ఏరూపమున స్థాన మున్నది? లేక ఉండవలయును? నిజమయిన కళ యెం దున్నది? ప్రస్తుతము బాజారులయందు లభించు సాహిత్యమునందును, చిత్రకళయందును కళ యను పేరను చెప్పఁబడుచున్న దాని నిజమయిన కళ యెంత యున్నది? టాల్స్టాయి మహర్షి తాలూకు కళావిషయకవిచారమునందు తమ యభిప్రాయ మేమి?

సంగీతకళకు జీవనములో మహత్త్వపూర్ణమయిన స్థాన మున్నది. అట్టి స్థితిలో దానికొఱకు ప్రత్యేకముగ పాఠశాల, విద్యాలయము, మహా విద్యాలయము, విశ్వవిద్యాలయము—అనువీనిలో స్థాన మెందులకు లభింపఁగూడదు? ఒకవేళ లభించు టావశ్యక మగుచో నేరూపమున?

సినీమా మొదలగువానిలో ఏసోదరీమణులు నటించి మొదలుగ వారి యభినయమును చూపుచున్నారో వారి మర్యాద యేమయి యుండవలెను? ప్రకృతము వారి యభినయమునందు విశుద్ధమయిన కళ యున్నదని చెప్ప వీలు లేదు. నిఱుపేదలగు సేద్యగాండ్రు, కూలీలు, నౌకరీవృత్తి గలవారును పగలంతయు పరిశ్రమ చేసిన తరువాతను ఏమి చేయవలెను? దేనివలన వారి జీవితము సుఖమయము, కళామయము కావలయును?

'కర్మసు కౌశల' మ్మనునదే కళ.

ఉత్తరము—కళావిహీనుఁడగు మనుజుఁడు పశుప్రాయుఁడు. కాని కళ యన నేమి? 'కళా కర్మసు కౌశలమ్'—గీత మూఁడవ యధ్యాయమునందలి యోగము. ఇది సంపూర్ణకళ. ఈసంగతియే బాహ్యకళయందు సయితము సంబంధించును. కోట్లకొలఁది జనులు దేనిని గ్రహింపఁజాలరో అది కళ కాదు. కాని స్వాతంత్త్ర్యమగును; యోగమగును. ఇట్లుండఁగా ఆకళ కంఠమునది కావచ్చును, వస్త్రమునది కావచ్చును, లేక రాతిది కావచ్చును. కోట్లకొలఁది జనుల యైకకంఠ్యములో రామస్మరణము చలాయించుట కళ. అది ఆవశ్యకముకూడ. ఎన్నో మందిరములు కళామయములు. అందలి కళను కోట్లకొలఁది జనులు గ్రహింపఁగలుగుదురు. మందిరములయందు పూజాపాఠాదుల యావశ్యకము ననుసరించి శ్రద్ధాపూర్వకముగ జరిగించుట కళకు దృష్టాంతము. ఇట్లే యొచ్చట నయితే

సమయము, క్షేత్రము, సంయోగము తాలూకు ప్రమాణము, గుర్తు ఉంచఁబడునో అచ్చట కళయున్నది. ఫిలిము నాకిష్టమయినదిగాదు. నేనెప్పుడును సినీమాలకు పోయి యెఱుఁగను.

విచారపూర్వకముగా పని చేయుటవలన అందునుండి రసము ప్రభవించియే తీరును. అనఁగా, విచారపూర్వకముగా చేయఁబడిన కార్యము కళామయముగ నగునన్నమాట. నిజమయినకళ సదా రసమయము. కళ యే రసము—అనికూడఁ జెప్పఁగలము.

యజ్ఞమయజీవనము కళకు పరమావధి. నిజమయినరస మందే యున్నది. అందునుండియే నిత్యనూతనమయిన దీనితాలూకు ప్రవాహము ప్రవహించుచుండును. దానిని త్రాగుచుండు మనుజుఁ డలసిపోఁడు. ఆప్రవాహ మెన్నటికిని ఎండిపోదు. ఏయజ్ఞమయితే భారరూపముగ నుండునో అది యజ్ఞమే కాదు. త్యాగము చేసి యనుమానపడినట్టయితే అది త్యాగమే అనిపించుకోదు. భోగముతాలూకు పరిణామము నాశము. త్యాగము తాలూకు పరిణామ మమరత్వము. రసము స్వతంత్ర వస్తువు కాదు. రసము మనవృత్తియందున్నది. ఒకనికి నాటకము తాలూకు పరదాలలో మజా లభించును. మఱొకని కాకాశమునందు నిత్యనూతనమయిన యేపరివర్తనము కలుగుచుండునో దానియం దానందము కలుగుచుండును. రస మెప్పుడును అభ్యాసమునకు విషయము. బాల్యమున రసముతాలూకు స్వరూపమున నెవరికయితే అభ్యాస మలవడుచుండునో, రస స్వరూపమున నెవరి యభ్యాసమును జనసముదాయము కైకొనుచుండునో వారు రసము నంగీకరింతురు. ఒకరాష్ట్రమునకుఁ గాని, ప్రజకుఁగాని యేది రసమయముగ తోఁచుచుండునో అదియే యింకొకరాష్ట్రమునకుఁగాని, ప్రజకుఁగాని రసహీనముగ తోఁచును.

సేవయందుమాత్రము పదునాఱు విధములయిన శృంగార మలంకరింపఁబడుచుండును. తమ సమస్త కళయు నందు వినియోగించుటకూడ జరగుచుండును. అది మొదటివస్తువు. తరువాతను తమ సేవ యగును.

ప్రశ్న-సంగీతమును, చిత్రకళను నేర్చుకొనుటవలన ఏయే గుణములవికాసము కలుగును? విద్యార్థికి వీని పరిచయ మెంతవఱకావశ్యకము?

ఉత్తరము—సంగీతమువలన ఈశ్వరధ్యానము సుకరముగ చేయఁబడఁగలదు. సంగీతము, చిత్రకళ సమస్త విశ్వము తాలూకు ఒక భాషయగును. సంగీతమువలన విశేషించి కంఠము విచ్చును. చిత్రకళవలన చేయి లేక కన్ను విచ్చును. భక్తిపరాయణత్వము నేర్చుకొనుటకు చాలినంత వీని పరిచయ మావశ్యకము.

ఈప్రశ్నోత్తరములే కాక గంధర్వవిద్యాలయము తాలూకు "సంగీతపత్రిక" యందు సంగీతమును గుఱించి యిట్లు వ్రాసిరి! సంగీతజ్ఞానశూన్యుఁడగు మనిషి యోగికాని పక్షమున పశుసముఁడు—అని యొకశ్లోకమందు చెప్పఁబడినది. నిజమడిగినట్టయితే యోగికూడ సంగీతము వినాగా తనపని చలాయించుకోలేఁడు. వానిసంగీతము హృదయవీణయందుండి బయలుదేఱును. ఆకారణముచేతను మనము దానిని వినఁజాలకున్నాము. యోగి తనహృదయము ద్వారా భగవంతుని భజించుచుండును. మనము కంఠముద్వారా ఆయనను భజించుచుండవలెను. మరియు నితరు లెవరయితే యిట్లు ఆయనను భజించుచుందురో దానిని వినవలెను. ఇట్లు చేయుచు మనము మన హృదయములయందు నిరంతరము ప్రతిధ్వనించుచున్న సంగీతమును వినుటకు మొదలిడుదుము."

—'విశాలభారత' కళాంకమునుండి.

ఊరఁబిచ్చుక

కలువలపల్లి రంగనాథశాస్త్రి గారు

పవలుఁ రేయియు మానవ-భవననివాసంబు మఱఁగి పలుమఱుఁ గూయున్
శ్రవణారుంతుదముగఁ బల్-కవలుగఁ జెలరేఁగి పిచ్చుకలు సతతంబున్.

చూలుఁ దాల్చిన యూరఁ బిచ్చుకలు జనుల-యిండ్ల వీలుఁ జూ లెఱుఁగక యిరవు గాని
చోట నేచెత్తయో సుంతసుంత తెచ్చి-గూడు లెటులనో నిర్మించి గ్రుడ్లు పెట్టు.
తమ పురాభవకృత దురితంబువలన-గూటినుండి నేలం గూలుఁ గొన్నిగ్రుడ్లు
కూలినంతనె యవిసి య్యాగ్రుడ్లు పోలియు-గ్రుడ్లు పొదిగినక్ మనుఁ గొన్ని రూపుఁ గాంచి
తనదుముక్కున నెర యేదొ తల్లి తెచ్చి-ప్రేమ మీఱఁ బిల్లల నోటఁ బెట్టి పెనుపఁ
గొన్నినాళ్ళకు నయ్యవి కూఁత లిడుచు-వింతఱెక్కలు రాఁ గూడు విడిచిపోవు.

దినదిన మేవో గింజలు-గొనకొని యూషాడ నేఱికొని తిని మనుచున్
తనుయాత్ర గడుపు పిచ్చిక-ల నెఱుంగరో, కనరో, యవి మెలంగెడు విధముల్.

సజ్జనుల్ రోయ, విచ్చలవిడి ప్రియతోడ సారెకుక్ మరుపనుల్ సల్పు టొకటి
తనకామినిం గూడి తనియులాతినిఁ బట్టి మచ్చరంబున మచ్చ మాపు టొకటి
వినుగు పుట్టించుచు వీనులు ప్రయ్యఁగా వాయెత్తి కిచకిచ కూయు టొకటి
కడుపుఁగక్కుఱితి నెక్కడనైన నెర లభించిన మానఁగాఁ బోక తినుట యొకటి
అబ్బెనే కాని, గుణలేశ మరయ సున్న-అఖలదోషైక భాజన మగుచు బ్రదుకు
పిచ్చిక నభిజ్ఞు లెపుడైనఁ బెద్దఁ జేసి-సన్నుతింతురె? కటకటా జడులమాడ్కి.

గండుఁగోయిలభంగిఁ గర్ణపేయంబుగాఁ బంచమ రాగంబుఁ బాడఁగలదె
రాచిల్క చందాన వాచామృదుత్వంబు పెంపు మీఱంగ భాషింపఁగలదె
పావురాకైవడి భావంబుఁ దనిపెడి యింపు చొప్పడ గుబాళింపఁగలదె
నెమ్మిపోలిక నిసర్గమ్ముగ షడ్జంబుసొంపు వెలారించి చూపఁగలదె
ద్రిమ్మరితనాన నటునిటుఁ దిరుగు చెవుడు-గంతు వైచుచు నిల్కడఁ గాంచఁ బోక
ఊరఁబిచ్చిక శ్రోత్రవిదారణముగఁ-జెలఁగి కిచకిచధ్వానముల్ సేయుఁ గాని.

కంఠమున నల్లనగుచాఱ గలుగుమాత్ర-నీలకంఠాఖ్య తన కబ్బె నిక్కమనుచు
నిక్కుఁ గాక తా శివుఁడౌనె నీచవృత్తి-మనెడు పిచ్చిక యెన్నిజన్మములకైన.

పిచ్చుక నీలకంఠమను పేరు గడించి మెలంగు బో మెడన్
మచ్చ యొకండు సాజమయి నల్లఁగ నుండుటఁ జేసి గొప్పపే
ర్వచ్చునె యంతమాత్రఁ ? గడు రమ్యపులాస్యము షడ్జనాదమున్
మెచ్చి తనర్చ బుధుల్ వొగడ మించు మయూరముసాటిఁ గాంచునే.

అమృతకుంభాహరణార్థంబు దివి కేఁగి క్రోటితో సురనదీతోయములను
గొని పోయి ప్రజ్వలద్ఘోరాగ్నిఁ జల్లార్చి గీర్వాణయుత గంధర్వులోలిఁ
దలఁపడి పోరాడ, బలవిక్రమంబులు వెలయ ప్రేల్మిడి వారి గెలిచి, యాత్త
పీయూషకలశుఁడై వెడలుచోఁ దనమీఁద బలభేదివజ్రంబు వైవ నరకు
గొనక, జితవజ్రియై నరగున, నిజాల-యంబునకు వచ్చి కద్రువ కమృతఘటము
నిచ్చి, జననిదాస్యము మాన్చి, యెసఁగువినత-సుతునియెదుట నిల్వంగఁ బిచ్చుకకుఁ దలమె

కమలానేత్రకుఁ గేతనంబు రథముంగా మించుచున్ యుద్ధరం
గములన్ వైరుల రూపు మాపి, జయముం గైకొంచు దుర్దాంతవి
క్రమతేజోబలశాలి యన్ బ్రథఁ గడుం గన్నట్టి పక్షీంద్రు చం
దమునన్ నీచపుఁ బ్రాణి పిచ్చిక యెటుల్ దాఁ గాంచు శౌర్యాదులన్.

కుంకుమారుణసర్వాంగ కుందచంద్ర-పాండురానన శ్రీనాథవాహ నీకుఁ
గేలుమోడ్పులు మాకిమ్ము క్షేమమనుచుఁ-జదలగరుడునిఁజూచి మ్రొక్కుదురుబుధులు.
నమ్యుఁడైన ఖగేశ్వరు న్గాంచి ప్రణతి-సేయకే యవివేకి పిచ్చికకు మ్రొక్కుఁ
గృతకముం జూచి వ్యామోహమతిని బ్రమసి-సత్యమని యెంచి వర్ణించుజనులువోలె.

దమితాశీవిషు నాగభక్షకు గరుత్మంతున్ సుపర్ణున్ విహం
గమరాజుం గని సర్పదష్టులు నతుల్ గావించి సౌపర్ణ మం
త్రము నిష్ఠ జపియింతురేని విషబాధల్ తగ్గఁ జేకూఱు క్షే
మము నారోగ్యము నూరఁబిచ్చుకకుఁ దన్మాహాత్మ్యమెట్లబ్బెడున్.

ఎఱకలు గలవుగా యెగురనేరనొ యంచు నెగురు నెట్లో మీఁది కెగిరి యలసి
ఏ చెట్లమీఁదనో ఏయిండ్లపైననో వ్రాలి కూటం జొచ్చి బ్రదుకు గ్రామ
చటకంబు పదునాల్గు జగముల నిజకుక్షిగోళంబునన్ నెలకొల్పి తనరు
విష్ణుదేవుని మోఁచి వినువీథి నలయక యెంతదవ్వేనియు నేఁగుదట్ట
తనము గడియించి, విష్ణువాహన మనంగ-మంచిపేరును బెంపును గాంచి తార్క్ష్య
వైనతేయనాగాంతకప్రభృతినామ-ములను బడసిన గరుడుఁడై వెలయఁబోద.

సత్యాగ్రహులు

పురిపండా అప్పలస్వామి (కవితాసమితి)

చిరపరాధీన శృంఖలాచ్ఛేదమునకు
జీవితసుమాలె ధారవోసితిరి మీరు
కురియదే నేడు స్వర్గీయ కుసుమ వృష్టి
శ్రీ విరాజిల్లు మీ యోధశిరములందు.

బాధలే భాగ్యముగ నొడిబట్ట జాలు
భారతాశ్రమ తరుణతాపసులు మీరు
ఏ నిరంకుశులేని బంధింపనిందు
నిగళముల త్రెంచుకొనెడు సైనికులు మీరు.

స్వార్థ లవ మేని లేని మీ త్యాగగరిమ
ప్రాకిపోయెను ఖండాంతరాల దాటి
ఇది స్వరాజ్యరమా నవాభ్యుదయ వేళ
నభమె నినదించె విజయదుందుభుల మ్రోత.

నగర విద్యార్థిని

సీరిపి ఆంజనేయులుగారు

కాలంపువిలువ చక్కఁగాఁ జాటిసేసి, విద్యార్జనమ్మున నెప్డు నడరుచుంట
శోధనమ్మునకుఁగాఁ జూడక, విజ్ఞాన జిజ్ఞాసఁగళలఁ జర్చించుచుంట,
దూషణ భూషణాదులకుఁ జొల్పడక, నిష్కపట భావమ్మునఁ గ్రాలుచుంట,
కానిచేఁతలకు మార్గముచూపు చెడుగులఁ గడకంటనేనియుఁ గానకుంట,
తనకుమాలిన చెయిదిని దడవకుంట, భక్తియును గార్యశక్తియుఁ బట్టుదలయుఁ
గల్గి, యెల్లెడ విజయమ్మె కాంచుచుంట, నగరవిద్యార్థినుల కెందుఁ దగు పథమ్ము.

విత్తులేకుండ ఫలము లభింపదుగద!

పండిత, పురాణం సూర్యనారాయణతీర్థులుగారు

మేలు గూర్పఁ దలంచు మిత్త్రిరత్నము వోలె నలసత మాన్పి కార్యములఁ బొన్పు
ప్రేమ గల్గిన దాసికీతిగా మెయి వంచి పరిశుభ్రముగ నింటిపనులు సేయు
లావణ్యవతి మహాలక్ష్మిలా గేవేళఁ గలకల మొగముతోఁ గానిపించు
కష్టసుఖముల నొక్కవిధమ్ముగా నెంచి భూదేవివలె నోర్పు పూనియుండు
కన్నతల్లిని మించి కడు నాదరమ్మునుంచి షడ్రసోపేతభోజనము నించు
ప్రక్కఁ జేరిన మంచిపణ్యాంగనను మించి మది కనుత్సాహంబు మానిపించు
నిట్టిషాడ్గుణ్యయుక్తయైనట్టి భార్య, గాని పంచలకారయౌ కాంత గాని
దొడ్డపున్నెమ్మె లేకెట్లు దొరకు? నౌను, విత్తు లేకుండ ఫలము లభింపదుగద!



చమత్కారచాటుపద్యములు

ఈపుస్తకము శ్రీ దాసరి లక్ష్మణస్వామిగారిచే సమకూర్పఁబడినది. దీనివెల ౦-౬-౦ లు. వారిచేతనే ముద్రితము, ప్రకటితము—పిఠాపురము.

ఇందుఁ బురాతనములు, అధునాతనములు నగు పద్యము లించుమించుగా మూడువందలు గలవు. **వాని** యందు ప్రతిపద్యమునందును వీనోరొక చమత్కారముం డుటచేతను, అవి చాటువులగుటచేతను దీనికీపేరు తగియున్నది. పద్యములు పలుచోట్లనుండి సంగ్రహించి యేకత్ర కూర్పఁబడినవి. విచిత్రవివాహము, వైదికులు, నియోగులు, పొగాకు, నస్యము, ఇత్యాదివిషయములనుగుఱించి వినోదార్థము రచింపఁబడిన పద్యములును, నీతిపద్యములును, సమస్యలు, వానిపూరణములు మొదలయినవి గలవు. ప్రతివారును జదువఁదగిన పుస్తకము. పలువురు వారు గ్రంథప్రకాశకులకు వ్రాయునది.

తీర్థులు.

నీతిపద్యరత్నాకరము

ఇదియును శ్రీ దాసరి లక్ష్మణస్వామిగారిచేతనే సమకూర్పఁబడినది. ఇది క్రౌను ౧౬ పుటల సైజున నూఱు పుటల పొత్తము. ఇందు వీరు భారతాదులగు గ్రంథములయందలి నీతిపద్యరత్నములను ప్రతివారును కంఠపాఠముగఁ జేయఁదగినవాని నేర్చి కూర్చి యాంధ్రబాలుర కెంతయు నుపకరించులాగునఁ జేసిరి. దీనిని ప్రతిగృహస్థుఁడును తమ బాలబాలికలచేఁ దప్పక చదివించి యేతద్గ్రంథసంధాతపరిశ్రమను సార్థక మొనరింతురుగాక. అమూల్యపద్యరత్నపేటికయగు దీనివెల ౦-౬-౦ లు మాత్రమే.

తీర్థులు.

ఉమర్ ఖయ్యామ్

గ్రంథకర్త: డాక్టరు చిలుకూరి నారాయణరావు గారు

ఈ తెనుగుకావ్యము సుప్రసిద్ధపారసీకకవి ఉమర్ గారి రుబాయత్ వృత్తసంచయమునకు అనువాదము. పారసీక మాతృకనుండి గాక, ఆంగ్లానువాదమగు ఫిట్జు గెరాల్డుగారి కావ్యమునుండి పరివర్తితము.

పారసీక మాతృకయందలి మాధుర్యము ఆభాష నెఱిగినవారికే అనుభవయోగ్యము కాని ఆంగ్లకావ్యము సైతము అద్భుతమైన భావగాంభీర్యమును, ప్రతిపదార్థ ప్రయోజనముం గల్గి భాసిల్లుచున్నది. నారాయణరావు గారి పట్పదులు కావ్యగుణము లన్నింటను ఆంగ్లమునకు కడుంగడు తీసిపోవునవై యున్నవి.

స్థాలీపులాకన్యాయముగా నొక్క యుదాహరణము.—

And, as the cock crew, those who stood before The Tavern shouted—"Open then the door You know how little while we have to stay, And, once departed, may return no more". Fitz. III.

ఈడ మే ముండేటి కాలము
దాటిపోతున్నాది మఱి అది
దాటిపోతే తిరిగి వచ్చే
మాట యేమొకదా

కొక్కొరో అని కోడి కూసెను
రొట్టు "తలుపును తీయ వే" మని
కూడియుండినవారు రాత్రము
తోడ వార్వగను.

చి|| వా|| 3.

రెంటికింగల వ్యత్యాసమును, అంతరమును విజ్ఞులు గ్రహింతురుగాక!

శ్రీ. వెం. సు.

సుధ - 'వార్షిక సంచిక'

సంపుటము ౧. సంచిక ౧౨. సంపాదకులు: కుటుంబరావుగారు, యస్. జి. ఆచార్యగారు. ఏడాదినుండి వెలువడే మాసపత్రిక 'సుధ ప్రయాణములోని మొదటి మైలురాయి దాటినగురుతుగా ఈవార్షిక సంచిక వెలువడింది' అని 'మున్నుడి' (పాలు రొక్కమైలు అనుకుంటే). తెదురువెయిటు కాగితములో, రాయలుసైజున ౯౬ పుటలవఱకు గలిగి అందముగా ఉన్నది యీ సంచిక.

శ్రీ విశ్వనాథ కవిరాజుగారి 'ఆంధ్రరంగస్థలమున సంస్కృత నాటకములు' అన్నది ఉద్ధృతమైన ఆంగ్ల వాక్యావళితో నిండిఉన్నా, పాశ్చాత్యాభిరుచి ననుసరించి సహా సంస్కృత నాటకకళ యెంత ఉత్తమమైనదిగా ఒప్పుదల అయినదీ నిరూపిస్తూ, ఆంధ్రరంగముమీద సంస్కృత నాటకాల ప్రయోగమునలని ప్రయోజనాన్ని, దాని ఆవశ్యకతను ఆదరణీయంగా సూచిస్తూ ఉన్నది. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారి 'ఆయుర్వేదము! అప్పుడు—ఇప్పుడు' అనేది పూర్వకాలం మన దేశంలో ఆయుర్వేదము ప్రభువుల ఆదరణ పొందుతూ, 'సిద్ధాంతపరముగను, అనుభవపరముగను' ఎట్టి అభివృద్ధితో విలసిల్లేదీ, ఏపద్ధతుల మీద జీవితానికి ఉపయోగపడుచు బడేదీ మొదలైన విలువగల భోగట్టాలు నిదర్శించే శాసనగత వాఙ్మయము కొంత ఉద్ధరించి చూపుతూ నేటి అవస్థాభేదాన్ని సూచిస్తూ ఉన్న ఉత్కృష్టమైన చారిత్రకవ్యాసము.

శ్రీ విశ్వనాథ వెంకటేశ్వరులుగారి 'అభిరుచి' అనే వ్యాసం ప్రతిభాకలితమై భావుకము గా ఉన్నది. శ్రీ కవికొండల వెంకటరావుగారు 'పెనుమంచిలి శైనుదేవుడు' అనే సరళమైన కథలో చూపిన అనుభవ మర్మజ్ఞత వారికళకు తీరని మెఱుగు పెట్టుతున్నది. శ్రీ వెంపటి నాగభూషణంగారి 'పాటకచ్చేరి' అనేకథ సున్నితంగా ఉన్నది. శ్రీ గుడిపాటి వెంకటాచలంగారి 'అమీనా' అనే కథ వారి విలక్షణమైన ఆశయాలకు కట్టుపడ్డది, మనసంఘము మనస్సుకే కాక అభిరుచిపక్వమైన కళాహృదయానికి సహా వెగటు గూర్చుతూ, వారి మెలకువగల సహజరచనావైదగ్ధ్యం మెప్పునుదీనం చేస్తూ ఉన్నది. సంకుచితమైన, కూర్పుకురాని వికలరాగశకలాలలో ఆత్మవికాసం ముడిచిపెట్టజాచేతత్పరత ఏభూభాగంలోనూ శాశ్వతవాణి కాజాలదు. వైద్యరత్న, పండిత డి. గోపాలాచార్యులుగారి 'దీర్ఘజీవనసాధనము' చాలా విజ్ఞానదాయకమైన వ్యాసము. శ్రీ సహదేవ సూర్యప్రకాశరావుగారి 'వకుళమాల', శ్రీ కొడాలి వెంకటసుబ్బారావు, కాము రాజుగడ్డ శివయోగానందరావుగార్ల, 'భక్తి-ప్రేమ' స్వతంత్రములైన చక్కని భావకావ్యాలు. ఇంకా శ్రీ సెట్టి లక్ష్మీనరసింహముగారి 'శ్రీసుధాసంధానము', శ్రీపురి పండా అప్పలస్వామిగారి 'అనార్కలీ', శ్రీ ఉమర్ ఆలీ షాగారి 'రాధ' మొదలైన అందమైన వ్యాసా లున్నవి.

రెండు మూడు సాధారణచిత్రా లున్నవి. అవి, స్వతః బొమ్మలు బాగానే ఉన్నా, వెయ్యడం చాలా సాధారణంగా ఉంది. సంచిక చివరభాగంలో గ్రంథంతోపాటు ప్రకటనలుకూడా కలగలపడం 'అభిరుచి'కి తగిన వ్యవహారం కాదనిపిస్తుంది.

'సుధ' ముందుముందు దాటబోయే 'మైలురాళ్ల' 'గురుతులు' ఇంకా కావ్యసంపద, సారస్వతాది వ్యాస సంపద పెందుకొని జనాదరపాత్ర మయేటట్టు సంపాదకులు పూనికతో ప్రయత్నిస్తారుగాక!

విలాసము: 'సుధ', పోస్టుబాక్సు నెం. ౨౦౪, మదరాసు.

మణిమంజూష

గ్రంథకర్త: శిష్టా వేంకటసుబ్బయ్యగారు. ప్రకాశకులు: సాహితీనికేతనమువారు, నరసాపురము, ప. గోదావరి. క్రౌనుసైజు, ౧౦౩ పుటలు. వెల ౧౪ అ.

ఇది కొన్ని కథల సంపుటము. కథలు చాలవఱకు పౌరాణికములు; 'రైతుబిడ్డ రాజగుట' అనునది 'Earthly Paradise' నుండి అనుకరించినది. శైలి కృత్రిమము గాక, చాలవరకు సరళమై, సహజమైయున్నది. పౌరాణికకథలు చదువదగు విద్యార్థిలోకమున కిది చదువ దగినదే. స్త్రీలకు నుపయోగపడును.

గ్రామజన దర్పణము

గ్రంథకర్త: సురవరము ప్రతాపరెడ్డిగారు, బి.ఏ., బి. యల్. గోలకొండ పత్రికాముద్రాశాల, ట్రూపు బజారు, హైదరాబాదు-నందు ముద్రితము. రాయలు ౧౬ సైజు, ౩౮ పుటలు. వెల ౩ అ. ౬ పై. గ్రంథాలయములు, పంచాయతులు, సహకారము మున్నగు విషయములగూర్చి కొండనుర్తులు గాలిగనంత క్లుప్తముగ వాక్యావళితో తెలిపినారు.

హైందవ స్త్రీలు

స్వామి వివేకానందుని ఒక ఉపన్యాసమునకు తెలుగు సేత. ఇది తెనాలి, ఉత్తమగ్రంథమాలిక ప్రథమపుష్పము. సంపాదకులు: వేంకటరత్నముగారు. క్రౌనుసైజు, ౨౩ పుటలు. వెల ౨ అ. శైలి సరళము. పెద్దసంపుటములుగా ఇట్టి సారస్వతము ప్రకటించుటకు గ్రంథమాలవారు పూనుకున్న బాగుండును.

The Crisis and the Truce
By "Chronicler"

ది న్యూ ఇపాక్ పబ్లిషర్స్, మద్రాసు. క్రౌను ౫౦ పుటలు. వెల ౧౦ అ.

1927 లో సైమన్ కమిషను నియమింపబడినది మొదలు 1931 లో గాంధి-ఇర్విన్ ఒడంబడిక జరిగినంత వరకును గల స్థితిగతులను వర్ణించుట ఈ గ్రంథము యొక్క యభిప్రాయము, సైమనుకమిషను; శాసనోల్లంఘనము; సప్రూ జయకర్ రాయబారములు; రౌండ్‌టేబిల్ సభ; గాంధి - ఇర్విన్ ఒడంబడిక—ఇవియే యీ గ్రంథమున నుదాహరింపబడిన యంశములు. వీనిని గూర్చిన వివరము లిందు క్లుప్తముగ వర్ణింపబడినవి. జరిగినసంగతులను ఉన్న వున్నట్లుగ పూస గ్రుచ్చినట్లు గ్రంథస్థము చేయుటయే బహుశః గ్రంథకర్త యభిప్రాయమై యుండవచ్చును. కాబట్టియే ఆయా యంశములను గూర్చి తన స్వాభిప్రాయములను గ్రంథకర్త వెలిబుచ్చియుండలేదు.

కాని ఒక్కటి. ఒడంబడిక విషయమున ఇర్విన్ ప్రభువు మహోదారత జూపెనని గ్రంథకర్త యభిప్రాయము. ఈ యౌదార్యము బ్రిటిష్ ప్రభుత్వమువారి దని మనము భావించుకొనవలెనో లేక ఇర్విన్ ప్రభువు వ్యక్తికి చెందినదిగానే భావించు కొనవలయునో తెలియుట లేదు. కాని, ఇది యెట్లయినను, ఒడంబడికలో బ్రిటిషుప్రభుత్వమువారు గాని, ఇర్విన్ ప్రభువు స్వయముగనే కాని చూపిన యౌదార్యమేమో యింతవరకును బోధపడకున్నది.

ఇంక చారిత్రాంశములకు సంబంధించినవర కవి చక్కగ వివరింపబడినవి. సందర్భానుకూలముగ, నాయా ప్రముఖుల యుపన్యాసములు మున్నగువానినిగూడ గ్రంథకర్త యుదాహరించెను. 1927-1929 కాంగ్రెసు సమావేశముల చరిత్రను, అఖిలపక్షమహాసభ చరిత్రను, ముస్లిం లీగ్, హిందూమహాసభల చరిత్రనుగూడ క్లుప్తముగ వివరించినచో గ్రంథము మరింత సమగ్రముగ నుండెడిది.

ప్ర. రం.

ప్రేమచందుకథలు

హిందీవాఙ్మయమున ప్రేమచందుకథలు పేరెన్నిక గన్నవి. విశ్వకల్యాణసంధాయకములగు ధర్మము, నీతి, దయ, ప్రేమ మొదలగు నుత్తమతత్త్వముల కథా

రూపమున బోధింపగల నేర్పు ప్రేమచందునకు గలదు. వీరు సృష్టించుపాత్రములు జీవకళ నిండారి పాఠకుల యెదుట సాక్షాత్కరించు చున్నట్లుండును. పాత్రముల యొక్క భిన్నములగు మనఃప్రవృత్తుల సంఘర్షణ మద్భుత రీతిని జిత్రితమయియుండును. పుక్కిటిపురాణములవలె గాక ప్రేమచందుకథలు పాఠకులహృదయముల నవ్య సుభావోదయమును గలిగించుచుండును. కథనము వ్యాసాధిక్యములు లేక శుద్ధినట్లమరియుండును. ఎల్ల విధముల ప్రేమచందుకథ లుత్తమశ్రేణికి జెందినవనిన విశేషించి చెప్ప బనిలేదు.

వాఙ్మయమున పెద్దపాళ్లలో నొకపాలు కథలది. సంఘమును దిద్ది తీర్చి తన యేలుబడిలోనికి దెచ్చికొని దానిని పెంపొందజేయుటకు మంచికథ లుపకరించును.

ఆంధ్రదేశమునను పలువురు కథకులు కథలను రచియించి యాంధ్రవాణికి సమర్పించుచున్నారు. వానిలో నుత్తమములగునవియు గలవు. వానివలన సంఘమున నించుక పరివర్తనమును గలుగుచున్నది. కాని యితర వాఙ్మయములయందువలె నాంధ్రవాఙ్మయమున మంచి కథ లెక్కుడుగ నింకను వెలువడవలెను. కావున కథా రచయితలకు మార్గదర్శకములుగ అన్యభాషలనున్న మంచికథల యనువాదములు నైతము నావశ్యకములు. ఇట్టి తఱి శ్రీ దినవహి సత్యనారాయణగారు ప్రేమచందుకథల నారింటిని తెలిగించి యాంధ్రదేశమున కర్పించి ధన్యవాదముల కర్హులయినారు. ఆంధ్రకథావాఙ్మయాభివృద్ధి నాకాంక్షించువారెల్లరు శ్రీ సత్యనారాయణగారి నభినందింపదగుదురు. వీరి తెలిగింపు ఇంచుక ముదుకగ నున్నను భావప్రకటనమున కనుకూలముగ, సుగమముగ నున్నది.

వీనికి బహుళప్రచారములను గలిగించి వీనివలని ప్రయోజనమును బడయవలసినభార మాంధ్రలోకముపై నున్నది. శ్రీ సత్యనారాయణగారును, సమర్థులగు నితరులును ఇంకను ఇతరభాషలయందుగల మంచికథల ననువదించి యాంధ్రకథావాఙ్మయమును పెంపొందింపదగుదురు. విలాసము: సరస్వతీ గ్రంథమాల, కాకరపఱ్ఱు, తణుకుతాలూకా, ప॥ గోదావరి.

కాదంబరీ కథాసారము

వివిధ విధములగు వర్ణనములతో, శబ్దార్థాలంకారములతో నిండియున్న సంస్కృతగద్యకావ్యమగు కాదంబరియందలి యితివృత్తము రెండుమూడు మారులు జదివినగాని పాఠకుని తలకెక్కుట యసాధ్యము. కావున నందలి వర్ణనభాగములను దొలగించి కథ సులభముగ తెలియునట్లు భీమరాజు సత్యనారాయణరావుగారు దీని నిట్లు తెలిగించినారు. ఇది పూర్వభాగముమాత్రము. అచ్చటచ్చట మూలగ్రంథమునందలి వర్ణనములవాసనయొకింత కానవచ్చుచున్నను ఇతివృత్తము సుబోధముగా నున్నది. రచనము నిర్దుష్టముగను, సరళముగను నున్నది. మాధ్యమిక పాఠశాలల విద్యార్థులు చదువదగినది. వెల ౦-౧౦-౦.

విలాసము: శ్రీ జే. కృష్ణస్వామి శర్మగారు, ఒంగోలు, గుంటూరుజిల్లా.

బాణగద్యకావ్యకథలు

బాణకృతములగు కాదంబరీ హర్షచరితముల యందలి యితివృత్తములను సుబోధమగునట్లు శ్రీ శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారిట్లు తెలుగున రచియించిరి. ఇందు మూలగ్రంథములయందలి వర్ణనములు, ఇతివృత్తావబోధమున కడ్డుదగులునవి, ఉజ్జగింపబడినవి. రచనము మృదుమధురముగ, నిర్దుష్టముగ నున్నది. భాషాపరిచయ మత్యల్పముగా నున్నవారికిగూడ తెలియునట్లు శ్రీశాస్త్రిగారు దీనిని రచియించినారు. ఇది మాధ్యమికపాఠశాలల బాలురు చదువదగినది.

విలాసము: శ్రీపాద శాస్త్రి అండు కో., పిఠాపురము, తూర్పుగోదావరి.

వర్ణనరత్నాకరము

౩-౪ భాగములుగల రెండవసంపుటము. గ్రంథసంధాత: దాసరి లక్ష్మణస్వామిగారు, పిఠాపురము, తూర్పుగోదావరిజిల్లా. ఇది డెమ్మీ ౧/౮ పేజీల సైజున ౬౦౦ పుటల గ్రంథము. వీ రిదివఱలో దీని ౧,౨ భాగముల

నొకసంపుటముగాఁ బ్రకటించినారు. ఇపుడీరెండవసంపుటమున ౧౧-వ శతాబ్ది మొదలు ౧౯-వ శతాబ్దివఱకును గల కవీశ్వరుల గ్రంథములనుండి వర్ణనలతోఁ గూడిన పద్యములను సుమారు ౫ వేలకుఁ బైఁగా నిందు సమావేశపఱచినారు. భారతము మొదలయిన యాంధ్రగ్రంథములయందలివి సకలజనోపయుక్తములయిన పద్యములను విషయవిభాగపూర్వకముగా నేకత్ర సమావేశపఱుచుటచే నిది యాంధ్రులకందఱకును చాల నుపయోగకారిగా నుండును. ఇట్టి మహోద్యమమునకుఁ బూనుకొన్న గ్రంథసంధాత యాంధ్రులయభినందనముల కర్హతముఁ డని చెప్పకతప్పదు. ఆంధ్రభారతాది యావదాంధ్రపద్యసారస్వత సారస్వత వర్ణనరత్నములెల్ల నొక్కచో లభించునట్లుచేసిన వీరియీ ఘనకార్యము మిగులఁగొనియాడఁదగినది. దీనివెల రు ౩-౮-౦. చమత్కారచాటుపద్యములను పుస్తకము దీనియందలి చివరభాగమే వేఱుగ నొక పుస్తకముగా ప్రకటింపఁబడినది. దీనిని గొన్నవారికి దానిని గొన నక్కఱ యుండదు.

తీర్థులు.

ఆంధ్రదేశ చరిత్రకథలు

ఆంధ్రదేశచరిత్రము బాలురకు సులభముగ బోధపడుట కనుకూలములగు పుస్తకములు తెలుగున చాల తక్కువ. లేవనియే చెప్పవచ్చును. అట్టి పుస్తకములు కొల్లలుగ వెలువడుటావశ్యకము. అట్టివానిలో నిది మొదటిదనదగును.

దీనిని శ్రీమామిడిపూడి వెంకటరంగయ్య (యం. ఏ.)గారు రచియించిరి. ఆంధ్రదేశచరిత్రయందు, పురాణములయందు ప్రసిద్ధిగన్న మహారాజులయు, మహాపురుషులయు జీవితములను, స్థలములచరిత్రములను ఆధారముగాగొని అల్లినకథలు ముప్పదిరెండిందు గలవు. నేటివఱకు ప్రకటితములయిన శాసనములవలన నుపలబ్ధములగు విషయములు, నానుడికథలు నీకథలయందు వలసినపట్టుల ననుసంధింపబడినవి. వీనిని చదువు తెలుగుబాలురకు తమ దేశముయొక్క చరిత్రయం దభిరుచిగలుగుట నిస్సంశయము. మఱియు నిందుగల ప్రాచీనములగు శిల్పచిత్రములయు, వర్ణచిత్రములయు సుందర ప్రతికృతులు పదునెనిమిది బాలురయభిరుచిని పెంపొందించుట కుపకరించును. ఇట్టిగ్రంథమును రచియించిన గ్రంథకర్త నాంధ్రు లభినందింపవలయును.

ఇందు కొన్ని చిన్నలోపములును గాన్పించుచున్నవి. గ్రంథము పేరు "ఆంధ్రదేశకథలు": ఇందు శ్రీరామాయణము, పాండవవిజయము అను కథలకు తావు కనపడదు.

విశ్వామిత్రుని కొడుకులే ఆంధ్రులు. "విశ్వామిత్రుని కొడుకులు ఆంధ్రదేశమునకువచ్చి............" అని ఇందుగలదు. (86)

"ఆంధ్రరాజు లందరు ఋషులకు విధేయులు"

—పు. ౧౮.

"ఆంధ్రరాజుకూడ అట్లే వచ్చి తగిన కానుకలను ఇచ్చెను."—పు. ౨౧. ఈ యాంధ్రరాజు లెవ్వరో!

"ఆంధ్రరాజులుకూడ ఏదో ఒకపక్షమున చేరవలసివచ్చెను."—పు. ౨౧. ఈయాంధ్రరాజు లెవ్వరు? ఎవ రెవరిపక్షమున జేరిరి?

"అయ్యా, మేము నిషాదులము; కిరాతులనికూడ మాకు పేరుగలదు."

—పు. ౮.

"ఆ ఆశ్రమమునకు కొంతదూరమున నిషాదు , కిరాతులు, నాగులు, వారివారి పల్లెలలో నివసించుచుండిరి."

—పు. ౧౨.

మొదటివాక్యము నిషాదులు కిరాతులు నొకజాతివారుగను, రెండవవాక్యము భిన్నజాతులవారుగను తెలుపుచున్నవి.

కృష్ణదేవరాయలు అనుకథయందు కృష్ణదేవరాయల విద్యాపరిపోషణము, కవిపండితగోష్ఠులు మొదలగువానిని గుఱించి యొకింతయైన లేమి కథకు లేమి-యయ్యెను.

అజీకర్తుడు (పు. ౫)—అజగర్తు డందురు. వశిష్ఠిపుత్రుడు (పు. ౩౨)—వాసిష్ఠీపుత్రు డందురు. కంపనకుమారుడు(పు. ౮౫)—కంపకుమారుడు, కంపడు, కంపరాయలు అందురు. (పు. ౧౦౪)—అహోబిలము-అహోబలము అనబడును. శాళి కోట-తల్లికోట యందురు.

రచనము సుగమముగనే యున్నను వ్యవస్థ లేకున్నది. అపశబ్దప్రయోగములు కలవు.

ఇట్టిలోపములు గ్రంథకరణమున సావధానత కొరవడుటచే సంభవించునవి. పునర్ముద్రణమున వీనిని గ్రంథకర్త తొలగింతురుకాక! బాలుర యుపయోగార్థము మరియు నిట్టిగ్రంథములను పెక్కిటిని రచియించి శ్రీ వేంకటరంగయ్యగారు బాలుర హృదయక్షేత్రముల ఆంధ్రదేశచరిత్రాంకురములు తామరతంపరగ పెరిగి వారికి ప్రాచీనదేశౌన్నత్యాదులను చక్కగా దెలియుటకు మంచి అవకాశమును గలిగింపదగుదురు.

సన్మార్గదర్శిని (మూడుభాగములు)

శ్రీయుతులు గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారు తెలుగుసామెతల అర్థమును వివరించుకథలను రచియించి యిట్లు ప్రకటించినారు. ఏ సామెతను వివరించుకథకు ఆసామెతనే పేరుగ నియమించినారు. మొదటిభాగమున ౫౮, రెండవభాగమున ౨౩, కథలును మూడవభాగమున ౨౧ కథలును గలవు. మొదటిభాగము నందలి యొక్కొక్కకథ యొక్కొక్క పుటకు, రెండవదానియందు రెండుపుటలకు, మూడవదానియందు మూడుపుటలకు సరిపోవునట్లు పెంచినారు. ఈపద్ధతి చాలబాగుగనున్నది. కథనము మధురముగను సుబోధముగను నున్నది. రచనము రెండుమూడు భాగముల నిర్దుష్టముగ నున్నది; మొదటిభాగమున నొకింత సంస్కారము నపేక్షించుచున్నది. ఇట్టికథలను చదువు బాలబాలికలకు భాషాజ్ఞానముతోపాటు లోకజ్ఞానమును పెంపొందును. కావున నీకథలను ప్రాథమికపాఠశాలలలో పై రెండుతరగతుల జదువు బాలబాలికలకు పాఠ్యగ్రంథముగా నియమింపదగును. వెల ౧ భాగము ౩ అ., ౨ భాగము ౪ అ., ౩ భాగము ౫ అ.

విలాసము: మేనేజరు, విద్యావినోదినీగ్రంథమాల, చిత్తూరు.

గ్రంథస్వీకారము

శ్రీ మదహోబిల చరిత్రము

గ్రంథకర్త: పాలపర్తి సూర్యనారాయణగారు. వెలయువారికి: సుంకు వెంకటరామయ్యశ్రేష్ఠి, చాగలమఱ్ఱి, కర్నూలు జిల్లా. క్రౌనుసైజు, ౪౧ పుటలు. వెల ౪ అ.

---

౧. శ్రీవేణుగోపాల సీస తారావళి

వెల ౩ పైసలు.

౨. హనుమత్సమావళి

వెల ౧ అ. ౬ పై.

పైరెండింటికి కర్త: బ్రహ్మభొట్ల పట్టాభిరామయ్యగారు, గుడివాడ.

జానకీ శతకము

గ్రంథకర్త: కొవ్వలి వేంకట రాజేశ్వరరావుగారు, కల్లికోట. వెల ౪ అ. శైలి ధారాళముగ నున్నది.

---

౧. లింగార్చన తత్త్వము

త్రిలిఙ్గ పత్రికనుండి పునర్ముద్రణము. గద్యవ్యాసము.

౨. నావిబుధలోక సందర్శనము

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికనుండి పునర్ముద్రణము. పద్యవ్యాసము. రచయిత: విమర్శకాగ్రేసర, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు, కాకినాడ.

మొగలాయీ దర్బారు

ప్రథమభాగము. (ఇంతకు ముందు రెండు మూడు నాలుగు భాగములు చేరినట్లు తెలిపియుంటిమి). డెమ్మీసైజు. ౩౨౪ పుటలు. వెల రు. ౧-౮-౦. గ్రంథకర్త: మొసలికంటి సంజీవరావుగారు. విలాసము; సరస్వతీ గ్రంథమాల, రాజమహేంద్రవరము.

Printed and Published by G. Subbaramayya, at the Andhra PatrikaPress, No.7,Thambu Chetty St., Madras

తీర్మానములు: ౪౫-వ భారత జాతీయ మహాసభ, కరాచి—౧౯౩౧

౧
పరమపదించిన దేశ భక్తులు

పండిత మోతీలాలు నెహ్రూ, మౌలానా మహమ్మదాలీ, మౌల్వీ మజ్రుల్‌హక్, శేషాశంకరు జగన్నాథము గార్లును, కడచిన జాతీయ సంగ్రామమున ప్రాణముల నర్పించిన వీర యోగి యోగినీ జనములును పరమపదించినందుల కీ కాంగ్రెసువారు విషాదమును వెల్లడించుచు వారి కుటుంబములకు వారితో పాటు దేశీయులెల్లరు దుఃఖించుచున్నారని తెలియబరచుచున్నారు.

౨
కాన్పూరు అల్లరులు

కాన్పూరులో హిందూ మహమ్మదీయులకు కొట్లాటలు కలిగి యనేకులు మరణించుటకు మరి యనేకులకు గాయములు తగులుటకును కారణ మైనందులకు కాంగ్రెసువారు దుఃఖించుచు, మృతులైన వారి కుటుంబములకును, గాయములు తగిలినవారి కుటుంబములకును తమ సానుభూతిని దెలుపుచున్నారు.

ఈ యల్లరులలో సంయుక్త రాష్ట్ర కాంగ్రెసు సంఘాధ్యక్షులును, దేశ సేవకులలో నెల్ల స్వార్థ రహితులని పేరొందినవారును, మతవైమనస్య బుద్ధి యించుకయేని లేక సర్వమతస్థుల హృదయములకు నెక్కినవారును నగు శ్రీ గణేశశంకర విద్యార్థిగారి మరణవార్తకీ కాంగ్రెసువారు దుఃఖించుచున్నారు. శ్రీ గణేశ శంకరుల దారపుత్రాదులకు కాంగ్రెసువారు తమ సానుభూతిని దెలియజేయుచు, దేశ సేవకులలో ప్రథమ గణ్యులైన యిట్టి మహనీయ లోకరు, సోదర దేశీయుల యున్మాదమును, కొట్లాటలను మాన్పి, శాంతిని, సమచిత్తమును సంస్థాపించి, యార్తుల సంరక్షించుటకై తమ యమూల్య ప్రాణముల నర్పించినందులకు కాంగ్రెసువారు గర్వపడుచున్నారు.

మహనీయ త్యాగమును వైమనస్య శాంతికి సాధనము గావించి, ప్రతిక్రియాబుద్ధి మానవలయునని కాన్పూరులో నీ కొట్లాటలకు సంబంధించిన వారెల్లరిని కాంగ్రెసువారు ప్రార్థించుచున్నారు. ఈ కొట్లాటకు మూలకారణము లరసి హిందూ మహమ్మదీయుల వైమనస్యమును శాంతపరచి, యీవిమర్శల యవ్యవస్థలను ప్రాకకుండ జేయుటకై కాంగ్రెసువారీకమిటీవారిని నియమించుచున్నారు. అధ్యక్షులు:- డాక్టరు భగవాన్దాసుగారు. సభ్యులు:- పురుషోత్తమదాసు టాండను, ఖ్వాజా మజీద్, టి. ఎ. కె. షేర్వాణి, జఫరుల్ ముల్క; పండిత సుందరలాల్,

౩
రాజకీయ ఖైదీల విడుదల

గవర్నమెంటువారు, కాంగ్రెసు వారితో గావించుకొనిన యొడంబడికకు, ఇంగ్లాండు ఇండియా దేశములకు స్నేహ సద్భావములను పెంపొందించుటయే లక్ష్యమైనయెడల, ఆయొడంబడికను బ్రిటిషువారు తమ యధికారమును వదలుకొనుటకు నిశ్చయించుకొని మనఃపూర్వకముగనే చేసికొని యుండినయెడల, నొడంబడికలో లేని రాజకీయ ఖైదీల నందరిని వెంటనే విడుదలచేసి, గవర్నమెంటువారు దేశీయులలో కొందరి రాజకీయాభిప్రాయముల కొరకు వారికి విధించిన రాజకీయ ప్రతిషేధముల నెల్ల తొలగింప వలసియుండునని కాంగ్రెసువారు హెచ్చరించుచున్నారు.

గవర్నమెంటువారీతీర్మానము ననుసరించి ప్రవర్తించినచో, లాహోరు ఉరిశిక్షల వలన ప్రజలలో జనించిన వైరస్యమును గొంతకుగొంత చల్లార్చినవారగుదురని యీ కాంగ్రెసు వారు గవర్నమెంటు వారికి దెలియజెప్పుచున్నారు.

౪
లాహోరు ఉరిశిక్షలు

ఈ కాంగ్రెసు వారికి, రాజకీయ ప్రయోజనములను సాధించుటకై దౌర్జన్యము నవలంబించు పద్ధతితో నెట్టి సంబంధమును లేదు. సర్వ విధముల దౌర్జన్యమును కాంగ్రెసువారు ఖండించుచున్నారు. కాని కీర్తిశేషులైన భగత్సింగు, సుఖదేవ్, రాజగురుల శౌర్యస్థైర్యములును, వారి త్యాగ గౌరవమును కాంగ్రెసువారి మెప్పుదలకు పాత్రమైనవి. వారి బంధుమిత్రులకు కాంగ్రెసువారు తమసానుభూతిని దెల్పుచున్నారు.

ఈ ముగ్గురియురిశిక్షయు కేవలము నిస్సంకోచమైన ప్రతిక్రియాబుద్ధితో గావింపబడినదనియు, నిది వీరిశిక్షను దప్పింప వలయునని గగ్గోలుపెట్టిన యావత్ప్రజాభిమతమును త్రోసిపుచ్చుటయనియు కాంగ్రెసువారభిప్రాయపడుచున్నారు.

ఈ యుభయ జాతుల మధ్య సద్భావము పెంపొందింప వలసియున్న యిట్టి క్లిష్ట సందర్భమున, తత్సహాయకమైన యీ మహావకాశమును కోల్పోవుటయేగాక, విశ్వాసము నశించి దౌర్జన్య కృత్యములు కావించుచుండిన పక్షమును శాంతి మార్గమునకు ద్రిప్పుకొను నవకాశమును గూడ గవర్నమెంటువారు కోలుపోయిరని కాంగ్రెసు వారు నమ్ముచున్నారు.

౫
గాంధి-ఇర్విను ఒడంబడిక

వర్కింగు కమిటీ వారికిని, గవర్నమెంటువారికిని జరిగిన తాత్కాలికపు టొడంబడిక నీకాంగ్రెసు వారు పరిశీలించి యంగీకరించుచు కాంగ్రెసుయొక్క పూర్ణ స్వరాజ్య లక్ష్యము యథాపూర్వముగనే యున్నదని విశదపరచుచున్నారు.

కాంగ్రెసు వారు రౌండుటేబిలు మహాసభయందు పాల్గొనుటకు సరియైన మార్గ మేర్పడినచో, ఆసభయందు కాంగ్రెసు ప్రతినిధులీ లక్ష్యముకొఱకే పోరాడుదురు అందును ముఖ్యముగ సైన్యము, విదేశవ్యవహారములు, కోశము, ఎగుమతి దిగుమతి పన్నులు, ఆర్థిక వ్యవహారములు అను వీనిపై దేశీయులకు పూర్ణాధికారము గలుగజేయుటకును, ఇండియా ప్రభుత్వమువారి కున్న ఋణములలో న్యాయప్రకారము భారతీయులును, ఆంగ్లేయులును నచ్చుకొనదగిన మొత్తములను నిర్ణయించుటకై నిష్పక్షపాతమైన విచారణచేయించుటకును, నీయుభయ దేశముల వారును పరస్పర సంబంధమును స్వేచ్ఛానుసారముగ విడుచుకొన గలిగిన హక్కును పొందుటకును కాంగ్రెసు ప్రతినిధులు ప్రయత్నము గావింతురు.

అయితే, భారతదేశక్షేమమున కవసరములని తోచినరక్షణములను, మినహాయింపులను అంగీకరించుటకు కాంగ్రెసు ప్రతినిధుల కధికారమున్నది.

రౌండుటేబిలుసభ కేగెడు కాంగ్రెసు ప్రతినిధి సంఘమునకు మహాత్ముని నాయకునిగా నియమించి, యాయనతో సభకు వెళ్లదగిన ప్రతినిధులను నియమించుటకు వర్కింగు కమిటీవారి కధికార మొసగబడినది.

౬
శాసనోల్లంఘనము

గత శాసనోల్లంఘనోద్యమమున పాల్గొని, కారాగృహవాసము, తుపాకిగుండ్లు, బయొనెట్టులు, లాఠీలు మున్నగు వానికి గురియై, స్వగృహములు వదలిపెట్టి ప్రవాసమునకు బోయి, యాస్తులను ప్రభుత్వము వారి పరముచేసిన సత్యాగ్రహుల నెల్లరను నీ కాంగ్రెసువారభినందించుచున్నారు. ఈ యుద్యమములో సమయమునకు దోడ్పడి వేలకొలది సత్యాగ్రహ దళములందు జేరిన నారీమణుల నెల్లర నభినందించుచు, వోట్ల హక్కుల విషయములో స్త్రీ పురుషులకు భేదము చూపునే రాజ్యాంగ విధానమును తమకు సమ్మతము కాజాలదని కాంగ్రెసువారు ప్రకటించుచున్నారు.

౭
మద్యపాననిషేధము

గడచిన పండ్రెండుమాసములందును మత్తుమాదక పదార్థముల నిషేధమున దేశములో జరిగిన యభివృద్ధికై

కాంగ్రెసువారు సంతృప్తిని దెలుపుచు నికముందుగూడ కాంగ్రెసుసంస్థలవా రెల్లరును నీమద్యనిషేధప్రచారమును మఱింత యుత్సాహముతో గావించు చుండవలయు నని కోరుచున్నారు. దేశీయ నారీజనములుగూడ, త్రాగుబోతుల శరీరాత్మలను నాశనమొనర్చి, పండువంటి సంసారములను పాడొనర్చు నీదురభ్యాసమును మాన్పుటకు బ్రయత్నింప వలయునని కాంగ్రెసువారు హెచ్చరించు చున్నారు.

౮

విదేశవస్త్ర బహిష్కరణము

కడచిన పదియేండ్ల నుండియును పండులకొలది పల్లెటూళ్లలో గావించిన ప్రచారము వలన, సేదకయిక్కులకు విశ్రాంతి సమయములందు దగిన సహాయ పరిశ్రమ లేదియును లేకపోవుటచేత నానాటికి దారిద్ర్యము మితిమీరి పోవుచున్నదనియు, రాటములుమాత్రమే యీ దారిద్ర్యమును బాపగలవనియు దేటతెల్లమైనది.

ప్రజలు రాటమును, దానితో కద్దరు వస్త్రములను బరిత్యజించి, విదేశవస్త్రములను గాని లేక స్వదేశపు మిల్లు గుడ్డలను గాని కొనుచున్నారు. అందుచేత పని లేక పోవు నష్టమును, ధన నష్టమునుగూడ నుభయత్ర సంభవించు చున్నవి.

ఈ నష్టము, విదేశ వస్త్రములను, విదేశి నూలును బహిష్కరించి, కద్దరును జేపట్టి, యది లేనపుడు స్వదేశిమిల్లుబట్టలను గొనుటవలననే తీరగలదు.

కావున భారతీయులు విదేశవస్త్రములను గొనమానవలయు ననియు విదేశిబట్ట, విదేశినూలు వర్తకులు దేశములో లక్షలకొలది బీదజనుల కడుపుమీద గొట్టుచున్న యీ వర్తకమును మానివేయ వలయుననియు కాంగ్రెసువారు హెచ్చరించు చున్నారు.

కాంగ్రెసు సంస్థలవారును, తదితర సహాయ సంస్థలవారును, కద్దరు ప్రచారము ద్వారా, విదేశవస్త్ర బహిష్కరణము తీవ్రముగా జేయింపవలయు నని కాంగ్రెసువారు హెచ్చరించు చున్నారు.

సంస్థానాధిపతులు గూడ నీ నిర్మాణక్రమమున దోడ్పడి, విదేశవస్త్రములను, విదేశి నూలును తమ రాజ్యములలోనికి బ్రవేశింపకుండ జేయవలయు నని కాంగ్రెసువారు ప్రార్థించు చున్నారు.

స్వదేశి మిల్లులవారు దేశముయొక్క యార్థికాభ్యుదయ నిర్మాణ కారకమైన యీ యుద్యమమున కీ విధముగ దోడ్పడుచుండ వలయునని కాంగ్రెసువారు కోరుచున్నారు. (1) వారు స్వయముగా కద్దరును ధరించి దేశీయ పరిశ్రమకు సహాయకరమైన యీ కద్దరుద్యమము నభిమానింపవలయును. (2) కద్దరుతో పోటీపడజాలిన వస్త్రములను నిర్మించుట మాని, అఖిల భారత చరఖా సంఘమువారికి దోడ్పడుచుండ వలయును. (3) తమ మిల్లు బట్టలను సాధ్యమైనంత చవుక ధరల కమ్ముచుండ వలయును. (4) వారు మిల్లులలో విదేశి నూలును, పట్టును, రేయను పట్టును వాడకుండ వలయును. (5) దేశములోని విదేశవస్త్ర వ్యాపారులయొద్ద నున్న విదేశి గుడ్డ నంతయు దీసికొని, దానికి బదులుగా తమ మిల్లువస్త్రములనిచ్చి తద్ద్వారమున దేశములో స్వదేశవస్త్ర వ్యాపారమును ప్రోత్సహించి, యట్లు తీసికొనిన విదేశిబట్టల సరకును విదేశముల కెగుమతి చేయవలయును. (6) కాంగ్రెసు కేవలము పేదజనుల యభ్యుదయమునకై ప్రయత్నించునది యగుటచే మిల్లు యజమానులు మిల్లు పనివాండ్ర సంపదభివృద్ధికై సహాయము చేయుచు, మంచిచెడ్డలలో వారితో భాగస్వాముల మనుమాట స్మరించుచుండ వలయును.

ఇక విదేశవర్తకు లెల్లరును కాంగ్రెసువారి విదేశ వస్త్ర బహిష్కారోద్యమము యొక్క యావశ్యకమును, న్యాయ్యమును గుర్తెరిగి, భారతదేశములో విదేశవస్త్ర వ్యాపారము మాని భారతప్రజల యార్థిక సంపత్తి చెడకుండ నిలిపి, యికముం దీ వ్యాపారమును తమ స్వార్థమును బట్టి చేయుటమాని యితర దేశముల యవసరావసరములను బట్టి చేయుచుండినచో నంతర్జాతీయ మైత్రిని సంస్థాపించి, వాణిజ్య ధర్మమునకు దోడ్పడినవా రగుదురని కాంగ్రెసువారు హెచ్చరించు చున్నారు.

బర్మాగవర్నమెంటువారి కీయబడిన అదనపు అధికారములను, వారు బర్మాలోని ప్రధానసంఘములనెల్ల నక్రమసంస్థలుగా పరిగణించిన యాజ్ఞలను నుపసంహరింపజేసి, శాంతపరిస్థితుల నేర్పరచి బర్మాయొక్క భావిస్థితినిగూర్చి బర్మాదేశీయులు శాంతముగను నిరభ్యంతరముగను చర్చించుటకును, బర్మాప్రజల యభిమతమే నెగ్గుటకును నవకాశము కలుగజేయవలయునని కాంగ్రెసువారు కోరుచున్నారు.

౧౩
ఆఫ్రిడీల రాజ్యము

భారతదేశపు సరిహద్దులందున్న దేశములతో భారతీయుల కెట్టి విరోధమును లేదనియు, వారితో స్నేహసద్భావములతో నుండుటయే సమ్మతమనియు కాంగ్రెసువారు ప్రకటించుచున్నారు.

గవర్నమెంటువారు సరిహద్దురాష్ట్రములలో నవలంబించుచున్న ఉత్సాహపద్ధతిని, సరిహద్దుల నున్నవారి స్వాతంత్ర్యమును నపహరించుటకు చేయుచున్న సర్వప్రయత్నములను నీసభవారు ఖండించుచున్నారు.

ఈ యుత్సాహపద్ధతిని ప్రబలీకరించుటకై భారతదేశసైన్యమును ధనమును నుపయోగింపగూడదనియు, సరిహద్దులనున్న ఆఫ్రిడీలు మున్నగువారి రాజ్యమునుండి సైన్యములను తొలగింపవలె ననియు కాంగ్రెసువారు హెచ్చరించుచున్నారు.

౧౪
స్వరాజ్య నిర్వచనము

కాంగ్రెసువారి భావములో స్వరాజ్య స్వరూప మెట్టిదో సామాన్యజనులకు సరిగా దెలియుటకుగాను, వారికి సులభముగా నర్థమగురీతిని కాంగ్రెసువారి యాశయమును ప్రకటించుట యవసరము.

కావున కాంగ్రెసువారితరఫున నంగీకరింపబడు రాజ్యాంగవిధానములో స్వరాజ్యప్రభుత్వమువా రీ క్రిందివిధమున దేశీయుల ప్రధానహక్కులను ప్రకటించుట కధికార ముండవలయును. (ఎ) సమావేశగుమ స్వాతంత్ర్యము. (బి) వాగ్రచనా స్వాతంత్ర్యము. (సి) అంతరంగ స్వాతంత్ర్యము. మతాచరణస్వేచ్ఛ. కాని యిది సక్రమ ప్రజాజీవనమునకు, నీతికి భంగకరమై యుండగూడదు. (డి) మైనారిటీల సభ్యత, భాష, లిపుల సంరక్షణము. (ఇ) స్త్రీ పురుష భేదములేక పౌరు లెల్లరికి సమానములైన స్వత్వములు, ధర్మములు నుండుట. (యఫ్) ఉద్యోగ, బిరుద, అధికారములయందుగాని, వృత్తి, వాణిజ్యములందుగాని, కుల, జాతి మతము లెట్టి లోపమును సమకూర్ప కుండుట. (జి, పబ్లికు-బావులు, రోడ్లు, సర్వప్రజలకు జెందిన తక్కిన యన్ని సంస్థలను వాడుకొనుటకు సర్వపౌరులకు సమానమైన హక్కు. (హెచ్) సర్వజనులకు నాయుధ ధారణ స్వాతంత్ర్యము. ఈ విషయములో కొన్ని నిషేధము లుండవచ్చును.

(౧) న్యాయమునకును విరుద్ధముగ నెవ్వరి స్వాతంత్ర్యమునకు భంగము గలుగ జేయగూడదు. ఎవ్వరి యింటను, బ్రవేశింప గూడదు, ఎవ్వరి యాస్తిని స్వాధీనము చేసికొన గూడదు.

(౨) గవర్నమెంటు వారు మతముల విషయములో తటస్థభావము వహింప వలయును.

(౩) పరిశ్రమల పనివాండ్రకు జీవనమునకు దగిన భృతి; పనిచేయు కాలనిర్ణయము, ఆరోగ్యము చెడని రీతి పని; వార్ధక్యము, వ్యాధి, నిరుద్యోగము సంభవించినప్పుడు తగిన యాదరువు చూపుట.

(౪) పనివాండ్రకు బానిసతనమును తత్సంబంధమైన పరిస్థితులను తొలగించుట.

(౫) ఆడుకూలీలకు సరియైన రక్షణము; ప్రసవ సమయములలో ప్రత్యేక సదుపాయములు.

(౬) చదువుకొన దగిన యీడులోనున్న బాలురను ఫ్యాక్టరీలలో నియమింప కుండ మాచుట.

(౭) లేబరు సంఘముల నేర్పరచుకొను స్వాతంత్ర్యము; లేబరు తగాదాలను దీర్చుకొనుటకు దగిన మధ్యవర్తి సంఘముల యేర్పాటు.

(౮) ల్యాండు రివిన్యూను తగ్గించుట; రయతులు చెల్లించు వ్యవసాయపు పన్ను (రెంటు) తగ్గించుట; శిస్తులు సరిపోని చిన్న చిన్న పొలములపై రెంటు వసూలు కొంతకాల మాపుట. చిన్న జమీందారుల కవసరమైనచోట నిట్టి తగ్గింపులకు బదులుగా గొంత సహాయము చేయుట.

(౯) వ్యవసాయపు ఆదాయముల మీద కొంత మొత్తమునకు పైగా ఆదాయపు పన్నును క్రమముగా విధించుట.

(౧౦) వారసత్వములమీద క్రమముగా పన్ను విధించుట.

(౧౧) మెజారిటీ పొందిన సర్వజనులకు వోట్ల హక్కు.

(౧౨) ఉచిత ప్రారంభవిద్య.

(౧౩) సైనికవ్యయమును సగానికిసగము తగ్గించుట.

(౧౪) సివిలు డిపార్టుమెంటుల వ్యయమును తగ్గించుట. గవర్నమెంటువారిచే ప్రత్యేకముగా నియమింపబడిన నిపుణులు మున్నగువారుదక్క దక్కినయుద్యోగు లెల్లరి జీతములును ౫00 రూపాయలకు మించనీయకుండుట.

(౧౫) విదేశవస్త్రములను, నూలును బహిష్కరించి దేశీయవస్త్ర వ్యాపారమును సంరక్షించుట.

(౧౬) మత్తు పదార్థముల సంపూర్ణ నిషేధము.

(౧౭) ఉప్పుపన్నును బొత్తిగా రద్దుచేయుట.

(౧౮) భారతీయ పరిశ్రమలకు సహాయకరముగను, భారతీయప్రజా క్షేమానుకూలముగను మారకము, కరెన్సీపద్ధతులను సంస్కరించుట,

(౧౯) ప్రధానపరిశ్రమలను, దేశములోని ఖనిజ సంపదల యాజమానిత్వమును ప్రభుత్వము స్వాధీనములో నుంచుట.

(౨౧) పరోక్షముగగాని, యపరోక్షముగగాని చేయబడు నన్యాయపు వడ్డీ వ్యాపారమును అదుపులో నుంచుట.

అఖిల భారతసంఘమువారి తీర్మానముయొక్క మూలతత్త్వమునకు విరుద్ధముగాకుండ తిరిగి వ్రాయుటకుగాని, మార్చుటకుగాని, యింకను గొంత కలుపుటకుగాని యధికార మొసగబడినది.

కార్యనిర్వాహక సంఘము

౧. సర్దారు వల్లభభాయి పటేలుగారు (అధ్యక్షుడు), ౨. మహాత్మ గాంధి, ౩. సేటు జమునాలాలు బజాజు గారు ఎం. ఏ. (కోశాధిపతి), ౪. డా. అన్సారిగారు (గుజరాతు), ౫. మౌలానా అబ్దులు కలాం ఆజాదుగారు, ౬. డా. ఆలంగారు, ౭. డా. సయ్యదు మహమ్మదు గారు (కార్యదర్శి), ౮. శ్రీమతి సరోజనీ దేవిగారు (స్త్రీ), ౯. జయరాందాసు దౌలతరాంగారు (కార్యదర్శి, సింధు), ౧౦. కే. ఎఫ్. నారిమనుగారు (పార్సి), ౧౧. జే. ఎం. సేనగుప్తగారు (వంగ), ౧౨. పండిత జవహరలాలు నెహ్రూగారు (సంయుక్త కార్యదర్శి), ౧౩. ఎం. ఎస్. అణేగారు (మధ్య), ౧౪. బాబు రాజేంద్ర ప్రసాదుగారు (బీహారు), ౧౫. సర్దారు శార్దూలసింగుగారు (పంజాబు).

సహాయ కార్యదర్శి:—శ్రీ బాబు రాజారావుగారు

కార్యాలయము:—అహమ్మదాబాదు.

రాబోవు కాంగ్రెసు మహాసభ

౧౯౩౨ మార్చి నెలలో ఉత్కళములో జరుగును.

సాభిప్రాయ విశేషములు

భారత జాతీయమహాసభాచరిత్రమునందు, కరాచినగరమునందు ప్రజోత్పత్తి సంవత్సరారంభమునందుకూడిన ౪౫వ సమావేశ చరిత్రము స్వరాజ్యసంరంభమునందును, ప్రపంచవ్యవహారములందును ధర్మప్రతిష్ఠనుబడయ గలదు. కాంగ్రెసు ౪౫ ఏండ్లక్రితము ప్రారంభమైనను 3౫ ఏండ్లు పరావలంబన ప్రయుక్తములైన ప్రస్తావనలతో కాలయాపనముగలిగినది. గతించిన పదేండ్లయందును గాంధిమహాత్ముని నాయకత్వముక్రింద కాంగ్రెసు అవలంబించిన కార్యక్రమమునకు ప్రథమ విజయము కరాచియందు గలిగినది. కరాచికాంగ్రెసు సహాయనిరాకరణోద్యమమునందు ప్రథమాధ్యాయమును ముగింపునకు దెచ్చినది. రెండవఅధ్యాయము ఆరంభించుటకు పూర్వము గతించిన పదేండ్లనుండి భరతఖండమునందును ప్రపంచమునందును పర్యాప్తంబయిన మహాపరివర్తనమును సింహావలోకనముచేయుట జ్ఞానోదయమునకును, కార్యాచరణమునకును సాధనము గాగలదు.

* * *

గాంధియుగము

లోకమాన్యబాలగంగాధరతిలకు నిర్యాణానంతరము కాంగ్రెసు వ్యవహారములందు నూతనపరిస్థితు లేర్పడినవి. వివిధప్రాంతములందును కాంగ్రెసునాయకులున్నను కేవలము కాంగ్రెసువిజయమునకై ఆత్మార్పణము చేసిన అఖిలభారతీయసుప్రసిద్ధనాయకు లెవరును లేకుండిరి. మాంటుఫర్డు రాజ్యాంగ సంస్కరణములు ప్రఖ్యాతనాయకులను రాజ్యాంగములందు ముంచివేసినవి. శ్రీయుత సురేంద్రనాథ బెనర్జి, బిపినచంద్రపాలు, శ్రీనివాసశాస్త్రి గారులు మొదలగు దేశభక్తులయుదంతము లధికారదశ గలుగజేసెడి సమ్మోహమునకు నిదర్శనములు. సర్ బి. యన్. శర్మగారి యుదంతమధికారవ్యామోహమునకు పరమప్రమాణముగ నున్నది. అధికారపిశాచము దేశాభిమానుల నావహించునపుడు గలిగెడు బీభత్సము రాజ్యతంత్రము నసహ్యము చేయుచున్నది. సర్ శంకరన్ నాయ రధికారానధికార దశలయందు జూపిన దురభిమాన దురాగ్రహ దురాలాపము లీ విషయము ననంతముఖములను విస్పష్టము చేయుచున్నవి. కాంగ్రెసు పీఠాధిపతులయిన విద్యావంతుల స్థితిగతు లిటులున్నపుడు సామాన్యుల విషయమై యోచించుట యనవసరము.

స్వరాజ్య సంపాదనమునకై ప్రజాహృదయమునుండి అధికారవ్యామోహము దూరస్థము చేయుట పరమావసర మైనది. దేశారాధనమొ, అధికారారాధనమొ సాధ్యము

గాని రెండును సాధ్యములు గావు. లోకమాన్య తిలకుగా రవలంబించిన సిద్ధాంతమునకు గాంధి మహాత్ముడు విశేషవ్యాపకమును గలుగజేసి స్వరాజ్య ప్రచారమును స్వరాజ్యసంపాదన సాధ్యము చేయగలిగెను. లోకమాన్య తిలకు మహాశయుడు నిరంతరము దేశసేవాపరాయణుడై నిర్బంధముల స్వీకరించిన విధానమునె గాంధిమహాత్ముడు ప్రజా హృదయమునందు వ్యాపకము చేసెను. తిలకు స్వరాజ్యనిధి కోటిమందిసభ్యలు, ఖద్దరు, ప్రజాహృదయమునందు స్వరాజ్యవ్యాపనమునకు నిదర్శనములైనవి.

* * *

సహాయనిరాకరణోద్యమము

ప్రపంచమునందు స్వాతంత్ర్యమునకై పరితపించెడివారలకును స్వాతంత్ర్యమును నిరోధించెడివారలకును సహాకారసాహచర్యము లసంభవములు. ప్రజాహృదయమునందు భయభ్రాంతులను వ్యామోహమును గలుగజేసెడి అధికారమునకు నిరాకరణ నిరసనములు స్వరాజ్య సంకల్పమునకు బీజములుగ నున్నవి. అధికారదుర్గములైన శాసనసభలను, న్యాయస్థానములను, విద్యాలయములను బహిష్కరించుట, యధికార వ్యామోహమును శిథిలము చేయుటకు సాధనముగ నిర్ణయింపబడినది. ఆ సమయమును సఫలము చేయుటకు వందల కొలది న్యాయవాదులు, విద్యార్థులు స్వీయవృత్తులను విసర్జించి అధికార వ్యామోహమును శిథిలము చేసిరి. దేశబంధు చిత్తరంజన దాసు, పండిత మోతీలాలు నెహ్రూ, బాబు రాజేంద్రప్రసాదు, నారాయణరాజు, కాశేశ్వరరావు, సీతారామశాస్త్రి, రాజగోపాలాచార్యులుగారులు మొదలగు న్యాయవాదు లనేకులు చూపినమహాత్యాగ మధికార వ్యామోహమును శిథిలము చేయుటకు వినియోగపడినది. దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారాంధ్రోద్యమ ప్రారంభమునందే న్యాయవాదివృత్తిని విసర్జించి దేశారాధకులకు మార్గదర్శకులైరి. సుప్రసిద్ధులైన దేశబంధు దాసు, మోతీలాలునెహ్రూగారులు సహాయ నిరాకరణోద్యమమునకు ప్రాబల్యమును గడించి గాంధి మహాత్ముని విశ్వాసమునకు పాత్రులైరి. సహాయ నిరాకరణోద్యమమునందు గాంధిమహాత్ముని నామముతో దాసు నెహ్రూగారల నామములు విరాజిల్లినను నిరాకరణ ధర్మమునందు స్థిరప్రతిష్ఠను బడయజాలవు.

దాసునెహ్రూగార్లు స్వరాజ్యపక్షమును గల్పించిశాసనసభాప్రవేశమునుజేసి సహాయనిరాకరణ శిబిరమునందు విభజనమును గలుగజేసి అధికారవ్యామోహమును పునరుద్ధరణ చేసిరి. దాసుగారి నిర్యాణము శాసనసభల యనుభవము సహాయనిరాకరణోద్యమమును పునరుద్ధరించినవి. మోతిలాలుగారి నిర్యాణము సహాయనిరాకరణోద్యమమునకు నవీనలక్ష్యమును ప్రతిపాదించినది. తండ్రికొడుకుల గౌరవస్థానములు జవాహరిలాలునెహ్రూగారికి సంక్రమించినవి. గాంధిమహాత్మునకు మోతిలాలు, జవహరిలాలు నెహ్రూగారల మీదను గలవిశ్వాసము జవా

హరిలాలుగారి మీదను లగ్నమైనది. గాంధి మహాత్మునకు స్వరాజ్యాదర్శముపట్లగల సందియము లన్నియును విచ్ఛిన్నములైనవి. స్వరాజ్యము పూర్ణస్వరాజ్యముగను లాహోరునందు బరిణమించినది. పూర్ణస్వరాజ్యము సాంఘిక ప్రజాస్వామిక స్వరాజ్యభావమును కరాచి యందువహించినది. గమ్యస్థాన మెప్పు డేరీతిని భారతీయులు చేరునదియును భగవదధీనమునందు గలదు.

*　　*　　*

కరాచికాంగ్రెసు

కరాచి కాంగ్రెసునకు గాంధి కాంగ్రెసు అని నామకరణమును జేయుట సముచితముగ నున్నది. కాంగ్రెసు వ్యవహారములందు నాగపురమునందు ప్రారంభమైన గాంధిమహాత్ముని ప్రతిభ కరాచియందుచ్ఛదశ నధిష్ఠించినది. కరాచినగరము, హరిశ్చంద్రరాయ నగరము, కాంగ్రెసు శిబిరములు, స్వచ్ఛందసేవక సేవికల శిబిరములు, కాంగ్రెసుమంటపము, విషయనిర్ధారణసభామంటపము, కార్యనిర్వాహక సంఘ మంటపము, సభాధిపతి మంటపము, సకలమును గాంధివిజయఘోషముతో నిండి పోయినవి. ప్రజలకేర్పాటుచేసిన మహాసభకు 60,000, విషయనిర్ధారణసభకు 3,000 మంది యును హాజరై టిక్కెట్లమూలమునను రూ 50,000 లు వసూళ్లయినవి కాంగ్రెసుమహాసభ యందు ప్రతినిధులమూలమునను రూ. 22,000, ప్రేక్షకుల మూలమునను రూ. 80,000 మొత్తము షుమారు లక్షరూప్యములు వసూళ్లయినవి. గాంధిసమాజప్రార్థనలకు ప్రొద్దునను సాయంత్రమునను వేలకొలది హాజరయి గాంధిజీని సందర్శించి ఆనందించుచుండిరి. హరిశ్చంద్రరాయ నగరమంతయును గాంధిమయమై వెలసినది. కరాచికాంగ్రెసు యథార్థముగను గాంధి కాంగ్రెసుగను పరిణమించినది. నవజీవన భారతీయులు కాంగ్రెసు వ్యవహారములం దభ్యంతరములను గలుగజేయుటకు సంకల్పించియును విరమించుట సముచితముగ నున్నది.

*　　*　　*

గాంధి విజయము

కరాచి కాంగ్రెసువ్యవహారములు గాంధి విజయమును హృద్యముగను వ్యక్తము చేయుచున్నవి. గాంధివిజయము ధర్మవిజయము; సత్యవిజయము; అహింసావిజయము; ఆత్మవిజయము. రక్తాంబరధారులు చూపినధిక్కారతిరస్కారభావములను కేవలము మందహాస నిగ్రహములతో గాంధిమహాత్ముడు పరాభవించి ఆత్మబలమును వ్యక్తముచేసెను. నవయువజన నాయకుడు శ్రీయుత సుబాసుచంద్రబోసు గారు గాంధిఇర్విను ఒడంబడికకు ప్రతిఘటనము విరమించి గాంధి విజయమునకు దోడ్పడుట మిత్రులకును, శత్రువులకును విస్మయమును గలుగజేసినది. వీర భగతుసింగు వధవలనను, నిరంకుశవర్గము గలుగజేయ దలచిన విభేదన తంత్రము విఫలమైనది. యువజన హృదయమునందును, ప్రజాహృదయమునందును కోపోద్రేకమునకు గారణంబులున్నను

కాంగ్రెసునందును దేశమునందును ప్రజలు చూపిన నిగ్రహము ప్రశంసనీయము. భగతు సింగునకును అతని సహచరులైన శుకదేవు రాజగురు గార్లకును చూపిన సానుభూతి ఈ విషయమును విశదము చేయుచున్నది. ఈ హత్యలను నిరాకరించుటయందును ప్రభుత్వమును నిరసించుటయందును కాంగ్రెసు స్వధర్మ నిర్వాహణమును జేసినది. వీరస్వర్గము ననుభవించుచున్న భగతుసింగు ప్రభృతుల నామములు భారతీయ స్వరాజ్య సంరంభము నం దాచంద్రతారార్కము స్మరింపబడగలవు. గాంధి మహాత్ముడు భగత్సింగు చూపిన ధైర్య స్థైర్యములను కొనియాడుచు హింసామార్గమును మాత్రము నిరసించుట, మహాత్ముని ధర్మౌన్నత్యమును విశదము చేయుచున్నది.

ఇర్విను-గాంధి నిర్ణయముల నామోదించుటయును గాంధిమహాత్మునిమాత్రమె రౌండు టేబిలుసమావేశమునకు కాంగ్రెసు ప్రతినిధిగను నిర్ణయించుటయును సకలవిధములను సముచితముగ నున్నది. ఈ నిర్ణయము పోటీలకును విభేదములకును నవకాశములను తొలగించినది. ఇర్విను-గాంధి యొడంబడికను స్థిరపరచుచు కరాచికాంగ్రెసు చేసిన తీర్మానము పూర్ణస్వరాజ్యాదర్శమును విశదము చేయుచున్నది. కాంగ్రెసు నిర్ణయించిన తీర్మానము సైన్యము, కోశము, విదేశ వ్యవహారములు ప్రజాధికారమునకు లోబడవలయు నని నిర్ణయించినది. అప్పుసొప్పులను విడిపోవుటకును నిర్ణయాధికారమును భారతీయులుగలిగియుండుటకు కాంగ్రెసు నిర్ణయించినది. ఇర్విను-గాంధి యొడంబడికపట్ల అసంతృప్తి దెలిపిన సుభాసుబోసుగారును నితరులును ప్రతిఘటనము మాని తటస్థభావమును బూనుటయును సమంజసముగ నున్నది. గాంధిమహాత్ముని నిర్ణయమును కరాచి కాంగ్రెసుఆమోదించి స్వధర్మనిర్వాహణమును జేసినది. ఇర్విన్ప్రభువుగారి నిర్ణయమును బ్రిటీషుప్రభుత్వ మామోదించి స్వధర్మ నిర్వాహణము నేవిధమునను జేయగలదో కాలము విశదము చేయగలదు. బ్రిటీషు రాజ్యనీతిజ్ఞులు ఇర్విను గాంధినిర్ణయములను సఫలముచేసి పుణ్యమును పురుషార్థమును సాధించుదురుగాత!

ఇర్విన్ప్రభుస్థానము నాక్రమింప నున్న విల్లింగ్డను ప్రభువు పదియైదేండ్లలోను దేశమునందు గలిగిన మహాసంచలనమును గ్రహించి ప్రజాభీష్టమును సఫలముచేసి ఇండియాబ్రిటీషు సాహచర్యము నన్యోన్య ప్రయోజనములకును ప్రపంచకల్యాణమునకును వినియోగపడుటకు పాటుపడి స్వీయాధికారమును సార్థకము చేయుదురు గాత!

* * *

స్వరాజ్య సంవిధానము

వివిధమతములకును, జాతులకును, రాష్ట్రములకును, సంస్థానములకును గర్భదరిద్రమునకును నిలయమైన విశాలమైన భరతవర్షమునందు స్వరాజ్య సంవిధానము క్లిష్టముగ నున్నది. క్లిష్ట సమస్యలందు హిందూ మహమ్మదీయ సమస్య దుర్భేద్యముగ నున్నది.

హిందూమహమ్మదీయసమస్య నిర్ణయముగానంతవరకును రౌండు టేబిలు సమావేశమునకు బోవుటకు గాంధిమహాత్ముడు నిరాకరించుట ధర్మముగనున్నది. మహమ్మదీయు లేకగ్రీవముగను కోరినదానిని హిందువులు గాంధి మహాత్మునకు తెలిపినటులు నిరాటంకముగను నంగీకరించుట సమంజసము. సంయుక్తనియోజకవర్గము నంగీకరించుటయు సకలరాష్ట్రములందును మహమ్మదీయులకు సంఖ్యకుమించిన ప్రాతినిధ్యము నంగీకరించుటయును మహమ్మదీయులను సుముఖులనుజేయుటకు సాధనము గాగలదు. ప్రపంచమునందంతటను మతావేశము విద్యావ్యాపనముతో తగ్గుచున్నది. మహమ్మదీయ పరిపాలనమును 500 వేండ్లు ప్రతిఘటించి వీర్యవంతముగ నున్న హిందూసంఘముమహమ్మదీయులప్రాబల్యమునకుభయపడవలసిన యవసరము లేదు. అమెరికాపత్రికాప్రతినిధి తెలిపినటులువినయవిధేయతలు, దుఃఖానుభవము, సౌందర్య గాంభీర్యములు హిందువులకు సహజశీలములు. హిందూసంస్కారముగల ఇండియను మహమ్మదీయులు హైందవ జాతియందు కాలక్రమమునను సమ్మేళనమును బొందుట ప్రకృతిధర్మము. మతాభిమానులును స్వార్థపరులును ఇర్వురు గాంధిగారల హితోపదేశమునాలకించి దేశకల్యాణమునకై త్యాగమునుబూనుదురు గాక!

స్వరాజ్యసంవిధానమునకు కరాచి కాంగ్రెసును సరిహద్దురాష్ట్ర సమస్యను, బర్మా సమస్యను, సంస్థానసమస్యను, ప్రజాస్వత్వసమస్యను నిర్ణయించిన విధము సముచితముగ నున్నది. స్వరాజ్యము ప్రజారాజ్యమనియును, శ్రీమంతులరాజ్యమును విద్యావంతుల రాజ్యమును గాదనియును స్వరాజ్య నిర్వచన ప్రస్తావన విశదము చేయుచున్నది. గాంధిమహాత్ముని మానవసేవాభిలాషను స్వరాజ్యనిర్వచన తీర్మానము విశదము చేయుచున్నది. భారతీయులందరును గాంధిమహాత్ముని వలెను విశాల హృదయమును గలిగి ప్రవర్తించి సకల సమస్యలను సాధించుకుందురు గాక!

* * *

స్వరాజ్య సాధన సాధ్యములు

ప్రవృత్తియందు సాధన సాధ్యములు సత్త్వానురూపమైన సంకల్పాశ్రయములై కారణకార్య రూపములను పరిణమించు చున్నవి. సాధనము పరిమితమైనపుడు సాధ్యమును పరిమితమగుచున్నది. దేశసేవకై ప్రాణత్యాగమును జేసిన వీరభగతుసింగు, సాధుగణేశ శంకర విద్యార్థులత్యాగమును ప్రశంసించుచు కరాచి కాంగ్రెసు తీర్మానములను జేసినది. కాంగ్రెసు భగతుసింగుగారి సాహస ధైర్యములను ప్రశంసించుచు వారి సాధనసంపత్తిని నిరాకరించినది. కారణము భగతుసింగు దేశమునకై ప్రాణత్యాగమును జేసినను వారి త్యాగము రాగద్వేషపరమై పరపీడనమునకు సాధనమైనది. భగతుసింగు వీరస్వర్గము నధిష్ఠించినను వారి సాధనము సకలజనాదరణీయముగాదు. మాంగఘోరునమీపమునందు భగతుసింగు నాటకప్రదర్శనమునందు గలిగిన దురంత మీవిషయమును

విశదము చేయుచున్నది. గణేశశంకర విద్యార్థిగారి ప్రాణత్యాగము రాగద్వేష పరముగాకను, ప్రేమమయమై సర్వజనామోదమును బడయుచున్నది. గణేశశంకర విద్యార్థిగా రాపన్నులను రక్షించుటకై అభయము నొసంగుచు ప్రాణములను సమర్పించి అమరత్వమును బడయ గలిగిరి. కరాచి కాంగ్రెసు గణేశశంకరవిద్యార్థిగారి త్యాగమును ప్రశంసించుచు జాతిమతద్వేషములను నివారించుటకై జనులందరును వారిమార్గము నవలంబించవలయునని తీర్మానించినది. ఈరెండు తీర్మానములందును గల ధర్మసూక్ష్మమును గ్రహించగల యధికారము గాంధిమహాత్మునకు మాత్రము గలదు. పురుషార్థసిద్ధికి ఆత్మత్యాగమునకు గల ప్రతిభ పరపీడనమునకు లేదని తీర్మానములు విశదము చేయుచున్నవి; అహింసాధర్మవిజయమును ప్రతిపాదించుచున్నవి. కరాచికాంగ్రెసు ప్రతిపాదించిన ధర్మవిజయము ప్రజోత్పత్తి సంవత్సరమునందు సత్యాగ్రహుల కాదరణీయమై గాంధి మహాత్ముడు పూనగల స్వరాజ్యప్రస్థానమునకు సాధనభూతమగు గాత! సత్యాగ్రహులు వారి సాధనమున కనురూపమైన ఫలమును బడయుట ప్రకృతిధర్మము. స్వరాజ్య యోధులు ముఖ్యముగను నవయువజనులీ పరమ ధర్మమును గ్రహించుట దేశకల్యాణమునకును ప్రపంచ శాంతికిని ప్రయోజనకరము.

* * * *

పూర్ణ స్వరాజ్యము-యువజనులు

పూర్ణస్వరాజ్య సంపాదనమునం దుద్రేక పూరితులైన యువజనులు రోషావేశమును జూపుట సహజము. యువజనోద్రేకమునకు గారణము నిరంకుశప్రభుత్వముపట్లను యువజనులకుగలిగిన నిరాశయని విశదమగుచున్నది. ప్రపంచమంతయును నవజీవనముతో సంచలించుచున్నపుడు మహాచైతన్యము గల భరతఖండము జీవరహితమై యుండజాలదు. గాంధిమహాత్మునకు రక్తాంబరధారు లొసంగిన స్వాగతము రోషావేశపూరితమైనను భారతయువకునకు సహజమైన సద్గ్రహమును విశదము చేయుచున్నది. నవజీవనసభయందు పూజ్యులైన పండిత మదనమోహన మాలవ్యగారికి యువజనులు చూపిన యవజ్ఞత భగతసింగు గారి ఉరివలనను గలిగినను నసహ్యముగనున్నది. మాలవ్యగారి నాహ్వానించిన సుభాసు చంద్రబోసు గారును నివారింపజాలక పోవుట యువజనాగ్రహమునకు నిదర్శనమై భావి శుభస్థితికి ప్రతిబంధకమగుచున్నది. కరాచి మ్యూనిసిపాలిటిఅధ్యక్షుడు జేమ్సుజీ మెహతాగారు యువజనోద్రేకమువిషయమై 'పార్శిసంసారము' నందు వ్రాసిన విషయము గాంధిమహాత్ముని నాకర్షించినది. గతవారపు యంగుఇండియా పత్రికయందు మెహతాగారి హితబోధల విషయమై గాంధిమహాత్ముడు వ్రాసిన యభిప్రాయములు ధర్మాత్ముల లక్ష్యము నాకర్షింపదగియున్నవి. సర్వత్ర చీటికిమాటికి సత్యాగ్రహ ప్రమాణములు చెలరేగుచున్నవి. ద్వేష గీతములు దిగంతములందును వ్యాపకమును గాంచుచున్నవి. బలవంతము నిర్బంధము పక్షపాతి యగుచున్నవి. వర్తకులు, ఉద్యోగస్థులు, ప్రతి

పక్షులు సందానమానముల ననుభవించిరి. సత్యాగ్రహమును దేశోద్ధరణమునకు వినియోగించుటకు దాని నావరించిన విషవాతావరణమునుండి రక్షించవలసిన యావసరమును గాంధి మహాత్ముడు యంగుఇండియా పత్రికయందు సువ్యక్తము చేసియున్నాడు. ప్రజ లందరును గాంధిమహాత్ముడు కోరినటులు సత్యాగ్రహమును ద్వేష రహితముగను ప్రేమ భరితముగను జేసి సత్యాగ్రహ ధర్మమును పవిత్రవంతము చేయుట యావసరము. గాంధి మహాత్ముడు సత్యాగ్రహము మూలముననుసాధింపదలచిన పూర్ణస్వరాజ్యసిద్ధికి సత్యాగ్రహప్రయోగము పరిశుద్ధమై విరాజిల్లవలసిన యవసరమును జేమ్సెడ్జిగారును అబ్దులు గఫ్ఫారుగారును తెలిపినటులు సత్యాగ్రహు లందరును గ్రహించి గాంధిమహాత్ముని సంతాపము నుపశమింప జేయుదురుగాత!

*　　　*　　　*

ప్రజల కర్తవ్యము

కరాచి కాంగ్రెసు శాసనోల్లంఘన ప్రస్థానమును విరమించినను శాంతియుతముగను విదేశవస్త్రములను, మద్యమును పికెటింగు చేయుట కంగీకరించినది. పికెటింగును రాజకీయాస్త్రముగను గాక ఆర్థికప్రయోజనముల కై వినియోగింపవలయునని గాంధిమహాత్ముడు కోరుచున్నాడు. ఇందలి ధర్మసూక్ష్మమును గ్రహించి గాంధిమహాత్ముని యాభీష్టమును సఫలము చేయుటధర్మము. మద్యపాన నిషేధమును బోధించుటకును ఇర్విను-గాంధి యొడంబడిక యావకాశములను గలుగజేయుచున్నది. ఖద్దరు ధారణము, ఖద్దరు వ్యాపనము సత్యాగ్రహోద్యమమునకు ప్రాణముగ నున్నవి. హిందూమహమ్మదీయ సంయోగమునకు గాంధి మహాత్ముడు కోరునటులు మహమ్మదీయుల కోరికలను నిరాటంకముగను నంగీకరించుట సమంజసము. అహింసా ధర్మమును మహమ్మదీయు లనుసరించునపుడు వారి ధర్మసందేహము లన్నియును నంతరించి హిందూ మహమ్మదీయ సంయోగము సాధ్యము గాగలదు. కరాచికాంగ్రెసు భారతీయులకాత్మవిశ్వాసమును గలుగ జేసినది. అహింసాధర్మము నుద్ధరించినది; సత్యాగ్రహస్వరూప స్వభావములను విశదము చేసినది; గాంధి విజయమును సర్వత్ర ప్రత్యక్షము చేసినది. హిందువులు మహమ్మదీయులు, వృద్ధులు యువజనులు, స్త్రీలు పురుషులు సత్యాగ్రహ పూర్ణస్వరాజ్య సంరంభమునందు గాంధి మహాత్మునకు దోడ్పడి సత్యాగ్రహ విజయమును సార్థకము చేసి పురుషార్థములకు బడయుదురు గాత!

— —

Printed and Published by G Subbaramayya, at the Andhra PatrikaPress, No.7, Thambu Chetty St., Madras